

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 18+20 వెల: ₹ 5.00
సంపుటి: 10
సంచిక: 297

గురువారం 18-1-2018

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR| KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సుఖోయ్‌లో సీతారామన్ విహారం

- రాజస్తాన్‌లోని జోధ్‌పూర్ ఎయిర్‌బేస్ నుంచి టేకాఫ్

- వివరాలు 11లో

ప్రపంచశక్తిగా భారత్

- సృజనాత్మకత సహకారంతో మార్పు తెస్తున్నారు
- మోదీపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రశంస
- భారత్‌తో భాగస్వామ్యానికి సిద్ధమని ప్రకటన
- ఇజ్రాయెల్ సృజనాత్మకత భేష్: మోదీ

- వివరాలు 11లో


బుధవారం అహ్మదాబాద్‌లోని సబర్మతి ఆశ్రమం వద్ద సరదాగా పతంగి ఎగరేస్తున్న నెతన్యాహు, ఆసక్తిగా తిలకిస్తున్న ఆయన భార్య సారా, మోదీ

సెన్సెక్స్ @ 35,000

కొత్త శిఖరాలకు స్టాక్ సూచీలు



- ఒక్క రోజు వ్యవధి తర్వాత మళ్లీ రికార్డులు
- ఇంట్రాడేలోనూ, ముగింపులోనూ ఆల్‌టైమ్ హై
- బ్యాంక్ షేర్ల జోరు.. తొలిసారిగా 35,000 పైకి సెన్సెక్స్
- 311 పాయింట్ల లాభంతో 35,082 వద్ద ముగింపు
- ఇంట్రాడేలో 10,800 పాయింట్లపైకి నిఫ్టీ
- 82 పాయింట్లు పెరిగి 10,789 వద్ద ముగింపు

- బిజినెస్ (14)లో

కాళేశ్వరం అద్భుతం

కేంద్ర మంత్రి గడ్కరీ ప్రశంస

- ప్రాజెక్టు సందర్శనకు ఆహ్వానించిన మంత్రి హరీశ్
- 3,000 టీఎంసీల మిగులు ఉంటే తీసుకోండి
- కేంద్రానికి స్పష్టం చేసిన మంత్రి
- తెలంగాణ అవసరాలే ముందని వ్యాఖ్య... ఎన్‌డబ్ల్యూడీఏ భేటీలో పాల్గొన్న హరీశ్‌రావు

- వివరాలు 6లో

తహసీల్దార్ రిజిస్ట్రేషన్లు..

అంత ఈజీ కాదట!

రెవెన్యూ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లపై అంతర్గత నివేదిక

- 367 మండలాల్లో రోజుకు 3, అంతకన్నా తక్కువగా రిజిస్ట్రేషన్లు
- ఇందులో 128 మండలాల్లో సగటున రోజుకో డాక్యుమెంట్ మాత్రమే
- ఏర్పాట్లకు రూ. 44.3 కోట్ల వ్యయం.. నిర్వహణకు ఏటా రూ. 5 కోట్లు
- రాష్ట్ర భౌగోళిక స్థితి కారణంగా నెట్‌వర్క్ ఏర్పాటు కష్టం
- సేవల కోసం పెద్ద సంఖ్యలో పోస్టుల అవసరం
- ఎమ్మార్వోలు, సబ్‌రిజిస్ట్రార్లు వేర్వేరు శాఖల పరిధిలో..
- ఎవరు ఎవరికి రిపోర్టు చేయాలనే సందేహాలు
- మార్కెట్ విలువ నిర్ధారణ, నిషేధిత భూముల అంశంలో పారదర్శకత ఎలాగనే ప్రశ్న.. ప్రస్తుత విధానం కొనసాగింపే మేలన్న అభిప్రాయం

సాక్షి, హైదరాబాద్

రెవెన్యూ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు అందించే ప్రతిపాదనపై భిన్నాభిప్రాయం వ్యక్తమవుతోంది. అటు ప్రభుత్వ పెద్దలుగానీ, ఇటు ఉన్నతాధికారులుగానీ పైకి ఏమీ మాట్లాడకపోయినా ఈ ప్రతిపాదన సాధ్యాసాధ్యాలపై తీవ్రమైన తర్జనభర్జన జరుగుతోంది. కొత్త విధానం అమలు అంత సులువుకాదని, ప్రస్తుత విధానం కొనసాగింపే మేలన్న భావన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఈనెల 8న జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి



ఆదేశాల మేరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అంతర్గతంగా ఇచ్చిన నివేదిక కీలకంగా మారింది. ఎమ్మార్వో కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవల అమలు సాధ్యాసాధ్యాలకు సంబంధించి

మిగతా 2వ పేజీలో ▶


పోలీసులు స్వాధీనం చేసుకున్న నోట్ల కట్టలు

రూ.97 కోట్ల పాత నోట్లు

యూపీలో రద్దయిన నోట్లు స్వాధీనం

- ఉత్తరప్రదేశ్‌లోని స్వరూప్‌నగర్‌లో బుధవారం పోలీసులు రూ. 97 కోట్ల విలువైన రద్దైన నోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరు తెలుగువారు సహా 16 మందిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రాబట్టిన సమాచారంతో కాన్పూర్‌లో పలుచోట్ల ఇంకా సోదాలు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

- 11లో

త్వరలో నియోజకవర్గాల యాత్ర



మెదక్ జిల్లా పర్యటనలో సీఎం కేసీఆర్

- తూప్రాన్‌కు వచ్చి రోజంతా ఉంటా
- దేశ సేవలో ఉండటం వల్లే ఆలస్యంగా వచ్చా
- తూప్రాన్‌లో 50 పడకల ఆస్పత్రి ప్రారంభం
- పట్టణ అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు

- వివరాలు 6లో



సుప్రీం జడ్జీలకు జస్టిస్ రమణ విందు

- ఆంధ్రా వంటకాల వడ్డింపు.. జస్టిస్ చలమేశ్వర్ గైర్హాజరు
- నేడు 'ఆ నలుగురి'తో సీజేఐ భేటీ?

- వివరాలు 11లో



ఉత్తమ్ సారథ్యంలోనే!


- వచ్చే ఎన్నికలపై కాంగ్రెస్ అధిష్టానం మనోగతం
- మార్పులుండబోవని పీసీసీకి సంకేతాలు
- సీనియర్లతో ప్రచార కమిటీ
- చైర్మన్‌గా పీసీసీ చీఫ్, ముగ్గురు కన్వీనర్లు
- ఫిబ్రవరిలో రాష్ట్రానికి రాహుల్ గాంధీ
- ఎన్నికలకు ఆర్నెల్ల ముందు నుంచే అభ్యర్థుల ఖరారు
- అందుకోసం ప్రత్యేక కమిటీ

- వివరాలు 12లో

వంచనలో బాబుకు బాబే సాటి

64వ రోజు

17-01-2018, బుధవారం
వికృతమాల,
చిత్తూరు జిల్లా.



పరిపాలించే నాయకుడు స్వార్థపరుడైతే, అవినీతిపరుడైతే.. ఒక రాష్ట్రం ఎంతగా నష్టపోతుందో, తన ఒక్కడి స్వార్థం కోసం రాష్ట్ర ప్రయోజనాలనైనా, అమాయకుల ప్రాణాలనైనా.. ఎలా బలిపెడతారో తెలిపే ఉదంతం ఈ రోజు ఎదురైంది. తాట్నేరి క్రాస్ వద్ద మునికోటి అనే వ్యక్తి కుటుంబ సభ్యులు కలిశారు. మునికోటి ఎవరో రాష్ట్ర ప్రజలకు తెలిసే ఉంటుంది. ప్రత్యేక హోదా కోసం 2015, ఆగస్టు 9న తిరుపతిలో ఆత్మార్పణ చేసుకున్న వ్యక్తి ఆయన. తనను తాను అగ్ని జ్వాలలకు ఆహుతి చేసుకున్న ఆ అన్న సాక్షిగా.. ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని టీడీపీ పెద్ద లు హామీ ఇచ్చారు. మంత్రులు, ఎమ్మెల్యేలు పరామర్శిం చి, ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. రెండున్నర సంవత్సరాలు దాటినా ఆ ఊసే లేదంట. రాష్ట్రానికి ఎంతో అవసరమైన ప్రత్యేక హోదా కోసం ఆత్మార్పణ చేసుకున్న మనిషి కుటుంబాని కి సాయం చేస్తామని చెప్పి, మాట తప్పడాన్ని ఏమంటారు? వంచన కన్నా మించిన పదం ఏమైనా ఉందా?

చంద్రబాబుగారు ప్రత్యేక హోదా సంజీవని అన్నారు. పది సంవత్సరాలు సరిపోదు.. పదిహేనేళ్లు కావాలన్నారు. రాష్ట్ర ప్రజల్లో, యువతలో, నిరుద్యోగుల్లో కోటి ఆశలు నింపారు. అవినీతితో సంపాదించిన డబ్బుతో ఎమ్మెల్యేలను కొంటూ.. ఓటుకు కోట్లు కేసులో ముఖ్యమంత్రిగారు సాక్ష్యాధారాలతో 2015, మేలో పట్టుబడ్డాక.. ఆ కేసు నుంచి, ఇతర అవినీతి కేసుల నుంచి బయటపడటానికి కేంద్రం ముందు పూర్తిగా సాగిలపడి, ప్రత్యేక హోదాను తాకట్టుపెట్టారు. ప్రత్యేక హోదా ఏమన్నా సంజీవనా? అంటూ మాటమార్చారు. దీంతో రాష్ట్ర ప్రజలు తీవ్ర నిరాశ, నిస్పృహలకు లోనయ్యారు. అది జరిగిన మూడు నెలలకే మునికోటి ఆత్మార్పణ చేసుకున్నాడు. రాష్ట్ర ప్రజలందరూ చంద్రబాబును వేలెత్తి చూపడంతో మంత్రులను, ఎమ్మెల్యేలను పంపి కంటితుడుపు పరామర్శలు జరిపించారు. రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. విషయం కాస్త మరుగునపడగానే మాట తప్పారు. హోదా కోసం ప్రాణత్యాగం చేసిన వ్యక్తి కుటుంబానికిచ్చే పరిహారం విషయంలో మోసం చేయడం ఒక ఎత్తయితే, ప్రత్యేక హోదా అంశాన్ని నీరుగార్చి, మునికోటి లాంటి యువకుల ప్రాణత్యాగాలకు విలువే లేకుండా చేయడం ఎంత దారుణం? మొన్నటికి మొన్న ప్రధాని దగ్గరకు పోయి కోట్లాది మంది నిరుద్యోగుల కోసం ప్రత్యేక హోదా అడుగుతారనుకుంటే.. తన అవినీతి సొమ్ముతో కొన్న ఎమ్మెల్యేలకు రాజకీయ ఉద్యోగావకాశాల కోసం.. నియోజకవర్గాలు పెంచాలని అడిగారట.. వంచనలో ఆయనకు ఆయనే సాటి! తన స్వార్థం కోసం ఎవ్వరినైనా బలిపెట్టే నైజం.. పిల్లనిచ్చిన మామనైనా.. రాష్ట్ర ప్రజలనైనా.

మధ్యాహ్నం స్వర్ణముఖి వంతెన మీద చెన్నంపల్లి గ్రామానికి చెందిన యువకులు.. ఒక చేతితో వారి గ్రామ సమీపంలో ప్రవహించే వాగు నీరు, మరో చేతితో ఆ గ్రామంలో లభ్యమయ్యే తాగునీళ్లన్న బాటిళ్లను చూపించారు. గాజులమండ్యం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న కెమికల్ ఫ్యాక్టరీలు వ్యర్థ, విషపూరిత జలాలను శుద్ధి చేయకుండా సమీపంలోని నక్కల వాగులోకి వదులుతున్నాయని, ఆ విష జలాల వల్ల దాదాపు 15 గ్రామాల ప్రజలు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారని, మంచి పంటలు పండే భూములు కూడా నిస్సారమవుతున్నాయని, భూగర్భ జలాలు కలుషితమై, తాగునీరు, సాగునీరు కూడా విషపూరితమవుతోందని వాపోయారు. ప్రభుత్వ పెద్దల అండదండలు ఉండటంతో అధికారులు కూడా పట్టించుకోవడంలేదని తెలిపారు. ఇలాంటి ప్రాంతాల్లోని ప్రజలకు రక్షిత మంచినీటి సరఫరా గాలికొదిలేసి, ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి చేసేది పారిశ్రామిక అభివృద్ధి ఎలా అవుతుంది? సామాన్యుల ప్రాణాలంటే అంత చులకనా? ప్రజల ప్రాణాలంటే.. విలువే లేదా?

పాపానాయుడుపేటలో బలహీనవర్గాల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. మాట్లాడిన ప్రతి ఒక్కరి మాటల్లో బాబుగారి మోసాలు బహిర్గతమయ్యాయి. బాబుగారు తన రంగుల మేనిఫెస్టోలో బీసీలకు నాలుగు పేజీలు కేటాయించారు. దాదాపు 120 హామీలను కుమ్మరించారు. అందులో ఏ ఒక్కటీ నెరవేర్చిన పాపాన పోలేదు. కోట్లాదిమంది జనాన్ని నమ్మించి మోసం చేయడమంటే.. అది మామూలు మనుషులకు సాధ్యంకాని పని. కాస్త చిత్తశుద్ధి, ప్రజల పట్ల బాధ్యత ఉన్న నాయకులెవరైనా అలా చేయడం మహాపాపంగా భావిస్తారు.

చివరిగా, ముఖ్యమంత్రి గారికి నాదో ప్రశ్న.. నిజంగా మీకు ఓటుకు కోట్లు, ఇతర అవినీతి కేసుల భయం లేకపోతే.. ప్రత్యేక హోదాపై ఎందుకు మాట మార్చారు? మీ భాగస్వామ్య పక్షమైన కేంద్రాన్ని ఎందుకు నిలదీయడం లేదు? కృష్ణా, గోదావరి జలాలపై మన రాష్ట్ర హక్కును ఎందుకు తాకట్టుపెట్టారు? రాష్ట్ర ప్రయోజనాలను ఎందుకు కాపాడలేకపోతున్నారు?

వై.యస్. జగన్.



వైఎస్ రాజారెడ్డి, వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్‌తో తనకున్న మూడు తరాల అనుబంధాన్ని, అభిమానాన్ని చాటుతూ జననేత కటౌట్‌ను భుజంపై మోస్తూ పాదయాత్రలో పాల్గొన్న భూమన కరుణాకర్‌రెడ్డి

అంత ఈజీ కాదట!

▶ మొదటి పేజీ తరువాయి

ఆ నివేదికలో పేర్కొన్న గణాంకాలు, సూచనలు ప్రభుత్వ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి. ప్రస్తుత విధానాన్ని కొనసాగించడమే మంచిదని ఆ నివేదిక స్పష్టం చేసినట్లు తెలిసింది. నివేదికలోని ముఖ్యాంశాలివీ..

రోజుకు ఒకటి రెండు డాక్యుమెంట్లే!

- గతేడాది రాష్ట్రంలోని 567 గ్రామీణ మండలాల్లో వ్యవసాయ భూముల కేటగిరీలో 4,54,607 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయ్యాయి.
- అందులో 373 మండలాల్లో సగటున రోజుకు మూడు అంతకన్నా తక్కువ సంఖ్యలో (260 మండలాల్లో రోజుకు రెండు.. ఇందులో 128 మండలాల్లో రోజుకో డాక్యుమెంట్ మాత్రమే) డాక్యుమెంట్లు రిజిస్టర్ అయ్యాయి.
- మిగతా 194 మండలాలకుగాను 65 చోట్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. అంటే సబ్‌రిజిస్ట్రార్లు లేని 129 మండలాల్లో మాత్రమే రోజుకు మూడు కన్నా ఎక్కువ లావాదేవీలు జరుగుతున్నాయి.
- ఇలాంటి పరిస్థితుల్లో అన్ని మండల కార్యాలయాల్లో మౌలిక సదుపాయాలు, మానవ వనరుల కల్పన అనవసరపు భారంగా మారుతుంది.

'శిక్షణ'తో తలనొప్పి

- ప్రస్తుతం డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ల చట్టం–1908, స్టాంపుల చట్టం–1899 ప్రకారం రిజిస్టర్ అవుతున్నాయి.
- ఇప్పుడు ఎమ్మార్వో కార్యాలయాల్లో రిజిస్టర్ చేయాలంటే.. ఎమ్మార్వోలకు ఈ చట్టాలు, నియమ నిబంధనలు, స్టాండింగ్ ఆర్డర్ల గురించి శిక్షణ ఇవ్వాలి.
- స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రస్తుతం అమలు చేస్తున్న 'కార్డ్ (కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్)' వ్యవస్థపై కూడా 443 మంది ఎమ్మార్వోలకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది.
- ఇక ఇప్పుడు సబ్ రిజిస్ట్రార్లున్న మండలాల్లో పనిచేస్తున్న ఎమ్మార్వోలకు వీటి గురించి అవగాహన ఉండదు. వారు తర్వాత సబ్‌రిజిస్ట్రార్లు లేని మండలాలకు బదిలీ అయితే శిక్షణ ఇవ్వాల్సి వస్తుంది.

బోలెడు సిబ్బంది అవసరం

- ప్రతి సబ్‌రిజిస్ట్రార్‌కు ఒక సీనియర్ అసిస్టెంట్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు సబార్డినేట్లు, క్లర్కులు కావాలి.
- మార్కెట్ విలువ సర్టిఫికెట్ల జారీ, చెక్‌స్లిప్‌ల తయారీ, డాక్యుమెంట్ల స్కానింగ్, చలానాలు, ఈసీల తయారీ, బయోమెట్రిక్ వివరాల సేకరణ, వెబ్‌ల్యాండ్‌ను పోల్చడం, పాస్ పుస్తకాల పరిశీలన, రికార్డుల మెయింటెనెన్స్, స్టాంపుల అమ్మకాల వంటి బాధ్యతలు ఉంటాయి.
- ఈ మేరకు పోస్టులు మంజూరు చేయాల్సి ఉంటుంది.

'నెట్‌వర్క్' ఎలా..?

- రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో 'కార్డ్ (కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్)' వ్యవస్థ ఆధారంగా డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఇప్పుడు ప్రతి ఎమ్మార్వో కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేయాలంటే ఆ మేరకు కంప్యూటర్లు, ఇంటర్నెట్ నెట్‌వర్క్ అనుసంధానం అవసరం.
- రాష్ట్రంలోని భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుతమున్న 141 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు నెట్‌వర్క్‌ను నిర్వహించడమే గగనంగా ఉంది
- మారుమూల ప్రాంతాల్లోని 584 ఎమ్మార్వో కార్యాలయాలకు నెట్‌వర్క్ అందించడం చాలా కష్టం.

సబ్‌రిజిస్ట్రార్ల పరిధితో తిప్పలు

- ప్రస్తుతం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు మండలాల ప్రాతిపదికన లేవు. కొన్ని మండలాల్లో సగం గ్రామాలు ఓ సబ్‌రిజిస్ట్రార్, మరిన్ని గ్రామాలు మరో సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో ఉన్నాయి.
- ఇప్పుడు ఎమ్మార్వో కార్యాలయాల వారీగా విధానం అమలుతో.. పలు సబ్‌రిజిస్ట్రార్ల కార్యాలయాల పరిధిని మార్చాల్సి ఉంటుంది.

పర్యవేక్షణకు ఇబ్బందులు

- ఇప్పుడున్న వ్యవస్థ ప్రకారం సబ్‌రిజిస్ట్రార్లు జిల్లా రిజిస్ట్రార్లకు, వారు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌కు బాధ్యులుగా ఉంటారు.
- ఎమ్మార్వోలు నేరుగా కలెక్టర్లకు బాధ్యులుగా ఉంటారు.
- ఇప్పుడు సబ్‌రిజిస్ట్రార్లతోపాటు ఎమ్మార్వోలు రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తే.. వారు ఎవరికి బాధ్యులుగా ఉండాలన్న సందేహం తలెత్తుతోంది.
- దీనితో ఇరు శాఖల సమన్వయంలో ఇబ్బందులు ఏర్పడే అవకాశముంది.

ఎమ్మార్వోలు అందుబాటులో లేకుంటే..?

- ఎమ్మార్వోల వ్యవస్థ అత్యంత క్రియాశీలంగా ఉంటుంది.
- వారు వారంలో మూడు రోజుల పాటు తమ పరిధిలో క్షేత్రస్థాయి పరిశీలనలతోపాటు వ్యవసాయం, సాగునీరు, ప్రొటోకాల్ లాంటి విధులకు హాజరు కావాల్సి ఉంటుంది.
- దీంతో రిజిస్ట్రేషన్లకు ఇబ్బంది ఏర్పడే అవకాశముంది.
- ఎమ్మార్వో అందుబాటులో లేకపోతే రిజిస్ట్రేషన్లు జరగక ప్రభుత్వ ఆదాయంపై ప్రభావం పడుతుంది.

'క్రాస్ చెకింగ్'కు ఇబ్బందే

- ప్రస్తుతం భూముల మార్కెట్ విలువలను సబ్‌రిజిస్ట్రార్లు కన్వీనర్లుగా ఉన్న కమిటీ నిర్ధారిస్తుంది. అందులో ఎమ్మార్వో సభ్యుడిగా ఉంటారు. ఇప్పుడు ఈ రెండూ ఎమ్మార్వోనే చేయాల్సి వస్తుంది.
- ఇక నిషేధిత భూముల జాబితాలను ఎమ్మార్వోలే సబ్‌రిజిస్ట్రార్లకు ఇస్తారు. సబ్ రిజిస్ట్రార్లు వాటిని పరిశీలించి రిజిస్ట్రేషన్ల సమయంలో క్రాస్ చెకింగ్ చేస్తారు. కొత్త విధానంతో రెండు పనులూ ఎమ్మార్వోనే చేయాల్సి వస్తే క్రాస్ చెకింగ్‌కు అవకాశం లేకుండా పోతుంది.

ఏటా తప్పని ఖర్చు

- రెవెన్యూ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు అందించాలంటే ఏర్పాట్ల కోసం ఒక్కో మండలంలో రూ.10 లక్షల వరకు అవసరం. ఈ లెక్కన రూ.44.3 కోట్లు ఖర్చవుతాయి.
- తర్వాత నిర్వహణ కోసం కూడా ఏటా రూ.5 కోట్ల వరకు అదనంగా ఖర్చవుతుంది. ఇది అనవసరపు భారంగా పరిణమిస్తుంది.

ఈ యోచన సమంజసం కాదు!

- కొత్త పాస్ పుస్తకాలు రైతులకు ఇబ్బంది లేకుండా సకాలంలో అందించాలంటే.. రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖలను ఎలక్ట్రానిక్ అనుసంధానం చేస్తే సరిపోతుంది.
- ప్రభుత్వం అప్పటికీ చేయాలనుకుంటే రిజిస్ట్రేషన్ల చట్టానికి అనుగుణంగా ప్రతి మండలానికి, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు నోటిఫికేషన్లు జారీ చేయాలి.

సినీ ప్రముఖులపై ఐటీ దాడులు

- జైసింహా నిర్మాత సి.కల్యాణ్, అజ్ఞాతవాసి నిర్మాత రాధాకృష్ణ ఆఫీసుల్లో తనిఖీలు
- మరో నలుగురు ప్రముఖుల కార్యాలయాల్లోనూ సోదాలు
- సినిమాలకు పెట్టుబడులు, ఆదాయ వివరాలపై ఆరా

హైదరాబాద్: పలువురు సినీ ప్రముఖుల కార్యాలయాలపై ఆదాయ పన్ను (ఐటీ) అధికారులు బుధవారం దాడులు చేశారు. నందమూరి బాలకృష్ణ నటించిన జైసింహా చిత్ర నిర్మాత సి.కల్యాణ్, పవన్‌కల్యాణ్ నటించిన అజ్ఞాతవాసి నిర్మాత రాధాకృష్ణ అలియాస్ చిన్నబాబుతో పాటు మరో నలుగురు సినీ ప్రముఖుల కార్యాలయాల్లో సోదాలు చేశారు. ఈ సందర్భంగా పలు కీలక డాక్యుమెంట్లతో పాటు హార్డ్‌డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. తొలుత కృష్ణానగర్‌లోని సి.కల్యాణ్ కార్యాలయంలో ఆరుగురితో కూడిన ఐటీ అధికారుల బృందం దాడి చేసి.. ఐదు గంటల పాటు తనిఖీలు నిర్వహించింది. అనంతరం ఆయన నివాసంలోనూ సోదాలు చేసింది. జైసింహా చిత్రంతోపాటు త్వరలో వీవీ వినాయక్, సాయిధరమ్‌తేజ్ కాంబినేషన్‌లో తలపెట్టిన భారీ బడ్జెట్ సినిమాకు సంబంధించిన లెక్కలు, పెట్టుబడుల వివరాలను, ఆదాయ పన్ను చెల్లింపు వివరాలను సేకరించినట్లు సమాచారం.

లియోనియా రిసార్ట్స్ ఎండీ అరెస్టు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ శివార్లలోని శామీర్‌పేట్‌లో ఉన్న లియోనియా రిసార్ట్స్ ఎండీ చక్రవర్తి రాజును సీబీఐ అధికారులు బుధవారం అరెస్టు చేశారు. లియోనియా రిసార్ట్స్ నిర్మించడం కోసం చక్రవర్తి రాజు 11 బ్యాంకుల నుంచి రూ.650 కోట్ల మేర రుణం తీసుకున్నారు. ఆ సమయంలో అనేక మంది రైతుల భూములకు సంబంధించిన బోగస్ పత్రాలను బ్యాంకుల్లో దాఖలు చేశారనే ఆరోపణలపై బెంగళూరు సీబీఐ టీమ్ కేసు నమోదు చేసుకుంది. ఈ రిసార్ట్‌కు కేవలం 30 ఎకరాల స్థలం మాత్రమే ఉండగా... బ్యాంకులకు 100 ఎకరాలకు పైగా చూపించారని, బోగస్ డాక్యుమెంట్ల ద్వారానే ఇది సాధ్యమైందని సీబీఐ గుర్తించింది. దీనికి సంబంధించి ప్రాథమిక ఆధారాలు సేకరించిన అధికారులు నిందితుడిగా ఉన్న చక్రవర్తి రాజును అరెస్టు చేశారు.

ప్రభుత్వానికి టీజేఏసీ వ్యతిరేకం కాదు

టీజేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం

సదాశివపేట(సంగారెడ్డి): టీఆర్‌ఎస్ ప్రభుత్వానికి టీజేఏసీ వ్యతిరేకం కాదని, అందరికి కొలువులు దొరకాలని, అందరి బతుకులు బాగు పడాలని కోరుతున్నామని టీజేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు. బుధవారం సదాశివపేటలో ఏర్పాటు చేసిన రైతు, నిరుద్యోగ గర్జనలో ఆయన ప్రసంగించారు. మనం కోరుకున్నట్లు పాలన లేదని,అందుకే ప్రశ్నిస్తున్నామన్నారు. రైతుల విషయాలపై అధ్యయనం చేసి వ్యవసాయ శాఖ మంత్రితో చర్చలు జరిపి వ్యవసాయ రంగం మార్పుపై సూచించినా లాభం లేకుండా పోయిందన్నారు. ఫిబ్రవరిలో 31 జిల్లాల చైర్మన్లతో సమావేశం నిర్వహిస్తామన్నారు.

ఫిబ్రవరిలో ఎన్నికలెట్లా?

- వచ్చే నెలలో పంచాయతీ ఎన్నికలు అసాధ్యమే!
- రెండు నెలలకుపైగా సమయం అవసరమంటున్న అధికార వర్గాలు

సాక్షి, హైదరాబాద్: వచ్చే నెలలోనే గ్రామ పంచాయతీల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్నా.. అది సాధ్యం కాదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఓటర్ల జాబితాలు, రిజర్వేషన్ల ఖరారు నుంచి.. నోటిఫికేషన్ గడువు దాకా అన్నీ కూడా ఇందుకు వీలు కల్పించవని స్పష్టం చేస్తున్నాయి. ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని యోచిస్తున్నట్లు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు స్వయంగా జిల్లా కలెక్టర్ల సదస్సులో ప్రకటించారు. కానీ ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఎన్నికల నిర్వహణ జరిగే అవకాశమే లేదని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ నుంచి ప్రక్రియ ముగిసే వరకు తప్పనిసరిగా 45 రోజుల వ్యవధి ఉండాలి. అంటే ఇప్పటికిప్పుడు నోటిఫికేషన్ జారీ చేస్తే తప్ప ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగే అవకాశం లేదు.

ఓటర్ల జాబితాలు, రిజర్వేషన్ల ఖరారు ఏదీ?

నోటిఫికేషన్ జారీ చేయాలంటే ముందు ఓటర్ల జాబితాలు సిద్ధంగా ఉండాలి. ఇప్పటికీ ఓటర్ల జాబితాలు సిద్ధంగా లేవు. ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల సవరణ ప్రక్రియ ఈ నెలాఖరు వరకు కొనసాగనుంది. తుది ఓటర్ల జాబితాలు ఎన్నికల సంఘానికి చేరితే తప్ప నోటిఫికేషన్ వెలువడే అవకాశం లేదు. ఎన్నికలకు ముందు గ్రామాల్లో సర్పంచులు, వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఖరారు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత చట్టం ప్రకారం ఐదేళ్లకోసారి రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లను మార్చాలి.

కొత్త పంచాయతీలతో..: కొత్తగా గ్రామ పంచాయతీల ఏర్పాటు, కొత్త పంచాయతీ రాజ్ చట్టం చేసే సన్నాహాల్లో ప్రభుత్వం ఉంది. ఫిబ్రవరి తొలివారంలో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి బిల్లు పెడతామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. అనుకున్నట్లుగానే కొత్త చట్టం అమల్లోకి వస్తే రాష్ట్రంలో కొత్తగా నాలుగు వేల గ్రామ పంచాయతీలు ఏర్పడతాయి. వాటికి నోటిఫికేషన్ జారీ చేసి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఇదంతా జరగాలంటే ఫిబ్రవరిలో సగం గడిచిపోతుంది.

ఎన్నికల ఏర్పాట్లు కూడా కష్టమే

దాదాపు 12 వేల గ్రామ పంచాయతీలకు ఎన్నికలు అంటే పెద్ద తతంగమే ఉంటుంది. సరిపడా బ్యాలెట్ బాక్సులు సైతం అందుబాటులో లేవని ఒక ఉన్నతాధికారి పేర్కొన్నారు. అవసరమైన ఎన్నికల సన్నాహాలు పూర్తి కావాలంటే కనీసం రెండు నెలల సమయం పడుతుందని చెబుతున్నారు.

లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్

వైద్య ఆరోగ్య మంత్రి లక్ష్మారెడ్డి



సాక్షి, హైదరాబాద్: లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ రూపకల్పన చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి అధికారులను ఆదేశించారు. సంక్షేమ పథకాల కొనసాగింపు, వచ్చే ఏడాది అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిధులను కేటాయించాలన్నారు. బుధవారం వెంగళరావునగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల ఉన్నతాధికారులతో బడ్జెట్, నియామకాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు ప్రజా వైద్యంపై నమ్మకం పెరిగిందన్నారు.

నగదు నిల్వలు సమకూర్చండి

- కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన రాష్ట్ర ప్రభుత్వం
- అరుణ్ జైట్లీతో మంత్రులు ఈటల, పోచారం భేటీ



బుధవారం ఢిల్లీలో జైట్లీని కలసిన అనంతరం బయటకు వస్తున్న మంత్రి ఈటల, కొప్పుల

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో రైతులకోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న వ్యవసాయ పెట్టుబడి పథకానికి అవసరమైన నగదు నిల్వలను సమకూర్చాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ బుధ వారం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని కలసి వ్యవసాయ పెట్టుబడి పథకం వివరాలందించారు. ఈ పథకం కింద రాష్ట్రం లో సాగులో ఉన్న ప్రతి ఎకరానికి రైతులకు రూ.4 వేలు చెక్కుల రూపంలో ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. అయితే ఈ పథకం కింద చెక్కులు తీసుకు వచ్చే రైతులకు ఇచ్చేందుకు బ్యాంకుల్లో తగిన స్థాయిలో నగదు నిల్వలు లేవని ఇటీవల నిర్వహించిన సమావేశంలో బ్యాంకర్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ఈ పథకానికి నగదు నిల్వలు తప్పనిసరైన నేపథ్యంలో కేంద్రం ఆ దిశగా ఏర్పాట్లు చేయాలని జైట్లీని కోరినట్టు సమావేశం అనంతరం పోచారం మీడియాకు తెలిపారు. 'రాష్ట్ర వ్యాప్తంగా ఏ రైతుకు ఎన్ని ఎకరాలు ఉందన్న విషయాన్ని భూ రికార్డుల ప్రక్షాళన ద్వారా సేకరించాం. దాని ప్రకారం 71,70,000 వేల మంది రైతుల వద్ద 1,42, 12,870 ఎకరాలు ఉన్నట్టు లెక్కలు తేలాయి. దీనికి ఒక్క వర్షాకాల పంటకే రూ.6 వేల కోట్లు అవసరమవుతాయని తేలింది. రెండో పంటకు కూడా రైతులకు పెట్టుబడి ఇస్తాం. రైతులకు చెక్కుల రూపం లో నగదు ఇవ్వాలని నిర్ణయించినందున, దీనికి సరిపడా కరెన్సీ నిల్వలు ప్రస్తుతానికి బ్యాంకుల్లో లేవు. నగదు నిల్వలు సమకూరిస్తేనే పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయగలుగుతామని బ్యాంకర్లు తెలిపారు. దీంతో జైట్లీని కలసి సమస్యను వివరించాం. ఆయన సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు'అని పోచారం వివరించారు. మే 1 నుంచి 10వ తేదీవరకు ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాల్లో తిరిగి చెక్కులు పంపిణీ చేస్తారన్నారు.

జీఎస్టీలోకి ఆ ఉత్పత్తులను ఒప్పుకోం..

వస్తు, సేవల పన్ను పరిధిలోకి పెట్రోలియం ఉత్పత్తులను తీసుకురావడాన్ని తెలంగాణ వ్యతిరేకిస్తుందని మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. వచ్చే నెల ఒకటిన కేంద్రం 2018–19 వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గురువారం ఢిల్లీలో అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జీఎస్టీ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఆశించిన స్థాయిలో ఆదాయం రాకపోవడంతో కొన్ని వస్తువుల పన్ను సరళిలో మార్పులు కోరుతామని ఈటల తెలిపారు. గోదావరి నదిలో మురుగు నీరు చేరకుండా శుద్ధి చేసేందుకు రూ. 36 కోట్ల నిధులు ఇవ్వాలని మంత్రి ఈటల రాజేందర్, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ కేంద్రాన్ని కోరారు. ఈ అంశంపై వారు బుధవారం ఢిల్లీలో కేంద్ర జలవనరుల మంత్రి నితిన్ గడ్కరీని కలసి ప్రతిపాదనలను సమర్పించారు. కాగా, తమ విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్టు ఈటల తెలిపారు.



దూసుకొచ్చిన మృత్యు శకటం

ఎల్బీ నగర్‌లో ఇసుక లారీ ఢీకొని ఇద్దరి మృతి

మరో ముగ్గురికి తీవ్ర గాయాలు ● పండక్కి ఊరెళ్లి వస్తుండగా విషాదం..

హైదరాబాద్: ఇసుక లారీ ఇద్దరి ప్రాణాలను బలి తీసుకుంది. ఊరిలో సంక్రాంతి సంబరాలు చేసుకొని కుటుంబంతో కలసి వస్తున్న ఓ బాలుడిని మృత్యువు కబళించింది. 10 నిమిషాల్లో ఇంటికి చేరుకోవాల్సి ఉండగా అనంతలోకాలకు తీసుకెళ్లింది. విధులకు వెళ్తున్న ఓ యువకుడినీ లారీ బలిగొన్నది. వివరాలు.. హైదరాబాద్ మీర్‌పేటకు చెందిన సునీల్, రాధ దంపతులకు ఇద్దరు కుమారులు మహేశ్(7), మనీశ్(4) ఉన్నారు. మహేశ్ మీర్‌పేటలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. సంక్రాంతికి సునీల్, భార్య, కుమారులతో కలసి అత్తగారి ఊరైన నల్లగొండ జిల్లా శ్రీనాథపురం వెళ్లి బుధవారం బైక్‌పై తిరుగుపయనమయ్యాడు. మధ్యాహ్నం వనస్థలిపురం సుష్మా చౌరస్తాకు రాగానే రెడ్ సిగ్నల్ పడటంతో బైక్ ఆపాడు. అదే సమయంలో ఆటోనగర్ నుంచి నగరానికి వెళ్తున్న ఇసుకలారీ బైక్‌ను, పక్కనే ఉన్న పల్సర్‌ను ఢీకొట్టింది. దీంతో సునీల్, రాధ, మనీశ్ తీవ్రంగా గాయపడ్డారు. మహేశ్(7), పల్సర్‌పై ఉన్న నరేశ్(25) మీదుగా లారీ దూసుకెళ్లడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. లారీ 6 మీటర్ల దూరం వెళ్లి మరో 4 ఆటోలను ఢీకొట్టింది. విజయవాడ జాతీయ రహదారిపై బీభత్సం సృష్టించింది. తీవ్రంగా గాయపడిన రాధ, సునీల్, మనీశ్‌ను ఎల్బీ నగర్‌లోని రక్ష ఆస్పత్రికి, అనంతరం కామినేని ఆస్పత్రికి తరలించారు. రాధ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. పరారీలో ఉన్న లారీ డ్రైవర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ప్రమాదం జరిగినా పత్తాలేని పోలీసులు

నిరంతరం ట్రాఫిక్‌తో రద్దీగా ఉండే సుష్మా చౌరస్తా వద్ద రోజూ ఇద్దరు కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తిస్తుంటారు. ఈ ప్రమాదం జరిగినప్పుడు ట్రాఫిక్ పోలీసులెవరూ లేకపోవడం గమనార్హం. ప్రమాదంపై స్థానికులు సమాచారమిచ్చినా పోలీసులు అరగంట వరకు కూడా స్పందించలేదు. నగరంలో ఉదయం 7.30 నుంచి 11.30 గంటల మధ్య, మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 10.00 గంటల మధ్య భారీ వాహనాల రాకపోకలపై నిషేధం ఉంది. అయినా లారీలు, భారీ వాహనాలు యథేచ్ఛగా నగరంలోకి ప్రవేశిస్తున్నా పట్టించుకునేనాథుడేలేడు.



ప్రమాదానికి కారణమైన లారీ

డ్యూటీకి వెళ్తుండగా...

హయత్‌నగర్‌లోని భాగ్యలతకు చెందిన నరేశ్ కొత్తపేటలోని మ్యాక్స్ షాపింగ్ మాల్‌లో సేల్స్ ఎగ్జిక్యూటీవ్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం విధులకు వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు.

టెన్త్ పరీక్షలకు 5.6 లక్షల మంది

ఫీజు చెల్లించిన విద్యార్థుల సంఖ్య ఇదీ ● మార్చి 15వ తేదీ నుంచి టెన్త్ పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: మార్చి 15 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను ప్రభుత్వ పరీక్షల విభాగం వేగవంతం చేసింది. పరీక్ష రాసేందుకు 5,60,395 మంది విద్యార్థులు ఫీజు చెల్లించారు. వీరి కోసం 2,500కు పైగా కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని అంచనా వేశారు. కేంద్రాల్లో అవసరమైన బెంచీలు, సదుపాయాల, ఇతర ఏర్పాట్లపై ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ సుధాకర్ అధికారులతో సమీక్షించారు. అన్ని సదుపాయాలుండేలా చూడాలని, లోపాలేమైనా ఉంటే తెలపాలని ఆదేశించారు. ఫర్నీచర్ అవసరమైతే ప్రతిపాదనలు పంపాలని విద్యా శాఖ సూచించింది.

సీసీ కెమెరాల ఏర్పాటు..: పరీక్షల ఏర్పాట్లలో భాగంగా సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. దీనిపై పాఠశాల విద్య కమిషనర్ కిషన్ ఉన్నతాధికారులతో చర్చించారు. గతేడాది మాల్ ప్రాక్టీస్ ఆరోపణలున్న జిల్లాల్లోని పరీక్ష కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయనున్నారు. పరీక్షలకు హాజరయ్యేందుకు 11,109 ఉన్నత పాఠశాలలకు చెందిన 5,04,545 మంది రెగ్యులర్ విద్యార్థులు ఫీజు చెల్లించారు. ఒకసారి ఫెయిలైన ప్రైవేటు విద్యార్థులు 35,864 మంది హాజరుకానుండగా, వొకేషనల్ విద్యార్థులు 19,986 మంది హాజరయ్యేందుకు ఫీజు చెల్లించారు. తత్కాల్ కింద ఫీజు చెల్లించేందుకు ఇంకా సమయం ఉన్నందున సంఖ్య స్వల్పంగా పెరిగే అవకాశముంది. పరీక్ష కేంద్రాలుగా ప్రైవేటు విద్యా సంస్థల ఎంపికలోనూ జాగ్రత్తలు తీసుకుంటోంది.

హైదరాబాద్, రంగారెడ్డిపై ప్రత్యేక దృష్టి..

పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అధిక సంఖ్యలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోనే ఉన్నారు. దీంతో ఈ 2 జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించింది. రెగ్యులర్ విద్యార్థుల్లో హైదరాబాద్ జిల్లా నుంచి 69,871, రంగారెడ్డి జిల్లా నుంచి 43,427 మంది హాజరుకానున్నారు. నిజామాబాద్ జిల్లాలో 24,200, సంగారెడ్డిలో 20,807, నల్లగొండలో 20,512, మహబూబ్‌నగర్‌లో 20,063 మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఫీజు చెల్లించారు.

నోటీసు ప్రకటన

మహారాజశ్రీ 9వ అదనపు కృష్ణా జిల్లా మరియు సెషన్సు జడ్జి వారి కోర్టులో మచిలీపట్నం
C.A. No. 296 - 2017(Criminal Appeal No.)

Between
M/S Kalyan Jewellers Vijayawada
Rep. by its Zonal Manager
Appellant
vs
Kakula Prasanth Kumar (R1)
Another Respondents

To
R1
కాకుల ప్రశాంత్ కుమార్
S/o శ్రీనివాసరావు
లింగపల్లి, రంగారెడ్డి జిల్లా
500019 తెలంగాణ

పై నెంబరు C.A. లోని R1 అయిన కాకుల ప్రశాంత్కుమార్ కు నోటీసు నిమిత్తము ది. 24/1/2018 వ తేదికి పై నెంబరు C.A. వాయిదా అయివున్నది. కావున పైన పేర్కొన్న 1వ రెస్పాండెంటు/ R1 ఆ రోజు ఉదయం గం' 10-30 ని' లకు పైన పేర్కొన్న కోర్టుకు స్వయముగా గాని లేదా న్యాయవాదిగారి ద్వారా గాని హాజరు అయి తమ ఆక్షేపణలు తెలుపవలెను. లేనియెడల పరోక్షమున తీర్మానించబడును

శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము

ఇట్లు
కలపటపు సీతారామారావు
తాతారావుల రాజేష్
అప్పిలెంటుతరపున
న్యాయవాది.

వాయిదా 24/1/2018
మచిలీపట్నం 15/1/2018



ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 2,487 పోస్టుల భర్తీకి కసరత్తు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ఖాళీగా ఉన్న పోస్టులతోపాటు కొత్త కాలేజీలకు మంజూరయ్యే పోస్టులనూ భర్తీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మొత్తంగా 131 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 2,487 పోస్టులను ఏప్రిల్‌లోగా భర్తీ చేయాలని భావిస్తోంది. వీటిలో పాత డిగ్రీ కాలేజీల్లో 1,273 పోస్టులు, 2008–09 నుంచి ఇప్పటివరకు మంజూరైన 60 కాలేజీల్లో మరో 1,214 పోస్టులను సృష్టించి భర్తీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. 75% పోస్టులను పదోన్నతుల ద్వారా, 25% పోస్టులను ప్రత్యక్ష నియామక పద్ధతిలో భర్తీ చేసే అవకాశం ఉంది. రాష్ట్రంలోని 71 డిగ్రీ కాలేజీల్లో 2,761 డిగ్రీ లెక్చరర్ పోస్టులు ఉన్నాయి. వాటిల్లో 1,488 పోస్టుల్లోనే రెగ్యులర్ అధ్యాపకులు ఉన్నారు. మరో 1,273 పోస్టుల్లో 384 మంది కాంట్రాక్టు అధ్యాపకులు, 889 మంది గెస్ట్ లెక్చరర్లు ఉన్నారు. వీటి భర్తీ కోసం కళాశాల విద్యా శాఖ గతంలో పంపిన ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉండగా, కొత్త కాలేజీల్లో 1,214 పోస్టులను సృష్టించి భర్తీ చేసేందుకు ఇటీవల ప్రతిపాదనలు పంపించింది.

రెవెన్యూ రికార్డుల్లో రైతుల పేర్లు చేర్చండి

ఆదిభట్ల రైతుల కేసులో ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం సేకరించిన భూముల్ని నిర్దేశించిన లక్ష్యం కోసం వినియోగించనప్పుడు, సదరు భూములు రైతుల అధీనంలోనే ఉన్నప్పుడు రెవెన్యూ రికార్డుల్లో రైతుల పేర్లను చేర్చాలని హైకోర్టు ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేసింది. రంగారెడ్డి జిల్లా ఆదిభట్లలోని 25 ఎకరాలను 2004లో ప్రభుత్వం భూసేకరణ చేసింది. భూములు తమ అధీనంలోనే ఉన్నాయని, రెవెన్యూ రికార్డుల్లో భూసేకరణ ఎవరికి నిర్దేశించారో ఆ సంస్థ పేరు ఉందంటూ రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు విచారణ జరిపారు. భూసేకరణ లక్ష్యం అమలు కానందున, రైతుల స్వాధీనంలోనే భూములు ఉన్నందున రెవెన్యూ రికార్డుల్లో తిరిగి రైతుల పేర్లు నమోదు చేయాలని రెవెన్యూ, జిల్లా అధికారులను న్యాయమూర్తి ఆదేశించారు. కోర్టును ఆశ్రయించిన వారికి మాత్రమే ఉత్తర్వులు వర్తిస్తాయని తెలిపారు.

దివ్యాంగులకు 5 శాతం కోటా

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల్లో దివ్యాంగులకు 5 శాతం కోటా కేటాయిస్తూ ప్రభుత్వం బుధవారం జీవో ఎంఎస్.1ను జారీ చేసింది. 'ద రైట్స్ ఆఫ్ పర్సన్ విత్ డిసెబులిటీస్ యాక్ట్, 2016'లో భాగంగా ఈ ఉత్తర్వులు ఇచ్చింది. క్షేత్రస్థాయి నుంచి వస్తున్న వినతుల మేరకు ప్రస్తుతమున్న 3 శాతాన్ని 5 శాతానికి పెంచినట్లు పేర్కొంది. అర్హులైన దివ్యాంగులు కోటాను వినియోగించుకోవాలని వికలాంగుల సంక్షేమ శాఖ సంచాలకులు బి.శైలజ సూచించారు.



నేడు ఎన్టీఆర్ పురస్కారాల ప్రదానోత్సవం

ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్ట్ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి



సాక్షి, హైదరాబాద్: ఎన్టీఆర్ 22వ వర్ధంతిని పురస్కరించుకొని నేడు (18న) ఎన్టీఆర్ లలితకళా పురస్కారాల ప్రదానోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి తెలిపారు. ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ గవర్నర్ కె.రోశయ్య హాజరవుతారన్నారు. బుధవారం ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ.. ప్రముఖ సినీనటుడు టి.చలపతిరావు, ప్రముఖ రచయిత్రి డాక్టర్ వాసా ప్రభావతి, ప్రవాసాంధ్రులు సిడ్నీ బుజ్జిలకు ఈ పురస్కారాలను అందజేయనున్నట్లు తెలిపారు. డి.సురేఖా మూర్తి, శశికళా స్వామి తదితరులతో ఎన్టీఆర్ చలనచిత్ర సంగీత విభావరిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమం సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమవుతుందని, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

సికింద్రాబాద్-రెక్సాల్ ప్రత్యేక రైలు



సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్–రెక్సాల్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో ఎం.ఉమాశంకర్‌కుమార్ బుధవారం తెలిపారు. సికింద్రాబాద్–రెక్సాల్ (07091/07092) ప్రత్యేక రైలు ఈ నెల 23, 30, ఫిబ్రవరి 6, 13, 20, 27, మార్చి 6, 13, 20, 27 తేదీల్లో సాయంత్రం 6.50కి సికింద్రాబాద్‌లో బయలుదేరి 2వ రోజు ఉదయం 10కు రెక్సాల్ చేరుకుంటుంది. ఈ నెల 26, ఫిబ్రవరి 2, 9, 16, 23, మార్చి 2, 9, 16, 23, 30 తేదీల్లో మధ్యాహ్నం 12.45కు రెక్సాల్‌లో బయలుదేరి రెండవ రోజు ఉదయం 6.55కు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

కాకినాడ–సికింద్రాబాద్ ప్రత్యేక రైలు

కాకినాడ–సికింద్రాబాద్ ప్రత్యేక రైలు (07002) ఈ నెల 19వ తేదీ రాత్రి 8.05కు కాకినాడలో బయలుదేరి మర్నాడు ఉదయం 6.55కు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

విశాఖ–లింగంపల్లి జనసాధారణ్

విశాఖ–లింగంపల్లి(07053) జనసాధారణ్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 18న సాయంత్రం 6.50కి విశాఖలో బయలుదేరి మర్నాడు ఉదయం 10కు లింగంపల్లి చేరుకుంటుంది.

టీ-శాట్ యూట్యూబ్ సబ్‌స్క్రైబర్స్ @ లక్ష

2 కోట్లకు చేరిన వీక్షకుల సంఖ్య: శైలేష్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: టీ–శాట్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో నడుస్తున్న యూట్యూబ్ చానల్‌కు విశేష ఆదరణ లభించింది. టీ–శాట్ యూట్యూబ్ చానల్‌ను 1,00,282 మంది సబ్‌స్క్రైబ్ చేశారని, వీక్షకుల(వ్యూస్) సంఖ్య 1,93,18,093కు చేరిందని సంస్థ సీఈవో ఆర్.శైలేష్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సభలు, సమావేశాలు నిర్వహించి నిరుద్యోగ యువతను చైతన్యపరిచే బృహత్తర కార్యక్రమాన్ని టీ–శాట్ నిర్వహిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో తెలంగాణ ఉద్యోగుల భాగస్వామ్యాన్ని పెంచే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాష్ట్ర ఐటీ శాఖ పరిధిలోని టాస్క్, డిజిటల్ మీడియాతో పాటు ఉన్నత విద్యాశాఖతో కలసి ఉమ్మడి కార్యాచరణ చేపట్టనున్నట్లు ప్రకటించారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీ పరీక్షలకు టీ–శాట్ నెట్‌వర్క్ అవగాహన కార్యక్రమాలను ప్రసారం చేసింది. గ్రూప్–2, ఐఐటీ, నీట్, ఎంసెట్, పాలిసెట్, గురుకుల, ఫారెస్ట్ ఉద్యోగ గైడ్, టెట్ 2017, ఐబీపీఎస్‌తో పాటు టీఆర్‌టీ నిర్వహిస్తోంది. వీటితో పాటు స్పోకెన్ ఇంగ్లిష్, చిన్నపిల్లల కోసం ప్రత్యేక కార్యక్రమాలు, రాజ్యాంగపరమైన అంశాలు, సామాజిక కార్యక్రమాలు, ప్రముఖుల చరిత్రలను ప్రసారం చేస్తోంది.

ఏఎస్ రావు ఒలంపియాడ్‌లో శ్రీచైతన్య హవా

హైదరాబాద్: డాక్టర్ ఏఎస్ రావు అవార్డ్స్ కౌన్సిల్ 9, 10 తరగతుల విద్యార్థులకు డిసెంబర్ 31న నిర్వహించిన 30వ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్‌లో శ్రీచైతన్య విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఆలిండియా నంబర్ 1 ర్యాంకుతో పాటు టాప్ 10లో 15 ర్యాంకులను శ్రీచైతన్య విద్యార్థులు కైవసం చేసుకున్నారని విద్యాసంస్థల చైర్మన్ డా.బీఎస్ రావు ఓ ప్రకటనలో తెలిపారు. టాప్ 20లో 28 ర్యాంకులు సాధించారని, ర్యాంకులు సాధించిన 76 మంది విద్యార్థుల్లో 51 మంది శ్రీచైతన్యకు చెందిన వారేనని తెలిపారు. ఆరేళ్లుగా నిర్వహిస్తున్న ఒలంపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నారని పేర్కొన్నారు. విజయాలు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సంస్థ అకడమిక్ డైరెక్టర్ సీమ అభినందనలు తెలిపారు.



సాక్షి
గురువారం, జనవరి, 18

ఈ వ్యాపార ధోరణి మారాలి

సరిగ్గా ఎనిమిదేళ్ల క్రితం యూపీఏ ప్రభుత్వం పెట్రోల్ ధరపైనా, 2014లో ఎన్‌డీఏ ప్రభుత్వం డీజిల్ ధరపైనా నియంత్రణ తొలగించినప్పుడు దేశ ప్రజలకు ఒకే రకమైన వాగ్దానం చేశాయి. ఇలా నియంత్రణ ఎత్తేయడం వల్ల మేలే తప్ప కీడు జరగదన్నదే దాని సారాంశం. కానీ వాస్తవం అందుకు విరుద్ధంగా ఉన్నదని 'సాక్షి' బుధవారం వెల్లడించిన కథనం స్పష్టం చేస్తోంది. గతంతో పోలిస్తే చమురు ఉత్పత్తుల ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లోతక్కువగానే ఉన్నా వాటికి అనుగుణంగా ఇక్కడ ధరలు తగ్గటం లేదు సరికదా అవి పైపైకి పోతున్నాయని ఆ కథనం వివరించింది. అంతేకాదు... దేశంలో ఈ పెట్రో ధరల మంటను మిగిలిన వారి కంటే రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలే అధికంగా భరించవలసి వస్తున్నదని వెల్లడించింది. చమురు సంస్థలు ప్రతి పదిహేను రోజులకూ పెట్రోల్, డీజిల్ ధరలను సవరించే విధానాన్ని నిరుడు జూన్ 16నుంచి తొలగించి, దాని స్థానంలో రోజువారీ సవరణను మొదలుపెట్టారు. ఈ రోజువారీ ధరల సవరణలో ప్రభుత్వాలకు ఒక వెసులుబాటు ఉంది. రోజుకు కొన్ని చిల్లర పైసలు పెరగడాన్ని లేదా తగ్గడాన్ని పెద్దగా ఎవరూ పట్టించుకోరు. కానీ మొత్తంగా గత వారం కంటే రూపాయి లేదా అంతకన్నా ఎక్కువ పెరిగిందని, నెలక్రితం కంటే రూ. 2 పెరిగిందని గ్రహించినప్పుడు గుండెలు బాదుకోక మానరు. పెరిగే పెట్రో ధరలతో సమస్యేమంటే... అవి కేవలం ద్విచక్ర వాహనదారులనో, ఆటోలు, కార్లు, ట్రక్కులు ఉన్నవారినో తాకి ఊరుకోవు. కూరగాయలు, ఇతర నిత్యావసరాలు మొదలుకొని సామాన్యులు కొనే ప్రతి వస్తువుపైనా ఆ పెట్రో ధరల ప్రభావం పడుతుంది. ఫలితంగా ద్రవ్యోల్బణం పెరిగి బతుకులు దుర్భరంగా మారతాయి. పెరిగే ధరలకనుగుణంగా కరువు భత్యం మారే ఉద్యోగులకు ఎంతో కొంత ఊరట దొరుకుతుంది. కానీ రెక్కాడితే గానీ డొక్కాడని కోట్లాదిమంది బడుగు జీవుల పరిస్థితేమిటి? వారు బతకడమెలా? మన ప్రభుత్వాలు ఆ సంగతి ఆలోచిస్తున్నట్టు లేదు.

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరకూ, ఇక్కడ పెట్రో ఉత్పత్తుల ధరలకూ ఏనాడూ పొంతన ఉండటం లేదు. 2013 సెప్టెంబర్‌లో అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ చమురు ధర 113 డాలర్లు(సుమారు రూ. 7,200) ఉన్నప్పుడు హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ. 83.07, డీజిల్ ధర రూ. 58.67 ఉంది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధర 69 డాలర్లకు (సుమారు రూ. 4,416) పడిపోయినా పెట్రోల్, డీజిల్ ధరలు అదే నిష్పత్తిలో తగ్గలేదు. ప్రస్తుతం హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ. 75.47, డీజిల్ ధర రూ. 67.23 ఉంది. మన ప్రభుత్వాలు తమ విధానాల్లో ఉన్న లోపాలను సవరించుకోవడానికి బదులు ఎప్పటికప్పుడు సామాన్యులపై భారాన్ని నెట్టి చేతులు దులుపుకుంటున్నాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు పడిపోవడమంటే మన కరెంట్ అకౌంట్ లోటు తగ్గడం, మన విదేశీ మారకద్రవ్యం ఆదా కావడం. ఇంకా చెప్పాలంటే ద్రవ్యలోటు తగ్గడం. పడిపోతున్న చమురు ధరల వల్ల ఇన్ని ఉపయోగాలున్నా సాధారణ పౌరులకు అందువల్ల కలుగుతున్న ప్రయోజనం ఏమీ లేదు. అంతర్జాతీయంగా ధరలు తగ్గుతున్నప్పుడు పన్నులు పెంచి ఇక్కడి ధరలను నామమాత్రంగా తగ్గించడం, ధరలు పెరిగినప్పుడు మాత్రం ఆ భారాన్నంతటినీ ప్రజలపైన మోపడం ప్రభుత్వాలకు అలవాటుగా మారింది. అంతర్జాతీయ చమురు మార్కెట్‌ను ఎన్నో రకాల అంశాలు ప్రభావితం చేస్తుంటాయి. కమోడిటీ మార్కెట్‌లో ముడి చమురు ధరల్లో వచ్చే వ్యత్యాసాలు మొదలుకొని ముడి చమురుకుండే డిమాండ్ వరకూ వాటిల్లో ఎన్నో ఉంటాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు అలుముకున్నప్పుడూ, ఒపెక్ దేశాలు చమురు ఉత్పత్తుల పరిమాణాన్ని పెంచడం లేదా తగ్గించడం చేసినప్పుడూ, మార్కెట్‌లోకొచ్చే షేల్ చమురు పరిమాణం వగైరాలు చమురు ధరల్ని ప్రభావితం చేస్తాయి. ఇన్ని సంక్లిష్టతలున్న అంతర్జాతీయ మార్కెట్‌కు మన చమురు ధరల్ని ముడి వేసి అంతా దాని ప్రకారం చేస్తామనడమే అన్యాయమనుకుంటే... రకరకాల పన్నులు, సుంకాలు జోడించి వాటిని మరింతగా పెంచడం క్షమించరాని విషయం. 2016–17 ఆర్థిక సంవత్సరంలో పెట్రో ఉత్పత్తులపై వివిధ పన్నులు, సుంకాల ద్వారా రూ. 2.67 లక్షల కోట్లు ఆదాయం వచ్చిందని గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో రాష్ట్రాల వాటా 42 శాతమైతే, మిగిలింది కేంద్రం వాటా.

వేరే రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు పెట్రో ఉత్పత్తులపై వ్యాట్, ఇతర సుంకాలు భారీగా వసూలు చేస్తున్నాయన్న సంగతి దిగ్భ్రాంతి కలిగిస్తుంది. పెట్రోల్ ధరలో ఈ రెండు రాష్ట్రాలూ దేశంలోనే రెండోస్థానంలో ఉన్నాయి. డీజిల్ విషయానికొస్తే ఈ రెండుచోట్లే దాని ధర అధికం. వాస్తవానికి పెట్రోల్, డీజిల్ ధరలు హైదరాబాద్ కంటే కూడా విజయవాడలో రూ. 1.80 పైసలు ఎక్కువ. ఆంధ్రప్రదేశ్ పొరుగు రాష్ట్రాల్లో సరిహద్దులో ఉన్న బంకుల్లో 'ఆంధ్రప్రదేశ్‌లో రేట్లు ఎక్కువ. ఇక్కడే ట్యాంక్ నింపుకోండి' అంటూ కటౌట్లు పెడుతున్నారంటే పరిస్థితేమిటో అర్థమవుతుంది. దేశంలో నిత్యావసరాలను నలుమూలలకూ చేరవేసే ట్రక్కులు డీజిల్‌తో నడిచేవే గనుక దాని ధర పెరిగినప్పుడల్లా ఆ ప్రభావం సామాన్యులపై పడుతుంది. ద్రవ్యోల్బణం కట్టలు తెంచుకుంటుంది. పెట్రోల్ చార్జీలు పెరిగితే రవాణా చార్జీలపై ప్రభావం ఉంటుంది. ఏతావాతా నిత్యావసరాల ధరలు, రవాణా చార్జీలు భారీగా పెరిగి జనం విలవిలలాడతారు. పెట్రోల్‌పై 57 శాతం, డీజిల్‌పై 44 శాతం పన్నులు, సుంకాలు విధిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనం బతుకులతో ఆటలాడుకుంటున్న తీరు క్షంతవ్యం కాదు. ఏకీకృత పన్ను వ్యవస్థ అంటూ జీఎస్‌టీని అమల్లోకి తెచ్చి ఆర్నెల్లు దాటుతున్నా పెట్రో ఉత్పత్తులకు దాన్ని వర్తింపజేయకపోవడం న్యాయం కాదు. ఫక్తు వ్యాపార ధోరణికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇకనైనా స్వస్తి చెప్పాలి. పెట్రో ధరల విధానాన్ని సవరించుకోవాలి.



ధరల పెరుగుదలను ఖాయం చేసే సంస్కరణలు నిజంగా ప్రజలకు మేలు చేసే సంస్కరణ లేనా?

– మోనా చరెన్
అమెరికన్ కాలమిస్టు

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి శు.పాడ్యమి ఉ.9.10 వరకు, తదుపరి విదియ, నక్షత్రం శ్రవణం రా.12.08 వరకు, తదుపరి ధనిష్ఠ, వర్జ్యం తె.4.27 నుంచి 6.10 వరకు (తెల్లవారితే శుక్రవారం), దుర్ముహూర్తం ఉ.10.17 నుంచి 11.02 వరకు, తదుపరి ప.2.44 నుంచి 3.29 వరకు, అమృతఘడియలు... ప.12.45 నుంచి 2.30 వరకు.

సూర్యోదయం : 6.39
సూర్యాస్తమయం : 5.43
రాహుకాలం : ప 1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు

నమాజ్ వేళలు

ఫజర్ : 5.34
జొహర్ : 12.26
అసర్ : 4.28
మగ్రీబ్ : 6.03
ఇషా : 7.19

ఆ సేవలను గుర్తించే క్షణం ఎప్పుడో!


మల్లెపల్లి లక్ష్మయ్య

వ్యవసాయం, పారిశ్రామిక రంగాల అభివృద్ధి అణువణువునా అంటరాని కులాల త్యాగాలతో నిండి ఉన్నాయి. ఆ త్యాగాల అనుభవాలను మరిచిన సమాజం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. అంటరాని కులాలు గతంలో శ్రమ దోపిడీకి గురికావడమే కాదు, వర్తమాన సమాజంలో ఎటువంటి భాగస్వామ్యానికీ నోచుకోవడంలేదు. హీనంగా చూస్తూ వారిని ఊరి బయటకు నెడుతున్నారు. జాతి సంపదను పెంచిన కులాలు ప్రభుత్వాల దగ్గర రిజర్వేషన్ల కోసమో, సంక్షేమ కార్యక్రమాల కోసమో మోకరిల్లాల్సిన పరిస్థితి.


'ఆఫ్రికా నవ నక్షత్రాలూ వెనక్కి ఇచ్చేయాలి. అవి ఆఫ్రికా వజ్రాలు. తొమ్మిది వజ్రాలను తొమ్మిది నక్షత్రాలని పిలుస్తాం. ఇవి బ్రిటన్‌లో ఉన్నాయి. అటువంటి వేలాది వజ్రాలు ఆఫ్రికా నుంచి తవ్వి తీసుకెళ్లారు. అవి మావి, మాకే చెందాలి' ఆఫ్రికా రిపరేషన్స్ మూవ్‌మెంట్ నాయకులు, బ్రిటన్ పార్లమెంట్ సభ్యులు బెర్నీగ్రాంట్ డిమాండ్ ఇది. ఆఫ్రికాను బ్రిటన్ వలసగా మార్చుకోవడం, సంపదను దోచుకెళ్లడం వంటి వివరాలను బెర్నీగ్రాంట్ తెలియజేశారు. ఆఫ్రికా నల్లజాతి ప్రజలు వజ్రాలను వెలికితీసి బ్రిటన్‌ను సంపన్న దేశంగా మార్చారని బెర్నీ పేర్కొన్నారు. ఆఫ్రికా నల్లజాతి కార్మికుడు ఒకరు ప్రీమియర్ మైనింగ్ కంపెనీలో పనిచేస్తున్న సమయంలో 1905లో ఒక వజ్రం కంటపడింది. ఇది చరిత్రలో నమోదు కాలేదు. ఆ వజ్రాన్ని 1907లో బ్రిటన్ ప్రభుత్వం లక్షా యాభైవేల పౌండ్స్‌కు కొనుగోలు చేసి చక్రవర్తి ఏడవ ఎడ్వర్డ్‌కు జన్మదిన కానుకగా అందజేసింది. దాన్ని ఆ తర్వాత తొమ్మిది చిన్న వజ్రాలుగా మలిచారు. వీటినే తొమ్మిది నక్షత్రాలుగా పిలుస్తామని బెర్నీగ్రాంట్ తెలిపారు. బెర్నీ ఆఫ్రికా రిపరేషన్స్ మూవ్‌మెంట్ నాయకుడు.

ఆ ఉద్యమం గురించి ఇంకొంచెం

2001 ఆగస్టు– సెప్టెంబర్ నెలల్లో దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో జరిగిన ప్రపంచ జాతి వివక్షా వ్యతిరేక సదస్సులో మొదటిసారిగా 'రిపరేషన్స్'అనే అణగారిన ప్రజల విముక్తినాదం నా చెవులను తాకింది. 'వివక్షకూ అణచివేతకూ గురైన ప్రజల ప్రగతి కోసం మానవ హక్కులూ, సేవాదృక్పథం మాత్రమే సరిపోవు. కోల్పోయిన అన్నిరకాల వనరులు, సంపద తిరిగి పొందేంతవరకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. అదే రిపరేషన్స్' అని నల్లజాతి నినదించింది. అప్పటి నుంచి ఆ ఉద్యమం అంచెలంచెలుగా విస్తరిస్తున్నది. అమెరికాలో, ఆస్ట్రేలియాలో ఆదిమ తెగల ప్రజలకు అక్కడి ప్రభుత్వాలు రిపరేషన్స్ పేరుతో ఏటా కొన్ని నిధులు కేటాయించి అభివృద్ధికి పాటుపడుతున్నాయి. అమెరికాలో కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో ప్రజలు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు కూడా. డిసెంబర్ 7, 2009న ఫెడరల్ కోర్టు రెడ్ ఇండియన్స్‌కి రిపరేషన్స్ నిధులు అందజేయాలని తీర్పునిచ్చింది. ఇది ఆధునిక ప్రభుత్వాలు బాధ్యతగా వ్యవహరించడానికి సూచనగా నాటి అధ్యక్షుడు బరాక్ ఒబామా భావించారు కూడా. ఆదిమ తెగల ప్రజల సంపద, వారసత్వం మీదనే ఆధునిక సమాజాల నిర్మాణం జరిగిందనీ, అణచివేతతో, పీడనతో ప్రజలనుంచి దోచుకున్న సంపదతోనే ప్రస్తుత వ్యవస్థలు పనిచేస్తున్నాయనీ, అటువంటి వారసత్వాన్నీ, సంపదనూ అందించిన ప్రజలను మర్చిపోవడం లేదా వివక్షకు గురిచేయడం ఎంత మాత్రం సరికాదని ఆ సమయంలోనే ఒబామా ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. దీనితో మరోసారి రిపరేషన్స్ అంశం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

'రిపరేషన్స్'అంశం చరిత్రకు కొత్తకాదు. గతంలో యుద్ధంలో ఓడినవారు విజేతలకు నష్టపరిహారంగా కొంత సంపదను రిపరేషన్స్ పేరిట చెల్లించేవారు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో జర్మనీలో జరిగిన యూదు జాతి హత్యాకాండకు పరిహారంగా ప్రభుత్వం ఏటా రిపరేషన్స్ చెల్లిస్తున్నది. కెనడాలో 1991 నుంచి అధ్యయనం చేసి 2006లో అక్కడి ఆదిమ తెగల అభివృద్ధి కోసం రెండు బిలియన్ డాలర్ల ఆర్థికసాయాన్ని అందజేసింది. నియంతృత్వ పాలనలలో నిర్బంధానికి గురైన ప్రజలకు, కార్యకర్తలకు ప్రజాస్వామ్య వ్యవస్థలు ఏర్పడిన అనంతరం తగు నష్టపరిహారం చెల్లించినట్టు ఆధారాలున్నాయి. చిలీ, మొరాకో, గుయానా, బార్బొడాస్, జమైకా దేశాల్లో ఇటువంటి రాజకీయ రిపరేషన్స్ అందజేశారు. రాజకీయ పరమైన వారసత్వ హక్కుగా

కొత్త కోణం



ఈ రోజు ఆఫ్రికా రిపరేషన్స్ మూవ్‌మెంట్ నడుస్తున్నది. అమెరికా నల్లజాతి ప్రజలు కూడా తమకు జరిగిన అన్యాయానికీ, దోపిడీకి రిపరేషన్స్ పరిష్కారమని భావిస్తున్నారు.

రిజర్వేషన్ - రిపరేషన్

ఈ నేపథ్యం నుంచే భారతదేశంలో రిజర్వేషన్లను అర్థం చేసుకోవాలి. ఇటీవల ఈ రిజర్వేషన్ల డిమాండ్‌కు కొత్త అర్థాలు తీసుకొస్తున్నారు. జనాభా అధికంగా ఉండి, రాజకీయాలను ప్రభావితం చేసేవారు తమ ఆర్థిక, సామాజిక స్థితిగతులతో నిమిత్తం లేకుండా రిజర్వేషన్లపైన ఉద్యమాలు చేస్తున్నారు. భారత రాజ్యాంగం స్ఫూర్తి ప్రకారం కాకుండా కేవలం తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి కొందరు రాజకీయ నాయకులు ఇటువంటి నినాదాలను ముందుకు తెస్తున్నారు. ఎలాగైనా అధికారంలోనికి రావాలనే ఆశతో ప్రధాన పార్టీలన్నీ ఇటువంటి నినాదాలను సమర్థిస్తున్నాయి. రాజ్యాంగ పరిధిలో అవి ఏమాత్రం ఇమడవని తెలిసినప్పటికీ ప్రోత్సహిస్తున్నాయి. దానితో రిజర్వేషన్ల లక్ష్యమే ప్రమాదంలో పడింది. భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల ప్రకారం పౌరులెవ్వరైనా వివక్షకు గురికాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. అయితే నిజానికి ఏ వర్గాలైతే ఈ దేశంలో వివక్షకూ, దోపిడీకీ, వెలివేతకూ గురయ్యాయో అవి ఇంకా అదే పరిస్థితుల్లో జీవనం కొనసాగిస్తున్నాయి. ఆర్థిక, సామాజిక అంతరాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఈ వర్గాలకే ఎంతో చేసినట్టు, దేశ సంపదను దోచిపెడుతున్నట్టు ఆధిపత్య కులవాదులు భావించడమే దారుణం. పైకి ఏం చెబుతున్నప్పటికీ ఎస్సీ, ఎస్టీల పట్ల, వారి అభివృద్ధి పట్ల రాజకీయ నాయకులలో చిత్తశుద్ధి లేదు. కానీ సంక్షేమం పేరుతో ఘనకార్యం చేస్తున్నట్టు ప్రకటించుకుంటున్నారు. ఆఫ్రికా రిపరేషన్స్ మూవ్‌మెంట్ స్ఫూర్తిని చూశాక, వారి వాదనను అర్థం చేసుకున్న తర్వాత ఈ దేశంలోని ఎస్సీ, ఎస్టీలకు కావాల్సింది రిజర్వేషన్లు మాత్రమే కాదు, రిపరేషన్స్ సైతం తప్పనిసరి అని భావించాలి. ప్రస్తుతం ఎస్సీలుగా పేర్కొంటున్న అంటరాని కులాలు మూడు వేల సంవత్సరాలకు పైగా తమ శ్రమను, సంపదను, ప్రాణాలను ఈ దేశం కోసం అర్పించాయి.

ఆ శ్రమ, త్యాగం వృథా కారాదు

వ్యవసాయం, పారిశ్రామిక రంగాల అభివృద్ధి అణువణువునా అంటరాని కులాల త్యాగాలతో నిండి ఉన్నాయి. ఆ త్యాగాల అనుభవాలను మరిచిన సమాజం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. అంటరాని కులాలు గతంలో శ్రమ దోపిడీకి గురికావడమే కాదు, వర్తమాన సమాజంలో ఎటువంటి భాగస్వామ్యానికీ నోచుకోవడంలేదు. హీనంగా చూస్తూ వారిని ఊరి బయటకు నెడుతున్నారు. జాతి సంపదను పెంచిన కులాలు ప్రభుత్వాల దగ్గర రిజర్వేషన్ల కోసమో, సంక్షేమ కార్యక్రమాల కోసమో మోకరిల్లాల్సిన పరిస్థితి.

వ్యవసాయ సమాజం పురోగమించడానికి అంటరాని కులాలు చేసిన కృషి అనిర్వచనీయం. చనిపోయిన పశువుల చర్మాలను శుద్ధి చేసి 18 రకాల వృత్తి వస్తువులను అందించి ఉండకపోతే ఈ రోజు మన సమాజాన్ని ఈ స్థాయిలో ఊహించడం కష్టమే. అత్యంత మురికితో ఉండి, వాసనకూడా తట్టుకోలేని స్థితిలో తోలును లందలో ఉంచి శుభ్రం చేయడం సమాజంలోని మరే ఇతర సామాజిక వర్గం చేయలేనప్పుడు అంటరాని కులాలుగా ఉన్న వీరు దాన్ని అత్యంత బాధ్యతగా సామాజిక పురోగమనానికి ఒక ఆయుధంగా వాడారు. వ్యవసాయ రంగంలో పశుపోషణ, చెరువుల నిర్మాణం, నిర్వహణ, దున్నడం, పంటల రక్షణ వంటి పనులు అంటరాని కులాలే నిర్వహించాయి. ఇటీవల రైతేరాజు అనీ, అన్నదాత అనీ చెపుతున్నదంతా ఎవరిని గురించి ప్రస్తావిస్తున్నదంటే భూమి ఎవరి చేతిలో ఉందో వారిని గురించే, భూమిపైన కాగితపు హక్కుదారులను గురించే తప్ప ఆ మట్టిలో మట్టిగా ఆరుగాలం కష్టపడి, తమ చెమటతో పంటలను పండించిన ఈ అంటరాని జనం తమ రక్తాన్ని ధారపోసి గుక్కెడు గంజికి సైతం నోచుకోక తరతరాలుగా ఆ భూమికి దూరంగా బతుకుతున్నారన్న స్పృహ ఈ సమాజానికి ఎందుకు లేకుండా పోయిందో అర్థం కాదు. ఇక ఏ తోలైతే సాంకేతిక నైపుణ్యానికి పునాదులు వేసిందో దాన్ని ఆవిష్కరించిన అంటరాని కులాలు ఈ రోజు అదే పరిశ్రమలో కూలీలుగా కూడా మిగల్లేదు. ఏటా వేల కోట్ల రూపాయల ఎగుమతితో విదేశీ మారక ద్రవ్యాన్ని సంపాదిస్తున్న వాళ్లు పరిశ్రమాధిపతులైతే వృత్తికీ, ఉత్పత్తికీ దూరమై దిక్కు తోచక గ్రామాల్లో అలమటిస్తున్నది మాత్రం అంటరాని కులాలు. 150 ఏళ్ల రైల్వే, గనుల చరిత్రను తవ్వి తీస్తే కార్మికుల కృషి, త్యాగం బయటపడతాయి. కానీ ఇప్పటి వరకు ఆ చరిత్రను రాయడానికీ, అధ్యయనం చేయడానికీ ఏ ప్రభుత్వాలూ సిద్ధంగా లేవు.

ఆదివాసీల పరిస్థితీ అంతే!

అదేవిధంగా ఆదివాసీలు గత వందల సంవత్సరాల్లో తమ భూమినీ, అడవినీ కోల్పోయి పుట్టిన గడ్డపైనే పరాయి బతుకు బతుకుతున్నారు. పరిశ్రమాధిపతుల ప్రయోజనం కోసం ప్రభుత్వాలు ఆదివాసీలను తరిమి వేస్తూ అక్కడి వనరులను ఆక్రమించుకుంటున్నాయి. నాటి బ్రిటిష్ ప్రభుత్వంతో పాటు ఆధునిక ప్రభుత్వాలు సైతం వారిని వెంటాడి వేటాడుతున్నాయి. దేశ సంపదను వృద్ధి చేయడంలో, వనరులను కాపాడడంలో ఎన్నో త్యాగాలు చేసిన ఆదివాసీల కోసం, అంటరాని కులాల కోసం బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు వాటి మీద ఆధారపడి అమలు జరుగుతున్న రిజర్వేషన్లు, సంక్షేమ కార్యక్రమాలు, రోజురోజుకీ ప్రభుత్వాల దయాదాక్షిణ్యాల మీద, వారి మంచి, చెడు ప్రవర్తనలమీద ఆధారపడుతున్నాయి. అందుకే ఆఫ్రికా నల్లజాతి ప్రజలు డిమాండ్ చేస్తున్నట్టుగా, ఉద్యమిస్తున్నట్టుగా రిపరేషన్స్ అనే ఉద్యమాన్ని భారతదేశంలో కూడా ఆదివాసీలు, దళితులు ఆరంభించక తప్పని పరిస్థితిని భారత సమాజం, ప్రభుత్వాలు కల్పిస్తున్నాయి. రిజర్వేషన్ల మీద నిరసనతో ఉన్న సమాజం, దళితుల పట్ల అడుగడుగునా ద్వేషంతో ఉన్న కుల సమాజం భారతదేశ చరిత్రను మరొక్కసారి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. అణచివేతకు గురైన వర్గాల వారు దేశంలో 25 శాతం ఉన్నారు. దేశంలో సామరస్యం, శాంతి, ప్రజాస్వామ్యం నిలబడాలంటే ఒక్కటే మార్గం ఉంది. తరతరాలుగా ఈ సమాజంలో భాగం కాలేకపోయిన, వివక్షకీ గురి అవుతోన్న ఆ అణగారిన వర్గాలను ఈ దేశంలో ఒక భాగంగా గుర్తించక తప్పదు.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు । 97055 66213

నమ్మకం ఇచ్చిన మనీషి వైఎస్సార్

కొమ్మినేని శ్రీనివాసరావుతో దర్శకుడు కోడి రామకృష్ణ



రాజకీయనేతగా కంటే వ్యక్తిగా వైఎస్ రాజశేఖరరెడ్డి చాలా మంచిమనిషని, ఈ మనిషి ఉంటే చాలు అనే నమ్మకం ప్రజలకు ఇచ్చిన గొప్పనేత అని శతాధిక చిత్ర దర్శకుడు కోడి రామకృష్ణ పేర్కొన్నారు. ఏ రంగంలో అయినా పొగిడేవారి కంటే విమర్శించే వారికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సరైన విధంగా నచ్చచెప్పగలిగితే ఎంతటి ప్రముఖులైనా మనం చెప్పింది వింటారనేది చిత్రజీవితంలో తాను పొందిన మంచి అనుభవమన్నారు. రాజకీయ జీవితంలో క్షణం కూడా ఖాళీగా గడపకుండా వైఎస్ జగన్ అందరి అభిమానాన్ని చూరగొంటున్నారని, ఆయన కృషి ఫలిస్తుందని చెబుతున్న కోడి రామకృష్ణ అభిప్రాయాలు ఆయన మాటల్లోనే...

సినిమాకు చెందిన అన్ని శాఖల్లోనూ ఇంత అనుభవం ఎలా సాధించారు?

దర్శకుడికి బాయ్ చేసే పని నుంచి దర్శకుడు చేసే పనివరకు అన్నీ తెలిసి ఉండాలి. మనవద్ద పనిచేసే బాయ్ కష్టం కూడా తెలియాలి. అందుకే కాఫీ అనగానే బాయ్‌ని కేకేయకూడదు. తను ఏ కష్టంలో ఉన్నాడో చూసి అడగాలి. అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్నప్పటినుంచి నేను ఎడిటర్ పనేమింటి, అసిస్టెంట్ పనేమిటి, మ్యూజిక్ ఏమిటి, ఎలా చేస్తారు.. రైటర్ ఎవరు అని అన్నీ తెలుసుకుంటాను. వారినుంచి సహాయం తీసుకుంటాను. ప్రతి రంగంలోనూ ఒక సమర్థుడిని పెట్టుకుంటాను. సమర్థుడు అంటే నన్ను విమర్శించాలి. ఇది బాగా లేదు సార్ అనగలగాలి. అప్పుడే మళ్లీ వెనక్కు చూసుకుంటాం.

సినీరంగంలో పొగడ్తలు తప్పవు కదా?

పొగడటం అనేది విషం లాంటిది. మన తప్పును మనకు చెప్పే విమర్శ అద్దం లాంటిది. నాకు పొగిడేవారంటే భయం. విమర్శ మనం వెళ్లే దారిలో ఒక సిగ్నల్ లాంటిది. లేదు సార్, బాగా లేదు సర్, మనం పలాని అంశంలో రాజీపడిపోతున్నాం డైరెక్టర్ గారూ అని ఎవరన్నా అంటే వెంటనే అమ్మా అనుకుని అతడికి షేక్ హ్యాండ్ ఇచ్చి మరీ జాగ్రత్త పడాలి.

పెద్ద డైరెక్టర్లు, నటులను కూడా మీరు విమర్శించేవారా?

ప్రతి ఒక్కరికీ ఒక సైకాలజీ ఉంటుంది. కానీ నేరుగా విమర్శించకూడదు. భానుమతి గారున్నారు. ఆమె డైరెక్టర్, రచయిత, నటి. ఆమెకు ఒక సీన్ చెప్పామంటే తన సూచన చెబుతారు. ఒకే మేడమ్ బాగుంది పెడతాము అని చెప్పి పది నిమిషాలు ఆగి, ఇక్కడ ఇలా వచ్చింది మేడం. ఫరవాలేదా అని అడిగితే అలా వచ్చిందా, అయితేవద్దు తీసేద్దాం అని ఆమె సమాధానపడేవారు. అదే వెంటనే చెబితే కోపం వచ్చేస్తుంది కదా. మంగమ్మగారి మనవడు స్క్రిప్ట్ వినిపించాను. ఆ సినిమాలో ఆవిడ పాత్రకి డబుల్ మీనింగ్ డైలాగులు ఎక్కువ ఉంటాయి. గోపాల్‌రెడ్డిగారు, గణేష్ పాత్రో గారు నేను ఆమె వద్దకు వెళ్లి స్క్రిప్టు చదివి వినిపించగానే సర్రున లేచి వెళ్లిపోయిందామె. 'వెళ్లిపోండి మీరు బయటకు, కాఫీలు ఇవ్వడం కూడా దండగ మీకు. భానుమతి అంటే ఏమనుకున్నారు' అంటూ మండిపడ్డారు. లేదమ్మా, తప్పకుండా స్క్రిప్టు మారుస్తాము అని ఒప్పించాము. సరే మార్చండి అన్నారు. ఆ తర్వాతి రోజు పొద్దున్నే కోడూరులో షూటింగ్. అన్నీ సరిగా ఉన్నాయా లేదా అని ఆమె టెన్షన్ పడుతున్నారు. ఆమె ముందుకు వెళ్లి డైలాగ్ చూపించాను. ఫస్ట్ షాట్. చుట్టూ జనం. 'భయంకర బల్లి బట్టల్లేకుండా స్నానం చేస్తూ బావగారు వచ్చారని లేచి నిలబడిందట' అని డైలాగ్. ఏకధాటిగా చెప్పేసింది. షాట్ ఓకే. జనమంతా చప్పట్లు కొట్టేశారు. ఆమెకు ఆశ్చర్యమేసింది. నిన్న మీరు వద్దన్న డైలాగ్ ఇదే అని చెప్పాను. అన్ని డైలాగులూ ఇదేరకంగా చెప్పండి మీరు. సినిమా సంవత్సరం ఆడుతుందన్నాను. అలాగే చెబుతాను అని ఒక్క డైలాగ్ కూడా మార్చకుండా అన్నీ చెప్పేశారామె. నచ్చచెప్పడంలోనే ఉందండి అసలు విషయం.

ఎన్టీఆర్ పరాభవానికి తప్పు మామదా? లేక అల్లుడిదా?

మన ఇంట్లో ఏం జరుగుతోంది, మన చుట్టూ ఏం జరుగుతోందని నిత్యం పరిశీలించుకోవాలి. పనిమనిషి నమ్మకంగా పనిచేస్తూ మన ఇంట్లోనే దొంగతనం చేసిందంటే కారణం ఆమె పరిస్థితులను, ఇబ్బందులను మనం అర్థం చేసుకోకపోవడమే. అవసరాలు వారిని డామినేట్ చేసినప్పుడు అందుబాటులో ఉన్న వస్తువు ఏదైనా సరే తీసుకోవాలనిపిస్తుంది. అందుకే పరిస్థితుల ప్రాబల్యమే రామారావు అలా కావడానికి కారణం అని నమ్ముతాను.

మనసులో మాట

వైఎస్సార్ పాలనపై మీ అభిప్రాయం?

వైఎస్ రాజశేఖరరెడ్డి నాకు మంచి స్నేహితుడు. సాయిబాబా పెట్టెను మద్రాసు నుంచి హైద్రాబాదుకు విమానంలో తీసుకొస్తుంటే, మా ఆవిడ బరువు మోస్తోం దని చూసి అమ్మా ఆ పెట్టె ఇవ్వు అని అడిగి తీసుకున్నారు వైఎస్సార్. ప్రయాణం ముగిసేదాకా బాబా పెట్టె పట్టుకుని వచ్చారు. ఆరోజు బాబా పెట్టె పట్టుకున్నారు కాబట్టే మీరు సీఎం అయ్యారు అని మా అమ్మ తర్వాత కలిసినప్పుడు చెబితే అవునమ్మా అంటూ నవ్వేశారాయన. వ్యక్తిగా చాలా మంచి మనిషి. ఆయన పాలన కూడా చక్కగా చేశారు. ఈ మనిషి ఉంటే చాలు అనే నమ్మకం ప్రజలకు ఇచ్చారు వైఎస్సార్.

వైఎస్ జగన్ పాదయాత్రపై మీ అభిప్రాయం ఏమిటి?

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాగా కష్టపడుతున్నారు. రాజకీయాల్లో అసలు తీరికన్నదే లేకుండా, ఎప్పుడూ ఏదో ఒకటి చేస్తూనే ఉన్నారు. ఎప్పటికైనా ఆయన కృషి ఫలిస్తుంది. పైగా ప్రతి ఒక్కరూ ఆయనను ఇష్టపడుతున్నారు. యువనేతగా ఆయన శ్రమిస్తున్న తీరు చూసి, రాజకీయనేతలు కూడా బాగా ఇష్టపడుతున్నారు. కృషి ఉంటే కానీ మనిషి పైకి రాడు అని ఆయన చేసి చెబుతున్నారు. రాజకీయాల కంటే ఆయనలో ఆ తత్వమే నాకు బాగా ఇష్టం.


(ఇంటర్వ్యూ పూర్తి పాఠం కింది లింకులో)
https://goo.gl/tBWCH9

నీచ రాజకీయాలకు స్వస్తి చెప్పాలి

జనవరి 18వ తేదీని చంద్రబాబు నికృష్ట రాజకీయానికి ప్రతిరూపంగా పరిగణించాలి. ఇప్పటికీ ఎన్టీఆర్‌ను స్త్రీలోలుడిగా చిత్రీకరిస్తూ బతుకుతున్న చంద్రబాబు నీచ రాజకీయానికి శాశ్వత సమాధి కట్టాలి.

సందర్భం


డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి



వెన్నుపోటు చర్య తప్పు కాదని చెప్పేందుకు చంద్రబాబునాయుడు చరిత్రను మార్చేందుకు కూడా సిద్ధపడ్డారు. స్త్రీలోలుడైన మావో నుంచి చైనాను రక్షించేందుకు డెంగ్ జియావో పింగ్ తిరుగుబాటు చేశాడని బూటకపు ప్రచారం చేస్తున్నారు. పార్టీ కార్యకర్తల శిక్షణ కోసం వెలువరించిన పుస్తకాలలో ఇలాంటి వక్రీకరణలను చొప్పించారు. ఎన్టీఆర్ కూడా స్త్రీలోలుడట! ఆయన నుంచి రాష్ట్రాన్ని కాపాడేందుకే చంద్రబాబు తిరుగుబాటు చేశాడట! అధికార దాహంతో 1995లో ఎన్టీఆర్‌ను పదవీచ్యుతుని చేసి, ఇందుకు ఎన్టీఆర్ భార్య కారణమని పచ్చ పత్రికల సాయంతో దుష్ప్రచారం చేయడం చూస్తే, చరిత్రలో ఇంత అథమస్థాయి నేత మరొకరు ఉండరని చెప్పవచ్చు. ఒక ప్రశ్న– ఎన్టీఆర్‌ను స్త్రీలోలునిగా చిత్రించే తెలుగుదేశం పార్టీ ఇప్పటికీ ఆయన ఫొటోలకు ఎందుకు దండలు వేస్తున్నట్టు?

1982లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే కాంగ్రెస్ పార్టీ నుంచి వలస వచ్చి తిష్ట వేసిన వారు చంద్రబాబు. ఒక పథకం ప్రకారం పార్టీలోని అనుభవజ్ఞులకు వంచనతో ఉద్వాసన పలికారు. 'ఏదో ఒకనాడు ఇతడు ఎన్టీఆర్ స్థానాన్ని ఆక్రమించడానికి ఆయనను చంపనయినా చంపుతాడు'అంటూ ఆ సమయంలోనే నల్లపురెడ్డి శ్రీనివాసులరెడ్డి వ్యాఖ్యానించిన సంగతి గుర్తు చేసుకోవాలి. చంద్రబాబుకు ఎన్టీఆర్ కేబినెట్ హోదాతో కూడిన కర్షక పరిషత్ నేతృత్వం కట్టబెట్టారు. కోర్టు మూడుసార్లు తిరస్కరించడంతో అప్పటివరకు ఎన్టీఆర్ సాధించుకున్న మంచిపేరుకు కూడా గ్రహణం పట్టింది. ఆపై పార్టీ ప్రధాన కార్యదర్శి పదవిని చంద్రబాబు చేజిక్కించుకున్నారు. ప్రభుత్వ వ్యవహారాలలో జోక్యం మొదలుపెట్టారు. అవినీతి విధానాలకు బాటలు పరిచారు. దీని ప్రభావం 1989 ఎన్నికల మీద కనిపించింది. పార్టీ ఓడిపోయింది.

1994లో 74 ఏళ్ల ఎన్టీఆర్ ఆయన భార్య వెంట ఉండగానే ఎన్నికల బరిలో దిగారు. ఎంతో కష్టించారు. 294 స్థానాలలో, మిత్రపక్షాలతో కలసి 258 చోట్ల విజయకేతనం ఎగురవేశారు. ఇదొక చరిత్ర. ఈసారి కూడా ఆర్థిక, రెవెన్యూ శాఖలనే కాకుండా, అదనంగా విద్యుత్ శాఖను కూడా చంద్రబాబు కైవసం చేసుకున్నారు. ఇదంతా పార్టీ మీద, ప్రభుత్వం మీద పట్టు సాధించడానికే. పార్టీకి చంద్రబాబు చేసిందేమీ లేదు. కానీ ఆయన అవినీతి సామ్రాజ్యాన్ని విస్తరించుకున్నారు. హెరిటేజ్ స్థాపన కూడా అవినీతి సొమ్ముతోనే జరిగింది.

పెరాల్టిక్ స్ట్రోక్‌తో బాధపడుతూ ఆసరా కోసం ఒక స్త్రీని జీవితంలోకి ఆహ్వానిస్తే, ఆమెనే బాబు బూచిగా చూపించి, ఎల్లో మీడియా సాయంతో చరిత్ర మరువలేని కుట్రను అమలు జరిపారు. ఎనిమిది నెలలు తిరగకుండానే ప్రభుత్వాన్ని కూలదోశారు. ఆగస్ట్ 26, 1995న వైస్రాయ్ హోటల్ ముందు జరిగిన ఘోరం మరువలేనిది. ముఖ్యమంత్రి హోదాలో వెళ్లిన ఎన్టీఆర్ మీద చెప్పులు విసిరారు. కుంగిన ఎన్టీఆర్ ఆగస్ట్ 30, 1995న ఆస్పత్రి పాలయ్యారు. ఆ సమయంలో ఎన్టీఆర్ కళ్లనీళ్లు పెట్టుకుని 'ఎన్టీఆర్ ఈరోజే చనిపోయాడు. నన్ను బ్రతికుండగానే సమాధి చేశాడు'అంటూ దుఃఖం పొంగిపొర్లుతుండగా అక్కడే మైకు తీసుకుని మాట్లాడిన సంఘటన ఎవరయినా మర్చిపోగలరా?

చంద్రబాబు మీద పోరాటానికి సిద్ధపడ్డ ఎన్టీఆర్ ఫిబ్రవరి 1996లో 'సింహగర్జన సదస్సు' ఏర్పాటు చేస్తున్నానని, ప్రజలకు చంద్రబాబు నీతిమాలిన చర్యను తెలియజేస్తానని చెప్పారు. సదస్సు కోసం 'బ్యాంక్ ఆఫ్ బరోడా'లో తన పేరుతో ఉన్న పార్టీ సభ్యత్వ డబ్బును తీసుకురమ్మని జనవరి 17–1996న దేవినేని రాజశేఖర్‌కు చెక్కు ఇచ్చి పంపారు. కానీ చంద్రబాబు స్టే ఆర్డర్ తెచ్చి ఎన్టీఆర్‌కు ఆ హక్కు లేదని చెప్పించారు. ఆయన ఆగ్రహోదగ్రుడై,'ఇతడు క్షమించటానికి వీల్లేని పెద్ద ద్రోహి' అని అందరిముందే తిట్టారు. ఆ బాధ తట్టుకోలేక మరో 10 గంటల్లోనే ఎన్టీఆర్ గుండె ఆగిపోయింది. అదుపు తప్పిన బీపీ, షుగర్ వల్లనే అలా జరిగిందని డాక్టర్లు ప్రకటించారు.

ఈ రాజకీయ హత్య చేసిందెవరు? 60 ఏళ్ల వయసులో పార్టీ పెట్టి, 70 ఏళ్ల వయసులో కూడా కష్టించి ఎన్టీఆర్ సాధించిన ప్రభుత్వాన్ని కబ్జా చేయడమే కాకుండా ఆయన మీద, ఆయన భార్యమీద నిందలు మోపటం ఎటువంటి అధమ రాజకీయం? ఇదే పరిస్థితి ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి ఎదుర్కొంటున్నారు. చంద్రబాబు పన్నిన ఉచ్చులో సోనియా ఇరుక్కున్నారు. అడ్డమైన కేసులు పెట్టించి, జగన్‌ను జైలుకు పంపారు.

74 ఏళ్ల వయసులో సర్వం పోగొట్టుకుని ప్రాణాల్నే విడచిన నా భర్త నందమూరి తారక రామారావును దుఃఖంతో స్మరించుకునే జనవరి 18వ తేదీని చంద్రబాబు నికృష్ట రాజకీయానికి ప్రతిరూపంగా పరిగణించాలి. ఇప్పటికీ ఎన్టీఆర్‌ను స్త్రీలోలుడిగా చిత్రీకరిస్తూ బతుకుతున్న చంద్రబాబు నీచ రాజకీయానికి శాశ్వత సమాధి కట్టండి– అదే ఎన్టీఆర్ ఆత్మకు శాంతి–ప్రశాంతి.

అశ్రునయనాలతో...

(నేడు ఎన్టీఆర్ 22వ వర్ధంతి)

వ్యాసకర్త సాహితీవేత్త,
వైఎస్సార్‌సీపీ నాయకురాలు

దుక్కి దున్నేది లేదు

ఒక ఇంజనీర్ కొడుకు..
ఇంజనీర్ కావాలనుకుంటున్నాడు..
ఓ డాక్టర్ కొడుకు..
డాక్టర్ కావాలనుకుంటున్నాడు..
కానీ.. ఓ రైతు కొడుకు..
మళ్లీ రైతు కావాలనుకోవడం లేదు..

వ్యవసాయంపై దేశ యువత నిరాసక్తత

- అసర్–2017 అధ్యయనంలో వెల్లడి
- ఒక్క శాతం మందే వ్యవసాయం వైపు మొగ్గు
- చాలా వరకు ఉద్యోగాలవైపే చూపు
- మ్యాప్‌లో సొంత రాష్ట్రాన్ని గుర్తించగలిగేవారు 42 శాతం



ఇదీ మన దేశంలోని వ్యవసాయ రంగం దుస్థితి.. నేటి యువత వ్యవసాయాన్ని వృత్తిగా చేపట్టడానికి విముఖత చూపుతోంది.. గ్రామీణ ప్రాంతాల్లోని యువత కూడా వ్యవసాయం మినహా మిగతా ఏదో ఓ రంగంవైపు మొగ్గు చూపుతోంది. ముఖ్యంగా ఏదో ఒక ఉద్యోగంలో చేరిపోవాలని కోరుకుంటోంది. ఏటా దేశంలో విద్యార్థులు, యువతపై పలు అంశాల్లో సర్వేలు చేసే అసర్ సంస్థ.. 2017 సంవత్సరానికి సంబంధించి చేసిన అధ్యయనంలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో కేవలం ఒక శాతం మందే వ్యవసాయాన్ని వృత్తిగా ఎంచుకుంటున్నారని సర్వేలో తేలింది. ఇక చాలా మంది యువత సాంకేతికత వినియోగంలో వెనుకబడి ఉన్నారని.. భారతదేశం మ్యాప్‌ను, అందులోని రాష్ట్రాలు, ప్రాంతాలను కూడా గుర్తించలేకపోతున్నారని వెల్లడైంది. అసర్ సంస్థ ఈ అధ్యయనానికి సంబంధించి మంగళవారం ఢిల్లీలో 'బియాండ్ బేసిక్స్'పేరిట నివేదికను విడుదల చేసింది. ఈ సర్వేలో భాగంగా దేశవ్యాప్తంగా 24 రాష్ట్రాల్లోని 28 జిల్లాల పరిధిలో 14 నుంచి 18 ఏళ్ల వయసున్న 30,532 మంది గ్రామీణ యువతను ప్రశ్నించింది. మన రాష్ట్రంలో తెలంగాణ యూనివర్సిటీ సహకారంతో నిజామాబాద్‌లో సర్వే చేసింది.

బ్యాంకింగ్ మెరుగు

బ్యాంకుల వినియోగం విషయంలో యువత కొంతమేర మెరుగ్గా ఉన్నట్లు అసర్ గణాంకాలు చెబుతున్నాయి. సర్వే చేసిన మొత్తం యువతలో 78 శాతం మందికి బ్యాంకు ఖాతాలు ఉన్నాయి. బ్యాంకుల్లో నగదు జమ, ఉపసంహరణ చేశామని 51 శాతం మంది, ఏటీఎం కార్డు ఉందని 16 శాతం మంది చెప్పారు. ఇంటర్నెట్ బ్యాంకింగ్ తెలుసని చెప్పిన వారు 5 శాతం మాత్రమే. ఇక 87 శాతం మంది టీవీ చూశామని, 63 శాతం మంది పేపర్ చదివామని, 47 శాతం మంది రేడియో విన్నామని తెలిపారు.

పోలీసు, ఇంజనీరు.. డాక్టరు

❖ మీరు భవిష్యత్తులో ఏం కావాలనుకుంటున్నారని ప్రశ్నించగా చాలా మంది యువత సాధారణ సమాధానాలే ఇచ్చారు. ❖ అబ్బాయిల్లో 18 శాతం ఆర్మీ లేదా పోలీస్ ఉద్యోగం చేయాలని, 12 శాతం మంది ఇంజనీర్లు కావాలని చెప్పగా.. అమ్మాయిల్లో 25 శాతం మంది టీచర్, 18 శాతం మంది డాక్టర్/నర్సు అవుతామని చెప్పారు. ❖ ఏదో ఒక ప్రభుత్వ ఉద్యోగం చేసుకుంటామని 13 శాతం మంది అబ్బాయిలు, 9 శాతం మంది అమ్మాయిలు చెప్పారు. ❖ స్కూళ్లు, కాలేజీల్లో నమోదుకాని యువతలో 30% తాము ఏం కావాలనుకుంటున్నామో చెప్పలేకపోయారు. ❖ 40 శాతం మంది తమకు రోల్ మోడల్స్ ఎవరూ లేరని చెప్పగా.. కొందరు తల్లిదండ్రులే రోల్ మోడల్ అని చెప్పారు.

నిజామాబాద్‌లో సర్వే ఫలితాలివీ..


మన రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లాలో నిర్వహించిన అధ్యయనంలో.. 60 గ్రామాల్లోని 945 కుటుంబాలకు చెందిన 1,035 మంది 14–18 ఏళ్ల వయసువారిని ప్రశ్నించారు. ❖ ఇందులో 17.2 శాతం మంది అసలు చదువుకోవడం లేదు. 7.3 శాతం మంది వృత్తి విద్యా కోర్సులు చేస్తున్నారు. ❖ 70.3% మొబైల్ ఫోన్‌ను, 35.9% ఇంటర్నెట్‌ను, 21% కంప్యూటర్‌ను వినియోగిస్తున్నారు. ❖ 69.4 శాతం మందికి సొంత బ్యాంకు ఖాతాలున్నాయి. బ్యాంకులో నగదు జమ, ఉపసంహరణ వంటివి 44 శాతం మందికే తెలుసు. ఏటీఎంలు వినియోగించడం 20.2 శాతం మందికి, ఇంటర్నెట్ బ్యాంకింగ్ కేవలం 6.3 శాతం మందికే తెలుసు. ❖ రెండో తరగతి పాఠ్య పుస్తకంలోని అంశాలను 76 శాతం మందే తప్పులు లేకుండా చదవగలుగుతున్నారు. ఇంగ్లిష్ వాక్యాలను 70.4 శాతం మందే చదవగలుగుతున్నారు. ❖ 78.4 శాతం మందే డబ్బులు లెక్కపెట్టగలుగుతున్నారు. ❖ సమయాన్ని గంటలు, నిమిషాల్లో 50 శాతం మందే చెప్పగలుగుతున్నారు. ❖ భారతదేశం మ్యాప్‌ను చూపించి ఇది ఏ దేశమని అడిగితే 96.2 శాతం మంది సరైన సమాధానమిచ్చారు. ❖ దేశ రాజధాని ఏదని అడిగితే 54.2 శాతం మంది సరైన జవాబిచ్చారు. ❖ మీది ఏ రాష్ట్రమని అడిగితే 87 శాతం మంది సరిగా చెప్పారు. ❖ మ్యాప్‌లో రాష్ట్రాన్ని గుర్తించాలని కోరితే 73.2 శాతం మంది మాత్రమే సరిగా చూపించారు. – సాక్షి, హైదరాబాద్

మ్యాప్‌ను కూడా గుర్తించలేరు



సర్వేలో భారత దేశం చిత్రపటాన్ని (మ్యాప్)ను చూపించి.. 'ఇది ఏ దేశం'అని అడిగితే 86 శాతం మందే సరైన సమాధానమిచ్చారు. మన దేశ రాజధాని ఏదని అడిగితే 64 శాతం, మీది ఏ రాష్ట్రమని అడిగితే 79 శాతం మాత్రమే సరైన సమాధానాలు ఇచ్చారు. మ్యాప్‌లో మీ రాష్ట్రాన్ని గుర్తించాలని అడిగితే.. 42 శాతమే సరిగా చూపించారు.

డిజిటల్.. డొల్లే



ప్రపంచం డిజిటల్ యుగంలో దూసుకెళుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో మన దేశ యువత చాలా వెనుకబడి ఉందని అసర్ సంస్థ గణాంకాలు చెబుతున్నాయి. సర్వే సందర్భంగా 59.3 శాతం మంది యువత అసలు కంప్యూటర్‌ను ఎప్పుడూ ఉపయోగించలేదని, 63.7 శాతం మంది ఇంటర్నెట్ వినియోగం తెలియదని వెల్లడించారు. ఇక సెల్‌ఫోన్‌ను వినియోగించినట్లు 82.4 శాతం మంది చెప్పారు.

పెట్టుబడులతో రండి

జపాన్ కంపెనీలను ఆహ్వానించిన మంత్రి కేటీఆర్

- టోక్యోలో 12 కంపెనీలతో విస్తృత చర్చలు
- వ్యర్థాల నిర్వహణ, ఫుడ్ ప్రాసెసింగ్, ఫార్మా రంగాల్లో పెట్టుబడులకు ఆహ్వానం



బుధవారం జపాన్‌లో భారత రాయబారి సుజయ్ చినోయ్‌ను కలిసిన మంత్రి కేటీఆర్. చిత్రంలో వివేక్, జయేశ్ రంజన్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో దాదాపు సగం పట్టణ ప్రాంతమేనని, నగరీకరణ, పట్టణీకరణ శరవేగంగా జరుగుతున్న నేపథ్యంలో వ్యర్థాల నిర్వహణ రంగానికి ప్రాధాన్యమిస్తున్నామని రాష్ట్ర మునిసిపల్, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు పేర్కొన్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యర్థాల నిర్వహణ పరిష్కారాల కోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు. ఈ విషయంలో జపాన్‌కు చెందిన టకుమ కంపెనీతో భాగస్వామ్యానికి సిద్ధంగా ఉన్నామని వివరించారు. విదేశీ పర్యటనలో భాగంగా మంత్రి కేటీఆర్ మంగళవారం దక్షిణ కొరియాలో పర్యటించిన విషయం తెలిసిందే. బుధవారం జపాన్ రాజధాని టోక్యోలో పర్యటించిన ఆయన.. అక్కడి 12 కంపెనీల ప్రతినిధులతో విస్తృత చర్చలు జరిపారు. ఈ క్రమంలో టకుమ కంపెనీ ప్రతినిధులతో సమావేశమై వ్యర్థాల నిర్వహణ రంగంలో పెట్టుబడులు పెట్టాలని కోరారు.

పలు కంపెనీల ప్రతినిధులతో భేటీ

ప్రముఖ ఇంజనీరింగ్ కంపెనీ జేఎఫ్ఈ ప్రతినిధి ఇజుమి సుగిబయాషి, మరో ఇంజనీరింగ్ కంపెనీ మినెబీయా ప్రతినిధులతో కేటీఆర్ సమావేశమయ్యారు. ప్రపంచంలోని 59 ప్రాంతాల నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్న మినెబీయా కంపెనీ విస్తరణ కోసం తెలంగాణను పరిశీలించాలని ఆహ్వానించారు. ఈఎస్ఈ ఫుడ్స్ చైర్మన్ హికోనోబు ఐసెతో సమావేశమై రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ వ్యాపారానికి ఉన్న విస్తృత అవకాశాలను వివరించారు. మేయిజి షియికా ఫార్మా కంపెనీ ప్రతినిధులతో సమావేశమై వ్యవసాయం, వెటర్నరీ మందుల ఉత్పత్తి రంగంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. సుమిటోమో ఫారెస్ట్రీ కంపెనీ, టోరే ఇండస్ట్రీస్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. జపనీస్ కంపెనీలు, ప్రపంచ ఇన్నోవేషన్ కమ్యూనిటీలకు అనుసంధానకర్తగా వ్యవహరిస్తున్న జపాన్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ బృందంతో కేటీఆర్ సమావేశమై రాష్ట్రంలో ఇన్నోవేషన్‌కు ఇస్తున్న ప్రాధాన్యాన్ని తెలిపారు. టీ హబ్, టీ ఫైబర్ తదితర ప్రాజెక్టులపై చర్చించారు. పర్యటనలో కేటీఆర్‌తోపాటు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జి.వివేక్, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ ఉన్నారు.

భారత రాయబారితో సమావేశం

జపాన్ పర్యటనలో భాగంగా కేటీఆర్ బృందం తొలుత అక్కడి భారత రాయబారి సుజయ్ చినోయ్‌తో సమావేశమై ఈ పర్యటన ఉద్దేశాలను వివరించింది. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించాలనే లక్ష్యంతో పర్యటన చేస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. సాంకేతిక ప్రగతి, పారిశ్రామిక రంగం, వేస్ట్ మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో జపాన్ అనుసరిస్తున్న పద్ధతులను ఆదర్శంగా తీసుకుంటామని తెలిపారు. జపాన్, తెలంగాణల మధ్య మరింత బలమైన ఆర్థిక, వ్యాపార భాగస్వామ్యాలను నెలకొల్పేందుకు సహకారం అందించాలని చినోయ్‌ను కోరారు. జైకా వంటి జపాన్ సంస్థలు ఇప్పటికే రాష్ట్రంలో పలు ప్రాజెక్టులకు రుణ సహాయం అందించాయని, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మరిన్ని ప్రాజెక్టులకు ఈ ఆర్థిక భాగస్వామ్యాన్ని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం జపాన్ ఆర్థిక, వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి యూజిముటోతో సమావేశమై.. వ్యాపార, వాణిజ్య సంబంధాల బలోపేతంపై చర్చించారు.



బుధవారం హైదరాబాద్‌లో ఫిల్మ్ స్కూల్‌ను ప్రారంభిస్తున్న దర్శకులు కె.విశ్వనాథ్, రాజమౌళి. చిత్రంలో రమేశ్ ప్రసాద్

చిత్ర పరిశ్రమ మార్గదర్శకుడు ఎల్వీ ప్రసాద్

- ఫిల్మ్ అండ్ మీడియా స్కూల్ ఏర్పాటు అభినందనీయం
- ప్రారంభోత్సవ సభలో కె.విశ్వనాథ్

హైదరాబాద్: చిత్ర పరిశ్రమకు ఎల్వీ ప్రసాద్ మార్గదర్శకుడిగా నిలుస్తారని దర్శకుడు కె.విశ్వనాథ్ అన్నారు. ఎల్వీ ప్రసాద్ 110వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని నెలకొల్పిన ప్రసాద్ క్రియేటివ్ మెంటర్స్ ఫిల్మ్ అండ్ మీడియా స్కూల్‌ను దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళితో కలసి ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ఈ స్కూల్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఎస్.ఎస్. రాజమౌళి మాట్లాడుతూ 56 ఏళ్లుగా విడుదలైన సినిమాల వెనుక ప్రసాద్ ల్యాబ్స్ పాత్ర కచ్చితంగా ఉంటుందన్నారు. సినిమా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందుబాటులోకి తెస్తున్న సంస్థ ఇదేనన్నారు. ఎడిటింగ్, గేమింగ్, యానిమేషన్ తదితర కోర్సుల్లో ఆరు నుంచి 10 నెలల కాల వ్యవధిలో శిక్షణ అందుబాటులో ఉంటుందని ప్రసాద్ ఐమాక్స్ అధినేత రమేశ్ ప్రసాద్ తెలిపారు.

సంగీత నాటక అకాడమీ అవార్డుల ప్రదానం

సాక్షి, న్యూఢిల్లీ: సంగీత నాటక అకాడమీ–2016 అవార్డులను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బుధవారం ఢిల్లీలో ప్రదానం చేశారు. థియేటర్ విభాగంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన సత్యబ్రత రౌత్, సంప్రదాయ థియేటర్ విభాగంలో ఏపీకి చెందిన అన్నాబత్తుల లక్ష్మీ మంగతాయారు, అన్నాబత్తుల లీలాసాయి అవార్డులు అందుకున్నారు. కూచిపూడి నృత్యం విభాగంలో ఏబీ బాల కొండలరావు, సంగీత విభాగంలో రత్నమాల ప్రకాశ్, ఆర్ట్స్ విభాగంలో ఏపీకి చెందిన పప్పు వేణుగోపాలరావు అవార్డులు అందుకున్నారు.

రచయితలకు శిక్షణ తరగతులు

సాక్షి, హైదరాబాద్: పద్య, గేయ, వచన కవిత్వాల కేటగిరీల్లో రచయితలకు శిక్షణ తరగతులు నిర్వహించాలని రాష్ట్ర సాహిత్య అకాడమీ నిర్ణయించింది. ఫిబ్రవరి 8, 9 తేదీల్లో రవీంద్రభారతిలోని మినీ ఆడిటోరియంలో శిక్షణ తరగతులు నిర్వహించనుంది. ఇందుకు సంబంధించి 50 మంది రచయితలను ఎంపిక చేసింది. శిక్షకుల పేర్లను ఒకట్రెండు రోజుల్లో ఖరారు చేసే అవకాశం ఉంది.

జర్నలిస్టులకు ఆర్థిక సాయం కోసం దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: జర్నలిస్టుల సంక్షేమ నిధి ఆర్థిక సాయానికి సంబంధించిన దరఖాస్తులను ఈ నెల 22 వరకు స్వీకరిస్తున్నట్లు రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబీకులు, జర్నలిస్టు వృత్తిలో ఉంటూ ప్రమాదాల భారిన పడి నడవలేని స్థితిలో ఉన్న వారు మాత్రమే దీనికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తును రాష్ట్ర మీడియా అకాడమీ కార్యాలయం, ఇంటి నంబర్ 5–9–166, చాపెల్ రోడ్, నాంపల్లి, హైదరాబాద్–500001 చిరునామాకు పంపాలన్నారు. వివరాలకు 040–23298672, 040–23298674లను సంప్రదించాలని కోరారు. దరఖాస్తు ఫారాలను www.ipr.tg.nic.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

'పెట్టుబడి' చెక్కులపై డిజిటల్ సంతకం!

- ఏవో, తహసీల్దార్ల సంతకాల డిజిటైజ్ దిశగా వ్యవసాయ శాఖ
- పథకం సొమ్ము దుర్వినియోగం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు



సాక్షి, హైదరాబాద్: 'రైతులకు పెట్టుబడి పథకం' సొమ్ము దుర్వినియోగం కాకుండా వ్యవసాయ శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. వ్యవసాయాధికారి (ఏవో), తహసీల్దార్ల డిజిటల్ సంతకాలతో రైతులకు చెక్కులివ్వాలని యోచిస్తోంది. ఏవో, తహసీల్దార్లు నేరుగా పెన్నుతో సంతకాలు చేయాలన్న నిబంధనతో నిధులు పక్కదారి పట్టే ప్రమాదముందని భావిస్తున్న ఆ శాఖాధికారులు ఈ మేరకు చర్యలకు ఉపక్రమించారు. ఇందుకు సంబంధించి ఏవో, తహసీల్దార్ల సంతకాలు ముందే సేకరించి డిజిటైజ్ చేయాలని భావిస్తున్నారు. గతంలో కరువు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు నష్ట పరిహారం సొమ్ము దుర్వినియోగమైన ఘటనల నేపథ్యంలో తగిన చర్యలు తీసుకుంటున్నారు.

బ్యాంకులకు జాబితా.. రైతులకు చెక్కులు..

పెట్టుబడి పథకంలో భాగంగా రైతుల జాబితాను ముందే సిద్ధం చేసుకొని ఆ ప్రకారం బ్యాంకులకు జాబితా పంపిస్తారు. రైతు పేరు, ఆధార్ నంబర్, డిజిటల్ సంతకాలతో చెక్కులు సిద్ధం చేసి ఏవోలకు అందజేస్తారు. వాటిని రైతులకు గ్రామసభలో ఏవోలు అందిస్తారు. చెక్కులు తీసుకున్న రైతుల సంతకాలూ సేకరిస్తారు. గ్రామసభలో చెక్కులు తీసుకోని రైతులు ఏవో కార్యాలయంలో తీసుకునే అవకాశం కల్పించాలని భావిస్తున్నారు. పెట్టుబడి పథకం తమకు వర్తించదన్న అసత్య ప్రచారాలు నమ్మొద్దని.. అలాంటి ప్రచారంతో డబ్బులు వసూలు చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు విన్నవించేందుకు వ్యవసాయ శాఖ సమాయత్తమైంది.

ఆ భూములకూ 'పెట్టుబడి'!

వ్యవసాయ యోగ్యం కాని భూములకు సాయం చేయకూడదంటూ మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫార్సుపై రైతుల నుంచి వ్యతిరేకత వస్తోంది. పట్టాలున్న గుట్టలు, చెరువు శిఖం భూములకు ఇవ్వాలంటూ వ్యవసాయ శాఖకు వారు విన్నవిస్తున్నారు. వ్యవసాయ యోగ్యం కాని భూములను పెట్టుబడి సాయంతో కష్టపడి సాగు భూములుగా మారుస్తున్నామని రైతులు చెబుతున్నారని, ఆయా విన్నపాలను ప్రభుత్వ దృష్టికి తీసుకొస్తామని అధికారులు అంటున్నారు. మరోవైపు తెలంగాణలో భూములుండి ఇతర రాష్ట్రాల్లో ఉంటున్న రైతులకూ పెట్టుబడి సాయం ఇస్తామని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. సరిహద్దు జిల్లాల్లో భూములు తెలంగాణలో, రైతులు మరో రాష్ట్రంలో ఉంటున్నారని.. కాబట్టి వారికీ సాయం అందుతుందంటున్నారు. హైదరాబాద్ శివారులో వందల ఎకరాల వ్యవసాయ క్షేత్రాలున్న సినిమా నటులు, రాజకీయ నేతలకూ పథకం వర్తిస్తుందని చెబుతున్నారు.

✦ ప్రజావైద్యంపై నమ్మకం పెరిగింది

అమ్మ ఒడి సేవల వాహనాల ప్రారంభోత్సవంలో సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ కిట్స్ పథకం అమలు, ప్రభుత్వ ఆసుపత్రులను మెరుగుపర్చడం వల్ల ప్రజల్లో ప్రజావైద్యంపై నమ్మకం పెరిగిందని సీఎం కేసీఆర్ అన్నారు. వచ్చే బడ్జెట్లో వైద్యారోగ్య శాఖకు ఎక్కువ నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. మాతాశిశు రక్షణలో అమ్మ ఒడి (102) సేవలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించేందుకు ఏర్పాటు చేసిన 200 అదనపు వాహనాలను, పట్టణాల్లో అత్యవసర వైద్యసేవలు అందించే 50 బైకు అంబులెన్స్‌లను సీఎం కేసీఆర్ బుధవారం ప్రారంభించారు. గ్రామాల్లో పర్యటించేందుకు ఏఎన్ఎంలకు ద్విచక్ర వాహనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య మంత్రి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

✦ మేడారం జాతరకు రండి

సీఎంను ఆహ్వానించిన మంత్రులు కడియం, చందూలాల్



బుధవారం ప్రగతిభవన్‌లో మేడారం జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో డిప్యూటీ సీఎం కడియం, మంత్రి చందూలాల్

సాక్షి, హైదరాబాద్: మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు రావాల్సిందిగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, గిరిజన అభివృద్ధి శాఖ మంత్రి అజ్మీరా చందూలాల్ ఆహ్వానించారు. బుధవారం ప్రగతిభవన్‌లో వారు సీఎంను కలసి ఆహ్వానపత్రిక అందించారు. ఈ సందర్భంగా సీఎం మేడారం జాతర పోస్టర్, సీడీని ఆవిష్కరించారు. ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించాలని సీఎం మంత్రులను కోరారు. ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. మేడారం జాతర కోసం చేసిన ఏర్పాట్లను కడియం ముఖ్యమంత్రికి వివరించారు. ''2016లో మేడారం జాతరకు ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.140 కోట్లు, ఈ సారి రూ.80 కోట్లు మంజూరు చేశారు. వీటితో భక్తులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేశాం. ఈ సారి పనులు శాశ్వత ప్రాతిపదికన చేపట్టాం. భూపాలపల్లి, పస్రా, తాడ్వాయి నుంచి మేడారం వచ్చే మూడు ప్రధాన రహదారులను డబుల్ లేన్ రోడ్లుగా మార్చాం. టాయిలెట్లు, బట్టలు మార్చుకునే గదులను శాశ్వత ప్రాతిపదికన నిర్మించాం''అని కడియం వివరించారు.

✦ జూన్‌లో గిరిజన వర్సిటీ ప్రారంభం

ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించిన కడియం

సాక్షి, హైదరాబాద్: జూన్ నుంచి ములుగు మండలం జాకారంలో గిరిజన వర్సిటీ ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. వర్సిటీతోపాటు వరంగల్ మామునూరులో వెటర్నరీ కాలేజీని ప్రారంభించే విషయమై బుధవారం సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. కాలేజీ కోసం ప్రభుత్వం గతేడాది రూ.109.69 కోట్లు మంజూరు చేసిందని కడియం చెప్పారు. కాలేజీలో ప్రవేశాలకు వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతి కోసం లేఖ రాశామని అధికారులు కడియం దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల ఢిల్లీలో మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో గిరిజన వర్సిటీ అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లానని కడియం చెప్పారు. వర్సిటీ కోసం భూమిని సేకరించినట్లు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖకు లేఖ రాయాలని అధికారులకు సూచించారు.

✦ రూ. 4,100 కోట్లు కేటాయించండి: అక్బర్



సాక్షి, హైదరాబాద్: వచ్చే బడ్జెట్‌లో మైనార్టీ సంక్షేమానికి రూ.4,100 కోట్లు కేటాయించాలని మజ్లిస్ శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. గత బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ఈ ఆర్థిక ఏడాది ముగిసే లోపు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో కోరారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలతో సమంగా మైనార్టీలకు సంక్షేమ పథకాలను వర్తింపజేయడం అభినందనీయమన్నారు. మైనార్టీలకు కేటాయించిన నిధుల విడుదల, వ్యయంలో జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2014–15 నుంచి 2017–18 వరకు రూ. 4,613.85 కోట్లు కేటాయించగా రూ.2,330 కోట్లను మాత్రమే ఖర్చు చేసినట్లు చెప్పారు. షాదీ ముబారక్ పథకం కింద ఇస్తున్న ఆర్థిక సాయాన్ని రూ.75,116 నుంచి రూ.1,00,116 కు పెంచాలని ప్రతిపాదించారు.



పంచాయతీరాజ్ డైరీ ఆవిష్కరణ

తెలంగాణ పంచాయతీరాజ్ సచివాలయం ఉద్యోగుల అసోసియేషన్-2018 డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

✦ దేశవ్యాప్తంగా వర్గీకరణ ఉద్యమం


గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవానీ



హైదరాబాద్: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా విస్తరిస్తామని గుజరాత్ స్వతంత్ర్య ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవానీ అన్నారు. తెలంగాణలో వెంటనే వర్గీకరణ చేపట్టాలని కోరారు. చంచల్‌గూడ జైల్లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగను ఆయన బుధవారం కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసుశాఖ కుట్ర పన్ని మంద కృష్ణను జైల్లో పెట్టాయని, అక్రమ కేసులు పెట్టడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. దళిత హక్కుల కోసం కృష్ణమాదిగ కష్టపడుతున్నారని అన్నారు. దళితులు ఏకమై పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. వివిధ అంశాలపై మంద కృష్ణతో చర్చించినట్లు తెలిపారు. నిరుపేద దళితులకు 3 నుంచి 5 ఎకరాల భూమి పంపిణీ చేయాలని ఆయా ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. వర్గీకరణ అంశాన్ని ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీ దృష్టికి తీసుకెళ్తారా.. అన్న ప్రశ్నను ఆయన దాటవేశారు.

✦ విద్యారంగాన్ని విస్మరించారు: లక్ష్మణ్

ఉపాధ్యాయ ఖాళీల భర్తీలో సర్కారు నిర్లక్ష్యం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో దాదాపు 40 వేలకుపైగా ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉంచుకుని, కనీస వసతులు లేని భవనాల్లో విద్యాసంస్థలను కొనసాగిస్తూ విద్యాప్రమాణాలను ఎలా మెరుగుపరుస్తారో ప్రభుత్వం చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ప్రశ్నించారు. అక్షరాస్యతలో దక్షిణ భారత దేశంలో చివరి స్థానంలో తెలంగాణ నిలిచిన విషయాన్ని విస్మరిస్తూ ప్రభుత్వ పాఠశాలలను ఏమాత్రం మెరుగుపరచకుండా చోద్యం చూస్తోందని విమర్శించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలోనే గురుకుల పాఠశాలలు అద్భుతంగా ఏర్పాటు చేస్తున్నట్టు ఆర్భాటపు ప్రకటనలిస్తున్నారని ఎండగట్టారు. బుధవారం ఆయన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య రానురానూ తగ్గుతున్న వాస్తవాన్ని సర్కారు గుర్తించడం లేదన్నారు. ఉన్నత విద్య ఇంతకన్నా ఘోరంగా ఉందన్నారు. బోధన, బోధనేతర పోస్టుల భర్తీలో నిర్లక్ష్యం, కనీస వసతుల కొరత వంటి సమస్యలతో వర్సిటీలు కునారిల్లుతున్నాయన్నారు. ఓడిపోతామన్న భయంతోనే పంచాయతీలకు పరోక్ష ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. సీనియర్ నేత నాగం జనార్దన్‌రెడ్డి బీజేపీలోనే కొనసాగుతారని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

✦ ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రసాద్

సాక్షి, హైదరాబాద్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శిగా డా.మీసాల ప్రసాద్, ఎల్.అయ్యప్ప ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీరి పదవీ కాలం ఏడాది ఉంటుందని, ఈ నెల 19 నుంచి 21 వరకు నల్లగొండలో జరిగే మహాసభల్లో బాధ్యతలు చేపడతారని పేర్కొన్నారు.

త్వరలో నియోజకవర్గాల యాత్ర

మెదక్ జిల్లా పర్యటనలో కేసీఆర్

- తూప్రాన్‌కు వచ్చి రోజంతా ఉంటా
- దేశ సేవలో ఉండటం వల్లే ఆలస్యంగా వచ్చా
- తూప్రాన్‌లో 50 పడకల ఆస్పత్రి ప్రారంభం
- పట్టణ అభివృద్ధికి రూ. 5 కోట్లు మంజూరు



గజ్వేల్ సమీపంలోని సంగాపూర్‌లో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూం మోడల్ కాలనీ మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి



తూప్రాన్‌లో 50 పడకల ఆస్పత్రిని ప్రారంభించి వైద్య పరికరాలను పరిశీలిస్తున్న కేసీఆర్

సాక్షి, మెదక్

''ఎవరేమన్నా అనుకోనీ... కొద్దిరోజుల్లో నేను నియోజకవర్గాల యాత్ర చేస్తున్నా. నియోజకవర్గాల్లో రెండేసి రోజులు పర్యటిస్తా.. ప్రజలతోనే ఉంటా''అని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. నియోజకవర్గ పర్యటనల్లో భాగంగా త్వరలో గజ్వేల్ నియోజకవర్గంలో పర్యటిస్తానని తెలిపారు. తూప్రాన్‌లో ఒక రోజంతా ఉండి పట్టణ అభివృద్ధిపై చర్చిస్తానన్నారు. అందరితో కలసి భోజనం చేస్తానని హామీ ఇచ్చారు. బుధవారం మెదక్ జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం కేసీఆర్ తూప్రాన్‌లో రూ.11 కోట్లతో నిర్మించిన 50 పడకల ఆస్పత్రిని ప్రారంభించారు. ఆస్పత్రి లోపలకు వెళ్లి అంతా కలియదిరిగి చూశారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే వారంతా పేదలేనని, వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రి అభివృద్ధికి మరిన్ని నిధులు అవసరమైతే ఇస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో టీఆర్ఎస్ నాయకులు, ప్రజలనుద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు. తాను దేశ సేవలో ఉండటం వల్లే తూప్రాన్ వచ్చేందుకు ఆలస్యమైనట్లు తెలిపారు. తూప్రాన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఎప్పటికప్పుడు జిల్లా మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి స్థానిక నేతలు తనకు తెలియజేస్తున్నట్లు వివరించారు. తూప్రాన్‌లో 50 పడకల ఆస్పత్రి ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తూప్రాన్ పట్టణ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. తూప్రాన్ పట్టణంలో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణానికి రూ. 5 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. అలాగే కమ్యూనిటీ హాల్‌కు రూ. కోటి నిధులతోపాటు డిగ్రీ కళాశాలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అంతకు ముందు కేసీఆర్ తూప్రాన్ పర్యటనకు గంట ఆలస్యంగా వచ్చారు. హైదరాబాద్ నుంచి 11.30 గంటలకు తూప్రాన్ చేరుకోవాల్సి ఉండగా 12.30 గంటలకు చేరుకున్నారు. సీఎం రాక ఆలస్యం అవుతున్న నేపథ్యంలో వేదపండితులు ముహూర్తం దాటిపోతుందని ఆస్పత్రి లోపల, వెలుపల గుమ్మడికాయ, టెంకాయలు కొట్టారు. సీఎం వచ్చాక ఆస్పత్రి ప్రారంభించడంతోపాటు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆ తర్వాత పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కేసీఆర్ పర్యటన నేపథ్యంలో పోలీసులు గట్టిబందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణానికి చెందిన ఎంఆర్పీఎస్, టీడీపీ నేతలను ముందస్తుగా అరెస్టు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రాజమణి మురళీ యాదవ్, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాబూమోహన్, రామలింగారెడ్డి, మదన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, వేముల ప్రశాంత్, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, రాష్ట్ర రోడ్డు రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ తూముకుంట నర్సారెడ్డి, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ భూమిరెడ్డి, కలెక్టర్లు వెంకట రాంరెడ్డి, మాణిక్కరాజ్ కణ్ణన్, గడా ఓఎస్‌డీ హన్మంతరావు, ఆర్డీఓ మధు తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో పనుల పరిశీలన

సాక్షి, సిద్దిపేట: సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సీఎం కేసీఆర్ బుధవారం పరిశీలించారు. మెదక్ జిల్లా పర్యటన ముగించుకొని గజ్వేల్ చేరుకున్న సీఎం ముందుగా అధునాతన హంగులతో నిర్మిస్తున్న వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణాలను చూశారు. మార్కెట్ భవన నిర్మాణాలు, రైతులకు ఉపయోగాలు మొదలైన అంశాలతో ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆస్పత్రిని చూసి అక్కడి నుంచి డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. అయితే మండల కేంద్రం మర్కూక్‌లో ఏర్పాటు చేసిన గ్రామసభకు వెళ్లాల్సి ఉన్నా అర్ధంతరంగా పర్యటనను వాయిదా వేసుకొని ఎర్రవల్లిలోని తన ఫాంహౌస్‌కు వెళ్లి అక్కడ కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. అనంతరం నల్లగొండ జిల్లా పర్యటనకు బయలుదేరారు. గజ్వేల్‌లో ఎంఆర్పీఎస్ నాయకులు సీఎం కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు వారించారు. మర్కూక్ గ్రామ సభలోనూ వారు నిరసన వ్యక్తం చేసే అవకాశం ఉందని, కొండపోచమ్మ సాగర్ నిర్వాసితులకు పరిహారం పెంచాలని రైతులు డిమాండ్ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని నిఘా వర్గాలు పేర్కొనడం వల్లే సీఎం గ్రామసభ వాయిదా పడినట్లు సమాచారం. సీఎం వెంట వైద్యారోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ వెంకట్రామిరెడ్డి ఉన్నారు.

నేతి విద్యాసాగర్ మాతృమూర్తికి సీఎం నివాళి

నకిరేకల్: శాసన మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ మాతృమూర్తి దివంగత రాధమ్మకు సీఎం కేసీఆర్ ఘన నివాళి అర్పించారు. బుధవారం సాయంత్రం ముఖ్యమంత్రి కేసీఆర్ హెలికాప్టర్ ద్వారా నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం చెర్కుపల్లి గ్రామానికి చేరుకున్నారు. ముందుగా నేతి రాధమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నేతి విద్యాసాగర్, కుటుంబీకులను పరామర్శించారు. 20 నిమిషాల పాటు విద్యాసాగర్ ఇంట్లోనే గడిపారు. అక్కడే అల్పాహారం స్వీకరించారు. సాయంత్రం ఐదు గంటలకు హెలికాప్టర్ ద్వారా మళ్లీ హైదరాబాద్‌కు పయనమయ్యారు.

ఎలక్ట్రిక్ వాహన విధానంపై కసరత్తు

- ఉత్పత్తి, వినియోగానికి ప్రోత్సాహం
- రూ.30 వేల కోట్ల పెట్టుబడులు.. 50 వేల మందికి ఉపాధి లక్ష్యం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి, వినియోగాన్ని విస్తృత స్థాయిలో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహన విధానాన్ని రూపొందిస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి రంగంలో కొత్త పరిశ్రమల స్థాపనకు భారీ మొత్తంలో పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు సృష్టించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానానికి రూపకల్పన చేస్తోంది. విద్యుత్, కార్మిక, రహదారులు, పన్నులు.. తదితర శాఖలతో సంప్రదింపులు జరిపి రాష్ట్ర పరిశ్రమల శాఖ ఈ విధానానికి ముసాయిదాను రూపొందిస్తోంది. ఈ వాహనాల ఉత్పత్తిరంగంలో సుమారు రూ.30 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 50 వేలమందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచ దిగ్గజ కంపెనీల నుంచి రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ విధానంలో ప్రభుత్వం పలు ప్రత్యేక రాయితీలు, ప్రోత్సాహకాలను ప్రకటించనుంది. కాగా, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ త్వరలో వివిధ ప్రభుత్వ శాఖలతో సమావేశం నిర్వహించి ఎలక్ట్రిక్ వాహనాల పరిశ్రమలకు అందించాల్సిన సహాయ, సహకారాలపై చర్చించనున్నారని తెలిసింది. అనంతరం విధాన ముసాయిదాకు తుదిరూపం ఇస్తారని అధికారవర్గాలు వెల్లడించాయి. రాష్ట్రంలో ఇప్పటికే మహీంద్ర, ఎంఆర్ఎఫ్ తదితర పరిశ్రమలు పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టి పరిశ్రమలు స్థాపించిన నేపథ్యంలో ఎలక్ట్రిక్ వాహనాల పరిశ్రమలు సైతం రాష్ట్రానికి వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. గత ఏడాది నవంబర్‌లో కర్ణాటక రాష్ట్రం కూడా ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి, వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక విధానాన్ని ప్రకటించింది. ఈ నేపథ్యంలో కర్ణాటకతో పాటు ఇతర రాష్ట్రాల్లో ప్రకటించిన విధానాలను పరిశీలించి దేశంలోనే అత్యుత్తమ ఎలక్ట్రిక్ వాహనాల విధానాన్ని రూపొందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అధికారవర్గాలు తెలిపాయి.

ఎగుమతులు పెరిగితేనే ఆదాయం రెట్టింపు

సీఎం ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు



సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు పెరిగితేనే రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు పేర్కొన్నారు. నాబార్డు, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్‌ల ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి కేంద్రంలో ఏర్పాటు చేసిన '2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు' అనే అంశంపై జరిగిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రైతులు పంటలను ఎక్కడైనా అమ్ముకునేలా మార్కెట్లు అందుబాటులో ఉండాలన్నారు. సామాన్యులకు అవసరమైన ఆహారోత్పత్తులను ప్రభుత్వం కొనివ్వాలని, పంటల ధరలతో వాటిని ముడిపెట్టరాదన్నారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి సి.పార్థసారథి మాట్లాడుతూ భారీగా పంట రుణాలిస్తున్నట్లు తాము చెబుతుంటే రైతులు మాత్రం ఇంకా ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుంచే తీసుకుంటున్నట్లు చెబుతున్నారన్నారు. రైతులకు పెట్టుబడి నిధుల సమస్య తీర్చేందుకు ఎకరానికి రూ. 4 వేల పథకాన్ని తెస్తున్నట్లు చెప్పారు. జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ వై.ఆర్.రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల కనీస వేతనం రూ. 18 వేలు ఉండాలని 7వ వేతన సంఘం చెప్పిందని, దీనినైనా కనీసం రైతులకు వర్తింపజేసి వారి ఆదాయాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మోహన్ కందా, మేనేజ్ సంస్థ డైరెక్టర్ జనరల్ వి.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేధిస్తుండు సారూ!

సీఎం కేసీఆర్‌కు సర్పంచ్ లేఖ

నారాయణపేట: మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి వేధిస్తున్నారని దామరగిద్ద మండలం బాపన్‌పల్లి సర్పంచ్ జి.శ్రీనివాస్ ఆరోపించారు. ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు మెయిల్, రిజిస్టర్డ్ పోస్టు ద్వారా లేఖను పంపినట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చవిచూసిన శివకుమార్‌రెడ్డి పక్షన తాను నిలబటం తప్పా అని ప్రశ్నించారు. తనపై అక్రమకేసులు బనాయింపచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ పనులను ప్రారంభించాలని కోరినా శివకుమార్‌రెడ్డి అనుచరుడిగా ముద్ర వేస్తూ పట్టించుకోవడం లేదన్నారు.

'కవ్వాల్' నుంచి 2 గ్రామాల తరలింపు!

- స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన రాంపూర్, మైసంపేట్
- రూ. 14 కోట్ల ప్యాకేజీ.. కుటుంబానికి రూ. 10 లక్షలు



సాక్షి, హైదరాబాద్: పులుల సంరక్షణ అభయారణ్యాల నుంచి గ్రామాల తరలింపునకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. తొలి విడతలో ప్రయోగాత్మకంగా కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులోని రెండు గ్రామాలను తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ రెండు గ్రామాలకు కల్పించాల్సిన పునరావాసంపై సచివాలయంలో చీఫ్ సెక్రటరీ అధ్యక్షతన పునరావాస అమలు రాష్ట్ర స్థాయి కమిటీ సమావేశం జరిగింది. నిర్మల్ జిల్లా రాంపూర్, మైసంపేటలకు చెందిన రూ. 14.20 కోట్ల విలువైన ప్రతిపాదనలకు కమిటీ ఆమోదం తెలిపింది.

తొలుత రాంపూర్, మైసంపేట్..

మానవ సంచారంతో పులులు కావ్వాల్‌లో స్థిరంగా ఉండలేకపోతున్నాయని, అత్యవసరంగా ఆదివాసీ గ్రామాలను తరలించాలని అటవీ అధికారులు సీఎస్‌కు వివరించారు. కవ్వాల్ రిజర్వ్ కోర్ ఏరియాలో మొత్తం 23 గ్రామాలుండగా ప్రస్తుతం నిర్మల్ జిల్లా రాంపూర్, మైసంపేట్ గ్రామాల ప్రజలు పునరావాసం పొందేందుకు ముందుకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. పులుల సంరక్షణ జాతీయ అథారిటీ నిబంధనల ప్రకారం వారికి పునరావాసం కల్పించనున్నట్లు చెప్పారు. ఆ ప్రకారం ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం, లేదా అదే డబ్బుతో అటవీ శాఖ పునరావాసం కల్పించే ప్రతిపాదనను తీసుకొచ్చారు. పునరావాసానికి అయ్యే ఖర్చులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 50 శాతం భరిస్తాయని పులుల సంరక్షణ జాతీయ అథారిటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ సోమశేఖర్ వివరించారు. పులుల అభయారణ్యం నుంచి తరలించే గ్రామాల వారికి మెరుగైన పునరావాసం కల్పించాలని అటవీ శాఖను చీఫ్ సెక్రటరీ ఎస్పీ సింగ్ ఆదేశించారు.

ఎస్సీ గురుకుల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ గురుకులాల్లో చదివి ప్రఖ్యాత యూనివర్సిటీల్లో సీట్లు సాధించిన ఐదుగురు విద్యార్థులకు ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాశ్ బుధవారం సచివాలయంలో ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. గురుకుల విద్యార్థులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు చేపడుతోందన్నారు. గురుకులాల్లోని ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రఖ్యాత కాలేజీలు, యూనివర్సిటీల్లో సీట్లు సాధించిన విద్యార్థులందరికీ ప్రభుత్వం తరపున ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు.

కాళేశ్వరం ప్రాజెక్టు అద్భుతం

గడ్కరీ ప్రశంసలు

- ప్రాజెక్టు సందర్శనకు ఆహ్వానించిన హరీశ్
- 3,000 టీఎంసీల మిగులుంటే తీసుకోండి
- కేంద్రానికి స్పష్టం చేసిన మంత్రి
- తెలంగాణ అవసరాలే ముందని వ్యాఖ్య



ఢిల్లీలో జరిగిన ఎన్‌డబ్ల్యూడీఏ భేటీలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో గడ్కరీ తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర జలవనరుల మంత్రి నితిన్ గడ్కరీ ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ తాగు, సాగు అవసరాల కోసం చేపడుతున్న ఈ ప్రాజెక్టు పనితీరు భేష్ అని కితాబిచ్చారు. ప్రాజెక్టు నిర్మాణానికి అధిక నిధుల కేటాయింపు, వేగవంతంగా పనులు కొనసాగించడం తదితరాలను ప్రశంసించారు. బుధవారం ఢిల్లీలో నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) ఆధ్వర్యంలో 14వ అంతర్రాష్ట్రీయ నదుల అనుసంధానంపై గడ్కరీ అధ్యక్షతన భేటీ జరిగింది. మంత్రి హరీశ్‌రావు, నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి పాల్గొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్యాలు, పనుల పురోగతిని గడ్కరీ ప్రశంసించారు. భేటీలో తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడులకు చెందిన నదుల అనుసంధానంపై చర్చించారు.

గోదావరే శరణ్యం: హరీశ్

గోదావరి–కావేరి నదులను తొలి దశలో, మహానది–గోదావరిలను రెండో దశలో అనుసంధానిస్తామని కేంద్రం ప్రతిపాదించింది. వీటిపై రాష్ట్ర ప్రభుత్వం 4 ప్రధానాంశాలను లేవనెత్తింది. నీటి లభ్యత, నీటి వనరులు–నీటి తరలింపు, ప్రత్యామ్నాయ మార్గాలు, తక్కువ ఖర్చుతో ఎక్కువ నీటి ఉపయోగం–పర్యావరణ అనుకూలత తదితరాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. మహానది–గోదావరి అనుసంధానాన్నే తొలి దశలో చేపట్టి, ఆ తర్వాతే గోదావరి–కావేరి అనుసంధానంపై చర్చించాలని హరీశ్ సూచించారు. కేంద్రం చెబుతున్నట్టుగా ఏటా 3,000 టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తున్నట్టయితే అనుసంధానానికి తెలంగాణ పూర్తి మద్దతిస్తుందని స్పష్టం చేశారు. ''రెండు నదుల మధ్య ఉన్న తెలంగాణను ప్రధానంగా నీటి కోసమే సాధించుకున్నాం. కాబట్టి మాకిది చాలా ప్రాధాన్యాంశం. కృష్ణాలో నీటి లభ్యత రోజురోజుకు తగ్గిపోతోంది. అందులో 300 టీఎంసీ నికర జలాలు, 70 టీఎంసీ మిగులు జలాలు తెలంగాణ హక్కు. బ్రిజేశ్ ట్రిబ్యునల్ తుది కేటాయింపులు జరపాల్సి ఉంది. కానీ కృష్ణాలో అంత నీరు తెలంగాణకు దక్కడం లేదు. కర్ణాటక ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచుకునేందుకు ట్రిబ్యునల్ అనుమతించింది. దాంతో కృష్ణాలో నీటి లభ్యత ఇంకా తగ్గుతుంది. కాబట్టి తెలంగాణలోని కృష్ణా పరీవాహక ప్రాంతం కూడా గోదావరి నీటిపైనే ఆధారపడాల్సి ఉంటుంది. గోదావరి జలాల్లో 954 టీఎంసీలు తెలంగాణ హక్కు. తెలంగాణ ఏర్పడ్డాక ప్రాజెక్టుల నిర్మాణం వేగవంతం చేసి ఈ హక్కును పూర్తి స్థాయి లో వినియోగించుకోవాలని మా ప్రభుత్వం కృషి చేస్తోంది. కాళేశ్వరం, దేవాదుల, తుపాకులగూడెం, సీతారామ తదితరాలతో తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు ప్రయత్నిస్తోంది. సీతారామ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం సస్యశ్యామలమవుతుంది. దీనితో రాష్ట్ర పరిధిలోనే నదుల అనుసంధానం చేపడుతున్నాం. కృష్ణా పరీవాహక ప్రాంతంలో నాగార్జునసాగర్ ఆయకట్టుకు కూడా సీతారామ ద్వారా నీరిస్తున్నాం. మొత్తంగా కృష్ణా, గోదావరుల నుంచి తెలంగాణకు 1,700 టీఎంసీలు కావాలి. ఇది పోను ఇంకా మిగులు జలాలుంటే ఇవ్వడానికి మేం సిద్ధం''అని వివరించారు.

అక్కనపల్లికి ఒప్పుకోం!

అక్కనపల్లి వద్ద బ్యారేజీ కట్టాలన్న కేంద్రం యోచనపై హరీశ్ అభ్యంతరం వెలిబుచ్చారు. ''అది సీతారామపై ప్రభావం చూపుతుంది. పైగా అక్కనపల్లి వద్ద నీటి లభ్యత లేదని మా అధ్యయనంలో తేలింది. 'అక్కనపల్లి వల్ల తెలంగాణలో 42 వేల ఎకరాలు, 45 గ్రామాలు ముంపునకు గురవుతాయి. ఇందుకు మేం సిద్ధంగా లేం. మొదట మహానది–గోదావరిని కలిపి గోదావరి నుంచి కృష్ణాకు, కృష్ణా నుంచి కావేరికీ కలిపి నీరు తీసుకెళ్తే అభ్యంతరం లేదు. ప్రభుత్వం చెబుతున్నట్టు ఏటా 3,000 టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయా అన్నదానిపై లెక్కతేల్చాలి. తెలంగాణకు కాళేశ్వరం, కంతనపల్లి ప్రాజెక్టులకు అనుమతులిచ్చే ముందు 40 ఏళ్ల సిరీస్ ఆధారంగా నీటి లభ్యతను లెక్కగట్టిన కేంద్రం, అక్కనపల్లి విషయంలో మాత్రం 110 ఏళ్ల సిరీస్ ఆధారంగా లెక్కించి 170 టీఎంసీల లభ్యత ఉందనడం సరికాదు. గోదావరి, కృష్ణా నుంచి తెలంగాణ నీటి అవసరాలను పక్కన పెట్టిన అనంతరం మిగులు జలాలను ఇవ్వడంలో అభ్యంతరం లేదు. నీటిలభ్యతపై సీడబ్ల్యూసీ, ఎన్‌డబ్ల్యూడీఏ, రాష్ట్ర అధికారుల అధ్వర్యంలో కమిటీ వేసి అధ్యయనం చేయించాలి'' అని భేటీలో కోరినట్టు హరీశ్ మీడియాకు తెలిపారు. ప్రాజెక్టు పనుల పరిశీలనకు రావాల్సిందిగా కోరగా గడ్కరీ సానుకూలంగా స్పందించారన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
గురువారం, 18-1-2018



బయోపిక్స్

- ఫ్యామిలీ లోపలి పేజీలో...

చెట్టు నీడ

ధన్యవాదాలు మిత్రమా



● ఎం.జి.రామచంద్రన్

1980ల నాటి మాట. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.జి.రామచంద్రన్. కర్ణాటక ముఖ్యమంత్రి రామకృష్ణ హెగ్డే. రెండు రాష్ట్రాల మధ్య కావేరీ జలాల వివాదం. అప్పటికే వందేళ్ల వివాదం అది! కావేరీ కర్ణాటకలో పుట్టింది. ఆ నీళ్లను దిగువన ఉన్న తమిళనాడు వాడుకుంటుండటంతో వివాదం పుట్టింది. రామచంద్రన్, రామకృష్ణ.. ఇద్దరు రాముళ్లు. రెండూ రామరాజ్యాలు. ప్రజలు కోరింది కాదనలేనివారే ఇద్దరూ. ప్రజలకు ఇష్టం లేనిది చేయలేనివారే ఇద్దరూ. 'నీళ్లు కావాలి' అంటోంది తమిళనాడు. 'ఇచ్చేది లేదు' అంటోంది కర్ణాటక. నీళ్లు తెమ్మని రామచంద్రన్ మీద, నీళ్లివ్వొద్దని రామకృష్ణ హెగ్డే మీద ఒత్తిడి పెరుగుతోంది. ఎన్ని ఒత్తిళ్లున్నా ప్రజల్ని పొత్తిళ్లలో పెట్టుకుని చూడడం నాయకుల లక్షణం. ఓ ఉదయం రామచంద్రన్ అకస్మాత్తుగా బెంగళూరులోని రామకృష్ణ హెగ్డే ఇంటి ముందు దిగారు. రామచంద్రన్ వస్తున్నట్లు హెగ్డేకు కనీసం కబురు కూడా లేదు! హెగ్డే ఆశ్చర్యపోయారు. ''రండి.. మిత్రమా'' అని నవ్వుతూ రామచంద్రన్‌ను ఆహ్వానించారు.

అల్పాహారం సిద్ధం అయింది. నాయకులిద్దరూ ఆహ్లాదంగా మాట్లాడుకుంటూ బ్రేక్‌ఫాస్ట్ తీసుకుంటున్నారు. ''పదార్థాలు రుచిగా ఉన్నాయి మిత్రమా'' అన్నారు రామచంద్రన్. అలా అంటుండగానే ఆయనకు వెక్కిళ్లు మొదలయ్యాయి. వెంటనే హెగ్డే మంచినీళ్ల గ్లాసు అందించారు.

''ధన్యవాదాలు మిత్రమా.. నా ప్రజలకు కూడా వెక్కిళ్లు వస్తున్నాయి. వాళ్లక్కూడా నీళ్లు అందివ్వగలవా?''.. అడిగారు రామచంద్రన్.

పెద్దగా నవ్వి, రామచంద్రన్ భుజం తట్టారు హెగ్డే.

రామచంద్రన్ చెన్నై వెళ్లిపోయారు. ఆ మధ్యాహ్నం బ్రేకింగ్ న్యూస్! 'కర్ణాటక రిలీజెస్ కావేరీ వాటర్ టు తమిళనాడు'. మీడియా కార్యాలయాలలో టెలీప్రింటర్‌లు ఆ రోజంతా టపటపమని ఊపిరి సలపకుండా కొట్టుకుంటూనే ఉన్నాయి.

రౌండ్ టేబుళ్లే కాదు, కొన్నిసార్లు డైనింగ్ టేబుళ్లు కూడా ప్రజా సమస్యల్ని పరిష్కరిస్తాయి. 'తగ్గే' చొరవ ఆ లీడర్‌లో ఉండాలంతే. (నిన్న.. జనవరి 17 ఎం.జి.రామచంద్రన్ జయంతి).

– మాధవ్ శింగరాజు

భయం మంచిది కాదు



● నందితాదాస్

నందితాదాస్ విలక్షణమైన నటి, దర్శకురాలు. పది భాషల్లో 40 సినిమాల్లో నటించారు. దీపామెహతా తీసిన 'ఫైర్' (1996) చిత్రంలో యాక్ట్ చేసినందుకు ఎన్నో మాటలు పడ్డారు. భారతీయ సంస్కృతిని మంటకలిపేసిందని సంప్రదాయవాదులు ఆమెను దూషించారు. హోమోసెక్సువల్ రిలేషన్స్‌ని అందులో చూపారు. అదీ కోపం. అయితే ''అప్పుడే నయం. ఇప్పటి మనుషుల్లో ఆ మాత్రం సహనమైనా లేకుండా పోయింది'' అని ఇటీవల ముంబై ఐ.ఐ.టి.లో జరిగిన 'సౌత్ ఏషియన్ కాన్ఫరెన్స్ ఆన్ జెండర్ అండ్ సెక్సువాలిటీ' సదస్సులో నందిత అన్నారు. ఆమె మాటలు నిజమేననిపిస్తోంది.. ఇప్పటికింకా చల్లారని 'పద్మావతి' వివాదాన్ని చూస్తుంటే. ''ఎందుకనో మనుషుల్లో భయం పెరిగిపోయింది. మౌనంగా ఉండిపోతున్నారు. మనసులో ఉన్నది చెప్పడమే నేరమౌతున్న రోజులు వచ్చిపడ్డాయి. పడుతుందో లేదో తెలియని దెబ్బ నుంచి ముందే తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు'' అని నందిత ఆవేదన వ్యక్తం చేశారు. ''ఈ భయం సమాజానికి మంచిది కాదు'' అన్నారు. నిజమే. భయం నాగరిక లక్షణం కూడా కాదు.



● కొడుకుతో జారియా



● జారియా

సింగిల్‌గా తెచ్చింది

ఓ సినిమాలో పాపులర్ డైలాగ్..
'సింహం సింగిల్‌గా వస్తుందని'!
పాస్‌పోర్టు ఆఫీస్ మాత్రం..
జారియా జంటగానే రావాలి అంది!
"కుదర్దు సింగిల్‌గానే వస్తుంది..
సింగిల్‌గానే మార్పు తెస్తుంది" అని
మనసులోనే శపథం చేసుకుంది జారియా!
ఈ సింగిల్ మదర్ .. పోరాటం..
విజయం.. వెరిమచ్ ఇన్‌స్పైరింగ్.

''క్యా హువా బేటా (ఏమైందమ్మా)''

బయటి నుంచి వచ్చి ఈసురోమంటూ సోఫాలో చేరగిలబడ్డ కూతురిని చూస్తూ అడిగింది తల్లి ఆత్రంగా!

''కుఛ్ నహీ హువా మా... హమేషాకి తరహ్ (ఏమీ కాలేదమ్మా.. ఎప్పటిలాగే)''.. నిరాశగా నిట్టూరుస్తూ జవాబిచ్చింది కూతురు.

''పరేషాన్ మత్ హో.. సబ్ ఠీక్ హోగా (కంగారు పడకు.. అంతా సవ్యంగానే జరుగుతుంది)''.. అంది తల్లి కూతురి తల నిమురుతూ!

కళ్లల్లో నీళ్లొచ్చాయి కూతురికి తల్లి స్పర్శతో. వెంటనే తమాయించుకుని ''ఏక్ మినట్ మా... ''అంటూ దిగ్గున లేచి తన గదిలోకి వెళ్లింది కూతురు. హడావుడిగా ల్యాప్‌ట్యాప్ తెరిచి.. 'ఛేంజ్ డాట్ ఓఆర్‌జీ'కి ఓ పిటిషన్ మెయిల్ చేసింది. తర్వాత విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి సుష్మాస్వరాజ్‌కు ట్వీట్ చేసింది.

ఆమె పేరు జారియా పట్నీ. ముంబై నివాసి. ఉన్నపళంగా పిటిషన్, మంత్రికి ట్వీట్ చేయాల్సిన అవసరమేంటి?

గతం

జారియాకు పందొమ్మిదేళ్లప్పుడు పెళ్లయింది. ముంబైలో వాళ్ల బిల్డింగ్‌లోనే ఓ అపార్ట్‌మెంట్‌లో అద్దెకుండే ఓ వ్యక్తితో పరిచయమైంది. అతను ఆమెకన్నా ఏడేళ్లు పెద్దవాడు. ''నువ్వంటే ఇష్టం'' అన్నాడు. ఆమె స్నేహం చేసింది. కాఫీ షాప్‌లు, సినిమాలు, షాపింగ్‌లకు కలిసి వెళ్లేవారు. ఆ చనువు ప్రేమగా మారింది. పెద్దల అంగీకారంతో పెళ్లి అయింది. పెళ్లయ్యాక అతనికి దుబైలో ఉద్యోగం రావడంతో జారియాను తీసుకొని దుబై వెళ్లాడు. ఆమె ఏం తినాలి? ఎలాంటి బట్టలు వేసుకోవాలి? ఎవరితో మాట్లాడాలి? ఎలాంటి వాళ్లు స్నేహితులుగా ఉండాలి అనేవన్నీ అతనే నిర్ణయించడం మొదలుపెట్టాడు. మొదట్లో.. ఏ బట్టలు వేసుకోవాలో, ఏం తినాలో భర్త చెబుతుంటే ప్రేమ అనుకుంది. కాని రానురాను ఆ తీరు పొసెసివ్‌నెస్‌గా, అతని అభద్రతగా అర్థమైంది జారియాకు. అయితే ఆయన ప్రతాపం అంతటితో ఆగలేదు. జారియా తన హక్కు గురించి ఏమాత్రం మాట్లాడినా చేయిచేసుకునేదాకా వెళ్లింది. ఆ సమయంలోనే ఆమె ప్రెగ్నెంట్ అని తేలింది. అయినా హింస ఆపలేదు. గర్భిణి అని కూడా చూడకుండా ఆమెను కొట్టాడు. తీవ్ర అస్వస్థతకు లోనై ఆసుపత్రి పాలైంది. ఒక్కరోజు ఆలస్యమైనా జారియా ప్రాణంమీదకు వచ్చేదని చెప్పారు డాక్టర్లు. దాంతో భయపడిపోయిన జారియా ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అవగానే ముంబైకి ప్రయాణమైంది. జరిగిన విషయం ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పింది. అండగా నిలిచారు. మళ్లీ వెనక్కి వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. విడాకులకు దరఖాస్తు చేసుకుంది. కేస్ కోర్టులో ఉండగానే జారియాకు కొడుకు పుట్టాడు. బిడ్డతో పాటు విచారణలకు వెళ్లొచ్చేది. ఎట్టకేలకు బిడ్డకు ఆమెను లీగల్ గార్డియన్‌గా చేస్తూ కోర్టు విడాకులు మంజూరు చేసింది. ఊపిరి పీల్చుకుంది జారియా.

బ్రాండ్ ఫొటోగ్రాఫర్



● టెక్నాలజీ, ఎంటర్‌టైన్‌మెంట్, డిజైన్ (టి.ఇ.డి.) మీట్‌లో జారియా ప్రసంగం

ఓ వైపు పిల్లాడి పెంపకం బాధ్యతలు చూసుకుంటూనే ఇంకోవైపు తండ్రికి వ్యాపారంలో చేదోడువాదోడుగా ఉంటోంది జారియా. బాబు కొంచెం పెద్దయ్యాక భర్త పక్కన పెట్టించిన ఫొటోగ్రఫీ అభిరుచిని మళ్లీ ప్రారంభించింది. త్వరలోనే మంచి పేరున్న బ్రాండ్స్ నుంచి ఆఫర్స్ రావడం మొదలయ్యాయి. ఆ షూటింగ్‌లు, వ్యాపారంతో చాలా బిజీ అయిపోయింది. షూటింగ్స్ విదేశాల్లో ఉండటంతో అక్కడికీ వెళ్లాల్సి వచ్చింది. ఒకసారి కొడుకును కూడా తీసుకెళ్దామనుకుంది. పాస్‌పోర్ట్‌కు అప్లయ్ చేస్తే రిజెక్ట్ అయింది. కొంతకాలం ఆగి మళ్లీ చేసింది. మళ్లీ దరఖాస్తును తోసిపుచ్చారు. ఖంగు తినింది. కారణమేంటో తెలియలేదు. పాస్‌పోర్ట్ ఆఫీస్‌కు వెళ్లి ఆరా తీసింది. పిల్లాడి తండ్రి సంతకం తప్పనిసరిగా కావాలన్నారు. ''అదేంటి? సింగిల్ పేరెంట్‌ని. విడాకులు కూడా తీసుకున్నాను. ఇప్పుడు అతని దగ్గరకు వెళ్లి సంతకం ఎలా తీసుకొస్తాను? తేలేను'' అని తేల్చేసింది. ''మేమూ ఇవ్వలేం'' అని వాళ్లూ స్పష్టం చేశారు. షాక్ అయింది జారియా. అతని హింసను భరించలేక కాపురం వద్దనుకోవడమే కాదు జన్మలో అతని మొహమే చూడకూడదనుకుంది. సంతకం కోసం అలాంటి వ్యక్తి దగ్గరకు మళ్లీ వెళ్లాలా? సమస్యే లేదు. పాస్ పోర్ట్ ఎలా రాదో చూస్తా అనుకుంది. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ చూసింది. విడాకుల కేసుల్లో పిల్లలకు సంబంధించి దరఖాస్తు ఫారాల్లో తల్లి, తండ్రి ఇద్దరిలో ఎవరి సంతకమైనా చెల్లుతుంది అని రాసి ఉంది. ఆ గైడ్‌లైన్‌ను పట్టుకొని ఇంకోసారి పాస్‌పోర్ట్ ఆఫీస్‌కు వెళ్లింది. తండ్రి సంతకం తప్పనిసరిగా కావాలని ప్రభుత్వ నియమాన్ని, నిబంధనను తీసి చూపించారు పాస్‌పోర్ట్ అధికారులు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్‌ను చెల్లదు పొమ్మన్నారు! డీలా పడి ఇల్లు చేరింది. అంతలోకే ఆలోచన వచ్చి చేంజ్ డాట్ ఓఆర్‌జీకి పిటిషన్, సుష్మాస్వరాజ్‌కు ట్వీటూ చేసింది.

ప్రస్తుతం

చేంజ్ డాట్ ఓఆర్‌జీలో ఆమె పిటిషన్‌కు తొంభైఆరువేల మంది మద్దతు పలికారు. దాంతో ప్రభుత్వం... సుప్రీంకోర్టు గైడ్‌లైన్‌కు విరుద్ధంగా ఉన్న తన నిబంధనను వెనక్కు తీసుకోవాల్సి వచ్చింది. తల్లి లీగల్ గార్డియన్ అని ఉన్న సుప్రీంకోర్టు గైడ్‌లైన్‌ను గౌరవిస్తూ తల్లి సంతకంతోనే జారియా కొడుకుకు పాస్‌పోర్ట్ మంజూరు చేశారు. తన పోరాటం ఎంతో మంది ఒంటరితల్లులకు ఊరటైనందుకు చాలా సంతోషంగా ఉంది జారియా పట్నీ!

– శరాది



● తిమ్మక్క

తల్లి చెట్టుకు నీడ కరువైంది

తిమ్మక్క చేతిలో చిల్లిగవ్వ లేదు. అయితే ఆమె చేతిలో.. భారత ప్రభుత్వం ఇచ్చిన నేషనల్ సిటిజన్ అవార్డు ఉంది. ఇందిరా ప్రియదర్శిని వృక్షమిత్ర అవార్డు ఉంది. మాతా శిశుసంరక్షణ కేంద్రం ఇచ్చిన గౌరవ సర్టిఫికెట్ ఉంది. ఇవేవీ ఆమెకు గుప్పెడు తిండి గింజల్ని ఇవ్వలేకపోయాయి. అందుకే తిమ్మక్క.. ఇటీవల కర్ణాటక ప్రభుత్వం తనకిచ్చిన అవార్డును తిరస్కరించింది.

'సాలుమరడ' తిమ్మక్క వయసు 105. కర్ణాటకలో ఆమె పెంచిన మర్రిచెట్లు ఎనిమిది వేలకు పైమాటే! తిమ్మక్క కర్ణాటక మాగడి తాలూకా హులికల్ అనే చిన్న గ్రామంలో జన్మించింది. బాల్యంలోనే పశువులను కాసే చిక్కయ్యను వివాహమాడింది. రాళ్లు కొడుతూ, భూమి దున్నుతూ జీవనం గడిపారు ఈ దంపతులు. దురదృష్టవశాత్తు వారికి సంతానం కలగలేదు. తిమ్మక్క ఏ మాత్రం కుంగిపోలేదు. తన జీవితాన్ని చెట్ల పెంపకానికి అంకితం చేసింది. భర్తతో కలిసి ఊరికి దగ్గరలో కుదూర్ రోడ్డుకి ఇరుపక్కలా మర్రి విత్తనాలు నాటుతూ, వాటిని సొంత పిల్లల్లా సాకడం ప్రారంభించింది. తను తిన్నా తినకున్నా వాటిని మాత్రం ఏళ్లుగా సంరక్షిస్తూనే ఉంది. ఇప్పటికీ మొక్కలు నాటుతూనే ఉంది. చెట్ల మొక్కలు నాటడం వల్లే ఆమెకు సాలుమరడ (చెట్ల వరుస) అని పేరు వచ్చింది. తిమ్మక్క చేసిన పర్యావరణ పరిరక్షణ సేవలకు గుర్తింపుగా ఎన్నో జాతీయ, అంతర్జాతీయ అవార్డులు ఆమెను వరించాయి. అయితే ఇన్ని అవార్డులు సంపాదించుకున్న తిమ్మక్కకు ప్రభుత్వం ఆర్థికంగా ఒక్క సహాయమూ చేయలేదు. ప్రభుత్వం నుంచి రావలసిన సహాయం కూడా సమయానికి అందకపోగా, వెళ్లి అడిగినా ప్రయోజనం లేకపోయింది. ఇటీవల ప్రభుత్వం అవార్డును ఇవ్వబోతే,''నేను దళితురాలిని అనే ఉద్దేశంతో నాకు అవార్డు ఇవ్వొద్దు. ప్రతివారు మెడల్స్, బహుమతులు ఇస్తారే కాని, ఒక్కరూ నాకు డబ్బు ఇవ్వాలని ఎందుకు అనుకోలేదో నాకు అర్థం కావట్లేదు'' అని ఆవేదనగా అంది తిమ్మక్క.

– డా. వైజయంతి

అమ్మను ఓ అయ్య చేతిలో పెట్టింది

నాన్న హఠాత్తుగా చనిపోయారు. అమ్మ ఒంటరి అయింది. పిల్లలు ఎంతమంది చుట్టూ ఉన్నా ఆ ఒంటరితనం పోయేది కాదు. అందుకే ఆ కూతురు అమ్మకు ఒక తోడును వెతికి తెచ్చింది. పెళ్లి చేసింది. తల్లిని ఓ అయ్యచేతిలో పెట్టింది.

'సంహిత మీరేనా' అడిగాడు, అడ్రస్ వెతుక్కుంటూ జైపూర్ వచ్చిన కృష్ణ గోపాల్ గుప్తా.

'అవును, రండి కూర్చోండి' అంటూ అతడిని ఆహ్వానించి సోఫా చూపించింది పాతికేళ్ల సంహిత.

''మాట్రిమోనియల్ వెబ్‌సైట్‌లో మీ అమ్మగారి కోసం మీరు పెట్టిన వివరాలన్నీ చదివాను. నాకు సమ్మతమే. నాకు యాభై ఐదేళ్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ని'' అని నేరుగా విషయంలోకి వచ్చేశాడతడు.

'ఇలాంటి నిర్ణయం తీసుకోవాల్సి వస్తుందని మేమసలు ఊహించనే లేదు. అంతా హటాత్తుగా జరిగిపోయింది. ఆరోగ్యంగా ఉన్న మా నాన్నగారు ఉన్నట్లుండి పోయారు'.. అంది సంహిత.

'భవిష్యత్తు ఎటు నడిపిస్తుందో ఊహించలేం. దేవుడు నిర్ణయిస్తాడు, తాననుకున్న దారిలో మనల్ని నడిపిస్తాడు... మనం నడుస్తాం అంతే' అన్నాడతను.

ఇలాంటి పరిణతి ఉన్న వ్యక్తి కోసమే సంహిత ఎదురు చూసింది. ఇతడి సహచర్యంలో తల్లి దుఃఖానికి దూరం కాగలుగుతుంది అనుకుంది.

● ❖ ●

తర్వాత కొద్దిరోజులకే.. గత డిసెంబర్ మూడవ తేదీన ఆర్యసమాజం సంప్రదాయంలో గీతకు (సంహిత తల్లి), కృష్ణగోపాల్‌కూ పెళ్లి జరిగింది. ఇరు కుటుంబాల నుంచి నాలుగు వందల మంది మిత్రులు, బంధువులు హాజరయ్యి దంపతులను అభినందనలు తెలిపారు. అంతకంటే ఎక్కువగా సంహిత చొరవను ప్రశంసలతో ముంచెత్తారు.

సంహిత గుర్‌గావ్‌లో ఉద్యోగం చేస్తోంది. తల్లి ఎలా ఉందో చూడ్డానికి రెండు వారాలకోసారి జైపూర్ వచ్చి వెళుతోంది.

– మంజీర



● తల్లీకూతుళ్లు



● అమ్మ గీత, 'నాన్న' కృష్ణ గోపాల్‌తో సంహిత

సాక్షి ఫ్యామిలీ
సినిమా
హైదరాబాద్
గురువారం
18-1-2018

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హలో సార్! నేను బీటెక్ చదువుతున్నా. సెకండ్ ఇయర్‌లో ఉన్నప్పుడు నాకు ఒక అబ్బాయి పరిచయమయ్యాడు. అప్పటికే తను జాబ్ చేస్తున్నాడు. తనంటే నాకు ఫస్ట్ నుంచీ ఇష్టమే. అయితే ఆ విషయం తనకి చెప్పలేదు. కానీ తనే తెలుసుకుని.. ''ఇదంతా కుదరదు. నేను నిన్ను పెళ్లి చేసుకోలేను. నా మరదల్ని చేసుకోవాలి తప్పదు.'' అన్నాడు. ఎందుకలా అని అడిగితే.. ''మేము వర్జిన్స్ కాదు'' అన్నాడు. నేను సైలెంట్ అయిపోయా. కొన్ని రోజులకు మళ్లీ తనే వచ్చి.. ''నువ్వు లేకుండా నేను ఉండలేను'' అన్నాడు. మరి మీ మరదలు..? అని అడిగితే.. ''ఆ రోజు మా మధ్య ఏం జరగలేదు. నాకు మత్తు మందు ఇచ్చి, లేచేసరికి అరచి గోల చేసి నన్ను బుక్ చేసింది. నువ్వు నాకు కావాలి. మనం పెళ్లి చేసుకుందాం. తనకి తరువాత నేనే పెళ్లి చేస్తాలే'' అన్నాడు. నేను కాదనలేక పోయా. కొన్ని రోజులకు వచ్చి.. ''నాకు పెళ్లి ఫిక్స్ అయ్యింది. మా నాన్న బలవంతం మీద ఈ పెళ్లి జరుగుతుంది'' అన్నాడు. పెళ్లి అయిపోయిన తరువాత వచ్చి.. ''నాకు నువ్వే కావాలి. నేను ఆ అమ్మాయిని నా భార్యగా అంగీకరించలేకపోతున్నా'' అంటున్నాడు. కాదంటే చచ్చిపోతా అంటున్నాడు. ఇప్పటికే చాలాసార్లు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇప్పుడు నేను ఏం చెయ్యాలో చెప్పండి ప్లీజ్.

- డింపు

వాడొక పిచ్చోడు.
'ప్రేమ పిచ్చోడా సార్?'
పిచ్చికి పిచ్చెక్కితే ఎలా ఉంటుందో అలా ఉన్నాడు...!
'ప్రేమకు ప్రేమెక్కినట్టు అనిపించలేదా సార్???'
అసలు వాడికి ప్రేమంటే ఏంటో తెలియదు.
పెళ్లంటే గౌరవం లేదు.
అమ్మాయంటే విలువ లేదు.
'అలా ఎలా చెప్పగలరు సార్?'
ప్రేమించిన అమ్మాయిని వదిలేశాడు...
పెళ్లి చేసుకున్న అమ్మాయినీ వదిలేశాడు..
రేపు డింపునీ వదిలేస్తాడు..
తాడూ బొంగరం లేని పిచ్చోడు..
వాడి చేతిలో ప్రేమ ఒక రాయి లాంటిది.
ఎటు విసురుతాడో....
ఎవరి జీవితాన్ని పగలగొడతాడో తెలియదు.
డింపు... ప్లీజ్ బీ కేర్ఫుల్!

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.
లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

కాకురో సుడోకు

3	5			8		4		1
1		6	4					
9	4				5		8	6
5	7			2	3		6	
6			7		4			8
	2		1	6			7	5
7	1		2				3	9
					7	1		2
2				3			5	7

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

4	1	2	5	8	3	9	7	6
8	3	9	4	6	7	1	2	5
6	7	5	1	2	9	3	8	4
2	8	1	6	7	5	4	3	9
7	5	6	9	3	4	2	1	8
9	4	3	8	1	2	6	5	7
1	6	7	2	9	8	5	4	3
5	2	8	3	4	6	7	9	1
3	9	4	7	5	1	8	6	2

హత్యకు స్కెచ్

'సామాన్యుడు, శ్రీమన్నారాయణ' సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న రవి చావలి దర్శకత్వంలో తాజాగా తెరకెక్కిన చిత్రం 'సూపర్ స్కెచ్'. హత్య నేపథ్యంలో నడిచే ఈ థ్రిల్లర్ స్టోరీలో నర్సింగ్, ఇంద్ర, సమీర్ దత్త, కార్తీక్, చక్రి మాగంటి, అనిక, సుభాంగీ, సోఫియా (లండన్) కీలక పాత్రలు చేశారు. ఎరోస్ సినిమాస్ సమర్పణలో బలరామ్ మక్కల నిర్మించిన ఈ చిత్రం ఎడిటింగ్ జరుపుకుంటోంది. రవి చావలి మాట్లాడుతూ– ''ఒక పోలీసాఫీసర్, ఓ ఫారిన్ అమ్మాయి, నలుగురు క్రిమినల్స్ మధ్య జరిగే కథ ఇది. పోలీసును ముప్పు తిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించిన క్రిమినల్స్ పాత్రల నేపథ్యంలో తెరకెక్కించాం. పోలీస్ అధికారిగా నర్సింగ్ నటన ఈ సినిమాకి హైలైట్. శ్రీహరిగారికి ప్రత్యామ్నాయం అన్నట్టు చేశాడు. ఉత్కంఠభరితంగా సాగేలా టైట్ స్క్రీన్ ప్లే ఉంటుంది. హైదరాబాద్, విజయవాడ, బాపట్ల సూర్యలంక బీచ్, వికారాబాద్ ఫారెస్ట్‌లో 50 రోజుల్లో చిత్రీకరణ పూర్తి చేశాం. ఫిబ్రవరి నెలాఖరున లేదా మార్చిలో సినిమాను విడుదల చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాణం: యూ అండ్ ఐ క్రియేషన్స్, ఫ్రెండ్స్ ఫిల్మ్ అకాడమీ, కెమెరా: సురేంద్ర రెడ్డి, సంగీతం: కార్తీక్ కొడకండ్ల.




సోఫియా

నేడు ఎన్టీఆర్ వర్ధంతి

తెలుగు జగతికి వీరుడు

'ఛోడ్ గయే బాలమ్'... అని రాజ్‌కపూర్ పియానో ముందు కూచుని విషాదంగా పాడుకుంటున్నప్పుడు, 'టూటే హుయే ఖ్వాబోనే'... అని దిలీప్ కుమార్ ప్రియురాలిని తలుచుకుని రోదిస్తున్నప్పుడు, 'తూ కహా యే బతా'... అని దేవ్ ఆనంద్ వీధులు పట్టుకుని తిరుగుతున్నప్పుడు 'కలవరమాయే మదిలో' అని నీటి గుమ్మటాల దగ్గర నిలబడి పాడుకోవడంతోటే ఆగిపోకుండా ఆ ప్రేమను నిజం చేసుకోవడానికి కత్తి పట్టుకుని కారడవులకు పయనమైన హీరో ఎన్.టి. రామారావు. ఒక జాతి వీరత్వం కలిగి ఉండాలని, వీర స్వభావంతో ముందుకు సాగాలని, జాతి చెప్పుకోవడానికి ఒక వీరుడు ఉండాలని, అది వెండితెర మీద అయినా సరే, ఒక ఇమేజ్‌ను నిలబెట్టగలిగిన హీరో ఎన్.టి.రామారావు. స్త్రీలను ప్రేమించడం, కౌటుంబిక జీవితంలోని కష్టనష్టాలను భరించడం, అనుబంధాలను నిలబెట్టుకోవడం... ఇవన్నీ పురుషుడి జీవితంలో ఒక భాగమే కాని పురుష జన్మకు సార్థకత ఘనకార్యాలు చేయడమేనని సినిమా మీడియమ్ ద్వారా పదే పదే చెప్పిన హీరో ఎన్.టి.రామారావు. ఉత్తరాదికి ఇలాంటి ఇమేజ్ ఇచ్చే హీరో ఏర్పడడానికి అమితాబ్ బచ్చన్ వచ్చే దాకా సమయం పట్టింది. కాని దక్షిణాదిన మూతి మీద ఎప్పుడూ మీసం ఉండేలా చూసుకునే ద్రవిడ జాతి ప్రతీకగా, ధీరోదాత్తతకు, పౌరుషానికి చిహ్నంగా తమిళ నాట ఎం.జి.ఆర్, కన్నడ సీమన రాజ్‌కుమార్, తెలుగులో ఎన్.టి.ఆర్ నిలబడ్డారు. సినిమాను కమర్షియల్ కళ అని భావించినట్టయితే అది నీరసపడిపోకుండా, శుష్కమైన పనులతో నిండిపోకుండా, దుర్బల దీనావస్థలకు పరిమితం కాకుండా కాపాడిన త్రయం ఈ ముగ్గురు. వీరిలో తెలుగువారి మేటి ఎన్.టి. రామారావు.



'కొండవీటి సింహం'లో...

దేవతల స్థానంలో దేవుళ్ల ముందు వరుసలో నిలిచి దైవత్వానికి పురుష స్వభావం స్థిరపడ్డాక ఆ సంస్కృతికి తెలుగులో తొలి ప్రతీక అయినవాడు ఎన్.టి.రామారావు. రాముడుగా అతడు రావణుడిని సంహరించాడు. కృష్ణుడిగా అతడు కురుక్షేత్రాన్ని నడిపించాడు. విష్ణువుగా చక్రం తిప్పాడు. శివుడుగా చెడును లయించాడు. తెలుగువారి పురాణ పురుషుడు ఎన్.టి.ఆర్. తెలుగు జానపదులు కలలుగన్న కోరమీసం రాకుమారుడు కూడా ఎన్.టి.ఆరే. అతడు చిక్కడు. అతడు అగ్గిపిడుగు. అతడే రాబిన్ హుడ్ బందిపోటు. అరేబియన్ గాథలకు అతడే ఆలీబాబా. అతడే కదా బాగ్దాద్ గజదొంగ. చరిత్రలోకి టైమ్ ట్రావెల్ చేయించి తెలుగువారిని భువనవిజయంలో ఆశీనులను చేయించిన కృష్ణదేవరాయలు అతడే. చంద్రగుప్తుడు అతడే. అశోకుడూ అతడే. భక్తి ఉద్యమంలోకి నడిపించగలిగిన పాండురంగడు అతడే. సిద్ధత్వంలోకి తీసుకెళ్లగలిగిన బ్రహ్మంగారు అతడే. ద్రవిడులకు ఒక ఆత్మ, ఆంతరాత్మ ఉందని నిరూపించి శూద్రుల దృష్టి కోణం నుంచి రావణుణ్ణి, కర్ణుణ్ణి మానవీయమూర్తులను చేసింది కూడా అతడే.



'పాతాళభైరవి'లో...

ఒక భుజాన వీరత్వం కలిగినా ఒక భుజాన వినోదాన్ని నింపుకుని బీదా బిక్కీ జనాలకు మూడు గంటల పాటు వారి కష్టాలను మరిచి పోగలిగేలా చేసినవాడు ఎన్.టి.రామారావు. వారి అమాయకమైన కేరింతల కోసం శ్రమించినవాడు ఎన్.టి.రామారావు. శ్రమజీవుల చెమట తుడిచిన చేతులు అతడివి. ఏనుగులెక్కి ఊడలను పట్టుకుని ఊగితే అతడు అడవి రాముడు. తుపాకి పట్టుకుని వేటకు బయల్దేరితే వేటగాడు. ఖాకీ యూనిఫామ్ తొడుక్కుంటే కొండవీటి సింహం. నల్ల కోటు ధరిస్తే జస్టిస్ చౌదరి. కరాటే బెల్ట్ కట్టుకుంటే యుగ పురుషుడు. గాల్లోన ఎగిరితే సూపర్ మేన్. ఒక మనిషి ఇన్ని చేయడం అసాధ్యం. కాని ఊహల్లో అయినా సామాన్యుణ్ణి లార్జర్ దేన్ లైఫ్‌గా ఉంచగలిగిన సమ్మోహితుడు ఎన్.టి.ఆర్. ఎనర్జీస్‌ని పాజిటివ్‌గా డ్రైవ్ చేసిన ఫోర్స్ అతడు.

ఒక భుజాన వీరత్వం కలిగినా ఒక భుజాన వినోదాన్ని నింపుకుని బీదా బిక్కీ జనాలకు మూడు గంటల పాటు వారి కష్టాలను మరిచిపోగలిగేలా చేసినవాడు ఎన్.టి.రామారావు. వారి అమాయకమైన కేరింతల కోసం శ్రమించినవాడు ఎన్.టి. రామారావు. శ్రమజీవుల చెమట తుడిచిన చేతులు అతడివి.

ముద్దబంతి పూలు పెట్టి మొగలి రేకును జడను చుట్టి... పల్లె పాట అతడి పెదాల మీద పరవశించింది.

కోలో కోయన్న కోలో నా సామీ... తెలుగు పదం అతడి పాద నర్తనలో మురిసిపోయింది.

కృషి ఉంటే మనుషులు రుషులవుతారని అతడు హితవు చెప్పాడు.

పుణ్యభూమి నా దేశం నమో నమామి అంటూ ఈ దేశం వైపు సగర్వంగా కన్నెత్తి చూడమని పిలుపు ఇచ్చాడు.

ఒక చెల్లికి అన్న–
ఒక తల్లికి కొడుకు–
ఆపదలో ఉన్నవాడికి రక్షకుడు–
ప్రజలకు నాయకుడు
సంపూర్ణ కథానాయకుడు.
ఎన్.టి.ఆర్ ఉంటాడు.
అతడు ఆరని గండదీపం.

- కె

డైలాగ్స్ పలకడంలో ఆయనకు ఆయనే సాటి

– మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు



● బాలకృష్ణ, టీయస్సార్, మధుసూదనాచారి, విద్యాసాగర్ రావు, మోహన్‌బాబు, స్వామి గౌడ్, గీతారెడ్డి, మాడుగుల నాగఫణి శర్మ

''ఇలాంటి కార్యక్రమాన్ని ఇంత చక్కగా నిర్వహించడం సుబ్బరామిరెడ్డి గారికే సాధ్యం. కళాకారులను సన్మానించడానికి ఆయన 120 ఏళ్లు జీవించి ఉండాలి'' అని మహారాష్ట్ర గవర్నర్ సి.హెచ్. విద్యాసాగర్ రావు అన్నారు. 'కళాబంధు' టి. సుబ్బరామిరెడ్డి బుధవారం 'కాకతీయ కళా వైభవ మహోత్సవం' నిర్వహించారు. ఈ సందర్భంగా నటుడు మంచు మోహన్‌బాబుని 'విశ్వ నట సార్వభౌమ' అవార్డుతో సత్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన విద్యాసాగర్ రావు మాట్లాడుతూ– ''భారతదేశంలో అత్యధికులు మాట్లాడే భాష హిందీ తర్వాత తెలుగే అని మనం సగర్వంగా చెప్పుకోవాలి. మారుమూల ప్రాంతాల్లోని పేద కళాకారులను సైతం గుర్తించి సన్మానం చేయాలని సుబ్బరామిరెడ్డిగారికి నేను మనవి చేస్తున్నా. ప్రపంచంలోని తెలుగువారందర్నీ కలిపి ఓ వెబ్‌సైట్ తయారు చేయాలి. తెలుగు భాషకు సంబంధించిన చరిత్ర, అన్ని విషయాలు అందులో ఉండేలా చూడాలి. తెలుగు భాష పేద విద్యార్థులకు ఎంత ఉపయోగపడుతుందనే విషయం మరచిపోకూడదు. సిటీల్లో గ్రాడ్యుయేషన్ వరకూ చదవాలంటే కొన్ని లక్షల రూపాయలు ఖర్చు అవుతాయి. పల్లె ప్రాంతంలో అయితే దాదాపు ఖర్చు లేకుండానే వాళ్లు చదువుకుంటున్నారు. కానీ, గ్రాడ్యుయేషన్ తర్వాత ఇంజినీరింగ్ కావొచ్చు.. కలెక్టర్ కావొచ్చు.. ధనిక విద్యార్థులతో పోటీ పడుతున్నారు గ్రామీణ విద్యార్థులు. ఈ శక్తి వారికి ఎలా వచ్చిందంటే తల్లిలా ఉండే తెలుగు భాషవల్లే. తెలుగు భాష వల్ల కొన్ని వేల రూపాయల సబ్సిడీ దొరుకుతోంది. అటువంటి భాషను మనం ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం ఉంది. కులరహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలి. పదునైన పదజాలాన్ని పలకడంలో తనకు తానే సాటి అని నిరూపించుకున్నారు మోహన్‌బాబుగారు. డైలాగులంటే ఎన్టీఆర్ తర్వాత గుర్తుకు వచ్చే వ్యక్తి మోహన్‌బాబుగారే'' అన్నారు.

తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి మాట్లాడుతూ– ''మోహన్‌బాబు నటన అద్భుతం. ఐదు తరాల ప్రేక్షకుల అభిమానం సొంతం చేసుకున్న ఆయన 'విశ్వ నట సార్వభౌమ' అవార్డుకు సంపూర్ణ అర్హులు'' అన్నారు. తెలంగాణ శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్ మాట్లాడుతూ– ''మోహన్‌బాబుగారి సినిమాలు భారతీయులు.. ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్ర ప్రజల గుండెల్లో చెక్కబడి ఉంటాయని చెప్పగలను. ఆయన జీవితం అంతా కళారంగానికే అంకితం చేశారు'' అన్నారు. సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ– ''మోహన్‌బాబు 42 ఏళ్లలో 600 చిత్రాలకు పైగా నటించారు. భారతదేశ చలనచిత్ర రంగంలో విలన్‌గా ఉండి హీరో అయ్యి 150 సినిమాలు (హీరోగా) చేసిన ఘనత మోహన్‌బాబుది. ఎంత గొప్ప నటుడో అంత ఖలేజా, దమ్ము ఉన్న మనిషి. 14వేల మంది విద్యార్థులున్న కాలేజీ పెట్టి 4వేల మందికి ఉచితంగా విద్య అందిస్తున్నారు. అటువంటి మోహన్‌బాబుని 'విశ్వ నట సార్వభౌమ' అవార్డుతో సత్కరించుకోవడం సంతోషం'' అన్నారు. అవార్డు గ్రహీత మోహన్‌బాబు మాట్లాడుతూ– ''మంచి వ్యక్తి అయిన విద్యాసాగర్ రావు నా ఆత్మీయులు కావడం సంతోషం. ఓరుగల్లు అంటే వరంగల్.. పౌరుషాల గడ్డ. ఆ ప్రాంతం గురించి నాకు పెద్దగా తెలియదు కానీ. కులమతాలకు అతీతంగా తెలుగు వారంతా కలిసి మెలసి ఉండాలని పోరాడిన వీర వనిత రుద్రమదేవి గురించి తెలుసు. డబ్బున్న వాళ్లు ఎందరో ఉంటారు. అందరికీ ఇటువంటి కార్యక్రమాలు చేయాలనే ఆలోచన రాదు. పూర్వం రాజులు చేసేవారు. ఇప్పుడు సుబ్బరామిరెడ్డిగారు చేస్తున్నారు. ఎన్నో కష్ట నష్టాలు ఎదుర్కొని నేనీ స్థాయికి వచ్చా. భక్తవత్సలం నాయుడు అయిన నన్ను మా గురువు దాసరిగారు మోహన్‌బాబుగా మార్చారు. 1982లో శ్రీ లక్ష్మీ ప్రసన్న పిక్చర్స్‌ని స్థాపించి అన్నగారు ఎన్టీఆర్‌తో కొబ్బరికాయ కొట్టించాను. 1992లో నా ఆస్తులు తాకట్టు పెట్టి 'మేజర్ చంద్రకాంత్' సినిమా తీస్తే అది సిల్వర్ జూబ్లీ హిట్ అయింది. మళ్లీ అన్నగారిని ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోబెట్టా. ఆ మహానుభావుడు నన్ను రాజ్యసభకు పంపారు. అందరికీ కోపం ఉంటుంది. కానీ, నాకు ఎక్కువ ఉంటుంది. 'తన కోపమే తన శత్రువు' అన్నట్టు నా కోపం నాకు నష్టాన్ని కలిగించిందే తప్ప ఎవరికీ నష్టం కలిగించలేదు'' అన్నారు. హీరో బాలకృష్ణ మాట్లాడుతూ– ''ఇప్పటికీ లలిత కళలు బతికి ఉన్నాయంటే సుబ్బరామిరెడ్డిగారిలాంటి వారివల్లే. 'కాకతీయ కళా పరిషత్' స్థాపించిన తొలిసారి మోహన్‌బాబుగారిని సత్కరించుకోవడం మా చలనచిత్ర రంగాన్ని సన్మానించడంగా నేను భావిస్తున్నా'' అన్నారు. హాస్య నటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ– ''ఏ నుంచి జెడ్ వరకూ మోహన్‌బాబు గారికి అభిమానులే'' అన్నారు. ఈ సందర్భంగా దివంగత నటులు టీఎల్ కాంతారావు కుటుంబానికి సుబ్బరామిరెడ్డి రూ.5 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. పలువురు కళాకారులను ఈ వేదికపై సత్కరించారు. దర్శకులు కె.రాఘవేంద్రరావు, కోదండరామిరెడ్డి, బి.గోపాల్, హీరోలు మంచు విష్ణు, మనోజ్, నటులు అలీ, సంగీత దర్శకుడు కోటి, నటీమణులు జయప్రద, జయసుధ, మంచు లక్ష్మి, హీరోయిన్లు శ్రియ, ప్రగ్యా జైస్వాల్, ఎంపీ జితేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు కిషన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకరరావు, డీకే అరుణ, ఎమ్మెల్సీ షబ్బీర్ హుస్సేన్‌తో పాటు డి.శ్రీనివాస్, దానం నాగేందర్, గీతారెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి వంటి రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.

ఆ వార్తల్లో నిజం లేదు



● తమన్నా

...అంటున్నారు మిల్కీ బ్యూటీ తమన్నా. ఇంతకీ ఆ వార్త ఏంటనేగా మీ డౌట్. బాలీవుడ్ నటి కంగనా రనౌత్ నటించిన 'క్వీన్' హిందీ సినిమాను తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రీమేక్ చేస్తోన్న విషయం తెలిసిందే. తెలుగులోనూ 'క్వీన్' పేరుతో వస్తోన్న ఈ చిత్రంలో తమన్నా టైటిల్ రోల్ చేస్తుండగా నీలకంఠ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఆ మధ్య మొదలైంది. ఇంతవరకూ బాగానే ఉన్నా.. 'క్వీన్' చిత్రీకరణలో నీలకంఠకూ, తమన్నాకు మధ్య మనస్పర్థలు వచ్చాయనీ, దాంతో నీలకంఠ ఆ సినిమా నుంచి తప్పుకున్నారనే వార్తలు ఫిల్మ్‌నగర్‌లో హల్‌చల్ చేయడంతో పాటు సోషల్ మీడియాలోనూ వైరల్‌గా మారాయి. ఈ వార్తలు అటూ ఇటూ తిరిగి తెలుగు క్వీన్ చెవిన పడ్డట్టున్నాయి. అందుకే కాబోలు తాజాగా తమన్నా ఈ విషయంపై క్లారిటీ ఇచ్చారు. ''నీలకంఠ సార్ అంటే నాకు చాలా గౌరవం. నేను ఆయనతో గొడవ పడ్డానని వస్తున్న వార్తల్లో నిజం లేదు. మా మధ్య ఎటువంటి మనస్పర్థలు లేవు. సినిమా నిర్మాణం విషయంలో నాకు, నా టీమ్‌కి కానీ ఎటువంటి అధికారం లేదు. పూర్తి అధికారం నిర్మాత మను కుమారన్‌దే. నాలుగు భాషల్లో ఏక కాలంలో రానున్న 'క్వీన్' మా అందరికీ ఓ డ్రీమ్ ప్రాజెక్ట్ లాంటిది. అందుకోసం యూనిట్ అంతా కష్టపడి పనిచేస్తోంది'' అని సెలవిచ్చారు తమన్నా. అయితే.. ప్రస్తుతం 'క్వీన్' షూటింగ్ జరుగుతోందా? ఆగిపోయిందా? అనే క్లారిటీ ఇవ్వలేదు మిల్కీ బ్యూటీ.



● గుడికెళ్లిన నయనతార

అతని కోసం గుడికి..

నయనతార ఈ మధ్య ఓ గుడికి వెళ్లారు. ఎందుకు వెళ్లారంటే 'తానా సేంద కూట్టమ్' హిట్టవ్వాలని. తెలుగులో 'గ్యాంగ్' పేరుతో రిలీజైంది. సూర్య హీరోగా విఘ్నేష్ శివన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కీర్తి సురేష్ కథానాయికగా నటించారు. మరి.. నయనతార ఎందుకు గుడికి వెళ్లారూ అంటే... విఘ్నేష్ శివన్ కోసమని చెన్నై టాక్. ఈ ఇద్దరూ లవ్‌లో ఉన్నారనే వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఆ సంగతలా ఉంచితే 'తానా సేంద...' సూపర్ హిట్. అంటే.. చిత్రబృందం కష్టానికి నయనతార పూజలు తోడయ్యాయా!

ఆ రోజు వచ్చింది

"ఆకతాయి' సినిమాలో కాలేజ్ కుర్రాడిలా నటించాను. 'ఇగో'లో బాధ్యతలను నిర్లక్ష్యం చేసి లైఫ్‌ను ఎంజాయ్ చేసే గోపీ పాత్రలో నటించాను. ఎమోషన్స్‌తో రూపొందిన మా చిత్రం ప్రేక్షకులను మెప్పిస్తుందన్న నమ్మకం ఉంది" అన్నారు ఆశిష్ రాజ్. ఆర్వీ సుబ్రహ్మణ్యం దర్శకత్వంలో ఆయన హీరోగా విజయ్ కరణ్, కౌషల్ కరణ్, అనిల్ కరణ్ నిర్మించిన చిత్రం 'ఇగో'. సిమ్రాన్ కథానాయికగా నటించిన ఈ సినిమా రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో ఆశిష్ రాజ్ చెప్పిన విశేషాలు.



● సుబ్రహ్మణ్యం

ఆశిష్ నా బర్త్‌డే గిఫ్ట్!

'ఇగో' చిత్రదర్శకుడు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ – "మా హీరోనే నా పుట్టిన రోజు కానుక. ఆశిష్ రాజ్ సూపర్‌గా నటించాడు. హీరోయిన్ సిమ్రాన్ బాగా నటించింది. మా సినిమాలో నటించిన సీనియర్ యాక్టర్స్ అందరూ ఎంతగానో హెల్ప్ చేశారు. వారిని మర్చిపోలేను. కథ విషయానికొస్తే.. పల్లెటూరి నుంచి పట్నానికి వచ్చే ప్రేమకథ ఇది. ఆ తర్వాత ఏం జరిగిందనేది స్క్రీన్‌పై చూస్తేనే బాగుంటుంది. స్క్రీన్‌ప్లే ఆసక్తికరంగా సాగుతుంది. ముఖ్యంగా సెకండాఫ్‌లో ప్రేక్షకులు థ్రిల్ అవుతారు" అన్నారు.

■ ఇగో ఫీలయ్యే ఇద్దరు (గోపీ, ఇందు) వ్యక్తుల మధ్య ఎమోషన్స్‌తో సాగే లవ్‌స్టోరీ ఇది. సినిమాలో విలేజ్, సిటీ కల్చర్ మిక్స్ ఉంటుంది. నటుడిగా నాకు మంచి గుర్తింపు తీసుకొస్తుందన్న నమ్మకం ఉంది. అమలాపురం యాసలో నేను చెప్పే డైలాగ్స్ బాగుంటాయి. ఖైరాదత్ చేసిన స్పెషల్ సాంగ్ సూపర్‌గా ఉంటుంది. దర్శకుడు సుబ్రహ్మణ్యం చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. సాయి కార్తీక్ సంగీతం స్పెషల్ ఎట్రాక్షన్. యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకుంటుంది. ■ చిన్నతనం నుంచే యాక్టింగ్ అంటే ఇంట్రెస్ట్. చదువు పూర్తైన తర్వాత మా నాన్నగారు ప్రోత్సహించారు. బ్యాక్‌గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీలో రాణించడం కష్టమే. కానీ నాకు దేవుడి అండ తోడుగా ఉంటుందనుకుంటున్నాను. మహేశ్‌బాబుతో ఓ యాడ్ ఫిల్మ్ చేస్తున్నప్పుడు దేవుడా.. నా కంటూ ఓ రోజు రావాలని మనసులో అనుకున్నాను. అదే నిజమైంది. నెక్స్ట్ సినిమా గురించి ఇంకా ఏమి అనుకోలేదు.



● ఆశిష్ రాజ్


ఆడపిల్లకి ఎన్నో కష్టాలు.
కన్నతల్లికి ఎన్నో శోకాలు.
బంగారుతల్లికి ఎన్నో వ్యథలు.
ఇది చాలక ఎన్ని శారీరక బాధలో!
అన్ని బాధల్లో ఎన్ని వివక్షలో!
ఇవి తెలుసుకుంటే చెల్లి జాగ్రత్త పడుతుందని..
గుండెకోతను తప్పించుకుంటుందని..
ఈ వివరాలను అందిస్తున్నాం.
మహిళలలో గుండెవ్యాధులు...
వాటికి కారణాలూ...
తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తే..
ఆమె తన వ్యథలను జయిస్తుందని..
శారీరక బాధలను ఎదుర్కొంటుందని
మా నమ్మకం... మా విశ్వాసం.

చెల్లి గుండెలో ఎన్ని వ్యథలో...



గుండెపోటు విషయంలో పురుషులకూ, మహిళలకు తేడా ఉందంటే మీరు నమ్ముతారా? మహిళల్లో స్రవించే ఈస్ట్రోజెన్ హార్మోన్ వల్ల రుతుక్రమం కొనసాగినంతకాలం మహిళలకు ఒక సహజ రక్షణ ఉంటుంది. కానీ ఒకవేళ చికిత్స విషయానికి వస్తే... సామాజికంగా మహిళలకు అందాల్సిన చికిత్స విషయంలో మాత్రం వివక్ష కొనసాగుతోంది. ఇదేదో వివక్ష ఎక్కువగా ఉండే మనలాంటి సంప్రదాయ దేశాల్లో మాత్రమే కాదు... బాగా అభివృద్ధి చెందాయని చెప్పకునే యూరోపియన్ దేశాల్లోనూ ఇదే తేడా కొనసాగుతోంది. స్వీడన్, ఇంగ్లాండ్‌లో జరిగిన అధ్యయనాలు ఇదే విషయాన్ని తెలియజేస్తున్నాయి. అధ్యయనం కొనసాగిన ఆ దేశాల్లోనూ, ఇక మనదేశంలోని మహిళా రోగుల స్థితిగతులను తెలుసుకోవడం కోసమే ఈ కథనం. పనిలో పనిగా కొన్ని నివారణ చర్యలూ, మరికొన్ని జాగ్రత్తలు కూడా.

గుండెపోటు చికిత్సలో విదేశాల్లోనూ మహిళల పట్ల వివక్ష...



గుండెపోటు వచ్చినప్పుడు పురుషులకు ఇచ్చే చికిత్సే మహిళలకు అందడం లేదన్న ఆందోళనకరమైన విషయం ఈమధ్యే వెల్లడయ్యింది. ఒక స్వీడిష్ అధ్యయనంలో ఈ అంశం తేటతెల్లమైంది. దాదాపు పదేళ్ల వ్యవధిలో స్వీడన్‌లోని 1,80,368 మంది గుండెపోటుకు గురైన రోగులపై నిర్వహించిన ఒక అధ్యయనం తెలిపిన విషయాలు సంచలనంగా మారాయి.

మొదటిసారి హార్ట్ ఎటాక్ వచ్చి కోలుకున్న తర్వాత, మళ్లీ అదే రెండోసారి వచ్చినప్పుడు మృతిచెందే మహిళల సంఖ్య... పురుషులతో పోల్చి చూస్తే దాదాపు రెండు రెట్లు ఎక్కువని ఆ అధ్యయనంలో వెల్లడయ్యింది.

ఈ విషయమై బ్రిటిష్ హార్ట్ ఫౌండేషన్ వ్యాఖ్యానిస్తూ... 'నిజానికి సామాజికంగా చూస్తే గుండెజబ్బులు అనగానే అదేదో పురుషులకే వచ్చేవనే అభిప్రాయం ఉంది. కానీ మహిళల్లో కనిపించే రొమ్ము క్యాన్సర్‌తో పోలిస్తే గుండెపోటుతో మృతిచెందే మహిళలే ఎక్కువ'' అంటూ తన ఆందోళనను వ్యక్తం చేసింది బ్రిటిష్ హార్ట్ ఫౌండేషన్. పరిశోధకులు ఈ అధ్యయనాలకు అవసరమైన సమాచారం (డేటా)ను 'యూనివర్సిటీ ఆఫ్ లీడ్స్'తో పాటు 'ద కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్'కు చెందిన ఆన్‌లైన్ కార్డియాక్ రిజిస్ట్రీ నుంచి స్వీకరించారు.

ఆ డేటా ఆధారంగా నిర్వహించిన అధ్యయనం వెల్లడించిన సత్యాలు చాలా దిగ్భ్రాంతిని కలిగించేలా ఉన్నాయి. గుండెపోటుకు గురైన పురుషులకు ఎలాంటి చికిత్స దొరుకుతుందో... చాలా మంది మహిళలకు అదే చికిత్స లభ్యం కావడం లేదు.

ఇదే అధ్యయనంలో కో-ఆథర్‌గా వ్యవహరించిన యూనివర్సిటీ ఆఫ్ లీడ్స్‌కు చెందిన ప్రొఫెసర్ క్రిస్‌గేల్ ఇందుకు కారణాలు చెబుతున్నారు. ఆయన చెబుతున్న అంశాలివి... ''బయటనుంచి చూస్తే సాధారణ ప్రజానీకంతో పాటు ఆరోగ్యరంగంలో సేవలందిస్తున్న చాలామంది ప్రొఫెషనల్స్‌లో చాలామంది... గుండెపోటు వచ్చిన రోగులందరినీ ఒకేలా పరిగణిస్తారు. గుండెపోటు వచ్చిన వ్యక్తి అనగానే మధ్యవయస్కుడైన ఒక పురుషుడు స్థూలకాయాన్ని కలిగి ఉండి, డయాబెటిస్‌తో బాధపడుతుంటాడనీ, అతడికి పొగతాగే అలవాటుంటుందని అనుకుంటారు. అయితే ప్రతి ఒక్కరి ఆరోగ్య చరిత్రా అలాగే ఉండలనేమీ లేదు. జనాభాపరంగా చూస్తే గుండెపోటు విస్తృతి మరింత ఎక్కువగా ఉంటుంది. మరీ ముఖ్యంగా మహిళల్లో అది మరింత ఎక్కువ'' అని ప్రొఫెసర్ క్రిస్‌గేల్ పేర్కొన్నారు.

జెండర్ పరమైన తేడా ఎందుకంటే...

గుండెపోటు వచ్చిన వారికి అందించే చికిత్సలో భాగంగా చేసే బైపాస్ సర్జరీ లేదా స్టెంట్స్ అమర్చడం వంటి వైద్యసేవలు పురుషులతో పోలిస్తే మహిళలకు 34 శాతం తక్కువగా లభిస్తున్నాయి. అంతేకాదు... పురుషులకు ప్రిస్క్రయిబ్ చేసే స్టాటిన్స్ (మొదటిసారి గుండెపోటు వచ్చినప్పుడు రెండోసారి మళ్లీ రాకుండా నివారించేందుకు గుండెకు రక్తాన్ని అందించే రక్తనాళాల్లోని పూడికను తొలగించే మందులు) కూడా మహిళలకు 24 శాతం తక్కువగా రాస్తున్నారు.

గుండెపోటుకు చికిత్స అందించే మూడు ముఖ్యమైన చికిత్సలూ స్త్రీ, పురుషులకు సమానంగా అందించాలంటూ మార్గదర్శకాలు ఉన్నప్పటికీ మహిళలకు అవి అందకపోవడమే జరుగుతోంది. ఒకవేళ మహిళలకు కూడా పురుషులకు ఇచ్చే చికిత్సే దొరికితే గుండెపోటుతో మృతిచెందే స్త్రీ, పురుషుల సంఖ్యలో ఇప్పుడు గణనీయంగా ఉన్న తేడా చాలావరకు తగ్గుతుందని ఈ అధ్యయనవేత్తలు పేర్కొంటున్నారు.

మరికొన్ని అంశాలు...

ఈ అధ్యయనంలో భాగంగా చూసినప్పుడు ఏడాదిలో ఇంగ్లాండ్‌లో దాదాపుగా 1,24,000 మంది పురుషులు గుండెపోటుతో హాస్పిటల్‌లో చేరితే... మహిళల్లో ఆ సంఖ్య దాదాపు 70,000 గా ఉంది. ఈ గణాంకాలను మరీ నిశితంగా పరిశీలించినప్పుడు తెలిసిన సత్యం మరింత విభ్రాంతికి గురిచేసింది. ప్రొఫెసర్ గేల్ చెబుతున్న వివరాల ప్రకారం ''గుండెపోటుతో హాస్పిటల్‌లో చేరే దాదాపు 50 శాతం మహిళలకు పురుషుల్లాంటి వ్యాధినిర్ధారణ పరీక్షలు జరగడం లేదు లేదా వారి విషయంలో తప్పుడు నిర్ధారణ (మిస్ డయాగ్నోజ్) జరుగుతోంది. ఇక అది వారికి అందించే మొత్తం చికిత్సను తప్పుదారి పట్టిస్తోంది. అంటే మొదట మనమో అంశాన్ని మిస్ చేశామంటే... అది ఆ మొత్తం చికిత్స ప్రక్రియను ప్రభావితం చేస్తోంది. ఫలితంగా మహిళల్లో మృతుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంటోంది'' అని ఆయన వివరించారు.

అంతేకాదు... ఈ అధ్యయనంలో లభ్యమైన విషయాల్లో మరింత ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే... కేవలం ఒక్క గుండెపోటు మాత్రమే కాదు... డయాబెటిస్, హైబీపీ లాంటి ఇతర రుగ్మతల విషయంలోనూ మహిళలే ఎక్కువగా వాటి బారిన పడుతున్నారు.

ఇక బ్రిటిష్ హార్ట్ ఫౌండేషన్‌కు చెందిన ప్రొఫెసర్ జెరెమీ పియర్‌సన్ మాట్లాడుతూ "ఈ అధ్యయన ఫలితాలు చాలా తీవ్రంగా ఉన్నాయి. మనం వెంటనే ఆయా అంశాలపై దృష్టిసారించాలని చెబుతున్నాయి. మనం అత్యవసరంగా ఈ అంశంపై దృష్టిసారించి, అందరిలోనూ అవగాహన పెంపొందేలా పూనుకోవాలంటూ సూచిస్తున్నాయి. కేవలం ఒక చిన్న జాగ్రత్త అంటే... పురుషులకు అందించే చికిత్సే మహిళలకూ అందించడం అన్న చర్య ద్వారా పరిస్థితులను తేలిగ్గానే మార్చేందుకు అవకాశం ఉంది. అప్పుడు తమ ప్రియమైన వారిని కోల్పోయే పరిస్థితి రాకుండా చేసి, మనమెన్నో కుటుంబాలను ఆదుకోవచ్చు" అంటున్నారు జెరెమీ.

భారతదేశంలో ఇలా...

గుండెజబ్బు విషయంలో స్త్రీ, పురుషుల మధ్య తేడాలు... అవి ఎందుకు?

భారతీయ స్త్రీ, పురుషుల్లో గుండెజబ్బుల విషయంలో కనిపించే తేడాలేమిటి? అవి ఎందుకు అనే అంశాన్ని పరిశీలిద్దాం.

మహిళల్లో గుండెజబ్బుల అంశానికి వస్తే కనిపించే వ్యత్యాసాలు, అసమానతలకు కారణాలను ఐదు అంశాల్లో వివరించవచ్చు...

అవి ...

మొదటిగా స్త్రీల విషయంలో మెనోపాజ్ వరకు ఈస్ట్రోజెన్ వల్ల గుండె జబ్బుల నుంచి కొంత రక్షణ ఉంటుంది. అందుకనే మగవాళ్లలో సుమారు యాభైయ్ యేళ్లలో ఎక్కువ అయ్యే గుండె జబ్బు ఆడవాళ్లలో అరవయ్ యేళ్లకు ఎక్కువవుతుంది. ఒక వయసు వరకూ మహిళల్లో గుండెజబ్బుల నుంచి స్వాభావిక రక్షణ లభిస్తుంది. దీనికి కారణం ప్రతి నెలా రుతుక్రమం సమయంలో విడుదల అయ్యే ఈస్ట్రోజెన్ హార్మోన్. దీని వల్ల మహిళల గుండెకూ, రక్తనాళాలకూ రక్షణ ఉంటుంది. కాబట్టి రుతుక్రమం ఆగిన వారితో పోలిస్తే... రుతుక్రమం అయ్యే మహిళలకు (మెనోపాజ్ దశకు చేరని వారిలో) గుండెజబ్బులు వచ్చే అవకాశాలు వచ్చే అవకాశాలు తక్కువ. కానీ డయాబెటిస్ వచ్చినా లేదా పొగతాగే అలవాటు ఉన్నా మహిళలకు లభించే ఈ సహజ రక్షణ తొలగిపోతుంది. యాభై ఏళ్లలోపు వయసువారిలో మహిళలో పోలిస్తే పురుషుల్లో గుండెజబ్బులు వచ్చే అవకాశాలు ఎక్కువ. కానీ యాభై-అరవైలలో ఈ అవకాశాలు ఇద్దరిలోనూ సమానం. అయితే అరవై ఏళ్లు దాటాక గుండెజబ్బులు మహిళల్లోనే ఎక్కువ. ఒకవేళ గర్భాశయాన్ని, అండాశయాన్ని తొలగిస్తే... వీళ్లకు గుండెజబ్బులు వచ్చే అవకాశాలు మరింత ఎక్కువ. అందుకే మరింత జాగ్రత్తగా ఉండాలి.



రెండవది, గుండెకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాలు కూడా పురుషులతో పోలిస్తే... మహిళలలో అవి పది శాతం సన్నగా ఉంటాయి. ఈ అంశం కూడా రక్తనాళాల్లో పూడిక త్వరగా చేరేందుకు దోహదపడుతుంది.

మూడవది, గుండె జబ్బు వచ్చినపుడు లక్షణాల బట్టి వైద్యులు తర్వాతి పరీక్షలూ, చికిత్సా చేబడుతారు. ఈ లక్షణాలు మహిళలలో విభిన్నంగా ఉండడమే కాకుండా, అందరు మహిళలలో ఒకే రకంగా ఉండవు. అందువలన మహిళలలో గుండె జబ్బు కనుక్కోవడం ఆలస్యం అవుతుంది.

నాలుగవది, వైద్యులు కూడా స్త్రీల చికిత్స విషయంలో కొంచెం వెనకడుగు వేస్తున్నారు.

ఐదవది, స్త్రీలలో చికిత్సకు సంబంధించిన కాంప్లికేషన్స్ అధికంగా ఉంటాయి.

చివరిగా, పితృస్వామ్య సమాజంలో మహిళల యొక్క గుండె జబ్బులపై పెట్టే ఖర్చు మగవారి జబ్బుకి పెట్టే ఖర్చు కన్నా తక్కువగా ఉండటం ఒక సమస్య. దీనిని సమస్య అనడం కంటే సామాజిక వివక్ష అనడమే కరెక్ట్.

స్త్రీ, పురుషుల మధ్య గుండె పోటు చికిత్సలో విభేదాలు భారతదేశంలో కూడా ప్రస్ఫుటంగా తెలుస్తున్నాయి. ఉత్తర, దక్షిణ భారతదేశంలో చేసిన అనేక పరిశోధనల బట్టి ఈ విషయం తేట తెల్లమవుతుంది.

డీమాట్ రెజిస్ట్రీ...: డీమాట్ రెజిస్ట్రీ అనే పరిశోధనలో, ప్రఖ్యాత గుండె నిపుణులు శ్రీనాథ రెడ్డి తదితరులు ఈ విషయాన్ని విపులీకరించడానికి ప్రయత్నించారు. ఆస్పత్రి నుంచి డిస్చార్జ్ చేసే సమయంలో పురుషులకన్నా స్త్రీలలో మందుల ప్రిస్క్రిప్షన్ అసంపూర్తిగా ఉందని ఈ పరిశోధనలో తేలింది. అసలు పురుషులలో కూడా పాశ్చాత్య దేశలతో పొలిస్తే మందుల మోతాదు కరెక్ట్ గా లేదని అదే పరిశోధనలో బయటపడటం మరొక సంగతి.

దక్షిణ భారత దేశంలోనూ ఈ లింగ భేదాలు ఖచ్చితంగా కనిపించాయి. అయితే కేరళలో మాత్రం ఈ వివక్ష కొంచెం తక్కువగా ఉందని అక్కడి పరిశోధకులు అభిప్రాయ పడ్డారు.



డాక్టర్ ఎం.ఎస్.ఎస్. ముఖర్జీ,
సీనియర్ కార్డియాలజిస్ట్, మాక్స్‌క్యూర్ హాస్పిటల్స్ మాదాపూర్, హైదరాబాద్

మహిళల్లో గుండెపోటు లక్షణాలు

గుండెజబ్బుల విషయంలో అందరికీ తెలిసిన లక్షణం ఛాతీలో నొప్పి మాత్రమే. గుండెపోటు వచ్చినప్పుడు గుండెపై ఒత్తినట్లుగా విపరీతమైన నొప్పి వచ్చి అది మెడ లేదా భుజం లేదా మెడవైపునకు పాకుతున్నట్లుగా వెళ్తుంది. చెమటలూ పడతాయి. ఊపిరితీసుకోవడమూ కష్టమవుతుంది. ఈ లక్షణాలన్నీ పురుషుల్లో చాలా సాధారణం. మహిళల్లోనూ ఇవే లక్షణాలు కనిపిస్తాయి. అయితే 50 శాతం మంది మహిళల్లో మాత్రం ఇవి పురుషులతో పోలిస్తే కాస్త వేరుగా ఉండే అవకాశం కూడా ఉంది. అంటే... బాగా అలసటగా/నీరసంగా ఉన్నట్లుగా ఉండటం (ఫెటీగ్), ఊపిరి ఆడకపోవడం, తిన్న ఆహారం జీర్ణం కానట్లుగా ఉండటం, పొట్ట పైభాగంలో ఇబ్బంది, దవడలో నొప్పి, గొంతులో నొప్పి, భుజంలో నొప్పి వంటి సాధారణ లక్షణాలకు భిన్నమైనవి కనిపించవచ్చు.

మహిళల్లో గుండెజబ్బులకు రిస్క్ ఫ్యాక్టర్స్

మహిళలో గుండెజబ్బులు క్రమేణా అభివృద్ధి చెందుతూ ఉండటానికి కొన్ని అంశాలు దోహదపడుతుంటాయి. ఆ అంశాలనే రిస్క్‌ఫ్యాక్టర్స్‌గా చెప్పవచ్చు. అవి...

● వయసు ● కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా గుండెజబ్బులున్న చరిత్ర (ఫ్యామిలీ హిస్టరీ) ● రక్తపోటు ● మధుమేహం ● రక్తంలో కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉండటం ● పొగతాగే అలవాటు ● స్థూలకాయం ● శారీరక శ్రమ/వ్యాయామం అంతగా లేకపోవడం ● ఒత్తిడి.

ఇక కొలెస్ట్రాల్ విషయానికి వస్తే రుతుక్రమం ఆగిన తర్వాత రక్తంలో చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్ వంటి కొవ్వు పదార్థాల పెరుగుదల, మంచి కొలెస్ట్రాల్ పాళ్లు తగ్గడం వంటి అంశాలు కూడా గుండెజబ్బుల రిస్క్‌ను మరింత పెంచుతాయి. మహిళల్లో రుతుక్రమం ఆగాక రక్తపోటు పెరగడానికి అవకాశాలు ఎక్కువ. అది గుండెజబ్బులకు దారితీయవచ్చు. అందుకే రుతుక్రమం ఆగిన మహిళలు తరచూ గుండెజబ్బుల విషయంలో పరీక్షలు చేయించుకుంటూ జాగ్రత్త పడాలి.

హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీతో సహజ రక్షణ కరవే...

కొందరు మహిళల్లో రుతుక్రమం ఆగాక కనిపించే లక్షణాలను తగ్గించడానికి బయట నుంచి ఈస్ట్రోజెన్ హార్మోన్లు ఇస్తుంటారు. దీన్నే హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీగా పేర్కొంటారు. అయితే ఇలా బయటి నుంచి ఇచ్చే ఈస్ట్రోజెన్ వల్ల సహజంగానే మహిళల దేహంలో ఉత్పత్తి కావడం వల్ల అంతకుముందు దొరికే సహజ రక్షణ దొరకకపోవడం ఒక విశేషం.

నివారణ: ● మహిళలు వ్యాయామం చేయడం మనదేశంలో చాలా చాలా తక్కువ. రోజూ కనీసం 30 నిమిషాల చొప్పున వారంలో కనీసం 5 రోజుల పాటు నడక, మెల్లగా జాగింగ్ చేయడం వంటి వ్యాయామాలు మహిళల గుండెజబ్బులను సహజంగానే నిరోధిస్తాయి ● ఆహారంలో ఉప్పు తగ్గించడం, ఆకుకూరలు, తాజా పండ్లు ఎక్కువగా తీసుకోవడం, నూనె పదార్థాలను పరిమితంగా తీసుకోవడం వల్ల గుండెజబ్బులను నివారించవచ్చు. ● రక్తపోటు, డయాబెటిస్ కొలెస్ట్రాల్ పాళ్లు పెరగడం వంటివి ఉంటే తగిన చికిత్స తీసుకోవాలి.



డాక్టర్ శ్రీదేవి, సీనియర్ కార్డియాలజిస్ట్, కేర్ హాస్పిటల్స్, బంజారాహిల్స్, హైదరాబాద్

జాగ్రత్తలు : ● మహిళల్లో రుతుక్రమం ఆగాక లక్షణాలు కనిపించకపోయినా వైద్య పరీక్షలు చేయించుకుంటే ఒకవేళ గుండెజబ్బు లక్షణాలను పసిగడితే గుండెపోటును నివారించే అవకాశముంది ● రిస్క్ ఫ్యాక్టర్లలో నివారించగలిగే అవకాశం ఉన్నవి అంటే... కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవడం, రక్తపోటు, మధుమేహాన్ని నియంత్రించుకోవడం వంటి జాగ్రత్తలతో గుండెపోటును నివారించవచ్చు. ప్రతి మూడు నెలలకొకసారి డాక్టర్‌ను సంప్రదించడం మంచిది.

ఫ్యామిలీ డాక్టర్

ఫైబ్రాయిడ్స్ సమస్య తగ్గేదెలా?

నా వయసు 42 ఏళ్లు. కొంతకాలంగా ఫైబ్రాయిడ్స్ సమస్యతో బాధపడుతున్నాను. డాక్టర్‌ను సంప్రదిస్తే శస్త్రచికిత్సతో వాటిని తొలగించాలని, అయితే భవిష్యత్తులో మళ్లీ రావచ్చని అంటున్నారు. దాంతో ఆందోళనగా ఉంది. మాటిమాటికీ తిరగబెట్టకుండా హోమియో చికిత్సతో ఈ సమస్య పూర్తిగా తగ్గుతుందా?

– మాధవి, చిత్తూరు

గర్భాశయంలో ఏర్పడే కణుతులను యుటెరైన్ ఫైబ్రాయిడ్స్ అంటారు. వీటి బారిన పడిన కొంతమంది స్త్రీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటారు. ఇవి గర్భాశయంలో ఒకటిగా లేదా చిన్న చిన్న నీటితిత్తులుగా కొన్ని సెంటీమీటర్ల వరకు పెరిగే అవకాశం ఉంటుంది. వీటి ఎదుగుదల కొందరిలో వేగంగానూ, మరికొందరిలో నిదానంగా ఉంటుంది. ఇంకొందరిలో నిదానంగా, నిలకడగా, స్వల్ప పరిమాణంలో ఉంటూ ఎలాంటి లక్షణాలనూ కనబరచకపోవచ్చు.

కారణాలు : ఫైబ్రాయిడ్స్ ఏ కారణం చేత ఏర్పడతాయనే విషయం పట్ల ఇంతవరకు స్పష్టత లేదు. కానీ కొన్ని హార్మోన్లు... ముఖ్యంగా ఈస్ట్రోజెన్, ప్రోజెస్టెరాన్ హార్మోన్ల ప్రభావం వల్ల ఫైబ్రాయిడ్స్ ఏర్పడే అవకాశం ఎక్కువ. రుతుచక్ర సమయంలో, గర్భధారణ సమయంలో ఇవి ఎక్కువగా ఏర్పడతాయి. నెలసరి ఆగిపోయిన స్త్రీలలో ఈ హార్మోన్ల ఉత్పాదన చాలావరకు తగ్గడంతో పాటు ఫైబ్రాయిడ్స్ ఏర్పడే అవకాశం తక్కువగా ఉంటుంది. స్థూలకాయం, వంశపారంపర్యత వంటి అంశాల వల్ల కూడా గర్భాశయ కణుతులు ఏర్పడతాయి.

లక్షణాలు : గర్భాశయ కణుతులు ఏర్పడ్డ ప్రదేశం, పరిణామం, సంఖ్యను బట్టి అవి ఏర్పడతాయి. అధిక రుతుస్రావం, రెండు రుతుచక్రాల మధ్య వ్యవధి ఎక్కువ రోజులు కొనసా గడం, పొత్తికడుపులో నొప్పి, నడుము నొప్పి, ఫైబ్రాయిడ్స్ వల్ల మూత్రాశయంపై ఒత్తిడి పడినట్లే తరచూ మూత్రానికి వెళ్లాలని అనిపిస్తూ ఉండటం, పేగులపై ఒత్తిడి పడితే మలబద్ధకం, కడుపుబ్బరం వంటి లక్షణాలను గమనించవచ్చు.

చికిత్స: జెనెటిక్ కన్‌స్టిట్యూషన్ పద్ధతి ద్వారా హోమియో విధానంలో యుటెరైన్ ఫైబ్రాయిడ్స్ సమస్యను సంపూర్ణంగా నయం చేయవచ్చు. ఈ చికిత్స ద్వారా గర్భాశయపు కణుతులను పూర్తిగా తొలగించడమే గాకుండా, శరీరంలోని హార్మోన్లను అసమతౌల్యతను సరిచేయడం వల్ల సమస్యను తేలిగ్గా పరిష్కరించవచ్చు. మీరు ఆందోళన పడాల్సిన అవసరం లేదు.



డాక్టర్ శ్రీకాంత్ మోర్లావర్
సీఎండీ, హోమియోకేర్ ఇంటర్నేషనల్, హైదరాబాద్

బాబు సమస్య ఏడీహెచ్‌డీ కావచ్చు!

మా బాబు వయసు ఎనిమిదేళ్లు. ఒక చోట కుదురుగా ఉండడు. ఏకాగ్రత తక్కువ. దాదాపు ప్రతిరోజూ స్కూల్ నుంచి ఎవరో ఒక టీచర్ మావాడి ప్రవర్తన గురించి కంప్లయింట్ చేస్తుంటారు. మా వాడి ప్రవర్తనకు కారణం ఏమిటి? హోమియోలో వాడి సమస్యకు ఏదైనా చికిత్స ఉందా?

– పి.ఎస్.మూర్తి, కొత్తగూడెం

మీరు చెప్పిన లక్షణాలను బట్టి మీ బాబుకు అటెన్షన్ డెఫిసిట్ హైపర్‌యాక్టివ్ డిజార్డర్ (ఏడీహెచ్‌డీ) అనే సమస్య ఉందని అనిపిస్తోంది. ఈ సమస్య ఉన్న పిల్లలకు సాధారణంగా ఏమీ గుర్తుండదు. ప్రపంచవ్యాప్తంగా 5 శాతం మంది పిల్లలు ఈ సమస్యతో బారిన పడుతుంటారు. కొంతమంది పిల్లల్లో వారు పెరుగుతున్న కొద్దీ సమస్య తగ్గుతుంది. ఏడీహెచ్‌డీ అనేది సాధారణంగా ఆరు నుంచి పన్నెండు సంవత్సరాల పిల్లల్లో వస్తుంది. ఏడీహెచ్‌డీతో బాధపడే పిల్లలు సాధారణ పిల్లల్లా ఉండరు.

సమస్యకు కారణాలు : ● జన్యుపరమైన కారణాలు ● తల్లిదండ్రులు ఎవరిలో ఒకరికి ఈ సమస్య ఉండటం ● తక్కువ బరువుతో ఉండే పిల్లల్లోనూ, సరైన ఆహారం తీసుకోకపోవడం వల్ల సమస్య రావచ్చు.

లక్షణాలు : ● మతిమరపు, తలనొప్పి ● ఆందోళన, వికారం, నిద్రలేమి, చిరాకు. ● మానసిక స్థితి చక్కగా లేకపోవడం ● ఒక చోట స్థిమితంగా ఉండలేకపోవడం. ● ఇతరులను ఇబ్బంది పెట్టడం.

నిర్ధారణ : రక్తపరీక్షలు, సీటీ స్కాన్, ఎమ్మారై

చికిత్స : హోమియోలో ఏడీహెచ్‌డీ సమస్యకు మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. వ్యాధి వ్యక్తమయ్యే తీరు, లక్షణాలను విశ్లేషించి మందులు ఇవ్వాలి. ఈ మందుల వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవు. ఈ సమస్యకు హోమియోలో స్ట్రామోనియమ్, చైనా, అకోనైట్, బెల్లడోనా, మెడోరినమ్ వంటి మందులు అందుబాటులో ఉన్నాయి. వీటిని డాక్టర్ల పర్యవేక్షణలో వాడాలి.



డాక్టర్ మురళి కె. అంకిరెడ్డి,
ఎండీ (హోమియో) స్టార్ హోమియోపతి, హైదరాబాద్

రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ సమస్య తగ్గుతుందా?

నా వయసు 55 ఏళ్లు. నాకు రెండు చేతుల్లోని కీళ్లు నొప్పిగా ఉండటం, కీళ్లవద్ద ఎర్రగా మారడం జరిగింది. డాక్టర్‌ను సంప్రదిస్తే రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ అన్నారు. హోమియో ద్వారా తగ్గుతుందా?

– దేవేందర్, నిజామాబాద్

ఈ మధ్యకాలంలో మన రోగనిరోధక శక్తి మన పట్ల ప్రతికూలంగా వ్యవహరించే ఆటోఇమ్యూన్ వ్యాధులతో బాధపడేవారు పెరుగుతున్నారు. ఈ తరహా వ్యాధులలో ప్రధానమైనది రుమటాయిడ్ ఆర్థ్రైటిస్. సాధారణంగా స్త్రీ-పురుషులలో యాభైఏళ్ళ వయసులో కీళ్ల నొప్పులు మొదలవుతాయి. ఇది వయస్సు పెరిగేకొద్దీ కీళ్ళలో వచ్చే అరుగుదల వలన, ఎముకలలో క్యాల్షియం తగ్గిపోవడం వలన వస్తూ ఉంటుంది. దీనిని 'ఆస్టియో ఆర్థ్రైటిస్' అంటారు. అయితే ఇందుకు భిన్నంగా కేవలం ముప్పై నుండి నలభై ఏళ్ళ మధ్యలో ఉండే యువతులలో చేతుల్లో, పాదాలలో ఉండే చిన్న చిన్న కీళ్లలో వచ్చే కీళ్ళ వాపులు, నొప్పులు రావడం రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ లక్షణాలు. దీని లక్షణాల తీవ్రతలో వివిధ మార్పులు కన్పిపిస్తాయి. వ్యాధి యాక్టివ్ స్టేజ్‌లో ఉన్నప్పుడు అలసట, ఆకలి లేకపోవడం, లోగ్రేడ్ జ్వరం, కీళ్ళలో, కండరాల్లో నొప్పులు, కీళ్లను సరిగ్గా కదపలేకపోవడం వంటి లక్షణాలు ఉంటాయి. సాధారణంగా కీళ్లనొప్పులు ఉదయాన్నే లేవగానే అత్యధికంగా ఉండి కొద్దిగా శరీరం కదిలించిన తర్వాత అదుపులో ఉంటాయి. సాధారణంగా చేతుల్లో కాళ్లలో రెండు వైపులా ఒకే కీళ్ళు ప్రభావితమవుతాయి. కీళ్ళు ఎర్రగా, వేడిగా మారి విపరీతమైన నొప్పితో బాధిస్తాయి. వ్యాధి దీర్ఘకాలంగా మారినప్పుడు కీళ్ళలోని మృదులాస్థి, ఎముకలు దెబ్బతినడం వలన వేళ్ళు వంకర్లు పోవడం పూర్తిగా కదలికలు ఆగిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. వీటినే 'డిఫార్మిటీస్' అంటారు. రుమటాయిడ్ ఆర్థ్రైటిస్‌ని నిర్ధారించడానికి ఏ ఒక్క పరీక్ష సరిపోదు. రక్తపరీక్షలతో పాటు ఇతర వైద్య పరీక్షలూ చేయించాల్సి ఉంటుంది. ఆటో ఇమ్యూన్ సమస్యలలో చికిత్స చెయ్యడానికి హోమియోపతిలో మియాజ్మాటిక్ ప్రిస్క్రిప్షన్ ఇస్తారు. సాధారణంగా వాడే పెయిన్ కిల్లర్స్, స్టెరాయిడ్స్ వల్ల నొప్పి నుండి తాత్కాలికంగా ఉపశమనం లభించడం లేదా కొన్ని సార్లు అస్సలు ప్రభావమే లేకపోవడం జరుగుతుంది. పైగా ఈ మందుల వలన డిఫార్మిటీస్‌ని నివారించలేం. హోమియోపతి మందుల ద్వారా అయితే వ్యాధిని నియంత్రించి నొప్పులను పూర్తిగా తగ్గించడం మాత్రమే కాకుండా డిఫార్మిటీలు రాకుండా కూడా నివారించవచ్చు.



డాక్టర్ టి.కిరణ్ కుమార్,
డైరెక్టర్, పాజిటివ్ హోమియోపతి, విజయవాడ, వైజాగ్

బయోపిక్స్

బాలీవుడ్ స్పైస్



● దీపికా పదుకోన్
● కంగనా రనౌత్

పద్మావత్‌కి అక్కడ దారి ఉందా?

చరిత్రలో ఖ్యాతి గాంచిన రాణుల్లో రాణి పద్మావతి ఒకరు. ఆమె జీవితం ఆధారంగానే సంజయ్ లీలా భన్సాలీ 'పద్మావత్' చిత్రాన్ని తెరకెక్కించారని బాలీవుడ్ టాక్. దీపికా పదుకోన్, రణ్‌వీర్ సింగ్, షాహిద్ కపూర్ ముఖ్య తారలుగా నటించిన ఈ సినిమాను ఈ నెల 25న రిలీజ్ చేయనున్నారు. అయితే హర్యానా, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలు తమ రాష్ట్రాల్లో రిలీజ్‌కు అభ్యంతరం తెలిపాయి. దీంతో చిత్రనిర్మాణ సంస్థ వయాకామ్18 సుప్రీం కోర్టును ఆశ్రయించగా, పరిశీలనకు అంగీకరించింది.

కథానాయిక ట్వింకిల్ ఖన్నా నిర్మాతగా మారారు. ఈ నెల 25న సినిమా విడుదల కానుంది. అక్షయ్‌లాంటి మాస్ హీరో ఈ సినిమా చేయడం గ్రేట్. ఈ ఒక్క బయోపిక్‌లోనే కాదు.. ఈ ఏడాది మరో రెండు నిజజీవిత కథల్లో కనిపించి, ట్రిపుల్ ధమాకా ఇవ్వనున్నారు. అవేంటంటే...

గోల్డెన్ జూబ్లీ ఇయర్‌లో గోల్డ్

లాస్ట్ ఇయర్ అక్షయ్‌కుమార్ గోల్డెన్ జూబ్లీ ఇయర్‌లోకి ఎంటరయ్యారు. అంటే.. ఆయన వయసు 50. గోల్డెన్ జూబ్లీ ఇయర్‌లో అక్షయ్ 'గోల్డ్' పేరుతో సినిమా చేయడం విశేషం. గతేడాదే షూటింగ్ పూర్తయింది. హాకీ ప్లేయర్ బల్బీర్ సింగ్ జీవితం ఆధారంగా లేడీ డైరెక్టర్ రీమా కగ్తి దర్శకత్వంలో ఈ సినిమాని ఫర్హాన్ అక్తర్ నిర్మించారు. స్వతంత్ర భారతదేశం తరపున ఒలింపిక్స్‌లో తొలి బంగారు పతకం సాధించిన టీమ్‌లో బల్బీర్ సింగ్ ఒకరు. ఆయన కథతోనే 'గోల్డ్' తీశారు. ఆగస్ట్ 15న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

కుమార్ పాత్ర చేయబోతున్నారు అక్షయ్. 1997లో గుల్షన్ హత్యకు గురయ్యారు. తొలినాళ్లలో ఆయన పడ్డ కష్టాల నుంచి మరణం వరకూ 'మొఘల్' కథ ఉంటుంది. అక్షయ్‌తో 'జాలీ ఎల్ఎల్‌బి 2' తెరకెక్కించిన సుభాష్ కపూర్ ఈ చిత్రానికి దర్శకుడు. త్వరలో షూటింగ్ స్టార్ట్ చేసి, ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

క్వీన్ కంగనా

'తను వెడ్స్ మను', 'క్వీన్' వంటి చిత్రాలతో బాలీవుడ్ క్వీన్ అనిపించుకున్నారు కంగనా. ఇప్పుడు క్వీన్‌గా ఆమె నటిస్తోన్న చిత్రం 'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ'. క్రిష్ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రంలో వీర వనిత ఝాన్సీ రాణి లక్ష్మీబాయి పాత్రలో కంగనా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం గుర్రపు స్వారీ, కత్తిసాము నేర్చుకున్నారు. చిత్రీకరణ సమయంలో చిన్ని చిన్ని గాయాలవుతున్నా కంగనా లెక్క చేయకుండా చేస్తున్నారు. ఏప్రిల్‌లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

దత్‌గా కపూర్

హీరో సంజయ్ దత్ జీవితం కథతో రాజ్‌కుమార్ హిరానీ ఓ సినిమా తీస్తున్నారు. ఇందులో సంజయ్‌గా రణబీర్ కపూర్ చేస్తున్నారు. యంగ్ ఏజ్, ఓల్డ్ సంజయ్‌గా కనిపించడం కోసం రణబీర్ బరువు తగ్గుతున్నారు, పెరుగుతున్నారు. సంజయ్ వృత్తి జీవితం, వ్యక్తిగత వివాదాలు వంటివి చూపిస్తారని టాక్. ఈ చిత్రానికి 'సంజూ' అనే టైటిల్ అనుకుంటున్నారట. సంజయ్ దత్‌ని 'సంజూ బాబా' అని పిలుస్తుంటుంది బాలీవుడ్. అందుకే ఈ టైటిల్‌ని పరిశీలిస్తున్నారట. జూన్ 29న ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారు.

హృతిక్.. ఫస్ట్ బయోపిక్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎంట్రన్స్ ఎగ్జామ్స్ రాయడానికి కష్టపడే పేద విద్యార్థుల కోసం ఆనంద్‌కుమార్ 'సూపర్ 30' అనే కాన్సెప్ట్ తయారు చేశారు. ఎందరో స్టూడెంట్స్‌కి శిక్షణ ఇచ్చి, వారు గెలిచేలా చేశారు. ఎవరీ ఆనంద్‌కుమార్ అంటే.. బిహారీ గణిత శాస్త్రవేత్త. ఆయన బయోపిక్‌లో నటించనున్నారు హృతిక్. ఆయన నటిస్తోన్న తొలి బయోపిక్ ఇది. వికాస్ బాల్ దర్శకత్వం వహించనున్న ఈ సినిమా టైటిల్ 'సూపర్ 30'. నవంబర్‌లో రిలీజ్ కానుంది.

నో ఫైట్!

సందీప్‌సింగ్‌కి, సంజయ్‌దత్‌కి నో ఫైట్. అయినా.. ఇదేంటి. హాకీ ప్లేయర్ సందీప్ సింగ్‌కి, నటుడు సంజయ్‌దత్‌కి ఫైట్ ఏంటి గురూ అంటే.. రియల్ లైఫ్‌లో కాదండి. రీల్ లైఫ్‌లో. అది కూడా వీరికి కాదు. వీరి బయోపిక్స్‌లో నటిస్తున్న హీరోలకి. ముందు సూర్మ (సందీప్ సింగ్ బయోపిక్)ను జూన్ 29న రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ, మార్చి 30న రిలీజ్ కావాల్సిన 'సంజు' (సంజయ్‌దత్ బయోపిక్‌కు పరిశీలనలో ఉన్న టైటిల్) వాయిదా పడింది. ఈ చిత్రాన్ని కూడా జూన్ 29నే విడుదల చేయాలనుకుంటున్నారు. దాంతో రెండు బయోపిక్‌లకు క్లాష్ తప్పదని పరిశీలకులు అన్నారు. క్లాష్ ఉండకూడదనుకున్నారేమో 'సూర్మా'ను ఆరు రోజులకు వాయిదా వేశారు. అంటే... జూలై 6న రిలీజ్ చేయనున్నట్లు చిత్రబృందం పేర్కొంది. సో.. నో ఫైట్ అన్నమాట.

అతని గోల్ గెలుపే

ఒక మ్యాచ్‌లో పెద్ద గాయం అయితే కోలుకుని మళ్లీ ఫిట్‌నెస్‌ను ప్రూవ్ చేసుకోవడం ఆషామాషీ కాదు. అలాంటి గాయమే అయ్యింది హాకీ ప్లేయర్ సందీప్ సింగ్‌కి. కానీ మ్యాచ్‌లో కాదు లైఫ్‌లో. అంటే.. యాక్సిడెంట్ అయ్యింది. సందీప్ సింగ్ తిరిగి హాకీ స్టిక్ పట్టడం అసాధ్యం అన్నారు కొందరు. కానీ, అతని గోల్ గెలుపు వైపు. హాకీ స్టిక్ పట్టుకున్నారు.. గోల్ కొట్టారు. అసాధ్యం కాదు.. సుసాధ్యం అని ప్రూవ్ చేశారాయన. ఇప్పుడు ఈ రియల్ కథనంపై రీల్ లైఫ్ స్టోరీ రూపొందుతోంది. షాద్ అలీ దర్శకత్వంలో 'సూర్మ' అనే టైటిల్‌తో రూపొందుతున్న ఈ సినిమాలో సందీప్ పాత్రలో నటిస్తున్నారు దిల్జీత్. ఈ సినిమా ఈ ఏడాదే రిలీజ్ అవుతుంది.

గురి ఎలా కుదిరింది

ఒలింపిక్స్‌లో పతకం సాధించడం అంత ఈజీ కాదు. అందుకే మెడల్ సాధించినవాళ్లు ఆదర్శంగా నిలుస్తారు. అభినవ్ బింద్రా ఈ కోవకే వస్తారు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో 10 మీటర్స్ ఎయిర్ రైఫిల్ విభాగంలో గోల్డ్ పతకం సాధించి, త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించారు అభినవ్. గోల్డ్ మెడల్‌పై అంత కచ్చితమైన గురి అతనికి ఎలా కుదిరిందన్న దానిపై ఇప్పుడు ఓ బయోపిక్‌ను హిందీలో రూపొందించనున్నారు. అభినవ్ బింద్రా పాత్రను హర్షవర్ధన్ కపూర్ పోషించనున్నారు.

సెట్స్‌కు సై!

దేశం గర్వించదగ్గ క్రీడాకారుల్లో సైనా నెహ్వాల్ ఒకరు. ఆమె జీవితం సిల్వర్ స్క్రీన్‌కు రానుంది. సైనా పాత్రను శ్రద్ధాకపూర్ పోషించనున్నారు. అయితే ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లడం లేదన్న వార్తలు వచ్చాయి. ''అది నిజం కాదు. త్వరలో స్టార్ట్ చేయబోతున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది.

- డి.జి. భవాని,
ముసిమి శివాంజనేయులు





● అక్షయ్‌కుమార్

బయోపిక్స్ క్రేజ్ పీక్స్‌కి చేరింది.

బాక్సింగ్ రింగ్‌లో మేరీ కోమ్ పిడిగుద్దులు గుద్దుతుంటే... లేడీ లైన్ అని, చప్పట్లు కొట్టారు. ఈ లేడీ లైన్ బాక్సర్‌గా రాణించడానికి చాలా కష్టాలు పడ్డారు. అందుకే మేరీ కోమ్ స్టోరీతో సినిమా తీస్తే... ప్రేక్షకులు కనకవర్షం కురిపించారు.

'బావలు సయ్యా.. మరదలు సయ్యా'... సిల్క్ సిత్మ రింగు రింగులు తిరుగుతూ డ్యాన్స్ చేస్తుంటే సిక్స్‌టీ ప్లస్ ఏజ్ ఉన్న హార్టులు కూడా స్వీట్ సిక్స్‌టీ అయిపోయాయి. అందుకే ఆమె లైఫ్ స్టోరీతో 'డర్టీ పిక్చర్' తీస్తే ఎగబడి చూశారు.

గ్రౌండ్‌లో ధోని రన్నుల మీద రన్నులు పీకుతుంటే... ఈ రేంజ్‌లో ఆడటానికి ఏ రేంజ్‌లో కష్టపడ్డాడు? ఇతగాడి బ్యాగ్రౌండ్ ఏంటో తెలియాల్సిందే అనుకున్నారు. అందుకే ధోని జీవితకథతో తీసిన 'ఎం.ఎస్.ధోని' హిట్.

ఇలా చెప్పుకుంటూ పోతే బాలీవుడ్ స్క్రీన్‌పై మెరిసిన 'బయోపిక్స్' ఎన్నో. ఈ నిజ జీవిత కథలకు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. అందుకే రెండు మూడేళ్లుగా హిందీలో బయోపిక్స్ హవా సాగుతోంది. ఈ ఏడాదైతే మినిమమ్ పది నిజజీవిత కథలు రీల్‌కి వచ్చే అవకాశం ఉంది. ఆ రియల్ స్టోరీస్ ఏంటంటే...

ట్రిపుల్ ధమాకా

కిలాడీ కుమార్... బాలీవుడ్‌లో అక్షయ్‌కుమార్‌ని అలానే అంటారు. ఎందుకంటే సినిమాల సెలెక్షన్ విషయంలో అక్షయ్ భలే కిలాడీ. అది నిజమే. డిఫరెంట్ క్యారెక్టర్స్ చేస్తుంటారు. సోషల్ మెసేజ్ ఉన్న 'ప్యాడ్‌మేన్' లాంటి సినిమా అంటే చాలు.. 'సై' అంటారు. అరుణాచలమ్ మురుగనాథమ్ అనే వ్యక్తి తక్కువ ధరకు లభ్యమయ్యే 'శానిటరీ నేప్‌కిన్'లు తయారు చేసి, తన గ్రామంలో ఉన్న మహిళలకు అందజేసేవారు. ఆయన కథతో తీసిన సినిమానే 'ప్యాడ్‌మేన్'. ఆర్. బాల్కీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ద్వారా అక్షయ్ భార్య, మాజీ

గుల్షన్ జీవిత కథలో...

ఢిల్లీల్లో పండ్ల దుకాణంలో పని చేసిన గుల్షన్ కుమార్ చౌకగా ఆడియో కేసెట్లు అమ్మే దుకాణం కొని, చిన్నగా మొదలై, సంగీత ప్రపంచంలో పెద్దగా ఎదిగారు. టీ-సిరీస్ మ్యూజిక్ లేబుల్ వ్యవస్థాపకుడిగా, నిర్మాతగా ఎంతో పేరు సంపాదించారు. ఆయన జీవితం ఆధారంగా తీయబోతున్న 'మొఘల్' చిత్రంలో గుల్షన్

ఆడ.. ఈడ.. అదే జోరు!

పది బయోపిక్స్ మాత్రమే కాదు.. మరికొన్ని సెట్స్‌కి వెళ్లే అవకాశం ఉంది. వాటిలో దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జీవితం ఆధారంగా తెరకెక్కనున్న సినిమా ఒకటి. ఇందులో విద్యాబాలన్ నటిస్తారని టాక్. రచయిత షాహిర్ బయోపిక్‌లో అభిషేక్ బచ్చన్ నటిస్తారట. ఆల్రెడీ కపిల్ దేవ్ పాత్రలో రణ్‌వీర్ సింగ్ నటిస్తున్నారు. మరి ఇంకెన్ని రియల్ స్టోరీస్ రీల్ పైకి వస్తాయో చూడాలి. ఆ సంగతలా ఉంచితే చెప్పిన తేదీ ప్రకారం పైన ఉన్న పది బయోపిక్‌లు రిలీజ్ అవుతాయా? ఈ మధ్యకాలంలో కొన్ని చిత్రాలు వాయిదా పడినట్లు పడతాయా? వేచి చూద్దాం. మరో సంగతేంటంటే.. ఆడ (హిందీ)లో మాత్రమే కాకుండా ఈడ (సౌత్) కూడా బయోపిక్స్ జోరు బాగానే ఉంది. ట్రెండ్‌తో, సీజన్‌తో సంబంధం లేదు. ఆదర్శంగా తీసుకోదగ్గ వ్యక్తుల కథలతో ఎప్పుడు సినిమా తీసినా 'వర్కవుట్' అవుతుంది. ఏమంటారు? ఇంకో విషయం కూడా... బయోపిక్స్‌లో క్రీడాకారుల లైఫ్ హిస్టరీలు ఎక్కువగా 'పిక్' చేస్తుండటం విశేషం.



● సైనాగా శ్రద్ధాకపూర్...
● సంజయ్‌దత్‌గా.. రణబీర్ కపూర్
● అభినవ్ బింద్రాతో హర్షవర్ధన్
● హృతిక్‌తో మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్
● సందీప్ సింగ్‌గా దిల్జిత్ సింగ్



● సోనమ్ కపూర్

పెళ్లెప్పుడని వాళ్లని అడగరేం?

సాధారణంగా పెళ్లి కాని కథానాయికలను 'మీ పెళ్లెప్పుడు?' అనే ప్రశ్న వెంటాడుతూ ఉంటుంది. ఈ ప్రశ్నకు కొందరు ఓ చిన్ని చిరునవ్వు నవ్వి ఊరుకుంటుంటారు. మరికొందరు 'అప్పుడేనా.. అందుకు ఇంకా చాలా టైమ్ ఉంది. ప్రస్తుతం నా దృష్టంతా సినిమాల పైనే' అంటుంటారు. ఇంకొందరు 'పెళ్లికేంటి తొందర. ఆ టైమ్ వచ్చినప్పుడు అందరికీ చెప్పే చేసుకుంటాం' అని సమాధానం ఇస్తుంటారు. సోనమ్ కపూర్ అయితే వీటికి భిన్నంగా స్పందిస్తారు. 'మీ పెళ్లెప్పుడు' అని ఇటీవల సోనమ్ కపూర్‌ని మీడియావారు అడిగారు. ఈ ప్రశ్నకు ఈ బ్యూటీ ఘాటుగా సమాధానమిచ్చారు. ''పెళ్లెప్పుడు అంటూ ఎప్పుడూ హీరోయిన్లనే అడుగుతారెందుకు? ఇదే ప్రశ్నని హీరోలను అడుగుతారా? రణబీర్ కపూర్, రణ్‌వీర్ సింగ్ వంటి వాళ్లను ఎప్పుడైనా ప్రశ్నించారా? మాకూ పర్సనల్ లైఫ్ ఉండదా? పెళ్లి చేసుకుంటే అందరికీ చెప్పే చేసుకుంటాం కదా? పెళ్లి అయినా నర్గీస్, వహీదా రెహమాన్, షర్మిలా ఠాగూర్, డింపుల్ కపాడియా, మాధురీ దీక్షిత్, కాజోల్, కరీనా కపూర్ వంటి ఎంతో మంది సెకండ్ ఇన్నింగ్స్‌లో తాము ఎవరికీ తక్కువ కాదంటూ నిరూపించుకోలేదా?'' అంటూ మండిపడ్డారట సోనమ్. ఇదిలా ఉంటే.. వ్యాపారవేత్త ఆనంద్ అహూజా, సోనమ్ కపూర్ ప్రేమలో ఉన్నారనీ, త్వరలో పెళ్లి పీటలు ఎక్కనున్నారనీ బాలీవుడ్ మీడియా కూడై కూస్తోన్న విషయం తెలిసిందే.

ఆధార్‌పై అనుమానాలొద్దు!



బ్యాంకు, పాన్ వివరాలు మా వద్ద ఉండవు

సమాచార పరిరక్షణకు అత్యాధునిక వ్యవస్థ ఉంది

యూఐడీఏఐ స్పష్టీకరణ

న్యూఢిల్లీ

కేవలం రూ.500కే దేశంలో ఎవరి ఆధార్ సమాచారమైనా ఆన్‌లైన్‌లో దొరుకుతోందంటూ 'ద ట్రిబ్యూన్' పత్రిక ఇటీవల బయటపెట్టి సంచలనం సృష్టించింది. అలాగే కొన్ని ప్రభుత్వ విభాగాల వెబ్‌సైట్ల నుంచే 13 కోట్ల మంది ఆధార్ సమాచారం బట్టబయలైందంటూ కూడా గతంలో వార్తలొచ్చాయి. అసలు ఆధార్ రాజ్యాంగ బద్ధమేనా కాదా అనే దానిపై సుప్రీం కోర్టు ఐదురుగు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం బుధవారం నుంచి విచారణ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఆధార్‌పై సామాన్యుల సందేహాలను నివృత్తి చేసేందుకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) 11 'తరచుగా అడిగే ప్రశ్నలు' (ఎఫ్ఏక్యూ), వాటికి సమాధానాలను విడుదల చేసింది.

ప్రశ్న: నా ఆధార్ సమాచారంలో బయోమెట్రిక్స్, బ్యాంక్ ఖాతా, పాన్, మొబైల్, ఈ-మెయిల్ తదితర వివరాలన్నీ ఉన్నాయి? నేను ఏమేం చేస్తానో యూఐడీఏఐ గమనిస్తూ ఉంటుందా?

జవాబు: తప్పు. యూఐడీఏఐ దగ్గర బ్యాంకు ఖాతాలు, పాన్, మ్యూచ్‌వల్ ఫండ్లలో పెట్టుబడులు, ఆస్తులు, ఆర్థిక లావాదేవీలు, కుటుంబ సభ్యులు, కులం తదితర వివరాలేవీ ఉండవు.

ప్రశ్న: కానీ నాకు బ్యాంక్ ఖాతా, పాన్ కార్డు, షేర్ మార్కెట్, మ్యూచ్‌వల్ ఫండ్లలో పెట్టుబడులు, మొబైల్ కనెక్షన్..ఇలా ఏది కావాలన్నా ఆధార్ అంటున్నారుగా. ఆయా సంస్థలకు నా ఆధార్ నంబర్ ఇస్తే ఆ సమాచారం యూఐడీఏఐకి రాదా?

జవాబు: కచ్చితంగా రాదు. మీరు ఆయా సంస్థలకు ఆధార్ సంఖ్య ఇచ్చినప్పుడు అవి మీరు వారికిస్తున్న బయోమెట్రిక్స్, మీ పేరు తదితరాలను మాత్రమే యూఐడీఏఐకి ధ్రువీకరణ కోసం పంపుతాయి. ఇతర వివరాలేవీ రావు. ఆధార్ నంబర్‌తో వేలిముద్రలు, పేరు సరిపోలితే ధ్రువీకరణ అయిపోతుంది.

ప్రశ్న: ఎవరికైనా నా ఆధార్ నంబర్ తెలిస్తే, వాళ్లు నా బ్యాంక్ ఖాతాను హ్యాక్ చేయగలరు కదా?

జవాబు: పూర్తిగా అవాస్తవం. కేవలం మీ ఏటీఎం కార్డు నంబర్ తెలిసినంత మాత్రాన ఎవరైనా మీ ఖాతాలోని డబ్బును ఏటీఎం ద్వారా డ్రా చేయగలరా? అలాగే ఇది కూడా అసాధ్యం.

ప్రశ్న: బ్యాంకు ఖాతాలకు ఆధార్‌ను అనుసంధానించుకోవాలని ఎందుకు చెబుతున్నారు?

జవాబు: మీ భద్రత కోసమే. నేరస్తులు, అవినీతి పరుల బ్యాంకు ఖాతాలను తొలగించేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఆధార్‌తో అనుసంధానమై ఉన్న ఖాతాల నుంచి ఎవరైనా అక్రమంగా డబ్బు తీస్తే వారి గురించి అన్ని వివరాలు ఇట్టే తెలిసిపోతాయి. కాబట్టి మీ ఖాతాలకు మరింత భద్రత సమకూరుతుంది.

ప్రశ్న: మరి మొబైల్ నంబర్లకు ఆధార్ ఎందుకు?

జవాబు: ఇది కూడా మీ భద్రత కోసమే. దేశ భద్రత కోసం కూడా. నేరస్తులు, మోసగాళ్లు వినియోగిస్తున్న సిమ్ కనెక్షన్లను తొలగించడం కోసమే అనుసంధానం చేసుకోమంటున్నాం. చాలాసార్లు నేరగాళ్లు నకిలీ ధ్రువపత్రాలతో సిమ్‌లు సంపాదించి నేరాలకు పాల్పడుతున్నారు. ఆధార్‌తో అనుసంధానించడం వల్ల దీన్ని నివారించవచ్చు.

ప్రశ్న: మొబైల్ కంపెనీలు నా వేలిముద్రలను సేవ్ చేసుకుని తర్వాత వాటిని వేరే పనుల కోసం వాడుకునే అవకాశం ఉంది కదా!

జవాబు: ఆధార్ ధ్రువీకరణ సమయంలో మీరిచ్చే వేలిముద్రలను మొబైల్ కంపెనీలే కాదు, ఎవ్వరూ సేవ్ చేసుకోలేరు. సెన్సర్‌పై మీ వేలిముద్ర పెట్టగానే, ఆ సమాచారం ఎన్‌క్రిప్ట్ అయ్యి, సరిపోల్చడం కోసం యూఐడీఏఐకి వస్తుంది. ఆధార్ చట్టం–2016 ప్రకారం ఏవేనీ సంస్థలు మీ వేలిముద్రలను సేవ్ చేయడం శిక్షార్హమైన నేరం.

ప్రశ్న: ఎన్ఆర్ఐలకు కూడా ఆధార్ ఉండాల్సిందేనా?

జవాబు: లేదు. ఆధార్‌లో భారత్‌లో నివసిస్తున్న వారికి మాత్రమే. ఆధార్‌ను పొందేందుకు ఎన్ఆర్ఐలు అసలు అర్హులే కాదు. ఎన్ఆర్ఐలకు ఆధార్ లేకపోయినా అన్ని రకాల సేవలూ లభిస్తాయి.

ప్రశ్న: పేదవారికి అత్యవసరమైన పింఛను, రేషన్ సరకులు తదితరాలను కూడా ఆధార్ లేని కారణంగా నిలిపేస్తున్నారు కదా?

జవాబు: కచ్చితంగా లేదు. ఎవరైనా ఆధార్ కార్డు ఇంకా తీసుకోకపోతే, అలాంటి వారికి ఆధార్ సంఖ్య వచ్చే వరకు ఇతర గుర్తింపు కార్డుల ఆధారంగానే సంక్షేమ పథకాల ప్రయోజనాలు కల్పించాల్సిందేనని చట్టంలో స్పష్టంగా ఉంది. ఒకవేళ ప్రభుత్వ సిబ్బంది ఎవరైనా ఆధార్ కచ్చితంగా కావాల్సిందేనని ఇబ్బంది పెడుతుంటే అలాంటి వారిపై పై అధికారులకు ఫిర్యాదు చేయండి.

ప్రశ్న: కొన్ని సంస్థలు ఈ-ఆధార్‌ను ఒప్పుకోవడం లేదు. ఒరిజినల్ ఆధార్ కార్డు కావాల్సిందేనని అవి పట్టుబడుతున్నాయి. ఎందుకు?

జవాబు: ఈ-ఆధార్ కూడా ఒరిజినల్ ఆధార్‌తో సమానమే. రెండింటిలో ఏదైనా ఒకటే. అన్ని సంస్థలూ రెండింటిలో దేన్నయినా అంగీకరించాల్సిందే. ఇంకా మాట్లాడితే ఒరిజినల్ ఆధార్ కన్నా ఈ-ఆధార్‌కే వారు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. ఎవరైనా ఈ-ఆధార్‌ను ఒప్పుకోకపోతే వెంటనే పై అధికారులకు ఫిర్యాదు చేయండి.

ప్రశ్న: సామాన్యులకు ఆధార్‌తో ప్రయోజనమేంటి?

జవాబు: ఆధార్ అంటే 119 కోట్ల మంది భారతీయుల విశ్వసనీయమైన గుర్తింపు. ఇతర ఏ గుర్తింపు కార్డుకూ లేని విశ్వసనీయత ఆధార్‌కు ఉంది. పల్లెల నుంచి పట్టణాల్లోని మురికి వాడల వరకు ఎవ్వరినైనా అడగండి వారు ఆధార్‌ను ఎలా ఉపయోగిస్తున్నారో. బ్యాంకు ఖాతాకు, ఉద్యోగానికి, ప్రభుత్వ సంక్షేమ ఫలాలను నేరుగా బ్యాంకు ఖాతాల్లో పొందేందుకు, రైళ్లలో ప్రయాణానికి ఇలా దేనికయినా సరే, గుర్తింపు కార్డుగా మొదటి ప్రాధాన్యత ఉన్నది ఆధార్‌కే.

ప్రశ్న: ఆధార్ సమాచారం లీక్ అయ్యిందంటూ మీడియాలో వార్తలు చూశాం. నిజం కాదంటారా?

జవాబు: ఆధార్ గత ఏడేళ్ల నుంచి ఉంది. ఎప్పుడూ సమాచారం లీక్ కాలేదు. ఆధార్ కార్డుదారుల సమాచారం భద్రంగా, సురక్షితంగాఉంది. ఆధార్ సమాచారం లీకయిందంటూ వచ్చిన వార్తలు అవాస్తవం. మేం ఆధార్ సమాచార భద్రత కోసం అత్యాధునిక సాంకేతికతను వాడుతున్నాం.




సుఖోయ్ యుద్ధ విమానంలో రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్

సుఖోయ్‌లో ప్రయాణించిన సీతారామన్

జోధ్‌పూర్: రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్(57) బుధవారం రెండు సీటర్ల సుఖోయ్–30 ఎంకేఐ యుద్ధవిమానంలో ప్రయాణించారు. ఆలివ్ రంగు యాంటీ గ్రావిటీ సూట్ ధరించిన సీతారామన్.. రాజస్తాన్‌లోని జోధ్‌పూర్ ఎయిర్‌బేస్‌లో ఐఏఎఫ్ పైలెట్‌తో కలిసి 45 నిమిషాల సేపు ఆకాశంలో విహరించారు. దీంతో సుఖోయ్‌లో ప్రయాణించిన తొలి మహిళా రక్షణ మంత్రిగా ఆమె చరిత్ర సృష్టించారు. సుఖోయ్‌లో ప్రయాణించిన తర్వాత సీతారామన్ మాట్లాడుతూ ఈ ప్రయాణం చిరస్మరణీయమైన అనుభవమని వ్యాఖ్యానించారు. ఈ ప్రయాణానికి ముందు ఐఏఎఫ్ ఎయిర్‌బేస్ నిర్వహణ, యుద్ధ సన్నద్ధతపై ఆమె సమీక్ష నిర్వహించారు. అనంతరం సుఖోయ్ ప్రయాణంతో పాటు కాక్‌పిట్ పరిస్థితులపై అధికారులు మంత్రికి వివరించారు. సీతారామన్ కంటే ముందు మాజీ రాష్ట్రపతులు ఏపీజే అబ్దుల్ కలామ్ 2003లో, ప్రతిభా పాటిల్ 2009లో సుఖోయ్‌లో ప్రయాణించారు. సీతారామన్ కంటే ముందు 2003లో అప్పటి రక్షణమంత్రి జార్జ్ ఫెర్నాండేజ్ సుఖోయ్–30 విమానంలో చక్కర్లు కొట్టారు. రక్షణమంత్రి ప్రయాణించిన విమానం 8 వేల మీటర్ల ఎత్తులో ప్రయాణిస్తూ ధ్వని వేగాన్ని అధిగమించిందని ఓ ఐఏఎఫ్ అధికారి తెలిపారు. 'ఈ ప్రయాణంలో ఎవరెస్ట్ శిఖరమంత(8,848 మీటర్ల) ఎత్తుకు చేరుకోవడంతో పాటు ధ్వని వేగాన్ని అధిగమించడం మన పైలెట్లకున్న సామర్థ్యాన్ని తెలియజేస్తోంది' అని సీతారామన్ వ్యాఖ్యానించారు.

గుండె సమస్యతోనే జస్టిస్ లోయా మృతి



నాగ్‌పూర్: గుండె ధమనుల పనితీరు దెబ్బతినడంతోనే జస్టిస్ బ్రిజ్‌గోపాల్ హర్‌కిషన్ లోయా మృతి చెందారని పోస్ట్‌మార్టం నివేదికను ఉటంకిస్తూ ఓ పోలీస్ ఉన్నతాధికారి తెలిపారు. నాగ్‌పూర్ ప్రభుత్వ వైద్యకళాశాల, ఆస్పత్రి అందించిన ఈ నివేదికతోనే సీఆర్పీసీ సెక్షన్ 174 కింద ఈ కేసు విచారణ ముగిసిందన్నారు. వైద్యుల హిస్టోపాథాలజీ నివేదికలో లోయా భౌతికకాయంలో విషపూరితమైన పదార్థాలేవీ లేవని తేలిందన్నారు. 2014లో డిసెంబర్ 1న నాగ్‌పూర్‌లో ఓ వేడుకకు హాజరైన లోయా అకస్మాత్తుగా కుప్పకూలిపోయి ప్రాణాలు కోల్పోయారు. బీజేపీ చీఫ్ అమిత్ షా నిందితుడిగా ఉన్న సోహ్రాబుద్దీన్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసును జస్టిస్ లోయా విచారిస్తున్న సంగతి తెలిసిందే. సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రాకు, మిగతా నలుగురు సుప్రీం న్యాయమూర్తులకు మధ్య నెలకొన్న తాజా సంక్షోభానికి జస్టిస్ లోయా మృతి కేసు విచారణ కూడా కారణం కావడం గమనార్హం.

రిటర్నుల ఫైలింగ్ సులభతరమే ఎజెండా!

నేడు జీఎస్టీ మండలి సమావేశం

న్యూఢిల్లీ: రిటర్నుల ఫైలింగ్‌ను సులభతరం చేయడం, ఈ–వే బిల్లుల జారీకి జీఎస్టీ నెట్‌వర్క్ సన్నద్ధతను సమీక్షించడమే ప్రధాన అజెండాగా జీఎస్టీ మండలి సమావేశం గురువారం జరగనుంది. బడ్జెట్ సమర్పణకు ముందు నిర్వహిస్తున్న ఈ భేటి 25వది కావడం గమనార్హం. జీఎస్టీ రేట్లను తగ్గించాలని పలు వర్గాల నుంచి వచ్చిన విన్నపాలను కూడా మండలి పరిశీలించే అవకాశాలున్నాయి. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలో జరిగే ఈ సమావేశంలో సుమారు 70 వస్తువులపై జీఎస్టీ రేట్లను తగ్గిస్తూ కీలక నిర్ణయం వెలువడుతుందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. జనవరి 29 నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో చర్చించేందుకు వీలుగా జీఎస్టీ చట్టంలో సవరణలకు మండలి ఆమోదం తెలపొచ్చని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

ట్రంప్ బుర్ర గట్టిదే..!

- అధ్యక్షుడికి పరీక్షలో 30కి 30 పాయింట్లు
- ఫలితాలను వెల్లడించిన శ్వేతసౌధం వైద్యుడు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్(71) మానసిక ఆరోగ్యంపై అనుమానాలు నెలకొన్న నేపథ్యంలో శ్వేతసౌధం వైద్యుడు డా.రానీ జాక్సన్ అధ్యక్షుడికి జరిపిన పరీక్షా ఫలితాలను మంగళవారం మీడియాకు వెల్లడించారు. ట్రంప్ మానసిక స్థితి సరిగానే ఉందనీ, ఈ పరీక్షల్లో ట్రంప్ 30కి 30 పాయింట్లు సాధించారని తెలిపారు. జంక్ ఫుడ్ తీసుకున్నా ఆరోగ్యంగా ఉండటానికి ట్రంప్ జన్యువులే కారణమన్నారు. గత 20 ఏళ్లలో మరింత ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకుని ఉంటే మరో 200 ఏళ్లు బతికేవారని తాను ట్రంప్‌తో చెప్పినట్లు జాక్సన్ వెల్లడించారు. మాంట్రియల్ కాగ్నిటివ్ అసెస్‌మెంట్ పేరిట దేశాధ్యక్షుడికి ఉన్న ఏకాగ్రత, మనసును లగ్నంచేసే తీరు, జ్ఞాపకశక్తి, భాష, గణన సామర్థ్యం వంటి అనేక అంశాలపై ఈ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షలో మెదడు పనితీరుకు సంబంధించి ట్రంప్‌నకు సమస్యలేవీ లేవని తేలిందన్నారు. ట్రంప్ స్వయంగా కోరడంతోనే ఈ పరీక్షను నిర్వహించినట్లు డా.జాక్సన్ స్పష్టం చేశారు. ఈ పరీక్షలో 30కి 26 పాయింట్లు వస్తే మెదడు సక్రమంగా పనిచేస్తున్నట్లేనని తెలిపారు. ఇటీవల విడుదలైన పుస్తకం 'ఫైర్ అండ్ ఫ్యూరీ'లో అధ్యక్షుడి మానసిక ఆరోగ్యంపై ఆయన సహాయకులకే అనుమానాలు ఉన్నాయని ఆరోపణలు రావడంతో వాల్టర్ రీడ్ నేషనల్ మిలిటరీ మెడికల్ సెంటర్‌లో సైనిక వైద్యులు ఆయనకు పరీక్షలు నిర్వహించారు. 6.3 అడుగుల ఎత్తున్న ట్రంప్ 108 కిలోల బరువున్నారని జాక్సన్ తెలిపారు.

యూపీలో 97 కోట్ల పాత నోట్లు

ఇద్దరు తెలుగువారు సహా 16 మంది అరెస్ట్

కాన్పూర్: ఉత్తరప్రదేశ్‌లోని స్వరూప్‌నగర్‌లో బుధవారం పోలీసులు రూ.97 కోట్ల విలువైన రద్దైన పాతనోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ప్రముఖ బిల్డర్ ఆనంద్ ఖత్రీ సహా 16 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రాబట్టిన సమాచారంతో కాన్పూర్‌లో పలుచోట్ల ఇంకా సోదాలు కొనసాగిస్తున్నట్లు యూపీ హోంశాఖ ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ మీడియాకు తెలిపారు. ప్రాథమిక విచారణలో ఈ మొత్తానికీ, ఉగ్రవాదులకు ఎలాంటి సంబంధం లేదని తేలిందన్నారు. ఈ కేసులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కోటేశ్వరరావు అనే వ్యక్తితో పాటు మరో మహిళను కూడా అరెస్ట్ చేశామన్నారు. నల్లధనంతో పాటు ఉగ్రసాయం, నకిలీ నోట్లను అరికట్టేందుకు వీలుగా 2016, నవంబర్ 8న కేంద్రం రూ.1000, 500 నోట్లను రద్దుచేసిన సంగతి తెలిసిందే. తాము స్వాధీనం చేసుకున్న మొత్తం నగదులో రూ.95 కోట్లు ఖత్రీ పూర్వీకుల ఇంట్లోనే దొరికాయని కాన్పూర్ సీనియర్ ఎస్పీ అఖిలేశ్ కుమార్ తెలిపారు. కొన్ని సంస్థలు, కొందరు వ్యక్తులు నల్ల ధనాన్ని తెల్లగా మార్చేందుకు యత్నిస్తున్నారని జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) ఇచ్చిన సమాచారంతోనే ఈ దాడులు నిర్వహించినట్లు వెల్లడించారు. పాత నోట్లను మార్చాలన్న దురుద్దేశంతోనే నిందితులు భారీ మొత్తంలో నగదును గోనె సంచుల్లో దాచిపెట్టినట్లు పేర్కొన్నారు.



ఆనంద్ ఖత్రీ ఇంట్లో పట్టుబడిన పాతనోట్లు

సుప్రీం జడ్జీలకు జస్టిస్ రమణ విందు

సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ.. సుప్రీం కోర్టు జడ్జీల కోసం ప్రత్యేక విందు ఏర్పాటుచేశారు. కోర్టు ప్రాంగణంలోని ఆయన చాంబర్‌లో భోజన విరామ సమయంలో జరిగిన విందులో నోరూరించే ఆంధ్రా వంటకాలను వడ్డించారు. తాజాగా నెలకొన్న సుప్రీం సంక్షోభంతో కోర్టు వాతావరణం గంభీరంగా ఉన్న సమయంలో ఏర్పాటుచేసిన ఈ విందు ఉపశమనం లాంటిదని ఓ సీనియర్ జడ్జి పేర్కొన్నారు. అనారోగ్యం కారణంగా జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ ఎస్ఏ బాబ్డే, జస్టిస్ గోయల్ మినహా సీజేఐ దీపక్ మిశ్రా, మిగిలిన 23 మంది న్యాయమూర్తులు ఈ విందులో పాల్గొన్నారు. ప్రతి బుధవారం ఒక్కో జడ్జి తమ ప్రాంత వంటకాలతో జడ్జీల కోసం విందు ఇస్తున్నారు. కాగా, బుధవారం కోర్టు కార్యకలాపాల ప్రారంభానికి ముందే జస్టిస్ చలమేశ్వర్ మినహా మిగిలిన ముగ్గురు తిరుగుబాటు జడ్జీలతో సీజేఐ సమావేశమయ్యారు. గురువారం చలమేశ్వర్ కోర్టుకు హాజరయ్యే అవకాశముంది. దీంతో ఈ నలుగురితో సీజేఐ సమావేశం అవుతారని సమాచారం.

కర్ణాటకలో హంగ్!

- మ్యాజిక్ ఫిగర్‌కు దగ్గరగా కాంగ్రెస్, బీజేపీ
- సీహెచ్ఎస్ సంస్థ సర్వే

సాక్షి, బెంగళూరు: కర్ణాటకలో వచ్చే ఏప్రిల్, మే నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, తాజాగా జరిపిన ఒక సర్వే రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీజేపీ మధ్య పోటీ హోరాహోరీగా ఉంటుందని, జేడీఎస్ కింగ్‌మేకర్‌గా మారే అవకాశం ఉందని ఈ సర్వే చెబుతోంది. సీహెచ్ఎస్ అనే సంస్థ నిర్వహించిన ఈ సర్వే రాష్ట్రంలో హంగ్ ప్రభుత్వం ఏర్పడుతుందంది. కాంగ్రెస్, బీజేపీ తమ వ్యూహాలకు మరింత పదును పెడితే తప్ప మ్యాజిక్ నంబర్ (112 సీట్లు)ను అందుకోవడం కష్టమని తేల్చింది. మొత్తం 224 సీట్లలో కాంగ్రెస్ 77–81 సీట్లు, బీజేపీ 73–76, జేడీఎస్ 64–66 సీట్లను సొంతం చేసుకుంటాయంది. ఈ సర్వే ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ప్రతి నియోజకవర్గంలో 2 వేల మంది నుంచి సమాచారాన్ని సేకరించి సర్వే జరిపినట్లు సీహెచ్ఎస్ తెలిపింది. ఈ సర్వేను కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు పరమేశ్వర్ చేయించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే.. తనకు దీంతో సంబంధమే లేదని, సీహెచ్ఎస్‌తో పాటు గుర్తు తెలియని వ్యక్తులపై సైబర్‌క్రైం సెల్‌లో ఫిర్యాదు చేసినట్లు పరమేశ్వర్ తెలిపారు. నిజానికి తమ పార్టీకి మరిన్ని ఎక్కువ సీట్లు వస్తాయని జేడీఎస్ చెప్పగా, బీజేపీ కూడా ఈ సర్వేను కొట్టిపారేసింది.

తమిళనాట అధికారం డీఎంకేదే!

- మూడో స్థానంలో రజనీకాంత్
- ఇండియా టుడే–కార్వీ సర్వే

సాక్షి ప్రతినిధి, చెన్నై: తమిళనాడు అసెంబ్లీకి ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే డీఎంకే విజయదుందుభి మోగిస్తుందని ఇండియా టుడే–కార్వీ సర్వేలో తేలింది. రెండు నెలల పాటు నిర్వహించిన ఈ సర్వే ఫలితాలను ఇండియా టుడే బుధవారం విడుదల చేసింది. మొత్తం 234 స్థానాలకుగానూ డీఎంకే, కాంగ్రెస్ ఐయూఎంఎల్ పార్టీల కూటమి 34 శాతం ఓట్లతో 130 చోట్ల విజయం సాధిస్తుందని ఆ సంస్థ తెలిపింది. ఈ ఎన్నికల్లో అధికార అన్నాడీఎంకే 26 శాతం ఓటు బ్యాంకుతో కేవలం 68 స్థానాలకే పరిమితమవుతుందని చెప్పింది. ఇంకా పార్టీ పేరు, గుర్తు ప్రకటించకపోయినా సూపర్ స్టార్ రజనీకాంత్ తమిళనాడు రాజకీయాల్లో చక్రం తిప్పనున్నారని తెలిపింది. ఈ ఎన్నికల్లో రజనీ 16 శాతం ఓట్లతో 33 సీట్లను కైవసం చేసుకొని మూడోస్థానంలో నిలుస్తారని వెల్లడించింది. ఈ ఎన్నికల్లో కమల్‌హాసన్ అంతగా ప్రభావం చూపలేకపోవచ్చని చెప్పింది.

ఆధార్ ఓ ఎలక్ట్రానిక్ పగ్గం

- ప్రజల్లో అసమ్మతి లేకుండా చేస్తుంది
- సుప్రీంకు తెలిపిన పిటిషనర్లు



న్యూఢిల్లీ: ఆధార్ అనేది ఒక ఎలక్ట్రానిక్ పగ్గం లాంటిదనీ, జంతువులను తాళ్లతో కట్టేసినట్లు ప్రభుత్వం ఆధార్‌తో ప్రజలను బంధిస్తోందని న్యాయవాది శ్యాం దివన్ సుప్రీంకోర్టుకు తెలిపారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఆధార్ రాజ్యాంగ బద్ధతను సవాల్ చేస్తూ వచ్చిన పిటిషన్లపై బుధవారం విచారణ ప్రారంభించింది. పిటిషనర్ల తరఫున శ్యాం వాదనలు వినిపించారు. 'ఆధార్ ఒక ఎలక్ట్రానిక్ పగ్గం లాంటిది. ఇది సెంట్రల్ డేటాబేస్‌కు కనెక్ట్ అయ్యి ఉంటుంది. పౌరుల రోజువారీ కార్యకలాపాలను, అలవాట్లను గమనించే అవకాశం ఇవ్వడం ద్వారా మెల్లగా ప్రజల్లో అసమ్మతిని అణచివేసి, ప్రభుత్వానికి అనుకూలంగా వారి ప్రవర్తనలో మార్పు తీసుకురాగలదు. ప్రతి దానికీ ఆధార్‌ను లింక్ చేయడం వల్ల ఏ పని చేయాలన్నా అది అవసరమవుతుంది. ఆధార్ నంబర్ లేకుండా బతకలేమనే స్థితి వస్తుంది. అప్పుడు ప్రభుత్వంలోని వారికి ఎవరిపైనైనా ఆగ్రహం వస్తే వారి ఆధార్ నంబర్‌ను స్విచాఫ్ చేస్తే చాలు. సామాజికంగా ఆ వ్యక్తి మరణించినంత పనవుతుంది. ఇలా ఇది ప్రజల్లో అసమ్మతి అనేదే లేకుండా చేస్తుంది' అంటూ శ్యాం వాదించారు. తదుపరి వాదనలు గురువారం కొనసాగనున్నాయి.

ఫిబ్రవరి 21న ముహూర్తం

- అదే రోజు నుంచి రాష్ట్ర పర్యటన
- నటుడు కమల్‌హాసన్ ప్రకటన
- కమల్‌కు రజనీ శుభాకాంక్షలు



సాక్షి ప్రతినిధి, చెన్నై: నటుడు కమల్‌హాసన్ ఫిబ్రవరి 21న కొత్త పార్టీని ప్రకటించనున్నారు. తన సొంతూరైన రామనాథపురంలో పార్టీని ప్రకటించిన అనంతరం రాష్ట్రవ్యాప్త పర్యటనకు శ్రీకారం చుట్టనున్నట్లు మంగళవారం అర్ధరాత్రి విడుదల చేసిన ప్రకటనలో కమల్ తెలిపారు. 'నటుడిగా నా అభివృద్ధికి కారకులైన తమిళ ప్రజానీకానికి కృతజ్ఞతలు. కృతజ్ఞతలు మాత్రమే కాదు, ప్రజలకు అంతకంటే ఎంతో చేయాల్సిన బాధ్యత ఉంది. ఆ బాధ్యతలు నెరవేర్చడం కోసం నేరుగా ప్రజల వద్దకు వెళ్లే కార్యక్రమాన్ని నేను పుట్టిన ఊరైన రామనాథపురం నుంచి వచ్చేనెల 21న ప్రారంభించబోతున్నాను. అదే రోజున పార్టీ పేరును, దాని లక్ష్యాలను ప్రకటించి, నా రాజకీయ ప్రస్థానాన్ని ఆరంభిస్తాను. రామనాథపురం, మధురై, దిండుగల్లు, శివగంగై జిల్లాల ప్రజలను కలుసుకుంటాను. ఇది నా దేశం, దీనిని కాపాడుకోవాలి అనే భావన నాకు మాత్రం ఉంటే సరిపోదు, మనమంతా కలిసి ఈ రాజకీయ రథాన్ని లాగడమే ప్రజాస్వామ్యం'అని కమల్ పేర్కొన్నారు.

కాలమే నిర్ణయిస్తుంది:రజనీ

కమల్ పార్టీని ప్రకటించడంపై నటుడు రజనీకాంత్ శుభాకాంక్షలు తెలిపారు. దివంగత సీఎం ఎంజీ రామచంద్రన్ 1973లో హీరోగా నటించి నిర్మించిన 'ఉలగం చుట్రు వాలిబన్' సినిమా సీక్వెల్ యానిమేషన్ చిత్రం ప్రారంభ వేడుక బుధవారం చెన్నైలో జరిగింది. ఈ వేడుకలో కమల్, రజనీ పాల్గొని ఒకే వేదికను పంచుకున్నారు.

ప్రపంచశక్తిగా భారత్!



సబర్మతి ఆశ్రమంలో చరఖాపై నూలు వడుకుతున్న నెతన్యాహు దంపతులు. చిత్రంలో మోదీ

- మోదీపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రశంసల జల్లు
- ఇజ్రాయెల్ సృజనాత్మకత భేష్ అంటూ కొనియాడిన ప్రధాని మోదీ
- అహ్మదాబాద్‌లో మోదీ–నెతన్యాహు దంపతుల రోడ్‌షో

అహ్మదాబాద్: భారత్‌ను ప్రపంచశక్తిగా తీర్చిదిద్దేందుకు సృజనాత్మకత ద్వారా భారత ప్రధాని నరేంద్ర మోదీ మార్పు తీసుకొస్తున్నారని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రశంసించారు. దూరదృష్టితో మోదీ భారత్‌లో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారని కొనియాడారు. అటు ప్రధాని మోదీ కూడా ఇజ్రాయెల్ సృజనాత్మకతను ప్రశంసించారు. నవభారత నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం సృజనాత్మకతను ప్రోత్సహించే వ్యవస్థను నెలకొల్పేందుకు కృషిచేస్తోందన్నారు. నెతన్యాహుతో కలిసి అహ్మదాబాద్ సమీపంలోని దియోధోలేరా గ్రామంలో ఏర్పాటుచేసిన 'ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ టెక్నాలజీ' (ఐ క్రియేట్)ను మోదీ జాతికి అంకితం చేశారు. అనంతరం మోదీ, నెతన్యాహు దంపతులు పతంగులు ఎగురవేశారు. భారత పర్యటన స్ఫూర్తిదాయకంగా మిగిలిపోతుందని నెతన్యాహు అన్నారు.

మేమిద్దరం యువకులమే!

పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మించిన ఈ ఐ క్రియేట్ కేంద్రాన్ని జాతికి అంకితం చేసిన అనంతరం.. ఈ కార్యక్రమానికి హాజరైన యువ వ్యాపారవేత్తలు, వాణిజ్య ప్రముఖులనుద్దేశించి ఇరువురు నేతలు ప్రసంగించారు. ప్రతి రంగంలో భారత్‌తో భాగస్వామ్యం కోసం ఇజ్రాయెల్ సిద్ధంగా ఉందని నెతన్యాహు పేర్కొన్నారు. ఇజ్రాయెల్ యువత భారత్‌లో పర్యటించి ఐ క్రియేట్ ద్వారా శక్తిసామర్థ్యాలను పెంచుకోవాలని కోరారు. 'ప్రధాని మోదీ దూరదృష్టి గల నాయకత్వంతో భారత్‌లో విప్లవాత్మక మార్పులు తెస్తున్నారు. భవిష్యత్తులో ఈ మార్పు ద్వారా ప్రపంచశక్తిగా భారత్ మారేందుకు ఆయన పనిచేస్తున్నారు. నైపుణ్యత, సృజనాత్మకత ద్వారా దీన్ని సాధిస్తున్నారు' అని నెతన్యాహు పేర్కొన్నారు. 'నేను, మోదీ ఇద్దరు యువకులమే. ఆశావాద దృక్పథంతో ముదుకెళ్తున్నాం. మా ఆలోచనలు నిత్య యవ్వనం' అని పేర్కొన్నారు.

నవభారత నిర్మాణానికి...

సృజనాత్మక వ్యవస్థ ద్వారా నవభారత నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కృషిచేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. వ్యాపారవేత్తలకు నిధులు, స్థలాలు, మార్గదర్శకులను ఇవ్వటంతోపాటు ఇతర వసతులు కల్పించి వారిలోని సామర్థ్యానికి పదును పెట్టేందుకే 'ఐ క్రియేట్'ను ఏర్పాటుచేశామన్నారు. అనంతరం, సబర్‌కంఠ జిల్లాలోని వాద్రాద్ గ్రామంలో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ వెజిటబుల్స్' ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మోదీ, నెతన్యాహు పాల్గొన్నారు. భారత్ ఓ స్వప్నంతో ముందుకెళ్తున్న దేశమని నెతన్యాహు ప్రశంసించారు. ఇజ్రాయెల్ సాంకేతికతతో గుజరాత్ రైతులు సాధిస్తున్న విజయాలను ఈ సందర్భంగా నెతన్యాహు ప్రశంసించారు.

అట్టహాసంగా రోడ్ షో

మోదీ, నెతన్యాహుల రోడ్ షో అహ్మదాబాద్ వీధుల్లో ఘనంగా సాగింది. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విమానాశ్రయం నుంచి సబర్మతి ఆశ్రమం వరకు 8 కి.మీ. మేర పటిష్ట భద్రత నడుమ ఈ రోడ్ షో జరిగింది. రోడ్లకు ఇరువైపులా వేల సంఖ్యలో ప్రజలు భారత్, ఇజ్రాయెల్ పతకాలు చేతిలో పట్టుకుని బారులు తీరారు.

మోదీకి కానుక

భారత పర్యటన సందర్భంగా మోదీకి నెతన్యాహు ప్రత్యేకమైన కానుక అందజేశారు. నీటిలోని లవణాలు తొలగించి శుద్ధిచేసే 'గాల్–మొబైల్ వాటర్ డీసాలినేషన్ అండ్ ప్యూరిఫికేషన్ జీప్'ను కానుకగా ఇచ్చారు. అహ్మదాబాద్ జిల్లా బావ్లా సమీపంలో జరిగిన కార్యక్రమంలో ఈ నీటి శుద్ధి యంత్రాన్ని మోదీకి అందజేశారు. ఈ వాహనాన్ని నెతన్యాహు సమక్షంలోనే బనకంఠ జిల్లా సుయిగామ్ (భారత్–పాక్ సరిహద్దుల్లోని గ్రామం) ప్రజలకు మోదీ అంకితం చేశారు. 'గతేడాది ఇజ్రాయెల్ పర్యటనలో నాకు ఈ వాహనాన్ని చూపించారు. చెత్త నీటిని కూడా ఇది శుద్ధి చేస్తుంది. ఇప్పుడు ఆ వాహనాన్ని నెతన్యాహు కానుకగా ఇచ్చారు. సరిహద్దుల్లోని సుయిగామ్‌లో ఇది ఉంటుంది. దీనిద్వారా సరిహద్దులోని జవాన్లకు శుద్ధమైన తాగునీరు అందుతుంది' అని మోదీ పేర్కొన్నారు.

రాజధానిలో ఇసుక తవ్వకాల వివరాలివ్వండి


ఏపీ ప్రభుత్వానికి ఎన్జీటీ ఆదేశం



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతి ప్రాంతంలో సాగుతున్న ఇసుక తవ్వకాలపై పూర్తి వివరాలను తమ ముందుంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్జీటీ) ఆదేశించింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలను సవాల్ చేస్తూ 'రేలా'అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ యూడీ సాల్వీ నేతృత్వంలోని ఎన్జీటీ ధర్మాసనం బుధవారం విచారించింది. ప్రకాశం బ్యారేజీలో పూడికతీత పేరుతో ప్రభుత్వం భారీ యంత్రాలతో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడుతోందని పిటిషనర్ల తరఫు న్యాయవాది శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. అక్కడ లభ్యమయ్యే ఇసుకను రాజధాని నిర్మాణానికి మాత్రమే వినియోగిస్తున్నామని ఏపీ ప్రభుత్వం తరఫు న్యాయవాది ప్రమోద్ వెల్లడించారు. రాజధాని ప్రాంతంలో కాంట్రాక్టు సంస్థలు చేపట్టే నిర్మాణాలకు గాను ఇసుక కోసం ప్రభుత్వం ఇస్తున్న నిధులపై పూర్తి వివరాలను తమకు అందజేయాలని ఎన్జీటీ ట్రిబ్యునల్ ఆదేశించింది. అనంతరం అక్కడ జరుగుతున్న ఇసుక తవ్వకాలు అక్రమమా? సక్రమమా? అనేది తేలుస్తామని స్పష్టం చేసింది.

తెలంగాణ వివరాలు కూడా ఇవ్వండి : తెలంగాణ రాష్ట్రంలో పూడికతీత పేరుతో నదుల నుంచి ఇసుకను తవ్వేస్తూ, అక్కడి ప్రభుత్వం అమ్ముకుంటోందని, వీటికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని న్యాయవాది శ్రావణ్‌కుమార్ తెలిపారు. తెలంగాణలో తవ్వుతున్న ఇసుకను ప్రజోపయోగ ప్రాజెక్టుల నిర్మాణాలకు వినియోగిస్తున్నట్టు తెలంగాణ తరఫు న్యాయవాది ఎ.సంజీవ్‌కుమార్ చెప్పారు. దీంతో తవ్వకాలు జరుగుతున్న తీరు, ఇసుక వినియోగానికి సంబంధించి వివరాలు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఎన్జీటీ ట్రిబ్యునల్ ఆదేశించింది.

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిగా సిసోడియా



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో)గా ఆర్.పి.సిసోడియాను నియమిస్తూ బుధవారం కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఆయన ప్రస్తుతం గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు భన్వర్‌లాల్ సీఈవోగా పనిచేశారు. ఆయన పదవీ విరమణ చేసిన తర్వాత జాయింట్ సీఈవో అనూప్‌సింగ్ రెండు రాష్ట్రాలకు ఇన్‌చార్జి సీఈవోగా విధులు నిర్వర్తిస్తున్న విషయం తెలిసిందే.

పోలవరాన్ని జాతీయ స్కాంగా మార్చారు



వైఎస్సార్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి పార్థసారథి

సాక్షి, హైదరాబాద్: పోలవరం జాతీయ ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జాతీయ స్థాయి కుంభకోణంగా మార్చేశారని వైఎస్సార్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి కొలుసు పార్థసారథి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ జరిపితే ఒక నెల వ్యవధిలోనే చంద్రబాబు పదవీచ్యుతుడై జైలుకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు టెండర్లు, ఇష్టారాజ్యంగా పెంచేసిన నిర్మాణ అంచనా వ్యయం, కాంట్రాక్టు అక్రమాలపై వస్తోన్న విమర్శలను పరిగణలోకి తీసుకుని ముఖ్యమంత్రే స్వయంగా సీబీఐ విచారణను కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టులో సాగుతున్న అవినీతి, అక్రమాలపై వైఎస్సార్‌సీపీ ఇంతకాలంగా చెప్తోందని, రైతుల నుంచి తాజాగా అందిన ఫిర్యాదులపై ప్రధాని కార్యాలయం కూడా స్పందించిందని చెప్పారు. తాము ఆరోపించిన అక్రమాలపై కేంద్రం నేడు ప్రశ్నిస్తోందని తెలిపారు. ఈ విషయాలపై పోలవరం అథారిటీ మెంబరు సెక్రటరీ డాక్టరు ఆర్‌కే గుప్త ఏపీ జలవనరుల శాఖ ఇంజనీరు–ఇన్–చీఫ్‌ను వివరణ అడిగారని... గుప్త రాసిన లేఖను మీడియా ముందుంచారు.

పోలవరంపై సీబీఐ విచారణ జరగాలి : చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు నుంచి అందినకాడికి దోచుకోవాలనే చూస్తున్నారని పార్థసారథి ధ్వజమెత్తారు. దీనిపై సీబీఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టును ఒక బంగారు బాతులాగా చూస్తున్నారని, జరగని పనిని జరిగినట్లు చూపించి కాంట్రాక్టర్లకు బిల్లులు విడుదల చేసి తన వంతు వాటా నిధులను కొట్టేస్తున్నారని ఆరోపించారు.

విజ్ఞానాన్ని పెంచేందుకే గ్రంథాలయాలు

బ్రెడ్ సంస్థ నిర్వాహకుడు అశోక్ కాచె



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న బ్రెడ్ సంస్థ నిర్వాహకుడు అశోక్ కాచె

హైదరాబాద్: విద్యార్థుల్లో విజ్ఞానం, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి బ్రెడ్ (బేసిక్ రీసెర్చ్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్) సొసైటీ పనిచేస్తుందని సంస్థ నిర్వాహకుడు అశోక్ కాచె పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి శంషీగూడ ప్రభుత్వ పాఠశాలలో సంస్థ ఆధ్వర్యంలో రూ.25 వేలతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంపొందించి, పోటీ పరీక్షల్లో విజయాలు సాధించేందుకు గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని 8 ఏళ్లుగా చేపడుతున్నామని, రాష్ట్రంలో ఇప్పటివరకు 406 గ్రంథాలయాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. బ్రెడ్ సంస్థ తమ పాఠశాలలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దేవమణి చెప్పారు. సంస్థ సహకారంతో విద్యార్థుల కోసం సమీక్ష పోటీలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బ్రెడ్ సంస్థ నిర్వాహకులు శశిభూషణ్ కాచె, విద్యాసాగర్, విజయసాయి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నలుగురు రైతుల ఆత్మహత్య

ఆమనగల్లు/కొత్తగూడ/దిలావర్‌పూర్/కమ్మర్‌పల్లి: అప్పుల బాధతో నలుగురు రైతులు వేర్వేరుగా ఆత్మహత్య చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లికి చెందిన కౌలు రైతు వల్లబుదాసు నర్సింహ(50) ఏడు ఎకరాలు కౌలుకు తీసుకుని ఈ ఏడాది పత్తి సాగుచేశారు. ఆశించిన విధంగా దిగుబడి రాకపోవడం.. అప్పులు పెరగడంతో ఈ నెల 11న పొలం వద్ద పురుగుల మందు తాగాడు. హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో మంగళవారం రాత్రి చనిపోయాడు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని ముస్మికి చెందిన రైతు అజ్మీరా గంగాధర్(37) సాగుకోసం రూ. ఐదు లక్షల వరకు అప్పులు చేశాడు. అవి తీరే మార్గంలేక పొలం వద్దే ఆత్మహత్య చేసుకున్నాడు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం సాంగ్వి గ్రామానికి చెందిన యువ రైతు కోండ్రు రాజారెడ్డి(36) కౌలు రైతు. వ్యవసాయం గిట్టుబాటు కాక మనస్తాపం చెందిన రాజారెడ్డి భార్య మమత సంక్రాంతి పండుగ కోసం తల్లిగారింటికి వెళ్లిన క్రమంలో బుధవారం ఉరి వేసుకున్నాడు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్‌లో అప్పుల బాధతో రైతు కొత్తూరి సాయిలు (53) ఆత్మహత్య చేసుకున్నాడు.



సాగర్ ప్రాజెక్టు దిగువన గల ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రంలో టెయిల్‌పాండ్‌లోనుంచి నీటిని ఎత్తిపోసుకునేందుకు బుధవారం విద్యుత్‌శాఖ సీఎండీ ప్రభాకర్ రావు రిబ్బన్‌కట్ చేసి ట్రయల్ రన్‌ను ప్రారంభించారు. ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రంలో 8 టర్బైన్లు ఉన్నాయి. 2వ టర్బైన్‌ను పంపుగా వాడుకునేందుకు లోడ్ వేయగానే ట్రిప్పు అయినట్లు సమాచారం. ప్రైమింగ్ ప్రెజర్ సరిపోయేంతగా రాకపోవడంతో పంపులు ఆగిపోయాయని తెలిసింది. సాంకేతిక సమాచారం కోసం జపాన్ దేశీయులను ఆశ్రయించి వారి సూచనల మేరకే తిరిగి పంపులు ప్రారంభించనున్నారు.

–నాగార్జునసాగర్

చట్టసభల్లో బీసీలందరికీ ప్రాతినిధ్యం

ప్రతి కులానికీ అవకాశం కల్పిస్తాం

బీసీల ఆత్మీయ సమ్మేళనంలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ హామీ

అవకాశం రాని కులాల వారికి ఇతరత్రా ప్రాధాన్యం



బీసీల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ప్రతిపక్షనేత వైఎస్ జగన్

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి : బడుగు బలహీన వర్గాల వారు చట్టసభల్లో తమ వాణి వినిపించేలా చూస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు చట్టసభల్లో ప్రాతినిధ్యం లేని కులాల వారికి అటు కౌన్సిల్‌లోనో లేక అసెంబ్లీలోనో అవకాశం కల్పిస్తానని చెప్పారు. చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించలేని వారికి టీటీడీ, శ్రీకాళహస్తి తదితర ఆలయాల బోర్డుల్లోనో, మరో విధంగానో అవకాశం కల్పిస్తానని చెప్పారు. తనకు తోడుగా కౌన్సిల్‌లో కూర్చోబెట్టుకుంటానని, అందుకు తనకు సహకరించాలని కోరారు. ప్రాతినిధ్యం లేని కులాలకు అవకాశం కల్పించినప్పుడు ఆయా కులాల అస్థిత్వం అందరికీ తెలుస్తుందన్నారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా 64వ రోజు బుధవారం చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని పాపానాయుడుపేట గ్రామంలో జరిగిన బీసీల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. చేనేత, పూసల కార్మికులను ఆదుకుంటానన్నారు. రికార్డులు తారుమారు చేసి పేదల భూములు కాజేసిన వారి భరతం పడతానని హెచ్చరించారు. అక్కచెల్లెమ్మల కన్నీటి గాథలతోనైనా ముఖ్యమంత్రికి బుద్ధి వస్తుందేమో చూద్దామన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్నప్పుడు జనానికి తాయిలాలు వేయడం బాబుకు అలవాటేనన్నారు. ఈ సమ్మేళనంలో ఆయన ఇంకా ఏమన్నారంటే..

ప్రతి కులాన్నీ బాబు ఎలా మోసం చేశారో చూడండి..

''బీసీలను మోసం చేసేందుకు (టీడీపీ ఎన్నికల ప్రణాళికలో వివిధ కులాలకు ఇచ్చిన హామీలు, చంద్రబాబు ఫొటో పోజులను చూపిస్తూ..) టీడీపీ మేనిఫెస్టోలో ప్రతి కులానికి ఒక పేజీ పెట్టారు. రకరకాలుగా ఫోజులు ఇస్తాడు. గౌడ సోదరులు కనిపిస్తే వారి భుజాన ఉన్న ట్యూబ్ తన భుజంపై వేసుకొని పోజులు కొడతారు. రోడ్డు పక్కన బుట్టలల్లే వాళ్లు కనబడితే వాటిని అల్లుతున్నట్లు పోజు పెడతాడు. పక్కనే చేనేత కార్మికులు కనబడితే వారి ఇళ్లల్లోకి వెళ్లి పక్కనే కూర్చొని ఫొటోలు దిగుతాడు. ఆ ఫొటోలతో ఎన్నికల ప్రణాళిక తయారు చేశాడు. ఇలా ప్రతి కులాన్నీ మోసం చేయడమే లక్ష్యంగా ఇచ్చిన ఎన్నికల హామీలకు లెక్కే లేదు. రజకులను ఎస్సీలుగా గుర్తించేందుకు చర్యలు తీసుకుంటారట. కురువ, కురుబలను ఎస్టీలుగా గుర్తిస్తారట. బోయలను ఎస్టీలుగా గుర్తించేందుకు చర్యలు తీసుకుంటారట. ఇలా అమలు చేయలేని అనేక హామీలు ఇచ్చి ప్రతి కులాన్నీ మోసం చేశాడు. చిత్రమేమిటంటే చేయలేనని తెలిసి కూడా చేస్తానని హామీ ఇవ్వడం. వాటిని ఎవరైనా అడిగితే వారిపై విరుచుకు పడటం, తాట తీస్తానని బెదిరించడం. ఇటీవల మత్స్యకారులు చంద్రబాబును నిలదీస్తే.. ముఖ్యమంత్రినే అడుగుతావా? తాట తీస్తా.. ఖబడ్దార్ అంటూ హెచ్చరించాడు. సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రతి కులాన్నీ మోసం చేశాడు.

బోయలపై ఇది మూడో తీర్మానం...

మొన్న అసెంబ్లీలో బోయలను ఎస్టీలుగా చేర్చాలని తీర్మానం చేసి ఢిల్లీకి పంపించారట. ఆశ్చర్యం ఏమిటంటే అసెంబ్లీలో బోయలపై ఇది మూడో తీర్మానం. ఇక నా చేతిలో ఏమీ లేదు, నా పని అయిపోయింది, ఇక చేయాల్సింది కేంద్రమే అని చేతులు కడుక్కుంటాడు చంద్రబాబు. ఎన్నికలప్పుడేమో ప్రయత్నం చేస్తానని కాదు.. చేసేస్తా అంటాడు. ఇప్పుడేమో నా చేతుల్లో లేదని తప్పించుకుంటున్నారు. అది జరగదని ఆయనకు (బాబు) తెలుసు. కానీ ఏమి చేస్తాడో తెలుసా? అంతా అయిపోయినట్టేనని ఆయా కులస్తులను నమ్మించేందుకు సీఎంవో కార్యాలయం నుంచే ఫోన్లు చేసి కేక్‌లు కట్ చేసి సంబరాలు చేయమంటాడు. మరోపక్క అదే కార్యాలయం నుంచే వ్యతిరేకులకు ఫోన్ చేసి ధర్నాలు చేయండి.. ఆందోళనలు చేయండని చెప్పిస్తాడు. ఇంతటి దారుణమైన రాజకీయం చేస్తున్న వ్యక్తిని నా జీవితంలో చూడలేదు. అంతెందుకు ఇక్కడే చూడండి. పెరిక బలిజలు 40 ఏళ్లుగా బీసీలు. వాళ్లు తమ బీసీ సర్టిఫికెట్‌ను పునరుద్ధరించమని అడిగితే వాటిని ఇవ్వడం లేదు. అగ్నికుల క్షత్రియులు న్నారు. వాళ్లు మత్స్యకారులు. బీసీ సర్టిఫికెట్ల కోసం వాళ్లు ఆఫీసుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సి వస్తోంది. అయినా దిక్కులేదు. అందుకే చంద్రబాబు నాలుగేళ్ల పాలనపై ఆలోచన చేయమని కోరుతున్నా.

బీసీ గర్జనలో డిక్లరేషన్ ప్రకటిస్తాం: బీసీలకు ఏమి చేస్తే మేలు జరుగుతుందనే దానిపై అధ్యయనం చేసేందుకు ఒక కమిటీని నియమించాం. ఆ కమిటీ రాష్ట్రంలోని ప్రతి జిల్లా, నియోజకవర్గంలో పర్యటిస్తుంది. ప్రజలతో మమేకం అవుతుంది. పరిస్థితులను గమనిస్తుంది. పాదయాత్ర ముగిసిన తర్వాత బీసీ గర్జన ఏర్పాటు చేసి అందులో బీసీ డిక్లరేషన్‌ను ప్రకటిస్తాం. అందులో బీసీలకు ఏం చేస్తామన్నది పొందుపరుస్తాం. మన ప్రభుత్వం వచ్చాక వాటిని తప్పకుండా అమలు చేస్తాం. చేనేత కార్మికుల కష్టాలేమిటో నాకు స్వయంగా తెలుసు. చేనేత సదస్సు జరిగినప్పుడు అనేక సంగతులు తెలుసుకున్నా. అందుకే చెబుతున్నా.. నేను చనిపోయిన తర్వాత నాన్న గారి ఫొటోతో పాటు నా ఫొటో కూడా ప్రతి ఇంట్లో పక్క పక్కనే పెట్టుకునేంతగా సాయం చేస్తా'' అని జగన్ భరోసా ఇచ్చారు. ఈ సమ్మేళనంలో బీసీ సెల్ రాష్ట్ర కన్వీనర్ జంగా కృష్ణమూర్తి తదితరులు ప్రసంగించారు.

మరిన్ని ఫొటోలు టాబ్లాయిడ్‌లో

చంద్రబాబుకీ నాన్న గారికీ ఉన్న తేడా ఇదీ..

చంద్రబాబు సొంత నియోజకవర్గం చంద్రగిరి. 1978లో కాంగ్రెస్ పార్టీ తరఫున అక్కడ పోటీ చేసి 2,500 ఓట్ల మెజారిటీతో గెలిచారు. నాన్నగారి పుణ్యాన మంత్రి అయ్యారు. ఐదేళ్లు పరిపాలించారు. తిరిగి 1983లో అదే నియోజకవర్గం నుంచి పోటీ చేసి 17,500 మెజారిటీతో ఎన్టీఆర్ పార్టీ చేతిలో ఓడిపోయారు. అయినా ఎన్టీఆర్.. ఓడిపోయి చచ్చిన పాములా పడి ఉన్న చంద్రబాబును పార్టీలోకి తీసుకుని ఆదరించారు. మంత్రిని చేశారు. ఇంతా చేస్తే సొంత మామను అదీ కుమార్తెను ఇచ్చిన మామను చంద్రబాబు వెన్నుపోటు పొడిచాడు. అది బాబు నైజం.

నాన్నగారు ఎలాంటి వారంటే..

నాన్నగారు చిన్నప్పుడు వెంకటప్ప అనే వడ్డెర కులానికి చెందిన మాస్టారి గారింట రెండు మూడేళ్లు ఉండి చదువుకున్నారు. ఆ విషయాన్ని నాన్న గారు మరచిపోకుండా వెంకటప్ప మాస్టారు పేరిట పులివెందులలో వెంకటప్ప మెమోరియల్ స్కూలు పెట్టారు. ఇప్పటికి 11..12 ఏళ్లయింది. వైఎస్సార్ ట్రస్ట్ తరఫున నా భార్య భారతి ఆ స్కూలును గొప్పగా నిర్వహిస్తోందని చెప్పడానికి గర్వపడుతున్నా. 2500 మంది పిల్లలున్నారు. ఇంగ్లిషు మీడియం స్కూలు. యూనిఫారం మొదలు విద్య అంతా ఉచితమే. జిల్లాలో పదో తరగతిలో అత్యధికంగా ఉత్తీర్ణత సాధించిన స్కూలు కూడా అదే. తనను చదివించిన ఓ బీసీ కులానికి చెందిన మాస్టారు పట్ల వైఎస్సార్ చూపిన ప్రేమాభిమానం అది. కానీ చంద్రబాబు మాత్రం తనను ఆదరించిన మామనే వెన్నుపోటు పొడిచాడు. ఇద్దరి మధ్య తేడా ఏమిటో మీరే చూడండి.

ఈఏపీ అయితే ఏళ్లు పడుతుంది..

- నాబార్డు, హడ్కో ద్వారా ఇవ్వండి
- 'ప్రత్యేక సాయం'పై అరుణ్ జైట్లీతో చంద్రబాబు



ఢిల్లీలో జైట్లీతో భేటీ అయిన చంద్రబాబు

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రానికి ఇస్తానన్న ప్రత్యేక సాయాన్ని ఎక్స్‌టెర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టు(ఈఏపీ)ల రూపంలో ఇవ్వాలంటే ఏళ్లకు ఏళ్లు పడుతుందని, అలా కాకుండా నాబార్డు, హడ్కో ద్వారా ఇవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి విజ్ఞప్తి చేశారు. ఆయన బుధవారం ఇక్కడ జైట్లీని కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ''ఆర్థిక మంత్రిని కలిసి రాష్ట్ర సమస్యలపై వివరించాను. ప్రత్యేక హోదా ఉంటే కేంద్ర ప్రాయోజిత పథకాల రూపంలో రాష్ట్రానికి వచ్చే రూ. 16 వేల కోట్లను ఈఏపీ రూపంలో కాకుండా నాబార్డు, హడ్కో, వాణిజ్య బ్యాంకుల ద్వారా ఇవ్వగలిగితే తక్షణం ఉపయోగించుకుంటామని వివరించాం. ఆయన సానుకూలంగా స్పందించారు. రెవెన్యూ లోటు భర్తీకి రూ. 16 వేల కోట్లు రీయింబర్స్‌మెంటు ఇస్తామని, ఇప్పటికి రూ. 4 వేల కోట్లు ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టుపై గడ్కరీతో మొన్న సమావేశమయ్యాం. కాంట్రాక్టర్ చేయలేకపోతే కొత్త కాంట్రాక్టర్‌కు ఇచ్చేందుకు నిన్న, ఇవాళ చర్చలు జరిగాయి. ఇక విశాఖలో రైల్వే జోన్ రావాలి. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను ప్రారంభించాలని కోరాను..''అని తెలిపారు. సీఐఐ, డీఐపీపీ, ఏపీ ప్రభుత్వం కలిసి ఫిబ్రవరి 24, 25, 26 తేదీల్లో విశాఖలో ఇన్వెస్టర్ల మీట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సీఎం వెంట కేంద్ర మంత్రులు అశోక్ గజపతి రాజు, వై.ఎస్.చౌదరి, ఎంపీలు సీఎం రమేశ్, తదితరులు ఉన్నారు.

విద్యుత్తు ఛార్జీలు తగ్గుముఖం

తాము అమలు చేస్తున్న రెండో తరం విద్యుత్తు సంస్కరణలతో విద్యుత్తు ఛార్జీలు తగ్గుముఖం పడుతుందని చంద్రబాబు చెప్పారు. బుధవారం మధ్యాహ్నం ఇక్కడ జరిగిన 'సీఐఐ భాగస్వామ్య సదస్సు–2018 సన్నాహక సమావేశం'లో పలు దేశాల పారిశ్రామిక ప్రతినిధులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ''గడిచిన మూడేళ్లుగా రెండంకెల వృద్ధి రేటు సాధిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. భవిష్యత్తులో 15 శాతం వృద్ధి రేటు సాధిస్తాం. సులభతర వాణిజ్య విధానంలో మేం నంబర్ 1గా ఉన్నాం. రెండో తరం విద్యుత్తు సంస్కరణలు చేపడుతున్నాం. విద్యుత్తు ఛార్జీలు మరింత తగ్గేందుకు ఇది దోహదపడుతుంది. అమరావతిలో మీరు పెట్టుబడి పెట్టే ప్రతిపైసాకు లాభదాయకత ఉంటుంది. విశాఖ సదస్సుకు మీరంతా రావాలి..''అని ఇన్వెస్టర్లను కోరారు. సదస్సులో కేంద్ర వాణిజ్య మంత్రి సురేష్ ప్రభు పాల్గొన్నారు. ఈ సదస్సులో రాజధాని అమరావతి భవనాల ఆకృతులు ఆకర్షణగా నిలిచాయి.

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

సాక్షి, విశాఖపట్నం: ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తామని, పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. విశాఖలో అంతర్జాతీయ మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సదస్సును సీఎం బుధవారం ప్రారంభించారు.

21న దావోస్‌కు చంద్రబాబు

ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు ఈ నెల 21న దావోస్ వెళ్లనున్నట్లు సీఓంవో తెలిపింది. 24 వరకూ ఆయన దావోస్‌లోనే ఉంటారని, ఆర్థిక వేదిక సదస్సు సందర్భంగా జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని. కాగా, ఈనెల 20న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది.

టీడీపీ మద్దతుదారుల మరో దాష్టీకం

సీఎం చంద్రబాబు ఇలాకాలో ఘటన

కుప్పం రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో కీచకపర్వం బుధవారం చోటుచేసుకుంది. వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన భార్యాభర్తలపై అధికార టీడీపీకి చెందినవారు దాడి చేశారు. వివస్త్రను చేసి కిరాతకంగా ప్రవర్తించారు. కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం గుంజార్లపల్లికి చెందిన దంపతులకు అదే గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మితో కొంతకాలంగా గొడవలున్నాయి. బుధవారం భార్యాభర్తలు కలసి పక్కింట్లోని అవ్వ దగ్గరకు వెళ్తుండగా వారిని చూసిన భాగ్యలక్ష్మి ఉమ్మివేసింది. దీన్ని వారు ప్రశ్నించారు. రెచ్చిపోయిన భాగ్యలక్ష్మి తన బంధువులతో కలసి వారిపై దాడికి తెగబడింది. బాధితురాలిని అందరి ముందే వివస్త్రను చేశారు. రాళ్లతో తీవ్రంగా కొట్టారు. అడ్డుకున్న ఆమె భర్తనూ చితకబాదారు.

ఎంఈవో అనుమతి అన్యాయం

పీఆర్‌టీయూ ఆవేదన

సాక్షి, హైదరాబాద్: ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు సెలవు కోసం ఎంఈవో అనుమతి తీసుకోవాలనడం అన్యాయమని ఎమ్మెల్సీ కె.జనార్దన్‌రెడ్డి, పీఆర్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పి.సరోత్తం, జి.చెన్నకేవశరెడ్డి అన్నారు. బుధవారం విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరిని కలసి ఉపాధ్యాయులకు జరుగుతున్న అన్యాయాలను వివరించారు. దీనిపై తగు న్యాయం చేయాలని కోరారు.

తెలంగాణ

ఈఎస్‌ఐ వైద్యం.. కార్మికుడి దైన్యం..

ప్రైవేటు ఆస్పత్రుల్లో సేవలకు సొంతఖర్చులే • నెలలు దాటినా అందని రీయింబర్స్‌మెంట్ డబ్బులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా కార్మికులకు సేవలందించాల్సిన ఈఎస్‌ఐ దారుణంగా మారుతోంది. ఇందులో 15.2 లక్షల మంది ఈఎస్‌ఐ ఖాతాదారులున్నారు. వారి కుటుంబ సభ్యులతో కలిపి గరిష్టంగా 50లక్షల మంది ఈఎస్‌ఐ పథకం కింద అర్హులవుతారు. ఈఎస్‌ఐ పథకం కింద లబ్ధిదారులకు శాఖపరమైన ఆస్పత్రులు, సేవలు అందుబాటులో లేని పక్షంలో ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం పొంది ఆమేరకు బిల్లును తిరిగి పొందే వెసులుబాటు ఉంది. చికిత్స పొందిన వారికి ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు అనుగుణంగా ఈఎస్‌ఐ యంత్రాంగం బిల్లును ఆమోదించి లబ్ధిదారులకు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి. ప్రస్తుతం రీయింబర్స్‌మెంట్ ప్రక్రియ కార్మికులకు గుదిబండగా మారింది. ఏళ్లు గడిచినా బిల్లులకు మోక్షం లేక ఖాతాదారులు అప్పులపాలు కావాల్సివస్తోంది.

బకాయిలు రూ.72 కోట్లు...

ఈఎస్‌ఐ విభాగంలో రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయి. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో క్లియరెన్స్‌లో జాప్యం జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12వేల మంది కార్మికులకు సంబంధించి రూ.72 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఏడాదిగా వీటి చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. ఇవేగాకుండా 2015–16, 2016–17 సంవత్సరానికి గాను బకాయిలు సైతం పూర్తిస్థాయిలో విడుదల కాలేదు.

సేవలూ అంతంతే..: ఈఎస్‌ఐ ఖాతాదారులకు రీయింబర్స్‌మెంట్‌కు గాను ప్రత్యేక నిబంధనలున్నాయి. రీయింబర్స్‌మెంట్ కింద అర్హత సాధించాలంటే ముందుగా సమీప ఈఎస్‌ఐ ఆస్పత్రి వైద్యుల అనుమతి తీసుకోవాలి. అక్కడ రిఫరెన్స్ పొందిన తర్వాత ప్రైవేటు ఆస్పత్రిలో అడ్మిట్ కావాలి. అత్యవసర, హృద్రోగాలు మినహాయించి మిగతా కేటగిరీకి చెందిన వారికి ఈ నిబంధన తప్పనిసరి. కానీ ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరుతున్న వారిలో ఎక్కువ మంది రిఫరెన్స్ తీసుకోవడం లేదు. ఈఎస్‌ఐ ఆస్పత్రుల్లో వైద్యులు ఉండకపోవడం, సేవల కల్పనలో జాప్యం, పరికరాల కొరత లాంటి కారణాలతో రోగులు ప్రైవేటుబాట పడుతున్నారు. రిఫరెన్స్ లేనివారికి సైతం రీయింబర్స్‌మెంట్ వర్తింపజేస్తున్నప్పటికీ... అవగాహన కల్పించడంలో యంత్రాంగం విఫలమవుతోందనే విమర్శలున్నాయి.

ఉత్తమ్ సారథ్యంలోనే..!

వచ్చే ఎన్నికలపై కాంగ్రెస్ అధిష్టానం మనోగతం

- మార్పులుండబోవని పీసీసీకి సంకేతాలు
- సీనియర్లతో ప్రచార కమిటీ • చైర్మన్‌గా పీసీసీ చీఫ్, ముగ్గురు కన్వీనర్లు
- ఫిబ్రవరిలో రాష్ట్రానికి రాహుల్ • ఆ తర్వాత ప్రచార కమిటీ నియామకం!
- ఎన్నికలకు ఆర్నెల్ల ముందు నుంచే అభ్యర్థుల ఖరారు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలోనే వచ్చే సాధారణ ఎన్నికల పోరుకు వెళ్లే అవకాశం కనిపిస్తోంది. ఎన్నికలకు కేవలం ఏడాది ముందు పీసీసీ అధ్యక్షుడిని మార్చడం వల్ల ప్రయోజనం ఉండదని పార్టీ అధిష్టానవర్గం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఉత్తమ్ నాయకత్వంలోనే ముందుకువెళ్లాలన్నట్లుగా రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే పార్టీలో కొన్ని వర్గాలను కలుపుకొని పోవడంలో ఉత్తమ్ విఫలమవుతున్నారన్న కొందరు సీనియర్ నేతల వాదనలతో అధిష్టానవర్గం ఏకీభవిస్తున్నా.. దానిని సరిదిద్దడం పెద్ద కష్టం కాదన్న భావనలో ఉంది. పార్టీలో అందరినీ కలుపుకొనిపోవాలని, విజయమే లక్ష్యంగా ముందుకెళ్లాలని ఉత్తమ్‌కు పార్టీ పలుమార్లు సూచించిందని.. దానికి అనుగుణంగానే ఆయన పని చేసుకుంటూ పోతున్నారని ఏఐసీసీ సీనియర్ నేత ఒకరు రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో పేర్కొన్నారు కూడా.

ప్రచార కమిటీ బాధ్యతలు కూడా..

వచ్చే ఎన్నికల కోసం ముందుగానే ప్రచార కమిటీని నియమించాలని కాంగ్రెస్ అధిష్టానవర్గం భావిస్తోంది. ఆ కమిటీ చైర్మన్ బాధ్యతలను కూడా పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కే అప్పగించే అవకాశాలు ఉన్నాయి. పీసీసీ చీఫ్‌ను కాకుండా మరో మరో సీనియర్ నేతను చైర్మన్‌గా నియమిస్తే పార్టీ సమన్వయం విషయంలో ఇబ్బందులు తలెత్తుతాయని అధిష్టానవర్గం భావిస్తోంది. ప్రచార కమిటీకి సీఎల్పీ నేత జానారెడ్డిని కో–చైర్మన్‌గా, మరో ముగ్గురు కన్వీనర్లు, 24 మంది సభ్యులను నియమించే అవకాశముందని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. టీడీపీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన రేవంత్‌రెడ్డిని కన్వీనర్‌గా నియమించడం దాదాపు ఖాయమైంది. రేవంత్‌తో పాటు మరో ఇద్దరు కన్వీనర్లు ఉంటారు. ఇక అభ్యర్థుల వడపోత కోసం రాష్ట్రస్థాయిలో స్క్రీనింగ్ కమిటీని ఏర్పాటు చేయబోతున్నారు. ఆ కమిటీలో పీసీసీ అధ్యక్షుడు, సీఎల్పీ నేతతో పాటు పీసీసీ మాజీ అధ్యక్షులు, సీనియర్ నేతలు ఉంటారు. జూన్ నాటికి ఈ కమిటీ ఏర్పాటవుతుందని భావిస్తున్నారు.

ఫిబ్రవరిలో రాహుల్ పర్యటన

ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ వచ్చే నెలలో రాష్ట్రంలో పర్యటించే అవకాశముంది. వరంగల్‌లో నిర్వహించాలని భావిస్తున్న సభను ఎన్నికలకు శంఖా రావంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని నిర్ణయిం చారు. అదే నెలలో పంచాయతీ ఎన్నికలు ఉన్నా సరే వరంగల్ బహిరంగ సభ ద్వారా సత్తా చాటాలని కాంగ్రెస్ భావిస్తోంది. దక్షి ణ తెలంగాణలో పార్టీ పటిష్టంగా ఉందని, ఉత్తర తెలంగాణ లోనూ బలంగా ఉన్నామ ని చాటుకుని టీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం తామేనని చెప్పాలని యోచిస్తోంది.

పార్టీ ఇన్‌చార్జి మార్పు!

రాష్ట్ర కాంగ్రెస్‌లో అన్ని రకాలుగా సమన్వయం చేయడానికి ప్రస్తుతం పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా ఉన్న కుంతియా స్థానంలో టీకాంగ్రెస్ నేతలతో మంచి సంబంధాలున్న సీనియర్ నేతను నియమిస్తారన్న ప్రచారం జరుగుతోంది. జమ్మూకశ్మీర్‌కు చెందిన గులాం నబీ ఆజాద్, కేరళకు చెందిన వయలార్ రవి, కర్ణాటకకు చెందిన మల్లికార్జున ఖర్గేలలో ఒకరిని నియమించవచ్చని ఏఐసీసీ నేత ఒకరు రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో చెప్పినట్లు సమాచారం. ''పీసీసీ అధ్యక్షుడి మార్పు ఉండదు. ఆ విషయంలో రాహుల్ స్పష్టమైన నిర్ణయం తీసుకున్నారు. ఉత్తమ్ సారథ్యంలోనే ఎన్నికలు జరుగుతాయి..''అని రాష్ట్రానికి చెందిన కేంద్ర మాజీ మంత్రి ఒకరు స్పష్టం చేశారు.

బిట్‌శాట్-2018

బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(బీఐటీఎస్: బిట్స్) పిలానీ.. 2018-19కి గాను పిలానీ, గోవా, హైదరాబాద్‌లోని తన క్యాంపస్‌ల్లో ఇంటిగ్రేటెడ్ ఫస్ట్ డిగ్రీ ప్రోగ్రామ్స్(బీఈ, బీఫార్మా, ఎంఎస్సీ)లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తూ బిట్స్‌అడ్మిషన్ టెస్ట్(బిట్‌శాట్)-2018 ప్రకటన విడుదల చేసింది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్/బయాలజీ సబ్జెక్టులతో ఇంటర్మీడియెట్/తత్సమాన విద్యలో ఉత్తీర్ణులు అర్హులు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. చివరి తేదీ మార్చి 13, 2018. మార్కుల శాతం, రిజర్వేషన్లు తదితర పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.bitsadmission.com

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా

సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

కెరీర్ గైడెన్స్

సీఏలో సరికొత్త నైపుణ్యాలకు 'ఫౌండేషన్'!



ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సీఏ ఔత్సాహికుల్లో నైపుణ్యాలు పెంపొందించే లక్ష్యంతో 2017, జూలై 1 నుంచి చార్టర్డ్ అకౌంటెన్సీ (సీఏ) కోర్సుకు కొత్త సిలబస్, విధానం అమల్లోకి వచ్చింది. ఇది మార్కెట్ అవసరాలకు అనుగుణంగా అభ్యర్థుల్లో నైపుణ్యాలు పెంపొందించే విధంగానే ఉన్నాయంటున్నాయి పారిశ్రామిక వర్గాలు. కొత్త విధానంలో తొలి పరీక్ష 2018 మేలో జరగనుంది. ఈ నేపథ్యంలో సీపీటీ స్థానంలో ప్రవేశపెట్టిన సీఏ ఫౌండేషన్ పరీక్ష విధానం, సిలబస్, అనుకూల అంశాలు తదితరాలపై ఫోకస్..

సీఏ కోర్సుకు.. సీఏ ఫౌండేషన్ అనేది ప్రవేశ పరీక్ష అని చెప్పొచ్చు. ఈ ఫౌండేషన్‌ను పూర్తిచేసిన వారు మాత్రమే సీఏ కోర్సును చదవడానికి అర్హులు. ఇప్పటి ఫౌండేషన్ స్థానంలో గతంలో సీపీటీ ఉండేది. సీపీటీలో ప్రశ్నలన్నీ మల్టిపుల్ చాయిస్ రూపంలోనే ఉండేవి. అయితే ప్రస్తుత ఫౌండేషన్‌లో 50 శాతం మార్కులను మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలకు, 50 శాతం మార్కులను డిస్క్రిప్టివ్ ప్రశ్నలకు కేటాయించారు. ఈ కొత్త విధానం వల్ల అభ్యర్థుల్లో విశ్లేషణాత్మక సామర్థ్యంతోపాటు భావవ్యక్తీకరణ నైపుణ్యాలు కూడా పెరుగుతాయి.

కొత్త విధానం ప్రకారం- సీఏ కోర్సులోని దశలు..

సీఏ ఫౌండేషన్
↓
సీఏ ఇంటర్మీడియెట్ (ఫౌండేషన్ పాసైన 8 నెలలకు)
↓
ప్రాక్టికల్ ట్రైనింగ్ (మూడేళ్లు)
↓
సీఏ ఫైనల్

సిలబస్

- **ప్రిన్సిపుల్స్ అండ్ ప్రాక్టీస్ ఆఫ్ అకౌంటింగ్:** అకౌంటింగ్ ఫండమెంటల్స్, అకౌంటింగ్ ప్రాసెస్, స్పెషల్ ట్రాన్సాక్షన్స్, పార్టనర్‌షిప్ అకౌంట్స్, నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్స్, కంపెనీ అకౌంట్స్ తదితర అంశాలు.
- **బిజినెస్ లాస్:** కాంట్రాక్ట్ యాక్ట్, సేల్ ఆఫ్ గూడ్స్ యాక్ట్, పార్ట్‌నర్‌షిప్ యాక్ట్, కంపెనీస్ యాక్ట్ మొదలైనవి.
- **బిజినెస్ కరస్పాండెన్స్ అండ్ రిపోర్టింగ్:** కమ్యూనికేషన్, వర్డ్ పవర్, వొకాబ్యులరీ, కాంప్రెహెన్షన్ ప్యాసేజీలు, నోట్ మేకింగ్, డెవలపింగ్ రైటింగ్ స్కిల్స్..
- **బిజినెస్ మ్యాథమెటిక్స్:** రేషియోస్, ఈక్వేషన్స్, మ్యాట్రిసెస్, పెర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్, సీక్వెన్సెస్, సిరీస్, సెట్స్, రిలేషన్స్, ఫంక్షన్స్, క్యాలిక్యులస్..
- **లాజికల్ రీజనింగ్:** నంబర్ సిరీస్, కోడింగ్ అండ్ డీకోడింగ్; డైరెక్షన్ టెస్ట్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, బ్లడ్ రిలేషన్స్..
- **స్టాటిస్టిక్స్:** డిస్క్రిప్షన్ ఆఫ్ డేటా, ప్రాబబిలిటీ, థియరిటికల్ డిస్ట్రిబ్యూషన్స్, ఇండెక్స్ నంబర్స్, టైమ్ సిరీస్..
- **బిజినెస్ ఎకనామిక్స్:** ఇంట్రడక్షన్, డిమాండ్ అండ్ సప్లయ్, థియరీ ఆఫ్ ప్రొడక్షన్ అండ్ కాస్ట్, బిజినెస్ సైకిల్స్..
- **బిజినెస్ అండ్ కమర్షియల్ నాలెడ్జ్:** బిజినెస్ ఎన్విరాన్‌మెంట్, బిజినెస్ ఆర్గనైజేషన్స్, గవర్నమెంట్ పాలసీలు..

ఫౌండేషన్ పరీక్ష విధానం

పేపర్	సబ్జెక్టులు	మార్కులు	వ్యవధి
పేపర్-1	ప్రిన్సిపుల్స్ అండ్ ప్రాక్టీస్ ఆఫ్ అకౌంటింగ్	100	3 గం॥లు
పేపర్-2	బిజినెస్ లాస్ (60 మార్కులు) బిజినెస్ కరస్పాండెన్స్ అండ్ రిపోర్టింగ్ (40 మార్కులు)	100	3 గం॥లు
పేపర్-3	బిజినెస్ మ్యాథమెటిక్స్ (40 మార్కులు) లాజికల్ రీజనింగ్ (20 మార్కులు) స్టాటిస్టిక్స్ (40 మార్కులు)	100	3 గం॥లు
పేపర్-4	బిజినెస్ ఎకనామిక్స్ (60 మార్కులు) బిజినెస్ అండ్ కమర్షియల్ నాలెడ్జ్ (40 మార్కులు)	100	3 గం॥లు

అనుకూలతలు

- సీపీటీ కేవలం ఆబ్జెక్టివ్ విధానం కాబట్టి కమ్యూనికేషన్ స్కిల్స్ లేకపోయినా చాలామంది ఉత్తీర్ణత సాధించేవారు. వీరు తర్వాతి దశల్లో ఇబ్బందిపడేవారు. ఇప్పుడు ఫౌండేషన్ విధానంలో మొదటి నుంచి కమ్యూనికేషన్ స్కిల్స్‌కు పెద్దపీట వేశారు. ప్రస్తుతం సీఏ ఇంటర్, ఫైనల్‌లో రాణించడానికి అవసరమైన నైపుణ్యాలు సీఏ ఫౌండేషన్ ద్వారా సమకూరుతాయి.
- ఫౌండేషన్ పేపర్-2 సిలబస్‌లో ఇంగ్లిష్ గ్రామర్, రైటింగ్ స్కిల్స్, నోట్ మేకింగ్ తదితర అంశాలు ఉండటం వల్ల కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెరుగుతాయి. డ్రాఫ్టింగ్ స్కిల్స్ కూడా అలవడతాయి.
- సీపీటీలో నెగెటివ్ మార్కుల విధానం ఉండేది. ఫౌండేషన్‌లో దాన్ని తొలగించారు. సీపీటీలో నాలుగు సబ్జెక్టులకు ఒకేరోజు పరీక్ష రాయాల్సి వచ్చేది. ఫౌండేషన్‌లో నాలుగు సబ్జెక్టులను నాలుగు రోజుల పాటు రాసుకోవచ్చు.
- గతంలో మార్చిలో ఇంటర్ పరీక్షలు ముగిసిన వెంటనే జూన్‌లో సీపీటీ రాయాల్సి వచ్చేది. దీనివల్ల విద్యార్థులు ఇబ్బందిపడేవారు. ప్రస్తుతం మారిన విధానంలో ఇంటర్ పరీక్షలకు, సీఏ ఫౌండేషన్‌కు మధ్య ఆర్నెల్లు సమయం ఉంది కాబట్టి బాగా సన్నద్ధమవొచ్చు.
- సీఏ ఫౌండేషన్‌లో రీజనింగ్ సబ్జెక్టును పొందుపరచడం వల్ల విద్యార్థికి విజ్ఞానంతో పాటు ఆలోచనా నైపుణ్యాలు(ఆప్టిట్యూడ్ స్కిల్స్) పెరిగే అవకాశముంది.
- అకౌంట్స్ సబ్జెక్టును పూర్తిగా డిస్క్రిప్టివ్‌గా మార్చారు. దీనివల్ల విద్యార్థులకు సీఏ ఇంటర్, ఫైనల్ దశల్లో ఎదురయ్యే డిస్క్రిప్టివ్ సమస్యలకు ముందుగానే శిక్షణ లభించినట్లయింది.
- బిజినెస్ మ్యాథమెటిక్స్, లాజికల్ రీజనింగ్, స్టాటిస్టిక్స్ అంశాల వల్ల విద్యార్థుల్లో పరిశీలనా శక్తి పెరుగుతుంది. ప్రతి అంశాన్నీ లోతుగా విశ్లేషించి, అర్థం చేసుకునే నైపుణ్యాలు అలవడతాయి.
- బిజినెస్ ఎకనామిక్స్, బిజినెస్ అండ్ కమర్షియల్ నాలెడ్జ్ అంశాల వల్ల రకరకాల వ్యాపారాలు, ఆర్థిక లావాదేవీలపై విద్యార్థులకు అవగాహన ఏర్పడుతుంది. వ్యాపార ప్రారంభ, నిర్వహణలపై పట్టు చిక్కుతుంది.

సీఏ కోర్సులో ఉత్తీర్ణత శాతం కేవలం 2-3 శాతం ఉంటుందని చాలా మంది భావిస్తుంటారు. ఇది అపోహ మాత్రమే. ఉదాహరణకు 2017 జనవరి సీపీటీ ఫలితాల్లో 46.44 శాతం ఉత్తీర్ణత నమోదైంది. సీఏ ఫైనల్లో 7000 మందికి పైగా విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

సీఏ అనగానే కేవలం కామర్స్ విద్యార్థులు మాత్రమే రాణించగలరనే అభిప్రాయం ఉంది. ఇది వాస్తవం కాదు. గత ఐదారేళ్ల గణాంకాలను పరిశీలిస్తే భారీ సంఖ్యలో ఎంపీసీ/బైపీసీ విద్యార్థులు సీఏలో రాణిస్తున్నట్లు అర్థమవుతోంది.

- ఇంటర్మీడియెట్ లేదా 10+2 లేదా తత్సమాన అర్హతతో ఎవరైనా సీఏ ఫౌండేషన్‌కు నమోదు చేసుకోవచ్చు.
- సీఏ ఫౌండేషన్ పరీక్షలు ఏటా మే, నవంబర్‌లో జరుగుతాయి.
- జూన్ 30 లోగా సీఏ ఫౌండేషన్‌కు రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు అదే సంవత్సరం నవంబర్‌లో సీఏ ఫౌండేషన్ రాసేందుకు అర్హత లభిస్తుంది. జూన్ 30 తర్వాత రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు తర్వాతి సంవత్సరం మేలో ఫౌండేషన్ రాయొచ్చు.
- సీఏ ఫౌండేషన్‌లోని పేపర్-1, పేపర్-2 పరీక్షలు డిస్క్రిప్టివ్ పద్ధతిలో; పేపర్-3, పేపర్-4 పరీక్షలు ఆబ్జెక్టివ్ పద్ధతిలో జరుగుతాయి.
- సీఏ ఫౌండేషన్‌లో ఉత్తీర్ణత సాధించాలంటే ప్రతి పేపర్‌లో కనీసం 40 శాతం మార్కులు సాధించాలి. అదే విధంగా మొత్తం నాలుగు పేపర్లకు కలిపి 50 శాతం మార్కులు సాధించాలి.



ఎం.ఎస్.ఎస్. ప్రకాశ్
డైరెక్టర్, మాస్టర్‌మైండ్స్

బులెటిన్ బోర్డ్

రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్‌లో 61 ఖాళీలు

రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్‌ఎఫ్‌సీఎల్)లో 61 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తూ నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్(ఎన్‌ఎఫ్‌ఎల్) ప్రకటన విడుదల చేసింది. ఆర్‌ఎఫ్‌సీఎల్.. ఎన్‌ఎఫ్‌ఎల్, ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్(ఈఐఎల్), ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎఫ్‌సీఐఎల్) సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పడింది.

- **పోస్టు:** మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఎంటీ)
- **వేతనం:** రూ.16,400-రూ.40,500.
- **విభాగాల వారీ ఖాళీలు:** కెమికల్-35, మెకానికల్-10, ఎలక్ట్రికల్-8, ఇన్‌స్ట్రుమెంటేషన్-8.
- **అర్హతలు:** సంబంధిత విభాగాలను అనుసరించి కనీసం 60శాతం(ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం) మార్కులతో బీఈ/బీటెక్‌తోపాటు గేట్-2016 స్కోర్ కార్డ్.
- **వయసు:** 2018, జనవరి 31 నాటికి 27 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** గేట్-2016 స్కోర్ ఆధారంగా మెరిట్ జాబితా, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** రూ.700 ; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మాజీ సైనికోద్యోగ కేటగిరీలకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** ఫిబ్రవరి 9, 2018.
- **వెబ్‌సైట్:** www.nationalfertilizers.com

నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌లో 38 ఖాళీలు

హైదరాబాద్‌లోని బాలానగర్‌లో ఉన్న నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్‌ఆర్‌ఎస్‌సీ).. 38 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **పోస్టు-ఖాళీలు:** సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సి'-33; సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌డీ'-2; సైంటిఫిక్ అసిస్టెంట్-3.
- **వేతనశ్రేణి:** సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సి'-రూ. 56,100-రూ.1,77,500; సైంటిస్ట్/ ఇంజనీర్ 'ఎస్‌డి'-రూ.67,700-రూ.2,08,700; సైంటిఫిక్ అసిస్టెంట్-రూ.44,900-రూ.1,42,400.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులను బట్టి ఎంఎస్సీ/ఎంఎస్సీ టెక్/ఎంఈ/ ఎంటెక్/ఎంఎస్/పీహెచ్‌డీ/బీఎస్సీ(ఎంఎస్‌సీఏఎస్). అలాగే నిబంధనల మేర మార్కుల శాతం ఉండాలి.
- **వయస్సు:** దరఖాస్తు గడువు ముగిసే నాటికి సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సి', సైంటిఫిక్ అసిస్టెంట్ పోస్టులకు 18-35 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి. సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌డి' పోస్టులకు వయోపరిమితి లేదు.
- **ఎంపిక:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** ఫిబ్రవరి 5, 2018.
- **వెబ్‌సైట్:** www.nrsc.gov.in

పీఎస్‌ఎల్వీసీ-40 ప్రయోగం విజయవంతం

అంతర్జాతీయం

దక్షిణ కొరియా, ఉత్తర కొరియా మధ్య చర్చలు

దాదాపు రెండేళ్ల తర్వాత ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య అధికారిక చర్చలు 2018, జనవరి 9న జరిగాయి. ఫిబ్రవరిలో దక్షిణ కొరియాలో జరిగే వింటర్ ఒలింపిక్స్‌కు తమ క్రీడా బృందాలను పంపించేందుకు ఉత్తర కొరియా అంగీకరించింది. అలాగే దక్షిణ కొరియాతో మిలటరీ హాట్‌లైన్ సర్వీసును పునః ప్రారంభించినట్లు ఉత్తర కొరియా వెల్లడించింది. ఇటీవల నూతన సంవత్సర సందేశంలో దక్షిణ కొరియాతో సత్సంబంధాలను నెలకొల్పుకునేందుకు సిద్ధంగా ఉన్నాయని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ప్రకటించడంతో తాజా చర్చలు కార్యరూపం దాల్చాయి. ఉభయదేశాల సరిహద్దులకు సమీపంలోని పాన్‌ముంజోమ్‌లో ఈ చర్చలు జరిగాయి. దక్షిణ కొరియా పరిధిలోకి వచ్చే ఈ గ్రామాన్ని శాంతి గ్రామంగా వ్యవహరిస్తారు.

భారత సంతతి పార్లమెంటేరియన్ల సదస్సులో ప్రధాని



ప్రపంచ వ్యాప్తంగా పార్లమెంటేరియన్లుగా ఉన్న భారత సంతతి పార్లమెంటేరియన్ల తొలి సదస్సు ఢిల్లీలో జనవరి 9, 2018న జరిగింది. రెండు రోజులపాటు జరిగిన ఈ సదస్సులో ఫ్రాన్స్, ఫిజీ, స్విట్జర్లాండ్, మారిషస్ సహా 24 దేశాలకు చెందిన 134 మంది ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. మహాత్మాగాంధీ, దక్షిణాఫ్రికా నుంచి తిరిగొచ్చి 102 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సదస్సును ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ... భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని, దేశాభివృద్ధిలో ఉత్ప్రేరకంగా నిలవాలని కోరారు. మహాత్మాగాంధీ సూచించిన అహింస సిద్ధాంతం ద్వారా ఉగ్రవాదాన్ని, అతివాదాన్ని ఎదుర్కొనవచ్చని తెలిపారు.

భారతీయులను వెనక్కి పంపే ఒప్పందాలపై భారత్-బ్రిటన్ సంతకాలు

చట్ట విరుద్ధంగా బ్రిటన్‌లో నివసిస్తున్న భారతీయులను వెనక్కి తిప్పి పంపేయడానికి సంబంధించిన రెండు ఒప్పందాలపై భారత్-బ్రిటన్‌లు లండన్‌లో 2018, జనవరి 13న సంతకాలు చేశాయి. ఉభయ దేశాల మధ్య కుదిరిన రెండు అవగాహన ఒప్పందాలపై భారత హోంశాఖ సహాయ మంత్రి కిరణ్ రిజిజు, బ్రిటన్ ఇమిగ్రేషన్ వ్యవహారాల మంత్రి కెరోలీన్‌నోక్స్ సంతకాలు చేశారు.

సైన్స్ అండ్ టెక్నాలజీ

భారత సూపర్ కంప్యూటర్ ప్రత్యూష్ ఆవిష్కరణ

భారత్ సూపర్ కంప్యూటర్ ప్రత్యూష్‌ను 2018, జనవరి 8న ఆవిష్కరించింది. ఇది గరిష్టంగా 6.8 పెటాఫ్లాప్‌ల వేగంతో పనిచేయగలదు. ఇక పెటాఫ్లాప్ అంటే.. సెకనుకు 1000 ట్రిలియన్ ఆపరేషన్స్ చేసే సామర్థ్యం. ప్రత్యూష్‌ను వాతావరణం, శీతోష్ణస్థితి అధ్యయనానికి వినియోగించనున్నట్లు పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటరాలజీ తెలియజేసింది. తద్వారా ఇలా వాతావరణం, శీతోష్ణస్థితి అధ్యయనానికి సూపర్ కంప్యూటర్‌లను వినియోగించడంలో జపాన్, యూకే, యూఎస్‌ఏ తర్వాత భారత్ నాలుగో స్థానంలో నిలిచినట్లయింది.

పీఎస్‌ఎల్వీసీ-40 ప్రయోగం విజయవంతం



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) తన 100వ ఉపగ్రహాన్ని విజయవంతంగా అంతరిక్షంలోకి పంపింది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్(షార్) నుంచి 2018, జనవరి 12న పీఎస్‌ఎల్వీసీ-40 రాకెట్ మొత్తం 31 ఉపగ్రహాలను ఒకేసారి మోసుకెళ్లి కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఇది పీఎస్‌ఎల్వీ 41వ ప్రయోగం. పీఎస్‌ఎల్వీసీ-40 వాహక నౌక కార్టోశాట్-2ను 510 కిలోమీటర్ల ఎత్తులో, మరో 29 ఉపగ్రహాలను 519 కిలోమీటర్ల ఎత్తులో ప్రవేశపెట్టింది. రాకెట్ మళ్లీ అక్కడి నుంచి 359 కిలోమీటర్లు కిందకు వచ్చి చివరిదైన ఐఎన్‌ఎస్-1సీ ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టింది. కార్టోశాట్ బరువు 710 కిలోలు కాగా, మిగిలిన 30 ఉపగ్రహాల బరువు 613 కిలోలు. కార్టోశాట్-2 సిరీస్ వల్ల భారత్ రిమోట్ సెన్సింగ్ వ్యవస్థ మరింత బలపడుతుంది. ఇందులో పాన్‌క్రోమాటిక్, మల్టీస్పెక్ట్రల్ కెమెరాలు ఉన్నాయి. వీటిద్వారా తీసే చిత్రాలు కార్టోగ్రాఫిక్ అప్లికేషన్లు, పట్టణ గ్రామీణ అవసరాలు, రహదారులు, నీటిసరఫరా పరిశీలన, భౌగోళిక పరిస్థితులు తెలుసుకోవడానికి ఉపయోగపడతాయి.

జాతీయం

సివిల్స్, గ్రూపు-1లకు ఉమ్మడి సిలబస్

యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్, రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లు నిర్వహించే గ్రూప్-1లేదా తత్సమాన ఉన్నత శ్రేణి పరీక్షలకు 60శాతం ఉమ్మడి (కామన్) సిలబస్ ఉండాలన్న ప్రతిపాదనకు గోవాలో జరిగిన రాష్ట్రాల పీఎస్సీల జాతీయ సదస్సు 2018, జనవరి 12న ఆమోదించింది.

సినిమా హాళ్లలో జాతీయ గీతాలాపన ఐచ్ఛికమే

సినిమా హాళ్లలో చలనచిత్రాన్ని ప్రదర్శించడానికి ముందు జాతీయగీతాలాపన తప్పనిసరికాదని సుప్రీంకోర్టు 2018, జనవరి 9న స్పష్టం చేసింది. ఇది ఐచ్ఛికమని తెలిపింది. జాతీయ గీతాలాపనకు సంబంధించి మార్గదర్శకాలు రూపొందించే బాధ్యతను ప్రభుత్వం నియమించిన సంఘానికి వదిలేసింది. 2016, నవంబరు 30న ఇచ్చిన ఉత్తర్వును ఈ మేరకు సవరించింది.

ఎంపీల్యాడ్స్ కాలపరిమితి పొడిగింపు

పార్లమెంటు సభ్యుల స్థానిక ప్రాంత అభివృద్ధి పథకం(ఎంపీల్యాడ్స్)ను 14వ ఆర్థిక సంఘం కాలపరిమితి ముగిసే తేదీ అయిన 2020, మార్చి 31వరకు కొనసాగించాలని కేంద్రం నిర్ణయించింది. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ 2018, జనవరి 10 ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. వచ్చే మూడేళ్ల కాలంలో ఈ పథకం కింద రూ.11,850కోట్లు ఖర్చు చేయనున్నారు.

సమాచార పరిరక్షణ, గోప్యత కోసం తాత్కాలిక ఆధార్ నంబర్



ఆధార్ వల్ల ప్రజల సమాచార భద్రత, గోప్యత ప్రశ్నార్థకమవుతోందంటూ.. ఆందోళన వ్యక్తమవుతుండటంతో భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ-యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా)ఆధార్ ధృవీకరణ కోసం కొత్త పద్ధతిని త్వరలోనే అమల్లోకి తేనున్నట్లు 2017, జనవరి 10న ప్రకటించింది. నూతన విధానంలో ప్రజలెవరూ తమ 12 అంకెల ఒరిజినల్ ఆధార్ సంఖ్యను ఎవ్వరికీ ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఆధార్ స్థానంలో తాత్కాలికంగా ఉండే 16 అంకెల ఒక వర్చువల్ గుర్తింపు సంఖ్యను మాత్రం ఇస్తే సరిపోతుందని యూఐడీఏఐ పేర్కొంది. దీనివల్ల వినియోగదారుడి ఆధార్‌లో ఉన్న సమాచారం వాణిజ్య సంస్థలు, ప్రభుత్వ విభాగాల్లోని ఉద్యోగులకు కనిపించదని తెలిపింది. కేవలం ఫొటో, పేరు, చిరునామా వంటి వివరాలు మాత్రమే కనిపిస్తాయని వివరించింది. కొత్త విధానంలో పలు నియంత్రణలు ఉన్నాయని యూఐడీఏఐ వెల్లడించింది.

22వ జాతీయ యువజనోత్సవ కార్యక్రమంలో ప్రధాని

గ్రేటర్ నోయిడాలోని గౌతమ్‌బుద్ధ విశ్వవిద్యాలయంలో 22వ జాతీయ యువజనోత్సవ కార్యక్రమం సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ 2018, జనవరి 12వ వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు.

ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు భారత పర్యటన



ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమెన్ నెతన్యాహు ఆరు రోజుల భారత పర్యటన కోసం 2018, జనవరి 14న ఢిల్లీ చేరుకున్నారు. ఆయనకు భారత ప్రధాని నరేంద్ర మోది స్వాగతం పలికారు. జనవరి 15న రెండు దేశాల ప్రధాన మంత్రుల మధ్య చర్చలు జరిగాయి. ఉభయ దేశాల మధ్య రక్షణ,చమురు, సహజవాయువు, పునరుత్పాదక ఇంధనం, విమానాశ్రయాలు, సైబర్ సెక్యూరిటీ, డాక్యుమెంటరీ తదితర రంగాలకు సంబంధించిన తొమ్మిది ఒప్పందాలు కుదిరాయి.

వార్తల్లో వ్యక్తులు



ఇస్రో ఛైర్మన్‌గా శివన్: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) నూతన ఛైర్మన్‌గా ప్రముఖ శాస్త్రవేత్త కె. శివన్ నియమితులయ్యారు. అంతరిక్ష శాఖ కార్యదర్శిగా, అంతరిక్ష కమిషన్ ఛైర్మన్‌గా శివన్ నియామకాన్ని కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదించింది. మూడేళ్లపాటు ఆయన ఈ బాధ్యతలు నిర్వహిస్తారు. శివన్ ప్రస్తుతం త్రివేండ్రంలోని విక్రమ్ సారాభాయి అంతరిక్ష కేంద్రం సంచాలకుడిగా ఉన్నారు. ఆయన 1982లో ఇస్రోలో చేరారు. ఇస్రోలో వివిధ హోదాల్లో పనిచేశారు. పీఎస్ఎల్వీ(పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్) ప్రాజెక్టుకు కీలక సేవలందించారు.

బ్రిటన్ ప్రభుత్వంలో మంత్రిగా రిషి సునక్

ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి అల్లుడు రిషి సునక్ బ్రిటన్ ప్రభుత్వంలో మంత్రిగా చేరారు. 2018, జనవరి 8న బ్రిటన్ ప్రధానమంత్రి థెరిసా మే చేపట్టిన కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో రిషికి చోటు దక్కింది. ఆయనకు బ్రిటన్ హౌసింగ్,కమ్యూనిటీస్, లోకల్ గవర్నమెంట్ వ్యవహారాల బాధ్యతలు అప్పగించారు. ఆయన కేబినెట్ మంత్రి హోదాలో విధులు నిర్వర్తించనున్నారు.

సరోద్ పండితుడు దాస్‌గుప్తా కన్నుమూత

సరోద్ పండితుడు బుద్ధదేవ్ దాస్‌గుప్తా(84) దక్షిణ కోల్‌కతాలో 2018 జనవరి 15న మరణించారు. ఆయన పద్మభూషణ్ అవార్డు గ్రహీత.

ఆర్థికం

2018లో భారత్ వృద్ధి 7.3 శాతం: ప్రపంచ బ్యాంకు

భారత స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) 2018-19లో 7.3 శాతంగా నమోదవుతుందని ప్రపంచబ్యాంక్ అంచనా వేసింది. ఆ తర్వాత 2019-20, 2020-21లో వృద్ధి 7.5 శాతంగా ఉంటుందనీ

కాంపిటీటివ్ గైడెన్స్
కరెంట్ అఫైర్స్

తెలిపింది. 2018 గ్లోబల్ ఎకనామిక్స్ ప్రాస్పెక్ట్స్ పేరుతో ప్రపంచబ్యాంక్ 2018, జనవరి 9న విడుదల చేసిన తాజా నివేదికలో పై అంశాలను పేర్కొంది. 2017-18లో భారత జీడీపీ 6.7 శాతంగా ఉంటుందని ప్రపంచ బ్యాంకు అంచనా వేసిన సంగతి తెలిసిందే. ఇది భారత ప్రభుత్వ అంచనా 6.5 శాతం కంటే ఎక్కువ.

విమానయాన రంగంలో 49 శాతం ఎఫ్‌డీఐలకు అనుమతి

కీలక రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను(ఎఫ్‌డీఐ) ప్రోత్సహించేలా నిబంధనలను మరింత సరళతరం చేస్తూ 2018, జనవరి10న కేంద్ర మంత్రివర్గం నిర్ణయాలు తీసుకొంది. అప్పుల్లో కూరుకుపోయిన ఎయిర్ ఇండియాలో 49 శాతం పెట్టుబడులు పెట్టడానికి అప్రూవల్ విధానంలో విదేశీ సంస్థలకు అనుమతి ఇచ్చింది. అప్రూవల్ విధానం అంటే.. వివిధ శాఖల అనుమతులు తీసుకొని పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది. సింగిల్ బ్రాండ్ రిటైల్ వ్యాపారంలో ఆటోమేటిక్ రూట్‌లో 100 శాతం ఎఫ్‌డీఐలకు అనుమతించింది. ఆటోమేటిక్ రూట్ అంటే.. భద్రతాపరమైన అనుమతులు తీసుకోవాల్సిన అవసరం ఉండదు. పారిశ్రామిక విధానం, ప్రోత్సాహక విభాగం (డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ అండ్ ప్రమోషన్-డీఐపీపీ) సిఫార్సులు సరిపోతాయి. నిర్మాణ అభివృద్ధి రంగంలోనూ ఇదే తరహా వెసులుబాటు కల్పించింది.

డబ్ల్యూఎఫ్ తయారీ సూచీలో భారత్‌కు 30వ స్థానం

ప్రపంచ తయారీ సూచీలో భారత్‌కు 30వ స్థానం లభించింది. వరల్డ్ ఎకనమిక్ ఫోరం(డబ్ల్యూఎఫ్) 2018 జనవరి 14న విడుదల చేసిన ఈ నివేదిక సూచిలో జపాన్ మొదటి స్థానంలో నిలిచింది. జపాన్ తర్వాత స్థానాల్లో దక్షిణ కొరియా, జర్మనీ, స్విట్జర్లాండ్, చైనా ఉన్నాయి. భవిష్యత్ తయారీ సంసిద్ధత అనే పేరుతో డబ్ల్యూఈఎఫ్ తొలిసారి ఈ సూచీ రూపొందించింది.

స్పోర్ట్స్

స్కీయింగ్‌లో భారత్‌కు తొలి అంతర్జాతీయ పతకం



హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన అమ్మాయి అంచల్ ఠాకూర్ స్కీయింగ్‌లో దేశానికి తొలి అంతర్జాతీయ పతకం అందించింది. టర్కీలో అంతర్జాతీయ స్కీ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్పైన్ ఎజ్డర్ 3200 కప్‌లో స్లాలోమ్ రేస్ విభాగంలో అంచల్ కాంస్య పతకం గెలిచింది.



ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి
కరెంట్ అఫైర్స్ నిపుణులు
ఆర్‌సీ రెడ్డి స్టడీ సర్కిల్, హైదరాబాద్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
311 ▲	88 ▲
35,082	10,789

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	7,255	▲	32
డోజోన్స్	25,980	▲	187
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,725	▽	31
డాక్స్	13,184	▽	62
షాంఘై	3,445	▲	9
నికాయ్	23,868	▽	83

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		• కొనుగోలు	• అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.82	64.95
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	89.78	89.96
€	యూరో	ఎస్‌బీఐ	79.89	80.05
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	58.82	58.94
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.86	51.96
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	49.20	49.30
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.50	18.37
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.87	18.55
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.05	11.44

సెన్సెక్స్ @ 35,000



కొత్త శిఖరాలకు స్టాక్ సూచీలు

- ఒక్క రోజు వ్యవధి తర్వాత మళ్లీ రికార్డులు
- ఇంట్రాడేలోనూ, ముగింపులోనూ ఆల్‌టైమ్ హై
- బ్యాంకింగ్ షేర్ల దూకుడు...
- తొలిసారిగా 35,000 పైకి సెన్సెక్స్
- 311 పాయింట్ల లాభంతో 35,082 వద్ద ముగింపు
- ఇంట్రాడేలో 10,800 పాయింట్లపైకి నిఫ్టీ
- 82 పాయింట్లు పెరిగి 10,789 వద్ద ముగింపు

ఒక రోజు వ్యవధి తర్వాత స్టాక్ సూచీలు మళ్లీ రికార్డులు సృష్టించాయి. ఇంట్రాడేలోనూ, ముగింపులోనూ కొత్త శిఖరాలకు చేరాయి. సెన్సెక్స్ తొలిసారిగా కీలకమైన 35 వేల పాయింట్లపైకి, నిఫ్టీ 10,800 పాయింట్లపైకి ఎగిశాయి. అంతర్జాతీయ సంకేతాలు బలహీనంగా ఉన్నప్పటికీ, అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్ల సునామీ కొనసాగింది. బీఎస్‌ఈ సెన్సెక్స్ 311 పాయింట్ల లాభంతో 35,082 పాయింట్ల వద్ద, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 88 పాయింట్ల లాభంతో 10,789 పాయింట్ల వద్ద ముగిశాయి. కేవలం 17 ట్రేడింగ్ సెషన్లలోనే సెన్సెక్స్ 34,000 పాయింట్ల నుంచి 35,000 పాయింట్లకు పెరిగింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 35,119 పాయింట్లు, నిఫ్టీ 10,803 పాయింట్ల గరిష్ట స్థాయిలను తాకాయి. ఇవి ఆయా సూచీలకు జీవిత కాల గరిష్ట స్థాయిలు. నిఫ్టీ మీడియా మినహా అన్ని రంగాల సూచీలు లాభాల్లోనే ముగిశాయి. టెక్నాలజీ, ఫార్మా, లోహ షేర్లు ర్యాలీలో పాల్గొన్నాయి. బ్యాంక్ నిఫ్టీ కూడా కొత్త శిఖరాలకు చేరింది. 345 పాయింట్ల లాభంతో 26,320 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 26,336 పాయింట్ల ఆల్‌టైమ్ హైని తాకింది. రెగ్జిట్ (ఆర్‌బీఐ గవర్నర్‌గా రఘురామ్ రాజన్ నిష్క్రమణ), బ్రెగ్జిట్, పెద్ద కరెన్సీ నోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు ఇలా అన్ని ప్రతికూలతలను అధిగమిస్తూ స్టాక్ సూచీలు కొత్త శిఖరాలను అధిరోహిస్తూ వస్తున్నాయని విశ్లేషకులు అంటున్నారు.

యాక్సిస్ బ్యాంక్ 5 శాతం లాభంతో రూ.585 వద్ద ముగిసింది. సెన్సెక్స్ షేర్లలో బాగా లాభపడిన షేర్ ఇదే. ఐసీఐసీఐ బ్యాంక్, యస్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, ఎల్ అండ్ టీ, ఐటీసీ, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, టాటా స్టీల్, సన్ ఫార్మా, పవర్ గ్రిడ్, బజాజ్ ఆటో, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎన్‌టీపీసీ షేర్లు 3 శాతం వరకూ పెరిగాయి. ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి ఐటీ షేర్లలో కొనుగోళ్లు కొనసాగాయి.

స్టాక్ సూచీలతో పాటు దాదాపు 70కు పైగా షేర్లు కూడా జీవిత కాల గరిష్ట స్థాయిలను తాకాయి. టీసీఎస్, ఎల్ అండ్ టీ, హిందుస్తాన్ యూనిలివర్, గృహ్ ఫైనాన్స్, టీటీకే ప్రెస్టీజ్, టాటా స్పాంజ్ ఐరన్, జుబిలంట్ లైఫ్ సైన్సెస్, సుప్రీం ఇండస్ట్రీస్ తదితర షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి.

తస్మాత్.. జాగ్రత్త !
స్టాక్ మార్కెట్ రికార్డ్ స్థాయిలకు చేరడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలని విశ్లేషకులు సూచిస్తున్నారు. ద్రవ్యోల్బణం పెరుగుతోందని, ముడి చమురు ధరలు కూడా పెరుగుతున్నాయని, అంచనాలకు అనుగుణంగా క్యూ3 ఫలితాలు లేకపోతే మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపించవచ్చని వారు హెచ్చరిస్తున్నారు.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	6,289
ఎన్‌ఎస్‌ఈ (ఈక్విటీ)	38,740
ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్)	9,10,681
ఎఫ్‌ఐఐ	625
డీఐఐ	169

లాభాలు ఎందుకంటే..

ద్రవ్యలోటు భయాలకు బ్రేక్..బ్యాంక్ షేర్ల జోరు
బాండ్ల మార్కెట్ ద్వారా సమీకరించే అదనపు రుణాలను తగ్గించుకుంటామని ప్రభుత్వం ప్రకటించడంతో ద్రవ్యలోటు పెరుగుతుందేమోనన్న భయాలకు బ్రేక్ పడింది. గతంలో అంచనా వేసిన ట్లుగా రూ.50,000 కోట్ల మేర కాకుండా రూ.20,000 కోట్ల మేర మాత్రమే అదనపు రుణాలు సమీకరిస్తామని ప్రభుత్వం పేర్కొంది. దీంతో బాండ్ ఈల్డ్స్, ద్రవ్యలోటులపై ఒత్తిడి ఉపశమించింది. దీనికి మొండి బకాయిల సమస్య నివారణకు ప్రభుత్వం సత్వరంగా చర్యలు తీసుకోనున్నదన్న వార్తలు కూడా జతకావడంతో బ్యాంక్ షేర్లలో కొనుగోళ్లు జోరుగా సాగాయి.

క్యూ3 ఫలితాలపై ఆశావహ అంచనాలు...
ఇటీవల వెలువడిన కంపెనీల క్యూ3 ఫలితాలు అంచనాలకు అనుగుణంగానే ఉండటం, కొన్ని అంచనాలను మించడంతో క్యూ3 ఫలితాలపై ఆశావహ అంచనాలు నెలకొన్నాయి. గత క్యూ3లో పెద్ద కరెన్సీ నోట్ల ప్రభావం ఉన్న కారణంగా ఈ క్యూ3లో ఫలితాలు బాగా ఉంటాయని నిపుణులు భావిస్తున్నారు.

బడ్జెట్‌పై ఆశలు..
మరో రెండు వారాల్లో బడ్జెట్ రానున్నది. ఎన్నికలకు ముందు వచ్చే ఈ బడ్జెట్ వినియోగం పెంపు ప్రోత్సహించేలా ఉండొచ్చన్న అంచనాలు నెలకొన్నాయి.

రూపాయి బలం..
డాలర్‌తో రూపాయి మారకం 15 పైసలు బలపడటం సానుకూల ప్రభావం చూపించింది.

70 వస్తువులపై జీఎస్‌టీ సవరణ...
గురువారం జరిగే జీఎస్‌టీ మండలి సమావేశంలో 70 ఐటెమ్స్‌కు (వీటిల్లో 40కు పైగా సేవలకు సంబంధించినవే) సంబంధించిన పన్ను రేట్లలో మార్పులు, చేర్పులు చేయవచ్చన్న వార్తలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌కు జోష్‌నిచ్చాయి.

గణాంకాల ఉత్సాహం...
ఇటీవల వెలువడిన గత నెల వాహన విక్రయాలు, పారిశ్రామికోత్పత్తి గణాంకాలు ప్రోత్సాహకరంగా ఉండటం, వివిధ అంతర్జాతీయ సంస్థలు ఆశావహ వృద్ధి అంచనాలను వెలువరించడం కలిసివచ్చాయి.

వచ్చే ఏడాది మార్చి కల్లా 11,800కు నిఫ్టీ

వచ్చే ఆర్థిక సంవత్సరం కల్లా నిఫ్టీ 11,800 పాయింట్లకు చేరుతుందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ అంచనా వేస్తోంది. గత రెండు క్వార్టర్లలో కంపెనీల ఆదాయాలు పెరుగుతున్నాయని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఇది 21.5 శాతంగా ఉండగలదని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ధీరజ్ రెల్లి పేర్కొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో జీడీపీ 7.3 శాతానికి, జీవీఏ 7.1 శాతానికి పెరుగుతాయని ఆయన అంచనా వేస్తున్నారు.

హెచ్‌యూఎల్ లాభం 1,326 కోట్లు

క్యూ3లో 27 శాతం వృద్ధి
- ఇంట్రాడేలో ఆల్‌టైమ్ హైకి షేరు



న్యూఢిల్లీ: ఎఫ్‌ఎమ్‌సీజీ దిగ్గజం హిందుస్తాన్ యూనిలివర్ (హెచ్‌యూఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక కాలంలో రూ.1,326 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో సాధించిన నికర లాభం రూ.1,038 కోట్లతో పోలిస్తే 28 శాతం వృద్ధి సాధించామని హెచ్‌యూఎల్ తెలిపింది. గత క్యూ3లో రూ.8,400 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం ఈ క్యూ3లో 4 శాతం వృద్ధితో రూ.8,742 కోట్లకు పెరిగిందని కంపెనీ చైర్మన్ హరీశ్ మన్వాని చెప్పారు. గత క్యూ3లో రూ.7,067 కోట్లుగా ఉన్న మొత్తం వ్యయాలు ఈ క్యూ3లో రూ.7,036 కోట్లకు తగ్గాయని తెలిపారు. ఇబిటా రూ.1,162 కోట్ల నుంచి 45 శాతం వృద్ధితో రూ.1,680 కోట్లకు, ఇబిటా మార్జిన్ 15.5% నుంచి 19.6%కి పెరిగాయని పేర్కొన్నారు.

అన్ని కేటగిరీల్లో మంచి వృద్ధి...
ఈ క్యూ3లో మంచి పనితీరు కనబరిచామని మన్వాని సంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని కేటగిరీల్లో మంచి వృద్ధి సాధించామని, మార్జిన్లు కూడా మెరుగుపడ్డాయని పేర్కొన్నారు. కీలక బ్రాండ్లపై మరింతగా పెట్టుబడులు పెడతామని, భవిష్యత్తు కోసం మరిన్ని కేటగిరీలను అభివృద్ధి చేస్తామని వివరించారు. కమోడిటీల ధరల పెరుగుదల సెగ ఇప్పుడిప్పుడే తగులుతోందని, వ్యయ నియంత్రణ పద్ధతులపై మరింతగా దృష్టిపెడుతున్నామని పేర్కొన్నారు. లాభదాయకతను నిలకడగా కొనసాగించడానికి, పోటీని తట్టుకునేందుకు మరింత దూకుడుగా వ్యాపార నిర్వహణ సాగిస్తామని తెలిపారు. ఫెయిర్ అండ్ లవ్‌లీ కారణంగా స్కిన్ కేర్ సెగ్మెంట్, డవ్, పియర్స్ కారణంగా వ్యక్తిగత ఉత్పత్తుల సెగ్మెంట్‌లు మంచి వృద్ధిని సాధించాయని పేర్కొన్నారు. పర్సనల్ కేర్ సెగ్మెంట్ ఆదాయం రూ.3,980 కోట్ల నుంచి రూ.4,090 కోట్లకు, హోమ్ కేర్ డివిజన్ రూ.2,689 కోట్ల నుంచి రూ.2,741 కోట్లకు పెరిగాయని పేర్కొన్నారు. ఫలితాలు అంచనాలను మించడంతో బీఎస్‌ఈలో హెచ్‌యూఎల్ షేర్ ఇంట్రాడేలో జీవిత కాల గరిష్ట స్థాయి, రూ.1,390ను తాకింది. ఆ తర్వాత లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో 0.7 శాతం క్షీణించి రూ.1,372 వద్ద ముగిసింది.

మొబైల్ డేటా లేకున్నా చాటింగ్

మెసేజింగ్ యాప్ హైక్ యూజర్ల కోసం కొత్తగా 'టోటల్' సర్వీసు

న్యూఢిల్లీ: మొబైల్ డేటా లేకపోయినా చాటింగ్, వార్తలు, రైలు టికెట్ల బుకింగ్, చెల్లింపులు వంటి సదుపాయాలు పొందే విధంగా మెసేజింగ్ సేవల సంస్థ హైక్ తాజాగా 'టోటల్' పేరిట కొత్త సర్వీసును ఆవిష్కరించింది. యూఎస్‌ఎస్‌డీ టెక్నాలజీపై ఇది పనిచేస్తుందని హైక్ మెసెంజర్ సీఈవో కవిన్ మిట్టల్ తెలిపారు. చౌక ఫోన్ల ఆపరేటింగ్ సిస్టమ్స్‌లో దీన్ని పొందుపర్చేలా ఇంటెక్స్, కార్బన్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన వెల్లడించారు. మెసేజింగ్, న్యూస్, స్పోర్ట్స్ స్కోర్లు మొదలైనవన్నీ ఈ సర్వీసుతో పొందవచ్చని.. అయితే,



ఫొటోలు పంపేందుకు మాత్రం డేటా అవసరమవుతుందని మిట్టల్ తెలిపారు. ఇందుకోసం 4జీ స్పీడ్‌తో 20 ఎంబీ డేటా ప్యాకేజీలను రూ. 1 నుంచి అందించేలా అటు ఎయిర్‌టెల్, వొడాఫోన్, ఎయిర్‌సెల్, బీఎస్‌ఎన్‌ఎల్‌తో కూడా ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన చెప్పారు. రిలయన్స్ జియో తదితర సంస్థలతో కూడా చర్చలు జరుపుతున్నట్లు తెలియజేశారు. ఎంపిక చేసిన ఇంటెక్స్, కార్బన్ ఫోన్లు కొనుగోలు చేసిన వారు టోటల్ సర్వీసుల కోసం సైన్ అప్ చేయగానే.. వారి హైక్ వాలెట్‌లో రూ.200 జమవుతాయని మిట్టల్ తెలిపారు. కేవైసీ ప్రక్రియ పూర్తయ్యాక డేటా ప్లాన్ల కొనుగోలుకు, ఇతరత్రా ఎవరికైనా పంపేందుకు కూడా ఈ మొత్తాన్ని ఉపయోగించుకోవచ్చన్నారు.

టూ వీలర్లకూ నావిగేషన్!

మ్యాప్ మై ఇండియా టెక్నాలజీ
- కొత్త హంగులతో సేఫ్‌మేట్


మీడియాతో రాకేశ్ వర్మ, శివాలిక్ ప్రసాద్ (కుడి)

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ద్విచక్ర వాహనాలకు నావిగేషన్ వ్యవస్థ? వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా త్వరలోనే ఇది భారత్‌లో సాకారం కానుంది. లొకేషన్ టెక్నాలజీ కంపెనీ మ్యాప్ మై ఇండియా ఈ మేరకు ఓ ద్విచక్ర వాహన కంపెనీతో చేతులు కలిపింది. కొద్ది రోజుల్లో నావిగేషన్ వ్యవస్థ కలిగిన టూ వీలర్లు రోడ్డెక్కనున్నాయని మ్యాప్ మై ఇండియా ఎండీ రాకేశ్ వర్మ తెలిపారు. కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శివాలిక్ ప్రసాద్‌తో కలిసి బుధవారమిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. ద్విచక్ర వాహన కంపెనీకి తాము సాఫ్ట్‌వేర్, మ్యాప్స్ అందిస్తామని చెప్పారు. వాహన కంపెనీ పేరు ఇప్పుడే వెల్లడించలేనన్నారు. అయితే హీరో మోటోకార్ప్ ఈ దిశగా ప్రయత్నాలను మొదలు పెట్టినట్టు సమాచారం. మ్యాప్ మై ఇండియా సహకారం అందించిన నావిగేషన్ వ్యవస్థ 30 లక్షలకుపైగా కార్లలో ప్రస్తుతం వినియోగంలో ఉంది.

నూతన ఫీచర్లతో...
స్మార్ట్ పర్సనల్ సేఫ్టీ ఉపకరణం 'సేఫ్‌మేట్' ఈ ఏడాదే కొత్త ఫీచర్లతో రానుందని రాకేశ్ వర్మ తెలిపారు. 'సిమ్ ఆధారంగా ఇది పనిచేస్తుంది. బ్యాటరీ ఒకసారి చార్జ్ చేస్తే 7 రోజులు వచ్చేలా డిజైన్ చేస్తున్నాం. అత్యవసర సమయాల్లో బటన్ నొక్కితే నిక్షిప్తం అయి ఉన్న నాలుగు నంబర్లకు ఫోన్ కాల్ వెళుతుంది. ప్రపంచంలో ఎక్కడున్నా ఇంటి నంబర్లతోసహా రియల్ టైం లొకేషన్ తెలుస్తుంది. లొకేషన్‌తో కూడిన అలర్టులు ఎస్‌ఎంఎస్, ఈమెయిల్ రూపంలో వెళ్తాయి. ఈ ఉపకరణం ఉన్నవారి దగ్గర స్మార్ట్‌ఫోన్ ఉండాల్సిన అవసరం లేదు. సేఫ్‌మేట్ సేవలు పొందాలంటే కస్టమర్లు నెలకు రూ.100 అద్దె చెల్లించాల్సి ఉంటుంది. ఉపకరణం ధర రూ.4,000 ఉండొచ్చు' అని వివరించారు. గూగుల్ మ్యాప్స్‌కు ప్రత్యామ్నాయంగా ఆధునీకరించిన సేవలను త్వరలో పరిచయం చేస్తున్నట్టు చెప్పారు.

శామ్‌సంగ్ నుంచి గెలాక్సీ ఆన్7 ప్రైమ్

ప్రారంభ ధర రూ. 12,990

న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం శామ్‌సంగ్ తాజాగా గెలాక్సీ ఆన్7 ప్రైమ్ స్మార్ట్‌ఫోన్‌ను ఆవిష్కరించింది. దీని ధర రూ.12,990 నుంచి మొదలవుతుంది. 5.5 అంగుళాల డిస్‌ప్లే, 1.6 గిగాహెర్ట్జ్ ఎక్సినోస్ ఆక్టా–కోర్ ప్రాసెసర్, 13 ఎంపీ బ్యాక్.. ఫ్రంట్ కెమెరాలు, 3300 ఎంఏహెచ్ బ్యాటరీ దీని ప్రత్యేకతలు. 3జీబీ ర్యామ్/32 జీబీ ధర రూ. 12,990 కాగా 4జీబీ ర్యామ్/64 జీబీ స్టోరేజీతో లభించే ఫోన్ ధర రూ. 14,990. ఇందులో శామ్‌సంగ్ మాల్ ఫీచర్ ఉంది.



ఏదైనా ఉత్పత్తిని ఫోన్‌తో ఫొటో తీసి.. వివిధ ఈకామర్స్ సైట్లలో వెతుక్కుని కొనుక్కునేందుకు ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. దీనికోసం అమెజాన్, జబాంగ్, షాప్‌క్లూస్, టాటా క్లిక్ వంటి ఈ–కామర్స్ సైట్స్‌తో శామ్‌సంగ్ ఒప్పందం కుదుర్చుకుంది. ఏకకాలంలో అనేక పనులు చేసే దేశీ వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆన్7 ప్రైమ్‌ను తీర్చిదిద్దినట్లు సంస్థ ఇండియా వైస్ ప్రెసిడెంట్ సందీప్ సింగ్ ఆరోరా తెలిపారు. అమెజాన్‌తో పాటు శామ్‌సంగ్ సొంత వెబ్‌సైట్లో వీటిని విక్రయిస్తున్నట్లు చెప్పారు.

రుణ సమీకరణ రూ. 20వేల కోట్లే

లక్ష్యాన్ని రూ. 50వేల కోట్ల నుంచి తగ్గించిన కేంద్రం


న్యూఢిల్లీ: మార్కెట్ నుంచి అదనంగా రూ.50వేల కోట్ల మేర రుణ సమీకరణ చేయాలని ముందుగా భావించినప్పటికీ.. ప్రస్తుతం దాన్ని రూ. 20,000 కోట్లకు పరిమితం చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇప్పటిదాకా వచ్చిన ఆదాయాలు, వ్యయాలను సమీక్షించిన మీదట ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం కార్యదర్శి సుభాష్ చంద్ర గర్గ్ మైక్రోబ్లాగింగ్ సైటు ట్విటర్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వ సెక్యూరిటీల జారీ ద్వారా ప్రస్తుత అవసరాల కోసం రూ.20,000 కోట్లు సమీకరిస్తే సరిపోతుందని సమీక్షలో తేలినట్లు కేంద్ర ఆర్థిక శాఖ కూడా ఒక ప్రకటన చేసింది. మూడు సార్లు నిర్వహించిన సెక్యూరిటీస్ వేలంలో... రూ.15,000 కోట్ల మేర రుణాలను స్వీకరించలేదని పేర్కొంది.



రాబోయే వారాల్లో మరో రూ.15,000 కోట్ల మొత్తాన్ని కూడా రుణ సమీకరణ నోటిఫికేషన్ నుంచి తగ్గించనున్నట్లు వివరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య లోటును జీడీపీలో 3.2%కి పరిమితం చేయాలనేది కేంద్రం లక్ష్యం. అయితే, గతేడాది నవంబర్ నాటికే బడ్జెట్‌లో నిర్దేశించుకున్న ద్రవ్య లోటు లక్ష్యం 112% మేర దాటిపోయింది.

పది రూపాయల నాణేలన్నీ చెల్లుతాయి: ఆర్‌బీఐ

ముంబై: పది రూపాయల నాణేలకు సంబంధించి చలామణిలో ఉన్న మొత్తం 14 డిజైన్లూ చెల్లుబాటవుతాయని రిజర్వ్ బ్యాంక్ స్పష్టం చేసింది. ఇవన్నీ చట్టబద్ధమైనవేనని ఒక ప్రకటనలో



పేర్కొంది. వ్యాపార వర్గాలు పది రూపాయల నాణేలను తీసుకోవడానికి నిరాకరిస్తున్న నేపథ్యంలో ఆర్‌బీఐ వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది. అసలైనవి కాకపోవచ్చనే సందేహాలతో రూ.10 నాణేలను తీసుకోవడానికి కొందరు నిరాకరిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిన నేపథ్యంలో ఈ ప్రకటన ఇస్తున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంశాలను ప్రతిబింబించేలా రూ.10 నాణేలను సందర్భానుసారంగా విడుదల చేస్తుంటామని వివరించింది. ఇప్పటిదాకా 14 డిజైన్లలో నాణేలు విడుదల చేశామని, ఇవన్నీ కూడా చట్టబద్ధంగా చెల్లుబాటయ్యేవేనని తెలిపింది. బ్యాంకులు కూడా తమ శాఖలన్నింటిలోనూ వీటిని తీసుకోవాలని సూచించింది.

రూట్ మార్చిన బస్సు పరిశ్రమ!

ఎలక్ట్రిక్, డబుల్ డెక్కర్‌లపై ఫోకస్
- రెండు మూడేళ్లలో తెచ్చేలా ప్రణాళికలు
- ప్రధాన కంపెనీలన్నిటిదీ ఇదే బాట
- ప్రీమియం విభాగంలో అనూహ్య వృద్ధి





హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అదీ ఇదీ అని కాదు... దాదాపుగా బస్సులు తయారు చేసే కంపెనీలన్నీ ఇపుడు రూటు మార్చుకుంటున్నాయి. మెరుగైన ఆదాయాలు, భవిష్యత్తు దృష్ట్యా కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకుని ఎలక్ట్రిక్, డబుల్ డెక్కర్ బస్సుల తయారీపై దృష్టి సారించాయి. ప్రయాణికుల భద్రత కోసం కేంద్రం తెస్తున్న కొత్త ప్రమాణాలు, స్మార్ట్ సిటీస్ ప్రాజెక్టులో భాగంగా కేంద్రం ఇస్తున్న ప్రోత్సాహం, ప్రయాణికుల నుంచి వస్తున్న డిమాండ్ నేపథ్యంలో ముున్ముందు మన రోడ్లపై ఆధునిక బస్‌ల హవా ఉంటుందనేది పరిశ్రమ అంచనా. దేశంలో ఏటా 70–80 వేల బస్సులు కొత్తగా రోడ్డెక్కుతున్నాయి. 2018–19లో ఈ సంఖ్య 90 వేలు దాటుతుందని అంచనా.

ఒకదాని వెంట ఒకటి..
వోల్వో, అశోక్ లేలాండ్, టాటా మోటార్స్, జేబీఎం, స్కానియా, బీవైడీ, గోల్డ్‌స్టోన్, కేపీఐటీ వంటి కంపెనీలు ఇప్పటికే ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తెచ్చాయి. వోల్వో ఐషర్, వీర వాహన్ వంటి కంపెనీలు ఎలక్ట్రిక్ బస్సులను పరీక్షిస్తున్నాయి. మెర్సిడెస్ బెంజ్, డెక్కన్ ఆటో నుంచి 2020 నాటికి ఈ మోడల్ మార్కెట్లోకి వచ్చే అవకాశముంది. మహీంద్రా సైతం వీటి తయారీపై దృష్టి సారించగా... ప్రతి కంపెనీ కొత్త టెక్నాలజీపై పని చేస్తున్నట్లు సమాచారం. ''దాదాపుగా బస్సుల తయారీలో ఉన్న కంపెనీలన్నీ ఎలక్ట్రిక్ విభాగంపై ఫోకస్ చేశాయి. మేం కూడా ఈ విభాగంలో అడుగు పెడుతున్నాం'' అని కరోన డైరెక్టర్ ఎం.బాలాజీ రావు సాక్షి బిజినెస్ బ్యూరో ప్రతినిధితో చెప్పారు.

ఉత్సాహం నింపిన టెండర్లు..
బెంగళూరు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (బీఎంటీసీ) 150 ఎలక్ట్రిక్ బస్సుల కోసం టెండర్లను ఆహ్వానించడం పరిశ్రమలో ఉత్సాహం నింపింది. ప్రీ–బిడ్ సమావేశానికి దేశ, విదేశాలకు చెందిన 12 తయారీ కంపెనీలతో పాటు పదుల సంఖ్యలో ఆపరేటర్లు హాజరయ్యారు. అద్దెకు ఈ బస్సులను తీసుకోవాలనేది బీఎంటీసీ యోచన. ఎంపికైన కంపెనీలకు ఇది కిలోమీటరుకు నిర్దేశిత మొత్తాన్ని చెల్లిస్తుంది. ఇందులో కొంత మొత్తాన్ని కేంద్రం భరిస్తుంది. అలాగే కేంద్రం 10 స్మార్ట్ సిటీల్లో వెయ్యి బస్సుల్ని ప్రవేశపెట్టాలని చూస్తోంది. 2018 మార్చి 31లోగా టెండర్లు పూర్తి చేయనుంది. ఒక్కో బస్‌కు కేంద్రం రూ.65–85 లక్షలను భరిస్తుంది.

ఇదీ బస్సు పరిశ్రమ...
దేశవ్యాప్తంగా ఏటా రోడ్డెక్కుతున్న బస్సుల్లో ప్రైవేటు ఆపరేటర్లు 65 శాతం, ప్రభుత్వ రోడ్డు రవాణా సంస్థలు 35 శాతం మేర కొనుగోలు చేస్తున్నాయి. ఇందులో రూ.75 లక్షలు, ఆపైన ఖరీదు చేసే ప్రీమియం బస్సులు 1,000 వరకూ ఉంటాయి. కస్టమర్ల డిమాండ్ నేపథ్యంలో 2018–19లో ప్రీమియం బస్సుల విక్రయాలు 3,000 యూనిట్ల దాకా ఉండొచ్చని పరిశ్రమ భావిస్తోంది. మొత్తం అమ్మకాల్లో దక్షిణాది రాష్ట్రాల వాటా ఏకంగా 55–60 శాతం ఉంది. ఇందులో అత్యధిక బస్సులు తెలుగు రాష్ట్రాల్లో పరుగెడుతున్నవే.

నగరాల మధ్య డబుల్ డెక్కర్లు..

ఇప్పటి వరకూ సిటీకే పరిమితమైన డబుల్ డెక్కర్ బస్సులు ఇక నగరాల మధ్య పరిగెత్తనున్నాయి. మెర్సిడెస్ బెంజ్, వీర, వోల్వో, స్కానియా బ్రాండ్ల డబుల్ డెక్కర్లు 2019 కల్లా దర్శనమివ్వనున్నట్లు సమాచారం. ఇతర కంపెనీలూ వీటి సరసన చేరనున్నాయి. ఇటీవలే ప్రభుత్వం డబుల్ డెక్కర్ బస్సుల నాణ్యత ప్రమాణాల కోసం ఆటోమోటివ్ ఇండస్ట్రీ స్టాండర్డ్–138ను తీసుకొచ్చింది. 80 మంది ప్రయాణించేలా సీట్ల సామర్థ్యం ఉంటుందని వీర బ్రాండ్ బస్సులను తయారు చేస్తున్న వీర వాహన ఉద్యోగ్ ఎండీ కె.శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. బస్సు ధర రూ.1.8 కోట్ల వరకు ఉంటుందని, కాకపోతే ఆపరేటర్లకు వ్యయం కలిసి వస్తుందని చెప్పారు. ఇవి వస్తే పరిశ్రమకు కొత్త ఊపు వస్తుందన్నారు.

నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

వస్తువు	ధర
పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	రూ.4,920 (కనిష్టం), రూ.4,650 (గరిష్టం)
మిర్చి (వరంగల్, తేజ)	రూ.9,100 (కనిష్టం), రూ.5,000 (గరిష్టం)
పసుపు (నిజామాబాద్, కొమ్ము)	రూ.7,471 (కనిష్టం), రూ.4,228 (గరిష్టం)
ఉల్లి (కర్నూలు)	రూ.1,720 (కనిష్టం), రూ.3,330 (గరిష్టం)
చక్కెర (చెన్నై)	రూ.3,600
బియ్యం (కరీంనగర్)	3,800 (హెచ్ఎంటీ)
కందిపప్పు (చెన్నై)	రూ.7,200
సుబాబులు (కృష్ణా)	రూ.4,400 (టన్నుకు)
ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)	--

ప్రత్యక్ష పన్ను వసూళ్ల జోరు

- తొమ్మిది నెలల్లో 19 శాతం అధికం
- రూ. 6.89 లక్షల కోట్లకు చేరిక
- కార్పొరేట్ పన్ను వసూళ్లలోనూ వృద్ధి

న్యూఢిల్లీ: ప్రత్యక్ష పన్ను వసూళ్లు అంచనాలకు మించి పరుగులు పెడుతున్నాయి. గతేడాది ఏప్రిల్‌తో మొదలైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొదటి తొమ్మిదిన్నర నెలల కాలంలో (ఏప్రిల్ నుంచి జనవరి 15 వరకు) పన్ను వసూళ్లు 18.7 శాతం పెరిగి ఏకంగా 6.89 లక్షల కోట్లకు చేరాయి. ఈ వివరాలను ఆదాయపన్ను శాఖకు చెందిన ప్రత్యక్ష పన్నుల మండలి (సీబీడీటీ) బుధవారం వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.9.8 లక్షల కోట్ల మేర ప్రత్యక్ష పన్ను వసూళ్లను ఆదాయపన్ను శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో జనవరి 15 నాటికి 70 శాతం లక్ష్యాన్ని చేరుకున్నట్టయింది. స్థూల వసూళ్లు రూ.8.11 లక్షల కోట్లుగా ఉండగా, ఇందులో రూ.1.22 లక్షల కోట్లు రిఫండ్స్ (తిరిగి చెల్లింపులు) ఉన్నట్టు సీబీడీటీ తెలిపింది. ''ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రత్యక్ష పన్ను వసూళ్లలో స్థిరమైన, చెప్పుకోతగ్గ పురోగతి ఉంది. స్థూల పన్ను వసూళ్లు జూన్ క్వార్టర్‌లో ఉన్న 10 శాతం నుంచి సెప్టెంబర్ క్వార్టర్‌లో 10.3 శాతానికి, డిసెంబర్ క్వార్టర్‌లో 12.6 శాతానికి, ప్రస్తుత క్వార్టర్‌లో జనవరి 15 నాటికి 13.5



శాతానికి చేరాయి'' అని సీబీడీటీ వెల్లడించింది. నికర పన్ను వసూళ్లు సైతం క్యూ1లో 14.8 శాతంగా ఉంటే, క్యూ2లో 15.8 శాతానికి, క్యూ3లో 18.7 శాతానికి, ప్రస్తుత క్వార్టర్‌లో జనవరి 15 నాటికి 18.7 శాతానికి పెరిగినట్టు వివరించింది. కార్పొరేట్ పన్ను వసూళ్లు సైతం ఇదే తీరులో వృద్ధి చెందాయి. జూన్ క్వార్టర్‌లో 4.8 శాతంగా ఉంటే, డిసెంబర్ క్వార్టర్ నాటికి 10.1 శాతానికి, ఆ తర్వాత 11.4 శాతానికి పెరిగాయని తెలిపింది.

శాట్‌ను ఆశ్రయించిన పీడబ్ల్యూసీ

సెబీ ఆదేశాలపై సవాల్

న్యూఢిల్లీ: సత్యం ఖాతాల కుంభకోణానికి సంబంధించి తమను రెండేళ్ల పాటు దేశీయ లిస్టెడ్ కంపెనీలకు ఆడిట్ సేవలు అందించకుండా సెబీ నిషేధించటంపై ఆడిట్ దిగ్గజం ప్రైస్‌వాటర్ హౌస్ కూపర్స్... సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను (శాట్) ఆశ్రయించింది. సత్యం కేసులో తాము ఉద్దేశపూర్వకంగా ఎలాంటి తప్పూ చేయలేదని ఈ సంస్థ ఇప్పటికే ప్రకటించింది.

డీసీబీ లాభం రూ. 57 కోట్లు

ముంబై: ప్రైవేటు రంగ డీసీబీ బ్యాంకు డిసెంబర్ త్రైమాసికంలో రూ.57 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. గత క్యూ3లో వచ్చిన నికర లాభం రూ.51 కోట్లతో పోలిస్తే 11 శాతం వృద్ధి చెందింది. రూ.250 కోట్ల నికర వడ్డీ ఆదాయం సాధించినట్లు బ్యాంకు తెలిపింది. స్థూల ఎన్‌పీఏలు 1.55 శాతం నుంచి 1.89 శాతానికి పెరిగాయి. పునరుద్ధరించిన ఒక కార్పొరేట్ రుణం ఎన్‌పీఏగా మారినట్టు బ్యాంకు తెలిపింది. బీఎస్ఈలో డీసీబీ షేరు 0.21 శాతం తగ్గి రూ.193.55 వద్ద ముగిసింది.

846 టన్నుల బంగారం దిగుమతి

2017లో 53 శాతం అధికం



న్యూఢిల్లీ: బంగారం దిగుమతులు గతేడాది భారీ ఎత్తున పెరిగాయి. ఏకంగా 846 టన్నుల పసిడి దేశంలోకి దిగుమతి అయింది. అంతర్జాతీయంగా ధరలు తక్కువ స్థాయిలో ఉండటంతో పాటు దేశీయంగా డిమాండ్ పెరగడమే దిగుమతులు అధికం కావడానికి కారణాలుగా ఎంఎంటీసీ- పీఏఎంపీ ఇండియా పేర్కొంది. 2016లో దిగుమతి అయిన బంగారం 550 టన్నులతో పోలిస్తే గతేడాది దిగుమతులు 53 శాతం పెరిగినట్టు తెలుస్తోంది. 2017లో పసిడి దిగుమతులు గణనీయంగా పెరిగినట్టు ఎంఎంటీసీ-పీఏఎంపీ ఇండియా ప్రెసిడెంట్ విపిన్ రైనా తెలియజేశారు. ఒక్క డిసెంబర్ నెలలోనే దిగుమతి అయిన బంగారం 70 టన్నులుగా ఉండటం విశేషం. 2016 డిసెంబర్ మాసంలో ఇది 49 టన్నులు మాత్రమే. పండుగలు, పెళ్లిళ్ల సీజన్ డిమాండ్‌కు తోడు అంతర్జాతీయంగా తక్కువ ధరలు ఉండటం పసిడి దిగుమతులను పెంచాయని రైనా అన్నారు. బంగారం దిగుమతులపై ప్రస్తుతం 10 శాతం సుంకం అమల్లో ఉంది. గతేడాది జూలై నుంచి జీఎస్టీ అమల్లోకి రాగా, ఇందులో బంగారంపై 3 శాతం పన్ను వేసినప్పటికీ డిమాండ్ తగ్గకపోవడం విశేషం.

ఐటీ ఉద్యోగార్థుల కోసం కొత్త కోర్సు



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ఐటీ రంగంలో ఎంట్రీ స్థాయి ఉద్యోగార్థుల కోసం ఆన్‌లైన్ విద్యాసేవల పోర్టల్ కోర్సెరా, టెక్ దిగ్గజం గూగుల్ కొత్తగా సర్టిఫికెట్ కోర్సును ప్రకటించాయి. ఈ ఐటీ సపోర్ట్ ప్రొఫెషనల్ సర్టిఫికెట్ కోర్సును... గూగుల్ నిపుణులు రూపొందించగా, కోర్సెరాలో అందుబాటులో ఉంటుంది. ఈ కోర్సుకు జనవరి 16న రిజిస్ట్రేషన్ ప్రారంభమయింది. 23 నుంచి బోధన మొదలవుతుంది. ఐటీలో గతానుభవం లేని వారు సైతం ఈ కోర్సు అభ్యసించిన 8-12 నెలల్లో ఎంట్రీ లెవల్ ఐటీ సపోర్ట్ ఉద్యోగాన్ని పొందగలిగేలా దీన్ని తీర్చిదిద్దినట్లు గూగుల్ వైస్ ప్రెసిడెంట్ బెన్ ఫ్రైడ్ తెలిపారు. బ్యాంక్ ఆఫ్ అమెరికా, వాల్‌మార్ట్, స్ప్రింట్, జీఈ డిజిటల్, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ సంస్థల్లోనూ ఎంట్రీ స్థాయి ఉద్యోగాలను పొందే అవకాశాలున్నట్లు పేర్కొన్నారు. ఐటీలో అనుభవం, శిక్షణ లేనివారు కూడా ప్రొఫెషనల్స్‌గా ఎదిగేందుకు తోడ్పడాలనే లక్ష్యంతోనే.. ఈ కోర్సు అందిస్తున్నట్లు కోర్సెరా భారత విభాగం డైరెక్టర్ రాఘవ్ గుప్తా తెలిపారు.

'అంబర్' ఐపీవోకు అదిరే స్పందన

న్యూఢిల్లీ: ఎయిర్ కండిషనర్లను తయారు చేసే గురుగ్రామ్‌కు చెందిన అంబర్ ఎంటర్‌ప్రైజెస్ ఐపీవోకు తొలిరోజే మంచి ఆదరణ లభించింది. రూ.600 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో వచ్చిన ఐపీవో బుధవారం ప్రారంభం కాగా, మొదటి రోజు పూర్తిగా సబ్‌స్క్రయిబ్ అయింది. 49.27 లక్షల షేర్లను కంపెనీ ఆఫర్ చేస్తుండగా 50.93 లక్షల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. ఐపీవోకు ఒక రోజు ముందు యాంకర్ ఇన్వెస్టర్లకు షేర్ల కేటాయింపు ద్వారా రూ.179 కోట్లను సమీకరించింది. రూ.475 కోట్ల మేర తాజా షేర్లను జారీ చేస్తుండగా, ప్రమోటర్లు జస్బీర్ సింగ్, దల్జీత్ సింగ్ రూ.125 కోట్ల మేర తమ వాటాలను విక్రయిస్తున్నారు. ఈ నెల 19న ఐపీవో ముగుస్తుంది. ఒక్కో షేరుకు రూ.855-859గా కంపెనీ ప్రైస్ బ్యాండ్‌ను నిర్ణయించింది. ప్రముఖ బ్రాండ్లకు ఎయిర్ కండిషనర్లను తయారు చేసి అందించడంతోపాటు రిఫ్రిజిరేటర్లు, నీటి శుద్ధి పరికరాలను కూడా ఈ కంపెనీ తయారు చేస్తోంది.

భారతీ ఇన్‌ఫ్రాటెల్ లాభం రూ. 585 కోట్లు

న్యూఢిల్లీ: మొబైల్ టవర్ల కంపెనీ భారతీ ఇన్‌ఫ్రాటెల్ ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో రూ.585 కోట్ల నికర లాభం సాధించింది. గత క్యూ3లో వచ్చిన నికర లాభం(రూ.620 కోట్లు)తో పోల్చితే 6 శాతం క్షీణించిందని భారతీ ఇన్‌ఫ్రాటెల్ పేర్కొంది. మొత్తం ఆదాయం 7 శాతం వృద్ధితో రూ.3,655 కోట్లకు ఎగసిందని కంపెనీ చైర్మన్ అఖిల్ గుప్తా పేర్కొన్నారు. వడ్డీ వ్యయాలు 154 శాతం పెరిగి రూ.51 కోట్లకు చేరాయని తెలిపారు. ఇబిటా 8 శాతం వృద్ధితో రూ.1,613 కోట్లకు పెరిగిందని, ఇబిటా మార్జిన్ 44.1 శాతంగా నమోదైందని వివరించారు. 4జీ వేగంగా అమల్లోకి వస్తుండటం, డేటా డిమాండ్ పెరుగుతుండటం దీర్ఘకాలానికి సానుకూలాంశాలని వివరించారు. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో భారతీ ఇన్‌ఫ్రాటెల్ షేర్ స్వల్ప నష్టంతో రూ.366 వద్ద ముగిసింది.

మైండ్‌ట్రీ లాభంలో 37 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: ఐటీ రంగంలోని మైండ్‌ట్రీ డిసెంబర్ త్రైమాసికంలో ఆశాజనక ఫలితాలను ప్రకటించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం 37.2 శాతం వృద్ధితో రూ.141.5 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో వచ్చిన లాభం రూ.103 కోట్లు మాత్రమే. ఆదాయం రూ.1,295 కోట్ల నుంచి 6 శాతం పెరిగి రూ.1,377 కోట్లకు చేరింది. ఒక్కో షేరుకు రూ.2 చొప్పున డివిడెండ్ ఇవ్వాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

జీ ఎంటర్‌టైన్‌మెంట్ లాభం రూ. 322 కోట్లు

న్యూఢిల్లీ: వినోద రంగంలోని జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ (జీల్) డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికి రూ.322 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని ఆర్జించింది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో వచ్చిన లాభంతో పోల్చి చూస్తే 28 శాతం వృద్ధి కనిపిస్తోంది. ఆదాయం సైతం 11 శాతం వృద్ధితో రూ.1,886 కోట్లుగా నమోదైంది.

కార్పొబ్రీఫ్స్...

గాయత్రి ప్రాజెక్ట్స్: ఎన్‌హెచ్‌ఏఐ నుంచి రూ. 923 కోట్ల విలువైన రెండు రోడ్డు ప్రాజెక్టులను దక్కించుకుంది.

పెన్నార్: పలు కంపెనీల నుంచి రూ. 242 కోట్ల విలువైన కాంట్రాక్టులు పొందింది.

లారస్ ల్యాబ్స్: గ్రేట్ ప్లేస్ టు వర్క్ సంస్థ నిర్వహించిన అధ్యయనంలో... పనిచేయదగ్గ కంపెనీల్లో ఒకటిగా లారస్ ల్యాబ్స్ గుర్తింపు పొందింది.


ప్రైవేట్ బ్యాంకుల్లో 100 శాతం ఎఫ్‌డీఐ !

న్యూఢిల్లీ: ప్రైవేట్ బ్యాంకుల్లో వంద శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) అనుమతించే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తోంది. అలాగే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కూడా ఎఫ్‌డీఐల పరిమితిని ప్రస్తుతమున్న 20 శాతం నుంచి 49 శాతానికి పెంచాలని కూడా యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనలపై కేంద్ర ఆర్థిక శాఖ, పారిశ్రామిక విధానం, ప్రోత్సాహక విభాగం (డీఐపీపీ), ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) చర్చలు జరుపుతున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం ప్రైవేట్ బ్యాంకుల్లో ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా ఆమోదం తీసుకోవాల్సిన అవసరం లేకుండా 49 శాతం దాకా ఎఫ్‌డీఐలకు అనుమతి ఉంది. అంతకు మించితే 74 శాతం దాకా చేసే పెట్టుబడులకు ప్రభుత్వ అనుమతి కావాల్సి ఉంటోంది. బ్యాంకింగ్ రంగంలో ఎఫ్‌డీఐ పరిమితులను పెంచడం వల్ల బ్యాంకులు సర్వీసులను మెరుగుపర్చుకోవడానికి, కనీస మూలధన అవసరాల నిబంధనలను పాటించడానికి తోడ్పడగలదని పరిశ్రమవర్గాలు పేర్కొన్నాయి.

వెయ్యి స్టోర్లు.. 500 కోట్ల ఆదాయం

డిసెంబర్ నాటికి శ్రీశ్రీ తత్వ సంస్థ లక్ష్యం

ముంబై: ఆధ్యాత్మిక గురు శ్రీశ్రీ రవిశంకర్‌కి చెందిన ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తుల సంస్థ శ్రీశ్రీ తత్వ... తన కార్యకలాపాల విస్తరణపై దృష్టి పెట్టింది. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో పరిమిత స్థాయిలో ఉన్న లావాదేవీలను మరింత పెంచుకునేందుకు ఆన్‌లైన్ రిటైల్ సంస్థ బిగ్‌బాస్కెట్‌తో బుధవారం ఒప్పందం కుదుర్చుకుంది. అలాగే, ఈ ఏడాది ఆఖరు కల్లా 1,000 రిటైల్ స్టోర్స్ ఏర్పాటు చేయాలని, రూ.500 కోట్ల ఆదాయం ఆర్జించాలని నిర్దేశించుకున్నట్లు సంస్థ ఎండీ అరవింద్ వర్చస్వి తెలిపారు. ఫ్రాంచైజీ విధానంలో ప్రారంభించే ఈ స్టోర్స్ కోసం ఫ్రాంచైజీ ఇండియా సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన తెలియజేశారు. శ్రీశ్రీ తత్వ మార్ట్, శ్రీశ్రీ తత్వ వెల్‌నెస్ ప్లేస్, శ్రీశ్రీ తత్వ హోమ్ అండ్ హెల్త్ పేరిట మూడు రకాల స్టోర్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు అరవింద్ తెలిపారు. మార్ట్‌లో ఆహారోత్పత్తులు, హోమ్ కేర్ ఉత్పత్తులు ఉంటాయని, వెల్‌నెస్ ప్లేస్‌లో ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తులతో పాటు హెల్త్‌కేర్ నిపుణులు కూడా అందుబాటులో ఉంటారని చెప్పారాయన.



ఇక, హోమ్ అండ్ హెల్త్ బ్రాండ్ స్టోర్స్‌లో రోజువారీ ఉపయోగించే అన్ని ఉత్పత్తులు, ఔషధాలతో పాటు ఆయుర్వేద వైద్యులు కూడా ఉంటారని తెలియజేశారు.

కంపెనీ ప్రస్తుతం 33 దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తుండగా.. ఈ ఏడాది ప్రధానంగా లాటిన్ అమెరికా, పశ్చిమాసియా, రష్యా, తూర్పు యూరప్, మధ్యప్రాచ్య ప్రాంతాలపై దృష్టి పెట్టనున్నట్లు అరవింద్ తెలియజేశారు. యోగా గురు రాందేవ్ బాబాకి చెందిన పతంజలి ఆయుర్వేద సంస్థ కూడా కార్యకలాపాలను విస్తరించే దిశగా.. పలు ఈ-కామర్స్ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్న సంగతి తెలిసిందే.

బోర్డ్ మీటింగ్స్

భారతీ ఎయిర్‌టెల్, యస్ బ్యాంక్, హిందుస్తాన్ జింక్, అల్ట్రాటెక్ సిమెంట్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్, డీబీ కార్ప్, జుబిలంట్ ఇండస్ట్రీస్, జెన్సర్ టెక్నాలజీస్, సైయంట్

బులియన్ రూ.లలో

	ధర	మార్పు
ముంబై		
బంగారం (99.9, 10గ్రా)	30,225	▲ 15
బంగారం (99.5, 10గ్రా)	30,075	▲ 15
వెండి (కిలో)	38,220	▲ 330
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)		
బంగారం (22 క్యారెట్లు)	28,790	▼ 30
వెండి (కిలో)	42,400	0
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	30,820	▼ 30
బంగారం (22 క్యారెట్లు)	28,820	▼ 30
వెండి(కిలో)	42,300	▼ 300
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	30,750	
బంగారం (22 క్యారెట్లు)	28,560	
వెండి(కిలో)	40,200	
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	31,170	▼ 300
బంగారం (22 క్యారెట్లు)	29,150	▲ 300
వెండి(కిలో)	---	
విజయవాడ		
బంగారం (24 క్యారెట్లు)	31,200	
బంగారం (22 క్యారెట్లు)	28,800	
వెండి(కిలో)	40,200	
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	31,130	▼ 30
బంగారం (22 క్యారెట్లు)	28,790	▼ 30
వెండి(కిలో)	40,400	▲ 100

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	64.01 (రాత్రి 11.30కు)	$63.73 (మంగళవారం ముగింపు)
బ్రెంట్	69.46 (రాత్రి 11.30కు)	$69.15 (మంగళవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 18-1-2018

విశాఖ	412-00
చిత్తూరు	398-00
వరంగల్	404-00
ముంబై	447-00
చెన్నై	405-00
విజయవాడ	412-00
గోదావరి	412-00
నమక్కల్	395-00
17-1-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	402-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.60
బెంగళూరు	405-00
ఢిల్లీ	425-00
కోల్‌కతా	464-00

ఎన్‌ఎస్‌ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PO	433.4	423.55
AMBUJA C	277.15	277.85
ASIAN PA	1193.75	1188.75
AXIS BAN	585.2	563.2
BAJAJ AU	3194.15	3160.05
BAJAJ FI	1701.2	1687.35
BHARTI A	499.9	497.25
[illegible]	[illegible]	[illegible]

A B C D

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
20 MICRO	57.15	57.7
20 MICRO	57.15	57.7
3M INDIA	18008.4	17756.25
5PAISA C	328.55	338.95
63 MOONS	111.9	112.75
8K MILES	815.4	833.3
AARTI DR	740.3	746.5
AARTI IN	1112.4	1125.15
AARVEE D	51.5	51.9
AARVI EN	105	109
[illegible]	[illegible]	[illegible]
BANNARI	2180.3	2256.8
BANSAL M	108	106.9
BANSWARA	134	134.85
BASF IND	2181.85	2207.95
BATA IND	730.7	727.6
BAYER CR	4600.7	4626.5
BEARDSEL	66.65	67.05
BEML LIM	1539.1	1531.75
BERGER P	257.95	260.95
BETA DRU	181.95	188
BF INVES	369.45	368.8
BF UTILI	536.6	523
BGR ENER	142.85	143.55
[illegible]	[illegible]	[illegible]
DHANUKA	774.85	778.45
DHUNSERI	176.1	180.85
DHUNSERI	481.6	488.95
DIC INDI	584.65	598.1
DILIP BU	958.9	933.4
DISH TV	75.3	72.4
DISHMAN	364.85	361.65
DIXON TE	3644	3703.65
DOLLAR I	464.55	465.05
DOLPHIN	134.7	137.7
DR. LAL	915.7	914.7
DUCON IN	51.6	51.15
DYNACONS	49.8	50.9
[illegible]	[illegible]	[illegible]

E F G H / I J K L

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
[illegible]	[illegible]	[illegible]
GUFIC BI	126.85	124.75
GUJ IND	130.4	131.55
GUJ NAR	495.05	485.6
GUJ STAT	158.6	155.5
GUJ. APO	235.85	234.7
GUJARAT	157.15	158.3
GUJARAT	154.7	158.65
GUJARAT	221.35	215.75
GUJARAT	259.2	261.2
GUJARAT	892.25	883.2
GUJARAT	905.45	891.1
GUJARAT	881.25	907.15
GULF OIL	882.35	894.55
[illegible]	[illegible]	[illegible]
JBM AUTO	520.45	529.55
JET AIRW	821.3	790.35
JET KNIT	117.1	125
JHS SVEN	69.95	68.8
JIND POL	77.4	79
JINDAL D	203.6	201.85
JINDAL P	394.5	399.55
JINDAL S	116.6	116.8
JINDAL S	167.85	169.35
JINDAL S	211.65	215.55
JINDAL S	269.7	270.7
JINDAL W	613.15	582.3
JK CEMEN	1148.75	1139.35
[illegible]	[illegible]	[illegible]

M N O P / R S T U / V W Y Z

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
MAN INFR	69.35	68.5
MANAKSIA	72.15	73.95
MANAPPUR	119.5	118
MANG.CHE	78.4	77.1
MANGALAM	201.45	193.6
MANGALAM	442.7	453.15
MANPASAN	447.8	460.8
MANUGRAP	56	55.3
MARATHON	608.5	608.2
MAS FINA	624.65	623.3
MASTEK L	427.5	414.8
MATRIMON	943.25	930.65
MAWANA S	72.75	74.35
[illegible]	[illegible]	[illegible]
PDS MULT	333.8	329.8
PEARL GL	136.3	138.1
PENNAR E	112.15	113.15
PENNAR I	66.75	68.4
PERSISTE	770.25	754.15
PETRON E	138.55	139.8
PFIZER L	2096.25	2028.5
PG ELECT	403	399.75
PHILIPS	1313.2	1340.7
PI INDUS	987.5	993.95
PIONEER	210.15	206.65
PLASTIBL	250.3	243.5
PNB HOUS	1279.1	1282.15
[illegible]	[illegible]	[illegible]
SCHAEFFL	5702.8	5700.6
SCHNEIDE	127.8	127.5
SECUR CR	239.75	211
SECURITY	1164.65	1180.5
SEQUENT	97.75	97
SESHASAY	1185.2	1135.6
SETCO AU	66.4	65.35
SHAKTI P	503.35	492.2
SHALBY L	239.75	229.55
SHALIM P	207.35	209
SHANKARA	1775.8	1751.15
SHANTHI	161.85	162.95
SHARDA C	447.15	453.25
[illegible]	[illegible]	[illegible]
TEXMACO	115.6	114.6
TGB BANQ	59.5	59.5
THANGAMA	627.4	628.8
THE BYKE	177.5	176.5
THE GE S	438.55	438.15
THE GROB	2377.4	2502.5
THE HI-T	526.6	534.4
THE INDI	148.65	144.55
THE INDI	197.7	195.4
THE MAND	174	168.05
THE NEW	613.95	611.9
THE P K	641.65	583.35
THE PHOE	611.2	599.6
[illegible]	[illegible]	[illegible]

బీఎస్ఈ ఎస్ఎంఈ షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
[illegible]	[illegible]	[illegible]

అమెరికాలో రోడ్డు ప్రమాదం

కరీంనగర్ జిల్లావాసి మృతి



కరీంనగర్ క్రైం: అమెరికాలోని సౌత్ ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కరీంనగర్ జిల్లాకి చెందిన నరహరి భరత్‌రెడ్డి మృతిచెందాడు. జిల్లాలోని కొత్తపల్లి మండలం మల్కాపూర్‌కు చెందిన నరహరి లక్ష్మారెడ్డి, లక్ష్మిల కుమారుడైన భరత్‌రెడ్డి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. ఫిబ్రవరిలో డాల్ఫిన్స్ క్యాన్సర్ ఛాలెంజ్ ఆధ్వర్యంలో జరిగే సైక్లింగ్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంది. దీనిలో భాగంగా ఈ నెల 13న సైక్లింగ్ ప్రాక్టీస్ చేస్తుండగా అదుపుతప్పి పడిపోయాడు. రోడ్డు అవతల వైపు పడిన భరత్‌రెడ్డిని ఓ కారు ఢీ కొట్టింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

సంప్రదాయ పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు



ఘనంగా మెస్రం కోడళ్ల బేటింగ్



జాతరలో భాగంగా బేటింగ్ కార్యక్రమంలో పాల్గొన్న మెస్రం వంశ కొత్త కోడళ్లు

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లోని నాగోబా జాతరలో మెస్రం కోడళ్ల బేటింగ్(పరిచయం) వైభవంగా సాగింది. మంగళవారం రాత్రి మహాపూజల తర్వాత జాతర ప్రారంభం కాగా, బుధవారం ఉదయం వరకు మెస్రం కొత్త కోడళ్ల బేటింగ్ నిర్వహించారు. మొత్తం 26 మంది కొత్త కోడళ్లను సంప్రదాయ వాయిద్యాలతో ఆలయానికి తీసుకువచ్చారు. తెల్లటి దస్తులు ధరింపజేసి సతిదేవత గుడిలో పూజలు చేయించారు. అనంతరం వంశ పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తున్న ప్రధాన్ కితకు చెందిన ప్రధాన్‌లకు కొత్త కోడళ్లు కానుకలు సమర్పించారు. బేటింగ్ పూర్తి కావడంతో కొత్త కోడళ్లు మెస్రం వంశంలో చేరినట్లు భావించారు.

ప్రత్యేక వంటకాలతో నైవేద్యం..

మెస్రం వంశీయులు 22 కితల వారీగా వంటకాలు తయారు చేసి ప్రత్యేక పూజలతో నైవేద్యం సమర్పించారు. కితలవారీగా సహపంక్తి భోజనాలు చేశారు. రాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి నాగోబా ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి మొక్కు తీర్చుకుంటున్నారు.

– ఇంద్రవెల్లి

మేడారం గద్దెల వద్ద భక్తులు





పసుపు, కుంకుమ తీసుకొస్తున్న మేడారం వడ్డెలు

గుడిమెలిగె వేళ పోటెత్తిన భక్తులు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మేడారం గ్రామం బుధవారం భక్తజనంతో పోటెత్తింది. సమ్మక్క-సారలమ్మ మహాజాతరలో భాగంగా తొలి ఘట్టమైన గుడిమెలిగె పండుగను వడ్డెలు బుధవారం వైభవంగా నిర్వహించారు. జంపన్న వాగులో స్నానాలు చేసిన సమ్మక్క-సారలమ్మ గద్దెలను దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు.

– తాడ్వాయి (ములుగు)

రాతికోటకు బీటలు

చెదిరిపోతున్న పాపన్న ఆనవాళ్లు ● శిథిలావస్థకు చేరిన కోట

సాక్షి, జనగామ: మొఘల్ పాలకుల ఆధిపత్యాన్ని ఎదిరించి బహుజన రాజ్య స్థాపనకు నడుం కట్టిన సర్దార్ సర్వాయి పాపన్న రాతి కోటకు బీటలు పడుతున్నాయి. నాటి గోల్కొండ రాజ్యా న్ని జయించి విజయ కేతనం ఎగురేసిన కోటను ఇప్పుడు పట్టించుకునే నాథుడు లేక కూలిపోయే దశకు చేరుకుంది. టూరిజం స్పాట్‌గా గుర్తించి నిధులు కేటాయించినా కనీస మరమ్మతులకు నోచుకోవడం లేదు.

జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్‌లో సర్దార్ సర్వాయి పాపన్న క్రీ.శ 17వ శతాబ్దంలో రాతి కోటను నిర్మించారు. రాజ్య విస్తరణలో భాగంగా మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు గోల్కొండపై కన్నేసి దండయాత్రకు పూనుకున్నారు. ఈ క్రమంలోనే క్రీ.శ.1687లో గోల్కొండను ఔరంగజేబు స్వాధీనం చేసుకున్నాడు. ఈ కాలంలో మొఘల్ పాలకులు నియమించిన సుబేదార్ల ఆగడాలతో రాజ్యంలో అరాచకం నెలకొంది. ప్రజలు అణచివేతకు గురవుతున్న సమయంలో క్రీ.శ. 1650లో పాపన్న జన్మించారు. గౌడ కులంలో జన్మించిన పాపన్న పశువుల కాపరిగా, తర్వాత కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగించారు. పాలకుల విధానాల కారణంగా పాపన్నలో రాజ్యకాంక్ష పెరిగింది. బలహీన వర్గాలు ఏకమైతేనే రాజ్యాధికారానికి రావచ్చని సొంతం సైన్యం ఏర్పాటు కోసం శ్రీకారం చుట్టారు. మొగల్ పాలకులపై తిరుగుబాటును ప్రకటించిన పాపన్న తొలి కోటను ఖిలాషాపూర్‌లోనే నిర్మించి నట్లుగా చరిత్రకారుల అభిప్రాయం. ఔరంగజేబు మరణించాక మొఘల్ సామ్రాజ్యంపై దండెత్తి పలు కోటలను పాపన్న స్వాధీనం చేసుకున్నారు. ఖిలాషాపూర్ కోట కేంద్రంగా వరంగల్, భువనగిరి, గోల్కొండను వశపర్చుకున్నారు.

రాతి కోట నిర్మాణం ఇలా..

ఖిలాషాపూర్‌లో పాపన్న క్రీ.శ 1675లో రాతి కోటను నిర్మించారు. 20 అడుగుల ఎత్తులో రాతి కోటను నిర్మించారు. ఆ కోటపై నాలుగు వైపులా 50 అడుగుల ఎత్తుతో బురుజులు, మధ్యలో మరో బురుజును నిర్మించారు. దూర ప్రాంతాల నుంచి శత్రువులు దండెత్తి వస్తే సులువుగా గుర్తించే విధంగా కోటను నిర్మాణం చేశారు. అంతేకాకుండా కోట సొరంగ మార్గాలను సైతం తవ్వించినట్లుగా చరిత్రకారులు, స్థానికులు చెబుతున్నారు. శత్రు దుర్భేధ్యంగా పూర్తిగా రాతితో కోట నిర్మాణం చేశారు.

కూలిపోతున్న ఖిలాషాపూర్‌లోని రాతికోట



చెదిరిపోతున్న కోట ఆనవాళ్లు..

బహుజన రాజ్య స్థాపకుడిగా గుర్తింపు పొందిన పాపన్న నిర్మించిన రాతి కోట ఇప్పుడు శిథిలావస్థకు చేరింది. కోట లోపలి భాగం ధ్వంసం అవుతోంది. గోడలు కూలిపోతున్నాయి. 2017 జనవరిలో కోట మరమ్మతు కోసం టూరిజం శాఖ రూ. 3 కోట్లు కేటాయించింది. అయినా పనులు చేపట్టకపోవడంతో కోట అస్తిత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. అంతేకాదు టూరిజం శాఖ చైర్మన్ పేర్వారం రాములు సొంత గ్రామంలోనే ఈ కోట ఉండటం గమనార్హం. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కోట అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

● రబీలో ఇప్పటివరకు 6.15 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పడ్డాయని వ్యవసాయశాఖ బుధవారం ఒక నివేదికలో వెల్లడించింది.

మాఫియా రాజ్యమేలుతోంది!

టీఆర్‌ఎస్ పాలనపై బీజేపీ శాసనసభాపక్ష నేత జి.కిషన్‌రెడ్డి ధ్వజం



కిషన్‌రెడ్డిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

సాక్షి, కామారెడ్డి: టీఆర్‌ఎస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని బీజేపీ శాసన సభాపక్ష నేత జి.కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా, భూమాఫియా, లిక్కర్ మాఫియా, డ్రగ్ మాఫియా రాజ్యమేలుతున్నాయని ఆరోపించారు. దీనిపై ప్రశ్నించిన వారిని అరెస్టు చేసి జైళ్లకు పంపుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కామారెడ్డి కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద ఇసుక మాఫియాకు వ్యతిరేకంగా నిర్వహించిన మహాధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వీఆర్‌ఏ సాయిలును ఇసుక మాఫియా హతమారిస్తే ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో కలెక్టర్, ఎస్పీలు మసిపూసి మారేడు కాయ చేస్తున్నారన్నారు. ఇసుక ట్రాక్టర్ కానప్పుడు అక్కడికి ఇసుక ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. వ్యవసాయానికి దన్నుగా ఉండేందుకు కేంద్రం అందిస్తున్న ట్రాక్టర్లను టీఆర్‌ఎస్ ప్రభుత్వం తమ కార్యకర్తలకు ఇచ్చి వాటితో ఇసుక వ్యాపారం చేయిస్తోందని ఆరోపించారు.

అంతా కేసీఆర్ స్వామ్యమే..

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని, అంతా కేసీఆర్ స్వామ్యమే నడుస్తోందని కిషన్‌రెడ్డి విమర్శించారు. మందకృష్ణ మాదిగను అరెస్టు చేసి జైలులో నిర్బంధించారన్నారు. ప్రజల పక్షాన పోరాడుతున్న వారిని అణచివేస్తూ, మాఫియాను పెంచి పోషిస్తున్నారన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనకుండా, ఉద్యమాన్ని అడ్డుకున్న వారంతా ఇప్పుడు ప్రగతి భవన్‌లో ఉన్నారన్నారు. దర్నా అనంతరం కలెక్టరేట్‌లోకి వెళ్లడానికి ప్రయత్నించిన కిషన్‌రెడ్డిని పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. ఆందోళనలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బాణాల లక్ష్మారెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యుడు యెండల లక్ష్మీనారాయణ, మాజీ మంత్రి ఆంజనేయులు, నాయకులు మురళీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో సిక్కి రెడ్డి జంట

మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి సిక్కి రెడ్డి మహిళల డబుల్స్ విభాగంలో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. కౌలాలంపూర్‌లో బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో సిక్కి రెడ్డి–అశ్విని పొన్నప్ప (భారత్) జంట 21–15, 21–12తో జోనా గొలిస్‌జెవ్‌స్కీ–లారా కెప్లెన్ (జర్మనీ) జోడీపై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో హైదరాబాద్ ఆటగాడు భమిడిపాటి సాయిప్రణీత్ శుభారంభం చేశాడు. తొలి రౌండ్‌లో సాయిప్రణీత్ 21–13, 21–13తో కాంతాపోన్ వాంగ్‌చరోయిన్ (థాయ్‌లాండ్)ను ఓడించాడు.

అదే కథ... అదే వ్యథ

రెండో టెస్టులోనూ భారత్ పరాజయం

135 పరుగులతో దక్షిణాఫ్రికా విజయం • లుంగీ ఇన్‌గిడికి 6 వికెట్లు
సిరీస్ 2–0తో సఫారీల సొంతం • 24 నుంచి చివరి టెస్టు

ఏదో అద్భుతం జరిగిపోతుందని ఎవరూ ఊహించలేదు. కానీ కొంత ప్రయత్నం, పోరాటానికి మాత్రం ఆస్కారం ఉందని అనిపించింది. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా మారడం, బ్యాటింగ్ చేయగల సత్తా ఉన్నవారు ఇంకా ఉండటంతో ఏదో మూల ఆశ! కానీ భారత్ అలాంటి ఆలోచనలకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. మన ఆట ముగిసేందుకు మరో 27.2 ఓవర్లు మాత్రమే సరిపోయాయి. మొదటి టెస్టు ఆడుతున్న ఇన్‌గిడి, రబడ ధాటికి బ్యాట్స్‌మెన్ చేతులెత్తేయడంతో విదేశీ గడ్డపై మరో పరాజయం టీమిండియా ఖాతాలో చేరగా... సిరీస్ సఫారీ చేతికి చిక్కింది.

బ్యాటింగ్‌లో పట్టుదల, నిర్దాక్షిణ్యమైన బౌలింగ్, అంత కంటే అద్భుతమైన ఫీల్డింగ్ వెరసి దక్షిణాఫ్రికాకు సెంచూరియన్‌లో విజయాన్ని అందించాయి. మరోవైపు బ్యాటింగ్, ఫీల్డింగ్‌లో సమష్టిగా విఫలమైన కోహ్లి సేన ఏమాత్రం పోటీనివ్వకుండా తలవంచింది. తొలి ఇన్నింగ్స్‌లో కోహ్లి ఒక్కడే 153 పరుగులు చేస్తే... రెండో ఇన్నింగ్స్‌లో జట్టు మొత్తం కలిసి చేసింది 151 మాత్రమే. సిరీస్ గెలవాలన్న కల ఎలాగూ పోయింది. ఇక మిగిలింది వాండరర్స్ మైదానంలో పరువు నిలబెట్టుకోవడమే.

సెంచూరియన్: దక్షిణాఫ్రికా జట్టు రెండేళ్ల క్రితం భారత గడ్డపై ఎదురైన పరాజయానికి తగిన రీతిలో ప్రతీకారం తీర్చుకుంది. వరుసగా రెండు టెస్టుల్లో టీమిండియాను చిత్తు చేసి సిరీస్ సొంతం చేసుకుంది. బుధవారం ఇక్కడ ముగిసిన రెండో టెస్టులో దక్షిణాఫ్రికా 135 పరుగుల భారీ తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. 287 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో చివరి రోజు భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 151 పరుగులకే కుప్పకూలింది. రోహిత్ శర్మ (74 బంతుల్లో 47; 6 ఫోర్లు, 1 సిక్స్) కొద్దిగా పోరాడటం మినహా మిగతా వాళ్లంతా విఫలమయ్యారు. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' లుంగీ ఇన్‌గిడి 6 వికెట్లు పడగొట్టగా, రబడకు 3 వికెట్లు దక్కాయి. తాజా ఫలితంతో మూడు టెస్టుల సిరీస్‌ను దక్షిణాఫ్రికా 2–0తో గెలుచుకుంది. చివరిదైన మూడో టెస్టు ఈ నెల 24 నుంచి జొహన్నెస్‌బర్గ్‌లో జరుగుతుంది.

వరుస కట్టి...

ఓవర్‌నైట్ స్కోరు 35/3తో చివరి రోజు ఆట ప్రారంభించిన భారత్ మరో 116 పరుగులు జోడించి మిగతా ఏడు వికెట్లు కోల్పోయింది. లంచ్ విరామానికి ముందే భారత్ పోరాటం ముగిసింది. ఐదో రోజు లుంగీ ఇన్‌గిడి నాలుగు వికెట్లతో భారత్ పని పట్టాడు. మరో రెండు వికెట్లు రబడ ఖాతాలో చేరగా, పుజారా (19) స్వయంకృతాపరాధంతో మ్యాచ్‌లో రెండోసారి రనౌటయ్యాడు. బుధవారం నాలుగో ఓవర్ తొలి బంతిని పార్థివ్ గల్లీ వైపు ఆడాడు. దానిని ఆపేందుకు ఇన్‌గిడి, డివిలియర్స్ ఇద్దరూ పరుగెత్తారు. అప్పటికే రెండు పరుగులు పూర్తి చేసిన పుజారా ఏబీని తక్కువగా అంచనా వేస్తూ మూడో పరుగు కోసం ప్రయత్నించాడు. అయితే డివిలియర్స్ విసిరిన త్రో కచ్చితత్వంతో కీపర్ వద్దకు రావడం, డి కాక్ వికెట్లు పడగొట్టడం వెంటనే జరిగిపోయాయి. కొద్ది సేపటికే తప్పుడు పుల్ షాట్ ఆడిన పార్థివ్ (19) ఫైన్ లెగ్‌లో మోర్కెల్ చక్కటి క్యాచ్‌కు వెనుదిరిగాడు. ఆదుకుంటారనుకున్న పాండ్యా (6), అశ్విన్ (3)లను ఇన్‌గిడి వరుస ఓవర్లలో పెవిలియన్‌కు పంపించడంతో భారత్ అప్పటికే ఆశలు కోల్పోయింది. ఈ దశలో రోహిత్, షమీ (24 బంతుల్లో 28; 5 ఫోర్లు) ధాటిగా ఆడి ఎనిమిదో వికెట్‌కు 61 బంతుల్లోనే 54 పరుగులు జోడించారు. అయితే ఇది ఎంతో సేపు సాగలేదు. రబడ బౌలింగ్‌లో రోహిత్ హుక్ చేయగా, ఫైన్ లెగ్‌లో డివిలియర్స్ అద్భుత క్యాచ్ అందుకున్నాడు. ఆ వెంటనే షమీ పని పట్టి ఐదో వికెట్‌ను తన ఖాతాలో వేసుకున్న ఇన్‌గిడి... తన తర్వాతి ఓవర్లో బుమ్రా (2)ను అవుట్ చేసి భారత్ ఆట ముగించాడు.



హార్దిక్ పాండ్యా వికెట్ తీసిన అనంతరం సహచరులతో ఇన్‌గిడి సంబరం

స్లో
ఓవర్‌రేట్ కారణంగా దక్షిణాఫ్రికా కెప్టెన్ డు ప్లెసిస్‌పై మ్యాచ్ ఫీజులో 40 శాతం... జట్టులోని మిగతా సభ్యులకు ఐసీసీ 20 శాతం జరిమానా విధించింది.

1 కోహ్లి కెప్టెన్సీలో భారత్ తొలిసారి సిరీస్ కోల్పోయింది. 2015లో శ్రీలంకతో సిరీస్ నుంచి మొదలు పెడితే వరుసగా 9 సిరీస్‌లు నెగ్గిన తర్వాత భారత్‌కు ఎదురైన పరాజయం ఇది. అయితే 2010 నుంచి ఉపఖండం బయట (వెస్టిండీస్‌ను మినహాయిస్తే) ఎనిమిది సిరీస్‌లు ఆడిన టీమిండియా ఒక్కటి కూడా గెలవలేకపోయింది. 7 ఓడగా... 1 డ్రా చేసుకుంది.

1 రెండు ఇన్నింగ్స్‌లలోనూ రనౌట్ అయిన మొదటి భారత బ్యాట్స్‌మన్ పుజారా.

7 తొలి టెస్టులోనే మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకున్న ఏడో దక్షిణాఫ్రికా ఆటగాడు ఇన్‌గిడి.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 335; భారత్ తొలి ఇన్నింగ్స్ 307; దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 258; భారత్ రెండో ఇన్నింగ్స్: మురళీ విజయ్ (బి) రబడ 9; లోకేశ్ రాహుల్ (సి) మహరాజ్ (బి) ఇన్‌గిడి 4; చతేశ్వర్ పుజారా (రనౌట్) 19; విరాట్ కోహ్లి (ఎల్బీ) (బి) ఇన్‌గిడి 5; పార్థివ్ పటేల్ (సి) మోర్కెల్ (బి) రబడ 19; రోహిత్ శర్మ (సి) డివిలియర్స్ (బి) రబడ 47; హార్దిక్ పాండ్యా (సి) డి కాక్ (బి) ఇన్‌గిడి 6; అశ్విన్ (సి) డి కాక్ (బి) ఇన్‌గిడి 3; షమీ (సి) మోర్కెల్ (బి) ఇన్‌గిడి 28; ఇషాంత్ శర్మ (నాటౌట్) 4; జస్‌ప్రీత్ బుమ్రా (సి) ఫిలాండర్ (బి) ఇన్‌గిడి 2; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (50.2 ఓవర్లలో ఆలౌట్) 151.**

వికెట్ల పతనం: 1–11; 2–16; 3–26; 4–49; 5–65; 6–83; 7–87; 8–141; 9–145; 10–151.

బౌలింగ్: ఫిలాండర్ 10–3–25–0; రబడ 14–3–47–3; ఇన్‌గిడి 12.2–3–39–6; మోర్కెల్ 8–3–10–0; మహరాజ్ 6–1–26–0.

ఫైనల్లో భారత్, పాక్

అంధుల వన్డే ప్రపంచకప్



అజ్మాన్ (యూఏఈ): డిఫెండింగ్ చాంపియన్ భారత క్రికెట్ జట్టు తమ జోరు కొనసాగిస్తూ అంధుల వన్డే వరల్డ్ కప్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. బంగ్లాదేశ్‌తో బుధవారం జరిగిన సెమీఫైనల్లో భారత్ ఏడు వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. తొలుత బంగ్లాదేశ్ 38.5 ఓవర్లలో 256 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్లలో దుర్గారావు మూడు వికెట్లు పడగొట్టగా... ప్రకాశ్, దీపక్ రెండేసి వికెట్లు తీశారు. 257 పరుగుల లక్ష్యాన్ని భారత్ 23 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి అధిగమించింది. గణేశ్ (112) సెంచరీ సాధించగా... దీపక్ (53), నరేశ్ (40) రాణించారు. మరో సెమీఫైనల్లో పాకిస్తాన్ 156 పరుగుల తేడాతో శ్రీలంకను ఓడించింది. ఈనెల 20న షార్జాలో భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య ఫైనల్ జరుగుతుంది. లీగ్ దశలో పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఏడు వికెట్ల తేడాతో గెలిచింది.

భారత్ శుభారంభం



తౌరంగ (న్యూజిలాండ్): నాలుగు దేశాల అంతర్జాతీయ హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు శుభారంభం చేసింది. జపాన్‌తో బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 6–0 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున దిల్‌ప్రీత్ (35వ, 45వ ని.లో)... వివేక్ (12వ, 28వ ని.లో) రెండేసి గోల్స్ చేయగా... రూపిందర్ పాల్ సింగ్ (7వ ని.లో), హర్మన్‌ప్రీత్ సింగ్ (41వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. గురువారం జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో బెల్జియంతో భారత్ తలపడుతుంది.

శ్రీలంకకు జింబాబ్వే షాక్

ఢాకా: బంగ్లాదేశ్‌లో జరుగుతున్న ముక్కోణపు వన్డే టోర్నీలో శ్రీలంకపై జింబాబ్వే 12 పరుగులతో సంచలన విజయం సాధించింది. తొలుత జింబాబ్వే 50 ఓవర్లలో 6 వికెట్లకు 290 పరుగులు చేసింది. మసకద్జ (73; 10 ఫోర్లు), సికందర్ రజా (81 నాటౌట్; 8 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. లంక బౌలర్లలో గుణరత్నెకు 3 వికెట్లు దక్కాయి. అనంతరం లంక 48.1 ఓవర్లలో 278 పరుగులకు ఆలౌటైంది. కుశాల్ పెరీరా (80; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), మాథ్యూస్ (42; 1 ఫోర్, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. చివర్లో తిసారా పెరీరా (37 బంతుల్లో 64; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగినా ఫలితం లేకపోయింది. జింబాబ్వే బౌలర్లలో చటారాకు 4, జార్విస్, క్రీమర్‌లకు చెరో 2 వికెట్లు దక్కాయి.



కోహ్లి

ఓటమి ఎవరి ఖాతాలో?

సాక్షి క్రీడావిభాగం

'అత్యుత్తమమైన 11 మంది అంటే ఎవరు? మీరే చెప్పండి. మీరు ఎంపిక చేసిన 11 మందినే తీసుకుంటాను'... సెంచూరియన్ టెస్టులో ఓటమి అనంతరం మీడియా సమావేశంలో తుది జట్టు ఎంపిక గురించి అడిగిన ప్రశ్నకు భారత కెప్టెన్ విరాట్ కోహ్లి ఒకింత ఆగ్రహంతో ఇచ్చిన సమాధానం ఇది. చాలా కాలంగా పరుగుల వరద పారించడంతో పాటు ప్రశాంతంగా నాయకత్వ బాధ్యతలు కొనసాగిస్తూ వివాదాలకు దూరంగా ఉంటున్న కోహ్లి ఇలా ఒక్కసారిగా అసహనం ప్రదర్శించడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. ఈ టెస్టులో ఇప్పటికే తన దుందుడుకు చర్యతో ఐసీసీ శిక్షకు గురయ్యాక మ్యాచ్‌లో పరాజయం పలకరించడంతో ఒక్కసారిగా పాత కోహ్లి బయటకు వచ్చాడు. అనూహ్య రీతిలో రెండు టెస్టుల్లో పరాభవం ఎదుర్కోవడాన్ని అతను ఇంకా జీర్ణించుకోలేకపోతున్నాడనేది వాస్తవం. ఈ జట్టు దక్షిణాఫ్రికా పర్యటనకు బయల్దేరే ముందు ఎన్నో అంచనాలు ఉన్నాయి. రెండేళ్లుగా సాగిస్తున్న వరుస విజయాల కిరీటాన్ని నెత్తిన పెట్టుకొని మనోళ్లు సఫారీ గడ్డపై అడుగు పెట్టారు. పేస్ బౌలింగ్ గొప్పగా ఉందని, గతంలో ఏ జట్టూ సాధించని ఘనతను వీరు చేసి చూపిస్తారని, రాబోయే 18 నెలల తర్వాత అందరు హా..శ్చర్యపోయే తరహాలో టీమిండియా కనిపిస్తుందని కోచ్ రవిశాస్త్రి చెప్పిందే మళ్లీ మళ్లీ చెబుతూ వచ్చారు. కానీ తుది ఫలితానికి వచ్చేసరికి అంతా తారుమారైంది. ఎప్పటిలాగే విదేశీ గడ్డపై మేమింతే అన్నట్లుగా పాత జట్లనే తలపిస్తూ మనోళ్లు రెండు టెస్టుల్లో ఓటమి మూటగట్టుకున్నారు.

నిజానికి సెంచూరియన్ టెస్టు పిచ్ భారత్‌లోలాగానే ఉందని గవాస్కర్ మొదలు విశ్లేషకులంతా అభిప్రాయపడ్డారు. మోర్నీ మోర్కెల్ అయితే 100 శాతం భారత పిచ్‌పైనే బౌలింగ్ చేస్తున్నట్లుంది అని వ్యాఖ్యానించాడు. ఇలాంటి చోట కూడా మనోళ్లు ప్రయోజనం పొందలేకపోయారంటే బ్యాటింగ్ వైఫల్యమే కారణం. దీనికి తోడు నాసిరకం ఫీల్డింగ్, వికెట్ల మధ్య పేలవమైన పరుగు. ధావన్ స్థానంలో వచ్చిన రాహుల్ రెండు ఇన్నింగ్స్‌లలోనూ చెత్త షాట్‌లు ఆడి అవుట్ కాగా, విజయ్ మరోసారి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోలేకపోయాడు. మూడో స్థానంలో పుజారాను కూడా నమ్మలేని పరిస్థితి వచ్చింది! పైగా ఈ మ్యాచ్ రెండు ఇన్నింగ్స్‌లలో రనౌట్ అయిన తీరు విచారకరం. తొలి ఇన్నింగ్స్‌లో అవసరం లేకపోయినా తొలి బంతికే సింగిల్, రెండో ఇన్నింగ్స్‌లో మూడో పరుగు తీసే ప్రయత్నం చేయడం పెద్ద సాహసమే. సరిగ్గా చెప్పాలంటే భారత ఆటగాళ్లు టెస్టుల్లో రనౌటైన గత ఎనిమిది సందర్భాల్లో ఆరింటిలో పుజారానే భాగంగా ఉన్నాడు! సోమరితనంతో గాల్లో బ్యాట్ ఉంచి పాండ్యా రనౌట్ అయిన తీరు అయితే మరీ ఘోరం. వన్డే ఫామ్‌ను, భారత్‌లో ప్రదర్శనను బట్టి రోహిత్ శర్మపై గట్టి నమ్మకం ఉంచిన కెప్టెన్ పునరాలోచించుకునేలా రెండు టెస్టుల్లోనూ అతని ఆట సాగింది. ప్రధాన బ్యాట్స్‌మన్‌గా ఓటమిలో అతనికీ భాగం ఉంది. కోహ్లి తొలి ఇన్నింగ్స్‌లో అద్భుత సెంచరీ చేయడం అతని స్థాయిని చూపించినా... గెలవాలంటే తానొక్కడే ఆడితే సరిపోదని అతనికీ అర్థమై ఉంటుంది. రెండు టెస్టుల్లోనూ ప్రత్యర్థిని రెండు సార్లు ఆలౌట్ చేయగలిగిన బౌలర్లను తప్పు పట్టడానికేమీ లేదు. భువనేశ్వర్, షమీ, బుమ్రా, ఇషాంత్... నలుగురూ కీలక సందర్భాల్లో జట్టుకు విలువైన వికెట్‌లు అందించి మ్యాచ్‌పై పట్టు చిక్కేలా చేశారు. కానీ బ్యాటింగ్ మనల్ని తెల్లబోయేలా చేసింది. ఫీల్డింగ్‌లో ఒక్కొక్కరు వంతుల వారీగా క్యాచ్‌లు వదిలేయడం ఒకవైపు అయితే... కీపర్‌గా పార్థివ్ వైఫల్యం మరో పెద్ద దెబ్బ. రెండో ఇన్నింగ్స్‌లో తాను పట్టాల్సిన క్యాచ్‌ను వదిలేసి మొదటి స్లిప్‌లో ఉన్న ఫీల్డర్ వైపు వేలు చూపడం దీనికి పరాకాష్ట!

ఈ ఫలితం తర్వాత మూడో టెస్టుకు మార్పులు మాత్రం ఖాయం. ఈ ఓటములను భారత మేనేజ్‌మెంట్ నిజంగానే సీరియస్‌గా తీసుకుంటుందా లేక మరో 9 రోజుల్లో జరగబోయే ఐపీఎల్ వేలం సమయానికి జనం అంతా మర్చిపోతారని భావిస్తోందా తెలీదు. అయితే తొలి టెస్టులో బాగా ఆడిన భువీని ఇక్కడ తప్పించినట్లు కోహ్లి అనూహ్య నిర్ణయాలు ఏమైనా తీసుకోవచ్చు. ఫలితం ఎలా వచ్చినా తాను కెప్టెన్‌గా ఉన్న 34 టెస్టుల్లోనూ ప్రతీ మ్యాచ్‌కు తుది జట్టును మార్చిన రికార్డు కోహ్లికి ఉంది! కాబట్టి ఎవరు వచ్చి 'వాండరర్స్'లో జట్టు అదృష్టాన్ని మార్చగలరో చూడాలి.

కొసమెరుపు: భారత్ రనౌట్ల బాధ చూస్తుంటే ఇక్కడ కూడా రహానే అవసరం కనిపిస్తోంది. టెస్టు కెరీర్‌లో 149 బ్యాటింగ్ పార్ట్‌నర్‌షిప్‌లలో భాగంగా ఉన్నా... ఒక్కసారి కూడా తాను రనౌట్ కాకపోగా, మరో ఎండ్‌లో ఎవరినీ రనౌట్ చేయని అరుదైన ఘనత రహానేకు ఉంది.

ఓదార్చేందుకు లేనిక్కడ...

నేను ఇక్కడ ఉన్నది మా ఆటగాళ్లను ఓదార్చేందుకు కాదు. మా జట్టు ఇప్పటికీ అత్యుత్తమమని మేం నమ్ముతున్నాం. ఏదో వచ్చామా, వెళ్లామా అన్నట్లు కాదు. సిరీస్ గెలుస్తామనే నమ్మకం లేకపోతే ఇక్కడికి రావడం అనవసరం. మాకు రెండు టెస్టుల్లోనూ గెలిచే అవకాశాలు వచ్చాయి. రెండేళ్ల క్రితం భారత్‌కు వచ్చినప్పుడు వారు అసలు ఎప్పుడైనా విజయానికి చేరువగా రాగలిగారా! నేను ప్రతీ టెస్టుకు తుది జట్టును మార్చడానికి, మ్యాచ్ ఫలితానికి సంబంధం లేదు. ఓటమి బాధించడం సహజం. కానీ అత్యుత్తమమైన 11 మంది వీరే అంటూ చెబితే దానిని నేను అంగీకరించను. మా దృష్టిలో అందరూ ఒకటే. ఒకసారి నిర్ణయం తీసుకుంటే దానికి కట్టుబడి ఉండాలి. సులభంగా వికెట్లు అప్పగించడమే ఓటమికి కారణం. పరాజయంపై మమ్మల్ని మేం ప్రశ్నించుకోవాల్సిన విషయాలు చాలా ఉన్నాయి. తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం దక్కాల్సింది. ఓటమి ఎదురైన చోట నా 153 పరుగులకు ఇప్పుడు విలువే లేదు. సరైన సన్నద్ధత లేకుండా ఇక్కడికి వచ్చామనే మాటను కూడా నేను నమ్మను. విదేశాల్లో గెలవాలంటే క్షణక్షణం పోరాడే ఒక రకమైన మొండితనం ఆటగాళ్లకు అవసరం.

–విరాట్ కోహ్లి, భారత కెప్టెన్

వొజ్నియాకి అద్భుతం



వొజ్నియాకి

పరాజయం అంచుల నుంచి విజయం సొంతం
ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీ

మెల్‌బోర్న్: ఒక్క గ్రాండ్‌స్లామ్ టైటిల్ కూడా గెలవకుండా ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ సాధించిన అతి కొద్ది క్రీడాకారిణుల్లో ఒకరైన కరోలిన్ వొజ్నియాకి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మూడో రౌండ్‌లోకి ప్రవేశించింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో రెండో సీడ్ వొజ్నియాకి (డెన్మార్క్) 3–6, 6–2, 7–5తో ప్రపంచ 119వ ర్యాంకర్ జానా ఫెట్ (క్రొయేషియా)పై గెలుపొందింది. 2 గంటల 31 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో వొజ్ని యాకి మూడో సెట్‌లో ఒకదశలో 1–5తో వెనుకబడింది. అంతేకాకుండా రెండు మ్యాచ్ పాయింట్లను కూడా కాపాడుకుంది. ఈ దశలో తన అనుభవాన్నంతా రంగరించి పోరాడిన ఈ డెన్మార్క్ భామ అనూహ్యంగా కోలుకుంది. వరుసగా ఆరు గేమ్‌లు సాధించి 7–5తో మూడో సెట్‌ను, మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. నాలుగు ఏస్‌లు సంధించి, ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేసిన వొజ్నియాకి ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేసింది. మరోవైపు జానా ఫెట్ 18 బ్రేక్ పాయింట్ అవకాశాల్లో ఆరింటిని మాత్రమే సద్వినియోగం చేసుకుంది. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌లో ఏడో సీడ్ జెలెనా ఒస్టాపెంకో (లాత్వియా) 6–3, 3–6, 6–4తో యింగ్ యింగ్ దువాన్ (చైనా)పై, నాలుగో సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్) 4–6, 6–2, 6–1తో సినియకోవా (చెక్ రిపబ్లిక్)పై నెగ్గి మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టారు.

నాదల్ ముందంజ

పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ రాఫెల్ నాదల్ (స్పెయిన్), మూడో సీడ్ దిమిత్రోవ్ (బల్గేరియా), ఆరో సీడ్ మారిన్ సిలిచ్ (క్రొయేషియా) మూడో రౌండ్‌లోకి చేరుకున్నారు. రెండో రౌండ్‌లో నాదల్ 6–3, 6–4, 7–6 (7/4)తో లియోనార్డో మాయెర్ (అర్జెంటీనా)పై, దిమిత్రోవ్ 4–6, 6–2, 6–4, 0–6, 8–6తో మెక్‌డొనాల్డ్ (అమెరికా)పై, సిలిచ్ 6–1, 7–5, 6–2తో సుసా (పోర్చుగల్)పై గెలిచారు. మరో మ్యాచ్‌లో 15వ సీడ్ జో విల్‌ఫ్రైడ్ సోంగా (ఫ్రాన్స్) 3–6, 6–1, 1–6, 7–6 (7/4), 7–5తో షపోవలోవ్ (కెనడా)పై, 17వ సీడ్ నిక్ కిరియోస్ (ఆస్ట్రేలియా) 7–5, 6–4, 7–6 (7/2)తో ట్రయెస్కీ (సెర్బియా)పై విజయం సాధించారు.

కార్లోవిచ్ ఏస్‌ల వర్షం

క్రొయేషియా ఆజానుబాహుడు ఇవో కార్లోవిచ్ మారథాన్ మ్యాచ్‌లో గట్టెక్కాడు. 38 ఏళ్ల కార్లోవిచ్ పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో 7–6 (7/3), 6–7 (3/7), 7–5, 4–6, 12–10తో యుచి సుగిటా (జపాన్)పై గెలిచాడు. 6 అడుగుల 11 అంగుళాల ఎత్తు, 104 కేజీల బరువున్న కార్లోవిచ్ ఈ మ్యాచ్‌లో ఏకంగా 53 ఏస్‌లు సంధించాడు. వరుసగా 15వ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడుతోన్న కార్లోవిచ్ ఏనాడూ ఈ టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్ దాటి ముందుకెళ్లలేదు.

కోస్ట్‌యుక్ సంచలనం



క్వాలిఫయర్‌గా బరిలోకి దిగిన ఉక్రెయిన్‌కు చెందిన 15 ఏళ్ల మార్టా కోస్ట్‌యుక్ తన విజయాల పరంపర కొనసాగిస్తోంది. రెండో రౌండ్‌లో కోస్ట్‌యుక్ 6–3, 7–5తో రోగోవ్‌స్కా (ఆస్ట్రేలియా)ను ఓడించింది. ఈ క్రమంలో ఆమె స్విట్జర్లాండ్ దిగ్గజం మార్టినా హింగిస్ (1996లో ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్) తర్వాత ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో మూడో రౌండ్‌కు చేరుకున్న పిన్న వయస్కురాలిగా గుర్తింపు పొందింది.



నిప్పుల్లోంచి దూసుకొస్తున్న గుర్రం... ఏదో సినిమాలోని సీన్‌లాగ కనిపిస్తోంది కదూ.. మన దగ్గర సంక్రాంతి సందర్భంగా మైసూరు తదితర ప్రాంతాల్లో ఎద్దులు ఇలా నిప్పుల్లోంచి దూకుతాయి. దాదాపు ఇదే సంక్రాంతి సమయంలో స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌కు సమీపంలోని శాన్ బార్తొలోమ్ అనే గ్రామంలో సెయింట్ ఆంథోనీ డేని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా జరిగే ఉత్సవంలోనే అశ్వికులు గుర్రాలను అగ్ని కీలల్లోంచి దూకిస్తారు. తద్వారా అవి పరిశుద్ధులవుతాయన్నది వారి నమ్మకం. గత 500 ఏళ్ల నుంచి ఈ వేడుకను ఏటా నిర్వహిస్తున్నారు.

నేడు నేరస్తుల సమగ్ర సర్వే

త్వరలో 18 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ● డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా గురువారం నేరస్తుల సమగ్ర సర్వే నిర్వహించనున్నట్లు డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. పదేళ్ల కాలంలో పోలీసు రికార్డుల్లో ఉన్న నేరగాళ్ల ఇళ్లకు అధికారులు వెళ్లి వారి వివరాలను నమోదుచేస్తారని తెలిపారు. అలాగే వారి ఇళ్లనూ జియో ట్యాగింగ్ చేసి టీఎస్ కాప్ యాప్‌లో పొందుపరచనున్నామన్నారు. కానిస్టేబుల్ నుంచి డీజీపీ వరకు అన్ని స్థాయిల అధికారులు ఈ సర్వేలో పాల్గొననున్నారు. త్వరలో 18 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు.

జాబితా ఆధారంగా..

2008–2017 మధ్య ఒకటి కంటే ఎక్కువసార్లు అరెస్టు అయిన నిందితులు చెప్పిన చిరునామాలతో రూపొందించిన జాబితాల ఆధారంగా సర్వే జరగనుంది. నేరస్తుడు ప్రస్తుతం ఏం చేస్తున్నాడు, కదలికలు ఏంటి వంటి తదితర వివరాలు సేకరించడంతో పాటు అవసరమైతే సమీపంలో ఉండే బంధువులు, స్నేహితుల ఇళ్లకు వెళ్లి ఆరా తీస్తారు. తాజా చిరునామాలతో వారు నివసిస్తున్న ప్రాంతాల వారీగా జాబితాలు రూపొందిస్తారు.

పూర్తయ్యే వరకూ సర్వే

నేరస్తుడి ఇళ్లను జియో ట్యాగింగ్ చేసి టీఎస్ కాప్ యాప్‌లో పొందుపరుస్తారు. గస్తీ నిర్వహించే రక్షక్, బ్లూకోల్ట్ సిబ్బందికి ఇచ్చే ట్యాబ్స్‌లో ఈ యాప్ ఉంటుంది. ఈ ట్యాబ్ ఆధారంగానే నేరగాళ్ల ఇళ్ళకు ఆయా సిబ్బంది వెళ్ళాల్సి ఉంటుంది. గురువారం సర్వే పూర్తి కాని నేపథ్యంలో పూర్తయ్యేవరకూ కొనసాగుతుందని, ప్రతి నేరస్తుడి ఆచూకీ కనిపెట్టి, వివరాలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ సర్వే నేపథ్యంలో స్థానికులు తమకు సహకరించాలని కోరారు.





‘చచ్చి’ బతకడం.. అదెలా?





సాక్షి, హైదరాబాద్: చనిపోయాడనుకున్న వ్యక్తి లేచి కూర్చుంటాడు.. ప్రాణం లేదని డాక్టర్లు నిర్ధారించిన పిల్లలు మార్చురీలో కొనఊపిరితో ఉన్నట్లు గుర్తిస్తారు.. అప్పుడప్పుడూ ఇలాంటి వార్తలు మనం చూస్తుంటాం. వైద్యులు మరీ ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా అని విస్తుపోతూంటాం. నిజంగానే ఈ రకమైన ఘటనలకు వైద్యులే కారణమా? కాకపోవచ్చనే అంటున్నారు స్పెయిన్ శాస్త్రవేత్తలు. చాలా అరుదుగా కనిపించే క్యాటిలెప్సీ అనే పరిస్థితి దీనికి కారణమని వారు చెబుతున్నారు.

స్పెయిన్‌లో ఓ ఘటన..

కొన్ని రోజుల కింద స్పెయిన్‌లోని అస్టూరియాస్ ప్రాంతంలో గొంజాలో మోంటయో జిమినెజ్ అనే వ్యక్తి మరణించినట్లు ముగ్గురు డాక్టర్లు నిర్ధారించారు. జైలు శిక్ష అనుభవిస్తున్న సమయంలో ఇలా జరగడంతో పోస్ట్‌మార్టం చేసేందుకు ఏర్పాట్లు జరిగాయి. ఒకట్రెండు గంటల్లో పోస్ట్‌మార్టం మొదలు కావాల్సి ఉండగా.. జిమినెజ్ కదిలాడు. ఆశ్చర్యపోయిన వైద్యులు నిశితంగా పరిశీలించి అతడు బతికే ఉన్నాడని నిర్ధారించుకుని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

స్పెయిన్‌లో క్యాటిలెప్సీ పరిస్థితిని ఎదుర్కొన్న జిమినెజ్ కొన్ని గంటల తర్వాత సాధారణ స్థితికి చేరుకున్నాడు. మూర్ఛవ్యాధితో బాధపడుతున్న జిమినెజ్ కొన్ని వారాలుగా మందులు వాడకపోవడం వల్ల క్యాటిలెప్సీ వచ్చినట్లు వైద్యుల అంచనా. మళ్లీ బతికిన తర్వాత

జిమినెజ్ బతికాడా?



జిమినెజ్ అడిగిన మొదటి ప్రశ్న ‘మా ఆవిడ ఎక్కడ’’అని. మెదడుకు ఆక్సిజన్ అందని పరిస్థితులు కొన్ని గంటలపాటు అనుభవించిన జిమినెజ్ భార్య గురించి వాకబు చేయడం అతడి జ్ఞాపకశక్తి బాగానే ఉందనేందుకు చిహ్నమని వైద్యులు తెలిపారు.

అరుదైన వ్యాధి..

శరీరం బిగుసుకుపోవడం.. ఊపిరి తీసుకునే, గుండె వేగం గుర్తించలేనంత తక్కువ స్థాయికి తగ్గిపోవడం.. సూదులతో గుచ్చినా స్పందన లేకపోవడం.. ఇవీ క్యాటిలెప్సీ లక్షణాలు. మూర్ఛ, పార్కిన్‌సన్స్ వంటి వ్యాధులతో బాధపడుతున్న వారిలో ఈ లక్షణాలు కనిపించే అవకాశముంది. మానసిక వ్యాధులకు వాడే మందుల వల్ల సైడ్‌ఎఫెక్ట్‌గా కూడా ఈ పరిస్థితి తలెత్తొచ్చని వైద్యులు అంటున్నారు. క్యాటిలెప్సీ వచ్చిన వారి కీళ్లను వంచితే.. తిరిగి సాధారణ స్థితికి రావని.. అలాగే ఉండిపోతాయని చెబుతున్నారు. ఈ లక్షణాలన్నింటి ఫలితంగా వైద్యులు ఆ వ్యక్తి మరణించినట్లు (వైద్య పరిభాషలో రిగర్ మార్టిస్) భావిస్తుంటారని అంచనా.

చరిత్రలో క్యాటిలెప్సీ..

క్యాటిలెప్సీ చరిత్రలో చాలా తక్కువగా నమోదైందనే చెప్పాలి. 1539లో సెయింట్ థెరీసా ఆఫ్ అలీవా అనే మహిళ ఈ పరిస్థితిని ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. మొదట అలీవా కాళ్లు బిగుసుకుపోయాయి. మూడేళ్లపాటు అలాగే ఉండిపోయింది. ఆ తర్వాత కూడా అప్పుడప్పుడూ క్యాటిలెప్సీ తరహా లక్షణాలు ఆమెలో కనిపించేవి.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Survey No. 127, Plot No. 12, Mallapur Village, Nacharam, Medchal District. Editor: V. Murali, Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.